నా తెలుగు వ్యాసావళి



యక్ష ఉవాచ: యస్యతేఽర్థాశ్చ కామాశ్చ ఆనృశంస్యం పరం మతం
తస్మాత్తే భ్రాతరస్సర్వే జీవంతు భరతర్షభ

రచన: మద్దాలి వేంకట సత్య రంగనాథం

ॐ

నా తెలుగు వ్యాసావళి

రచన:

మద్దాలి వేంకట సత్య రంగనాథం

నా తెలుగు వ్యాసావళి

రచన: మద్దాలి వేంకట సత్య రంగనాధం

Naa Telugu Vyaasaavalhi (Free E-Book)

Author: M. V. S. Ranganadham

ISBN 978-93-344-1226-0

9 789334 412260

© సర్వ హక్కులు రచయితవే

ప్రచురణ (Publishing): 18 – 09 – 2025

Contact details of author:

M. V. S. Ranganadham

H. No. 5-12-78/46,

Laxmipuri Colony Phase – 2,

Sainikpuri, Hyderabad – 500 094.

Telangana State.

Mob: +91 9818878155

E-Mail: mvsranganadham@hotmail.com

అంకితం

మా అబ్బాయి భారత్ కి మా అమ్మాయి స్వాతికి

భారత్ చిన్నప్పుడు



భారత్ ఇప్పుడు



స్వాతి చిన్నప్పుడు



స్వాతి ఇప్పుడు



ముందుమాట

మా పిల్లల చిన్నతనంలో వాళ్ళ వక్తృత్వ పోటీల కోసం కొంత విషయ సమీకరణ చేశాను. వాటి ఆధారంగా తయారు చేసిన వ్యాసాలు, నిన్న మొన్నటి దాకా వ్రాసిన వ్యాసాలు కలిపి ఈ పుస్తకంలో ఇస్తున్నాను.

మొత్తం 26 వ్యాసాలు ఈ పుస్తకంలో నిఘంటువు క్రమంలో (dictionary order) ఇవ్వబడ్డాయి. వాటిల్లో, అనులోమ విలోమ కందము వ్రాయడం ఎలా?, కవిత్వానికి నిర్వచనం చెప్పిన అవధాని, కాటూరివారి పౌలస్త్య హృదయము, గర్భకవిత్వం వ్రాయడం ఎలా?, - అన్న 4 వ్యాసాలు సాహిత్య వ్యాసాలు అని నా అభిప్రాయము.

క్రమ సంఖ్యలు 1 మరియు 6 – లలో ఇవ్వబడిన వ్యాసాలు సాహిత్య క్రీడకు సంబంధించినవి. అనులోమ విలోమ కందం (క్రమ సంఖ్య 1) వ్రాయడం అంటే, ముందు నుంచి వెనక్కి వెనక నుంచి ముందుకు చదివినా ఒకే లాగా ఉండే కంద పద్యం వ్రాయడం. ఒక పద్యం పొట్టలో మరో పద్యం ఉండేడట్లుగా వ్రాయడం గర్భ కవిత్వం (క్రమ సంఖ్య 6). ఈ విధంగా వ్రాయ గలగడానికి ఛందస్సులో పాటించాల్సిన నియమాల గురించి ఈ వ్యాసాల్లో ఇవ్వడం జరిగింది.

క్రమ సంఖ్య 5 – లో ఇవ్వబడిన "కాటూరి వారి పౌలస్త్య హృదయము" మహాకవి కాటూరి వేంకటేశ్వరరావు గారు రచించిన "పౌలస్త్య హృదయము" అన్న లఘుకావ్యం గురించిన విమర్శ. ఈ వ్యాసాన్ని మా గురువుగార్లలో ఒకరైన కీ. శే. లక్కరాజు శ్రీనివాసరావు గారికి అదివరకే అంకితం ఇచ్చాను. ఈ కావ్యము విలక్షణ

మైనది. ఇది పద్యరూపంలో వ్రాసిన రావణుని ఏకపాత్రాభినయము. దీని ప్రభావంతో నేను "శ్రీరాముని అంతరంగము" అన్న కావ్యం వ్రాశాను. అదే నా తొలి ఈ-బుక్.

ద్యూత సభలో ద్రౌపది ప్రశ్న సబబేనా?, ప్రసిద్ధమైన సినిమా పాటైన మొల్ల కల్పన, భవిష్యవాణి తెలుసుకోవడం మంచిదా?, యక్ష ప్రశ్నలు, రామాయణంలో కరప్షను అనగా అవినీతి కథ – అన్న వ్యాసాలు రామాయణ మహాభారతాల లోని కొన్ని అంశాలు తీసుకుని వ్రాసినవి.

అమరజీవి పొట్టి శ్రీరాములు, ఆంధ్ర సంస్కృతి, చదువులు మన దేశంలో, సేవలు మరో దేశానికి, సబబేనా?, మహా నాయకులు, మాతృభాషలో విద్యాబోధన అవసరమా?, రైళ్ళలో మట్టి కప్పులు మంచికి కాదు – అన్న 6 వ్యాసాలు (క్రమ సంఖ్యలు 2, 3, 8, 18, 19, 22) మా పిల్లల డిబేట్ (debate) కాంపిటీషన్ (competition) కోసం సేకరించిన విషయాల ఆధారంగా వ్రాసిన వ్యాసాలు. ఇవే కాక, క్రమ సంఖ్యలు 7, 11, 13, 24 – లలో ఇవ్వబడిన వ్యాసాలు కూడా విద్యార్థులకు యువతకు వారి వ్యక్తిత్వ వికాసానికి బాగా ఉపయోగపడతాయని నా అభిప్రాయము. వాటిల్లో కొన్ని విషయాలు పునరుక్తి (repetition) చెంది ఉండవచ్చు. అవి గమనించి కూడా కావాలనే అలానే ఉంచేశాను. అవి తొలగిస్తే, ఆయా విషయాల అవగాహనలో ఏదైనా లోపం జరుగుతుందనే ఉద్దేశ్యంతో అలా చేయడం జరిగింది.

చలపతి చాతుర్యం, నా చిన్నప్పటి జ్ఞాపకాలు కొన్ని, పరమానందయ్య శిష్యుల కథలో పరమార్థం, భజనలో అల్లరి, విగ్రహారాధన ఒక నమ్మకం – అన్న వ్యాసాలు కొంత హాస్యం మేళవించి వ్రాసినవి. స్త్రీలకు సంబంధించిన బాధ్యతలను గుర్తు చెయ్యడానికి వ్రాసిన రెండు వ్యాసాలు క్రమసంఖ్యలు 25, 26 లలో ఇవ్వబడ్డాయి.

అందులో క్రమసంఖ్య 25లో ఇవ్వబడిన వ్యాసం మా గురువుగారైన కీ.శే. శ్రీ చిరువోలు దుర్గాప్రసాదరావు గారు రచించినది. ఒక్కమాటుగా వ్యాసాల పేర్లు తెలియాలంటే విషయసూచిక చూడగలరు.

ఈ పుస్తకంలోని వ్యాసాలు అన్నీ అది వరకే నా బ్లాగు "https://mvsranganadham.in/" లో పెట్టడం వలన, కొంత మందికి తెలిసినవే. కొన్ని వ్యాసాలు "సంచిక మాస పత్రిక" అనబడే తెలుగు తొలి డైనమిక్ వెబ్ పత్రికలో ప్రచురించబడ్డాయి. ఆ వివరాలు ఆ యా వ్యాసాల క్రిందే చెప్పబడ్డాయి. చదవడానికి ఎక్కువ సౌలభ్యమని ఎక్కువ మందికి అందించడానికి వీలవుతుందనీ ఈ ఫ్రీ ఈ-బుక్ (free E-Book) విడుదల చేస్తున్నాను. ఇది నా ఐదవ ఈ-బుక్. ఇందులో దోషాలు గానీ నచ్చని విషయాలు గానీ ఉంటే పాఠకులు నాకు తప్పక తెలియఁజెయ్యాలని మనవి.

ఈ వ్యాస రచనకి తొలినాళ్ళలో కారణమైన మా అబ్బాయి భారత్, మా అమ్మాయి స్వాతిలకు ఈ పుస్తకం అంకితం ఇస్తున్నాను.

సైనిక్ పురి, హైదరాబాదు, భవదీయుడు,

ది: 18 - 09 - 2025. మద్దాలి వేంకట సత్య రంగనాధం

నా తెలుగు వ్యాసావళి

విషయ సూచిక

1. అనులోమ విలోమ కందము వ్రాయడం ఎలా?

(ఈ వ్యాసం సంచిక మాస పత్రిక అనబడే తెలుగులో తొలి డైనమిక్ వెబ్ పత్రికలో (ఏప్రిలు 27, 2025) ప్రచురించబడింది. అందుబాటులో ఉన్న లింకు: https://sanchika.com/anuloma-viloma-kandam-vraayadam-elaa-mvs-r/)

తెలుగులో భ్రమక పదాలను గురించి విని ఉన్నాము. అంటే, ఎడమ నుంచి కుడికి (అనులోమం), కుడి నుంచి ఎడమకు (విలోమం లేదా ప్రతిలోమం) చదివినా ఒకే పదం వస్తే దాన్ని భ్రమక పదం అంటారు. ఆంగ్లంలో అటువంటి పదాలను Palindromes అంటారు. ఉదాహరణలు వికటకవి, వలువ, ముదము లాంటి పదాలు. చిన్నప్పుడు ఒకళ్ళని ఒకళ్ళు ఆట పట్టించడానికి "దడిగాడువానసిరా" అనే వాళ్ళం. ఈ పదానికి అర్థం లేదు గానీ, తిరగేసి చదివితే "రాసిన వాడు గాడిద" అని మనం అనదలుచుకున్నామని అవతలి వాళ్ళకి తెలుస్తుంది. కానీ ఇలా వ్రాసిన రెండు పదబంధాలకి (phrases) కూడా వేరు వేరుగా అర్థం ఉంటే, ఆ విధంగా పద్య పాదాలు గనక ఉంటే ఎంత అందంగా ఉంటుందో, అన్న విషయాలు కొంత వరకు పరిశీలించడమే ఈ వ్యాసం లక్ష్యం.

అనులోమ విలోమ కందము అన్నది పదాల్లో భ్రమకపదం లాంటిది. మొదటి నుండి చివరకు చదివినా చివరి నుండి మొదటికి చదివినా ఒకేలా ఉండే కంద పద్యాన్ని అనులోమ విలోమ కందము అంటారు. కందంలో మొదటి రెండు పాదాలు తిరగేసి చదివితే తరువాతి రెండు పాదాలు వచ్చేటట్లుగా రచిస్తే ఇది సాధ్యమవుతుంది. ఇటువంటి పద్యాలు వ్రాయడం కష్టం కాబట్టి సాహిత్యంలో చాలా కొద్ది ఉదాహరణలే దొరుకుతాయి. కృష్ణదేవరాయల ఆస్థానం లోని అష్టదిగ్గజాలలో ఒకడైన నంది తిమ్మనకవి తాను రచించిన పారిజాతాపహరణ కావ్యంలో, ఈ క్రింది అనులోమ విలోమ కందము రచించాడు.

కం. నాయశరగ సార విరయ
తాయన జయసార సుభ గధర ధీ నియమా

మాయని ధీర థగభ సుర

సాయజ నయ తాయర విరసాగర శయనా.

ఇది మంచి ఉదాహరణ. పద్యం మొదటి నుంచి చివరికి చదివినా, చివరి నుంచి మొదటికి చదివినా ఒకటే. ఛందోబద్ధంగా ఉండడమే కాకుండా, రెండు విధాల కూడా అర్థవంతంగా ఉంటేనే (అర్థం వేరు అవ్వ వచ్చు) దాన్ని అనులోమ విలోమ కందము అంటారు. అర్థవంతంగా ఉండేటట్లు పదాల ఎన్నిక చెయ్యడం కవి ప్రతిభే అనడంలో సందేహం లేదు. అయితే, ఛందోబద్ధంగా అనులోమ విలోమ కందము రచించడానికి పాటించవలసిన నియమాలు ఏమిటో మొదట చూద్దాం.

కంద పద్యంలో నాలుగు పాదాలుంటాయి. 1, 3 పాదాల్లో ఒక్కొక్క దాన్లో మూడు గణాలు, 2, 4 పాదాల్లో ఒక్కొక్క దాన్లో ఐదు గణాలు ఉంటాయి. అన్నీ నాలుగు మాత్రల గణాలే ఉంటాయి. అవి గగ (UU), భ (UII), జ (IUI), స (IIU), నల (IIII) అన్న గణాలు. మొదటి రెండు, చివరి రెండు పాదాల లోని 8 గణాలనీ వరుసగా 1, 2, 3, ..., 7, 8 అని అనుకుంటే, బేసి సంఖ్య గల గణం జగణం కాకూడదు. 2, 4 పాదాల్లో మూడో గణం (యతికి ముందు వచ్చేది) జగణం (IUI) కాని, నల (IIII) కానీ అయి ఉండాలి. 2, 4 పాదాలలో చివరి అక్షరం గురువు, అంటే చివరి గణం గగ (UU) లేదా సగణం (IIU) అయి ఉండాలి. ప్రాస నియమం ఉంది. ప్రాసాక్షరం ముందున్న అక్షరం అన్ని పాదాలలోనూ అయితే గురువు కావాలి లేకపోతే లఘువు అయి ఉండాలి. ఒక చోట గురువు మరొక చోట లఘువు ఉంటే చెల్లదు. 2, 4 పాదాలలో 1వ అక్షరానికీ 4వ గణం మొదటి అక్షరానికీ యతిమైత్రి ఉండాలి. ప్రాసయతి చెల్లదు. మొదటి రెండు పాదాలలో ఉన్న దాన్ని వెనుక నుంచి చదివితే తరువాతి రెండు పాదాలు వస్తే అప్పుడు అది అనులోమ విలోమ కందము వస్తుంది. ఇది వ్రాయడానికి కంద పద్య లక్షణాలకు అదనంగా ఇంకా ఏ నియమాలు పాటించాలో చూద్దాం.

మొదటి రెండు పాదాలలో 1వ గణము తిరగేస్తే వచ్చేది చివరి రెండు పాదాల లోని 8వ గణము. ఆ 8వ గణము గురువుతో ముగుస్తుంది కాబట్టి, మొదటి పాదం లోని మొదటి గణం గురువుతో

మొదలవ్వాలి. అందుకని మొదటి రెండు పాదాలలో మొదటి గణం UII గానీ UU గానీ కావచ్చు. ఈ గణం తిరగేస్తే ఆఖరి రెండు పాదాలలోని 8వ గణం వస్తుంది కాబట్టి, అది IIU గానీ UU గానీ అవ్వాలి. మొదటి పాదం లోని మొదటి గణం గురువు. అది ప్రాసాక్షరానికి ముందున్న అక్షరం కాబట్టి, 2వ, 3వ, 4వ పాదాలలో కూడా మొదటి అక్షరం గురువై ఉండాలి. అంటే, మొదటి రెండు పాదాల లోని 1వ గణము, 4వ గణము, తిరగేస్తే వచ్చే చివరి రెండు పాదాల లోని 1వ గణము, 4వ గణము గురువుతో మొదలవ్వాలి.

మొదటి పాదం లోని 2వ గణము తిరగేస్తే వచ్చేది చివరి రెండు పాదాల లోని 7వ గణము. ఆ 7వ గణం బేసి గణం కాబట్టి జగణము ఉండకూడదు. జగణము (IUI) తిరగేసినా జగణమే వస్తుంది కనుక మొదటి పాదం లోని 2వ గణం కూడా జగణం అవడానికి వీలు లేదు. అందుచేత, మొదటి రెండు పాదాలలోని 2వ గణము UII గానీ IIU గానీ IIII గానీ UU గానీ అవ్వ వచ్చు. అది తిరగేస్తే ఆఖరి రెండు పాదాలలోని 7వ గణం రావాలి గనుక, ఆ గణము IIU గానీ UII గానీ IIII గానీ UU గానీ అవ్వ వచ్చు.

మొదటి రెండు పాదాల లోని 3వ గణము తిరగేస్తే వచ్చేది చివరి రెండు పాదాల లోని 6వ గణము. ఆఖరి రెండు పాదాల లోని 6వ గణము అంటే 4వ పాదంలోని 3వ గణము. అది సాధారణంగా IUI (జగణము) గానీ IIII గానీ అయ్యి ఉండాలి. ఇది తిరగేస్తే మొదటి రెండు పాదాలలోని 3వ గణం రావాలి గనుక, 3వ గణం బేసి గణం కనుక, అక్కడ జగణం ఉండకూడదు. కనుక, మొదటి రెండు పాదాల లోని 3వ గణము, తిరగేస్తే వచ్చే చివరి రెండు పాదాల లోని 6వ గణము, ఒక్క IIII అన్న గణం మాత్రమే అయి ఉండవచ్చు.

మొదటి రెండు పాదాల లోని 4వ గణము తిరగేస్తే వచ్చేది చివరి రెండు పాదాల లోని 5వ గణము. ఆఖరి రెండు పాదాల లోని 5వ గణము బేసి గణము కాబట్టి జగణం ఉండకూడదు. మొదటి రెండు పాదాల లోని 4వ గణం గురువుతో మొదలౌతుంది (ప్రాసాక్షరానికి ముందున్న అక్షరము కాబట్టి). అంటే, మొదటి రెండు పాదాల లోని 4వ గణంలో UII గానీ UU గానీ ఉంటే ఆఖరి రెండు పాదాల లోని 5వ గణము IIU గానీ UU గానీ ఉండవచ్చు.

మొదటి రెండు పాదాల లోని 5వ గణము తిరగేస్తే వచ్చేది చివరి రెండు పాదాల లోని 4వ గణము. మొదటి రెండు పాదాల లోని 5వ గణము బేసి గణము కాబట్టి జగణం అయ్యే అవకాశం లేదు. తిరగేస్తే వచ్చే ఆఖరి రెండు పాదాల లోని 4వ గణం గురువుతో మొదలౌతుంది (ప్రాసాక్షరానికి ముందున్న అక్షరము). అంటే, మొదటి రెండు పాదాలలో 5వ గణంలో UII గానీ UU గానీ ఉంటే ఆఖరి రెండు పాదాల లోని 4వ గణము IIU గానీ UU గానీ అవుతుంది.

మొదటి రెండు పాదాల లోని 6వ గణము తిరగేస్తే వచ్చేది చివరి రెండు పాదాల లోని 3వ గణము. మొదటి రెండు పాదాల లోని 6వ గణము అంటే 2వ పాదంలోని 3వ గణము. అది సాధారణంగా IUI (జగణము) గానీ IIII గానీ అయ్యి ఉండాలి. ఇది తిరగేస్తే వచ్చే ఆఖరి రెండు పాదాలలోని 3వ గణం బేసి గణం కనుక అక్కడ జగణం ఉండకూడదు. కనుక, మొదటి రెండు పాదాల లోని 6వ గణము, చివరి రెండు పాదాల లోని 3వ గణము ఒక్క IIII అన్న గణం మాత్రమే అయిఉండవచ్చు.

మొదటి రెండు పాదాల లోని 7వ గణము తిరగేస్తే వచ్చేది చివరి రెండు పాదాల లోని 2వ గణము. ఆ 7వ గణం బేసి గణం కాబట్టి జగణము ఉండకూడదు. జగణము (IUI) తిరగేసినా జగణమే వస్తుంది కనుక చివరి రెండు పాదాల లోని 2వ గణం కూడా జగణం అవడానికి వీలు లేదు. మొదటి రెండు పాదాల లోని 7వ గణము UII గానీ IIU గానీ IIII గానీ UU గానీ అవ్వ వచ్చు. అది తిరగేస్తే ఆఖరి రెండు పాదాలలోని 2వ గణం రావాలి గనుక, ఆ గణము IIU గానీ UII గానీ IIII గానీ UU గానీ అవ్వ వచ్చు.

మొదటి రెండు పాదాల లోని 8వ గణము తిరగేస్తే వచ్చేది చివరి రెండు పాదాల లోని 1వ గణము. ఆ 8వ గణము గురువుతో ముగుస్తుంది కాబట్టి, చివరి రెండు పాదాల లోని మొదటి గణం గురువుతో మొదలవ్వాలి. అందుకని ఆఖరి రెండు పాదాల లోని మొదటి గణం UII గానీ UU గానీ కావచ్చు. ఈ గణం తిరగేస్తే మొదటి రెండు పాదాల లోని 8వ గణం వస్తుంది కాబట్టి, అది IIU గానీ UU గానీ అవ్వాలి.

ఇవి కాక, కంద పద్యంలో ఉండే ప్రాసకి యతికి సంబంధించిన నియమాల దృష్టితో చూస్తే, అనులోమ విలోమ కందములో పాటించవలసిన నియమాలు ఏమిటో చూద్దాం.

ప్రాస: మొదటి రెండు పాదాలలో ఉండే 8 గణాలు తిరగేస్తే చివరి రెండు పాదాలలోని 8 గణాలు వస్తాయి కాబట్టి ప్రాసాక్షరాలు మొదటి 8 గణాల లోనే చూడ వచ్చు. అవి మొదటి గణంలో 2వ అక్షరము, 4వ గణంలో 2వ అక్షరము, 5వ గణంలో చివరి నుండి 2వ అక్షరము, 8వ గణంలో చివరి నుండి 2వ అక్షరము.

యతి: యతి విషయానికి వస్తే, కంద పద్యంలో 2వ 4వ పాదాల్లో యతి నియమం పాటించాలి. మొదటి రెండు పాదాలలో ఉండే 8 గణాలు తిరగేస్తే చివరి రెండు పాదాలలోని 8 గణాలు వస్తాయి కాబట్టి యతి మైత్రి కూడా మొదటి 8 గణాల లోనే చూడ వచ్చు. 4వ గణం మొదటి అక్షరంతో 7వ గణం మొదటి అక్షరానికి, 5వ గణం చివరి అక్షరానికి 2వ గణం చివరి అక్షరంతోను యతి మైత్రి ఉండాలి.

ఛందస్సు పరంగా (మాటల పరంగా కాదు) మొదటి నాలుగు గణాలు తిరగేస్తే చివరి నాలుగు గణాలు వస్తాయి. మాటల పరంగా మొదటి 8 గణాలు తిరగేస్తే చివరి 8 గణాలు వస్తాయి. పైన వివరించిన విషయాలను ఒక పట్టికలో చూపించాలంటే, క్రింది విధంగా ఉంటుంది.

మొదటి పాదం గణం సంఖ్య	ఉండ దగ్గ గణాలు	ప్రాస అక్షరం	యతి	వ్యాఖ్య
1	UII, UU	రెండవ		
2	UII, UU, IIU, IIII		చివరి - 2	తిరగేస్తే బేసి గణం. IUI ఉండకూడదు.
3	IIII			తిరగేస్తే 6వ గణం. జగణం నలం ఉండాలి. 3వ గణం బేసి కనుక జగణం ఉండకూడదు.
4	UII, UU	రెండవ	మొదటి-1	మొదటి-1 అని వ్రాసిన దానితో యతిమైత్రి

5	IIU, UU	చివరి నుండి రెండవ	చివరి - 2	చివరి – 2 అని వ్రాసిన దానితో యతిమైత్రి
6	IIII			జగణం నలం ఉండాలి. తిరగేస్తే 3వ గణం. అది బేసి కనుక జగణం ఉండకూడదు.
7	IIU, UU, UII, IIII		మొదటి-1	బేసి గణం. IUI ఉండకూడదు.
8	IIU, UU	చివరి నుండి రెండవ		

పైన చెప్పబడిన నియమాలు పాటిస్తూ, ఒక అనులోమ విలోమ కంద పద్యం వ్రాయడానికి ప్రయత్నం చేశాను. అది గొప్ప అర్థవంతమయిన పద్యం కాకపోయినా, అసలంటూ అర్థం లేకపోలేదు. ఆ పద్యం క్రింద ఇవ్వబడింది, మీరే చూడండి:

కం. మానగ నవ్విన మననము?
నానా? మన నా నగవుఁ గన నటనఁ గనమా?
మానగ నటన నగవుఁ గన
నా నమనా? నా మననము? నవ్వినఁ గనమా?

(మానగ = మానివేయు, మననము = చింతన, నాన = సిగ్గు, మను = జీవించు, నగవు = నవ్వు, కను = చూచు, నటన = కపట ప్రవర్తనము, నమన = వందనము)

మానివేయడానికి నవ్వితే చింతనా? సిగ్గా? వీక్షించమా జీవించడానికి నా నవ్వును చూస్తే కపట ప్రవర్తనము? కపట ప్రవర్తనము మానెయ్యడానికి నవ్వును చూస్తే నా వందనమా? నా చింతనా? నవ్వితే చూస్తాంగా?

2. అమరజీవి పొట్టి శ్రీరాములు

(మా అమ్మాయి, స్వాతి, స్కూలులో చదువుతున్న రోజులలో, తన డిబేటు పోటీ కోసం తయారు చేసిన మెటీరియల్ ఆధారంగా వ్రాసిన వ్యాసం ఇది. ఇప్పటికీ స్కూలు పిల్లలకి చదవడానికి బాగుంటుందని ఇక్కడ ఇస్తున్నాను.)

పొట్టి శ్రీరాములు గారంటే అందరికీ జ్ఞాపకం వచ్చే విషయం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన నిరాహారదీక్ష చేయడం. నిరాహార దీక్ష అంటే ఆహారం లేకుండా ఉండటం, రోజుల తరబడి. బాబోయ్. ఎంత కష్టమో. నామటుకు నేను, ఎప్పుడైనా అమ్మ మీద అలిగినప్పుడు ఒక గంట ఆలస్యంగా భోజనం చేశానేమో కానీ, ఏ రోజూ భోజనం తినకుండా ఉండలేదు. అయితే, మనలో కొందరు పెద్దలు, గురువారం అనీ, శనివారం అనీ, ఏదో ఒక పూట భోజనం లేకుండా ఉంటారేమో. అది ఆరోగ్యానికి మంచిది అని అంటారు. కానీ రోజుల తరబడి, ఆహారం లేకుండా ఉంటే చావు తథ్యం. అంటే, అలా ఉండే వ్యక్తులు చావుకు కూడా భయపడరన్న మాట. ఆశయసాధన కోసం నిరాహారదీక్షని సాధనంగా వాడిన వ్యక్తులు చాలా అరుదు. అలాంటి వ్యక్తులలో గాంధీజీ, జతిన్ దాస్ లతో పాటు మన పొట్టి శ్రీరాములు గారు కూడా ఉన్నారు.

ఈయన 1901లో మద్రాసులో పుట్టారు. చిన్నప్పుడు చదివిన ఆధ్యాత్మిక గ్రంధాలు, పెళ్ళయిన 5- 6 సంవత్సరాలకు భార్య పోవడం, ఆయనలో ఒక రకమైన విరక్తి భావం, ఆధ్యాత్మిక దృష్టి కలిగించాయి. బొంబాయిలో శానిటరీ ఇంజనీరుగా చేస్తూ గాంధీజీ పిలుపు విని సర్వసంగ పరిత్యాగం చేసి సబర్మతీ ఆశ్రమంలో చేరారు. తర్వాత, గాంధీజీ ఆశీస్సులతో స్వస్థలమైన నెల్లూరు జిల్లాలో సమాజసేవ మొదలు పెట్టారు.

మొదటగా, స్థానిక దేవాలయంలో హరిజనుల ప్రవేశం కోసం 23 రోజులు కఠోర దీక్ష చేసి, అనుకున్నది సాధించారు. దానికి, గాంధీజీ ఎంతో సంతోషించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఆయన తన పోరాటం ఆపలేదు. అప్పటి మద్రాసు ప్రభుత్వం హరిజనుల కోసం ఎక్కువ

శ్రద్ధ తీసుకోవాలని కోరుతూ, 1943లో 20 రోజులు నిరాహారవ్రతం చేశారు. అది మంచి ఫలితాన్ని ఇచ్చింది.

ఆ రోజుల్లో, ఆంధ్ర తమిళనాడు రాష్ట్రాలు కలిసి ఒకే రాష్ట్రంగా ఉండేవి. ఈ సమిష్టి మద్రాసు రాష్ట్రంలో తెలుగు లెస్స అవడం పోయి తెలుగు లెస్సు (less) అంటే తగ్గి పోతోందని శ్రీరాములు గారికి ఆవేదనగా ఉండేది. అయితే, ఇప్పుడున్నట్లుగానే అప్పుడు కూడా మన నాయకులలో ఐకమత్యం ఉండేది కాదు. ఆంధ్ర ప్రజల అభ్యుదయానికి ప్రత్యేక రాష్ట్రం కావాలని, దాని కోసం నాయకులనీ జాతినీ ఒకే మాటపై తీసుకు రావాలని ఆయన సంకల్పించారు. 1952లో అక్టోబరు 19న మద్రాసులో బులుసు సాంబమూర్తి గారి ఇంట్లో నిరాహారదీక్ష ప్రారంభించారు.

ఆ రోజుల్లో ఇలాంటివి చాలా చోట్ల జరుగుతుండటంవల్ల, ఈయన దీక్షని 45 రోజుల వరకూ ఎవరూ పట్టించుకోలేదు. డిశంబరు 5-6 వచ్చేసరికి శ్రీరాములు గారి పరిస్థితి విషమించింది. జనాల్లో మెల్లమెల్లగా ఆందోళన మొదలైంది. ఆయన్ని కాపాడాలని ఢిల్లీకి టెలిగ్రాములు వేల సంఖ్యలో రావడం మొదలైంది. డిశంబరు 9న, అప్పటి ప్రధాని నెహ్రూ గారు ఈ సమస్యను పరిశీలిస్తామని హామీ ఇచ్చినా శ్రీరాములు గారు తన పట్టు వదలలేదు. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి ఒక తేదిని నిర్ణయించాలని పట్టుపట్టారు. తన దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంలో నాకో పద్యం గుర్తొస్తోంది.

పట్టుపట్టరాదు పట్టి విడువరాదు
పట్టెనేని బిగియబట్ట వలయు
పట్టివిడుచుకన్న బరగ జచ్చుటమేలు
విశ్వదాభిరామ! వినురవేమ!

అంటే, పట్టుదలయే వహింపరాదు. వహించినచో ఆ పట్టు వదలరాదు. పట్టినపట్టు నడిమిలోనే విడచుటకంటే మరణము మేలు. తన ఆశయాన్నే ఊపిరిగా చేసుకొని డిశంబరు 15 వరకు శ్రీరాములు గారు దీక్ష చేశారు. ఆ రోజు అర్ధరాత్రి ప్రాణత్యాగం చేశారు. ఆ తర్వాత డిశంబరు 19న

ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయడం కోసం వాంఛూ కమిటీని నియమించడం, 1956లో నవంబరు 1న ఆంధ్ర రాష్ట్రం అవతరించడం మన అందరికీ తెలుసు.

మన జైన మతంలో నిర్వాణం పొందడానికి (నిర్యాణం కాదు), నిరహారదీక్ష ఒక మార్గం. అయితే, అది ముక్తి సాధించడం కోసం. అది కూడా, ఒక రకంగా స్వార్ధమే. ప్రజలకు మంచి చెయ్యడం కోసం ఈ రకమైన చావును కోరుకోవడం దీనికన్నా ఎంతో గొప్పది. ఆ తరువాత, ఆంధ్ర రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందటం శ్రీరాములు గారి చలవే. అంతే కాదు, ఈ దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడడానికి ఇది పూలబాట అయ్యింది. మన రాష్ట్రానికీ, మన దేశానికీ ఇంత గొప్ప భవిష్యత్తు నిచ్చిన శ్రీరాములు గారికి మనందరం ఎంతో రుణపడి ఉన్నాము.

3. ఆంధ్ర సంస్కృతి

(మా అమ్మాయి, స్వాతి, స్కూలులో చదువుతున్న రోజులలో, తన డిబేటు పోటీ కోసం తయారు చేసిన మెటీరియల్ ఆధారంగా వ్రాసిన వ్యాసం ఇది. ఇప్పటికీ స్కూలు పిల్లలకి చదవడానికి బాగుంటుందని ఇక్కడ ఇస్తున్నాను.)

'సంస్కృతి' అంటే సంస్కారం అని బ్రౌన్ నిఘంటువు చెబుతోంది. అంటే, మన చరిత్ర, అలవాట్లు, కట్టుబాట్లు, అభిరుచులు ఇవన్నీ అన్న మాట. ఆంధ్ర శబ్దము భాషాపరంగా, జాతిపరంగా, దేశపరంగా, వేదాల కాలంనుండీ వాడుతున్నాము. ఋగ్వేదంలోని ఐతరేయ బ్రాహ్మణంలో జాతి పరంగా ఉంది. రామాయణంలో సుగ్రీవుడు, సీతని వెదకడం కోసం కొంతమంది వానరులను, ఆంధ్రదేశానికి కూడా పంపుతాడు. ధర్మరాజు రాజసూయ యాగంలో మన రాజులు కూడా ఉన్నారు. క్రీస్తు శకం మొదటి శతాబ్దంలో హాలుడు వ్రాసిన గాథాసప్తశతిలో మన గోదావరి నది, మన పంటలు, మన ఆంధ్ర పదాలు కనిపిస్తాయి. ఆ తర్వాత వ్రాసిన చాలా శిలాశాసనాల్లో మన పదాలున్నాయి. అంటే, మనం వేదకాలం ముందు నుంచీ ఉన్నామన్నమాట.

కొన్నాళ్ళు అశోక చక్రవర్తి పాలనలో మౌర్యసామ్రాజ్యంలో ఉన్నాం. తర్వాత, శాతవాహన రాజుల, ఇక్ష్వాకుల, పల్లవుల, చాళుక్యుల, చోళుల, కాకతీయుల, విజయనగర రాజుల, కుతుబ్ షాహీల, మొగలుల, అసఫ్ జాహీల, నిజాముల పాలనలోనూ, ఆఖరికి స్వాతంత్ర్యము రాక మునుపు బ్రిటీషు పాలనలోనూ ఉన్నాము. అలనాటి నుండి, మనం మన సంస్కృతిని అభివృద్ధి చేసుకుంటూనే ఉన్నాము. సమాజాన్ని ఉన్నతమైన బాటలో నడపడానికి మనం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాము.

ద్రాక్షారామం, శ్రీశైలం, కాళేశ్వరం అన్న త్రిలింగాలు ఉన్న ప్రాంతం భాష తెనుగు భాష అని అన్నారు. 'దేశభాష లందు తెలుగు లెస్స', 'ది ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' (The Italian of the East) అని అందరి ప్రశంసలు అందుకున్న మన భాష, నన్నయ కాలంనుండీ చాలా అభివృద్ధి చెందింది. మన భాషా సాహిత్యంలో అన్నిరకాల ప్రక్రియలు ఉన్నాయి. పుట్టడం ద్రవిడంలో

అయినా సంస్కృతంలో సంస్కరించబడింది. అసలు సంస్కృతం మనమే బాగా ఉచ్చరిస్తామని అందరూ అంటారు. తెలుగులో మనకున్న 56 అక్షరాలలో అంత ప్రభావం ఉంది.

ఉత్తరాదిన ఉన్న ఆర్య నాగరికతకు దక్షిణాదిన ఉన్న ద్రవిడ నాగరికతకు మనం సేతువు లాంటి వాళ్ళం. మన అలవాట్లలో రెండూ ఉన్నాయి. అయితే, అచ్చంగా మనవే అని చెప్పుకునేవీ ఉన్నాయి. మనుస్మృతికి భిన్నంగా మేనరికం వివాహాలు మనకే ఉన్నాయి. పెళ్ళిళ్ళల్లో మంగళ సూత్ర ధారణ, తలంబ్రాలు పోయడం మన పద్ధతులే. తిక్కన విరాట పర్వంలో ఇది ఉంది. వివాహిత స్త్రీలు కాళ్ళకి మట్టెలు పెట్టుకోవడం, ఆడ మగ అందరూ చక్కగా అలంకరించుకుని అభరణాలు ధరించడం ఎప్పట్నించో ఉన్నాయి. పెళ్ళిళ్ళల్లో మంగళ హారతులు పాడటం శాతవాహన కాలంనుండి వస్తోంది.

రోజు ప్రొద్దున్నే వాకిళ్ళు శుభ్రం చేసి ముగ్గులు పెట్టడం నన్నయ భారతం నుంచి మనకు తెలుసు. గుమ్మాలకి మామిడి తోరణాలు కట్టడం, ఆడవాళ్ళు స్నానానికి ముందు ఒంటికి పసుపు రాసుకోవడం, తాంబూలం వేసుకోవడం మొదలైనవి మనకు అనాదిగా వస్తున్న అలవాట్లు. ఆరోగ్యానికి ఇవి మంచివని చాలమంది అంటున్నారు. దేశంలో జరిగే హోలి, దీపావళి లాంటి అన్ని పండగలతో పాటు, మనం ప్రత్యేకంగా బతకమ్మ పండగ, పీర్ల పండగ లాంటివి చేసుకుంటాము. 'ఏరువాక సాగారో' అంటూ ఏరువాక పౌర్ణమి, సంక్రాంతి పండుగలు మనకి వ్యవసాయం అంటే ఎంత ఇష్టమో చెబుతాయి.

ఇక వంటకాల సంగతి కొస్తే, మనకున్నన్ని ఎవ్వరికీ లేవు. మన ఆవకాయ లాంటి ఊరగాయలు, మన గుత్తి వంకాయ కూర లోక ప్రసిద్ధము. వీటి మీద పాటలు, పద్యాలు కూడా వ్రాశారు. వీటిలో కూడా మన ఉనికి ప్రత్యేకంగా ఉంది. అందుకే అన్నారు, డా. సి. నారాయణ రెడ్డిగారు, 'పంచభక్ష్య పరమాన్నాలు కంచాన వడ్డింప, గోంగూర కోసమై గుటక వేసే వాడు, ఎవరయ్య వాడు ఇంకెవరయ్య మన తెలుగు వాడు' అని.

ఇతర సంప్రదాయాల్లో ఉన్న మంచిని తీసుకోవడమే కాదు, మనకున్న మంచిని ఇతర ప్రాంతాలకి పంచడం కూడా మనకొచ్చు. హిందూ, బౌద్ధ మతాలని మనం క్రీ.పూ. 4వ శతాబ్దంలో ప్రచారం చేశాము. సిలోన్, బర్మా, జావాల్లో, కంపూచియాలో అమరావతి, విజయపురి అన్న ప్రదేశాలు ఇంకా ఉన్నాయి. మన ఒంగోలు గిత్త ఇండోనీషియాలో ఇప్పటికీ ప్రసిద్ధి. ఇప్పటి కాలంలో ప్రపంచంలోని అన్ని రంగాల్లోనూ మనవాళ్ళు అధిగమిస్తున్నారు. ఐ.టి. (IT) రంగం మనం లేకపోతే లేదు అంటున్నారు.

హస్త కళల్లో కూడా మనవాళ్ళు నిష్ణాతులే. మన బిద్రి, కళంకారి, కొండపల్లి కొయ్య బొమ్మలు, నిర్మల్ బొమ్మలు, ఇత్తడితో చేసే బొమ్మలు, లేపాక్షి వంటి శిల్ప కళాఖండాలు, బంజారాల అద్దాల అల్లికలు, గద్వాల, కొత్తపేట, ధర్మవరం, నారాయణపేట, వెంకటగిరి, పెద్దాపురం, పోచంపల్లి చీరలు మొదలైనవి ఎంతో ప్రసిద్ధి చెందినవి. నాట్యరంగానికి వస్తే, తోలుబొమ్మలాట, కూచిపూడి నృత్యం, తప్పెటగుళ్ళు, లంబాడీ నృత్యం మన ప్రత్యేకతలు. మనకున్న హరికథలు, బుర్రకథలు ఇంకెవ్వరికీ లేవు. నాటకాల్లోనూ, సినిమా రంగంలో కూడా మనకి మంచి పేరుంది. కన్యాశుల్కం, వరవిక్రయం లాంటి నాటకాలు సమాజంలోని కుళ్ళుని కడగడానికి ఉపయోగించాయి. మన సంస్కృతికి విశేష ప్రచారం రావడానికి సినిమాలు కారణం.

మనకి అన్ని రంగాల్లోనూ ప్రజ్ఞావంతులు ఉన్నారు. పలనాటి బ్రహ్మన్న, కందుకూరి, గురజాడ లాంటి సంఘ సంస్కర్తలు, అల్లూరి సీతారామరాజు లాంటి యోధులు, టంగుటూరి ప్రకాశం, పొట్టి శ్రీరాములు లాంటి త్యాగధనులు, క్షేత్రయ్య, త్యాగయ్య లాంటి వాగ్గేయకారులు, రుద్రమదేవి, చానమ్మ, తెలుగింటి కోడలు సరోజిని నాయుడు లాంటి స్త్రీ మూర్తులు, కె. ఎల్. రావు లాంటి శాస్త్రజ్ఞులు, మనకి దండిగా ఉన్నారు. మనం వాళ్ళ నుంచి చాలా నేర్చుకోవాలని చూస్తాం.

మన వాళ్ళలో బహుభాషాకోవిదులు కూడా చాలామంది ఉన్నారు. తెలుగు వచ్చిన వాడికి ఏ భాషయినా సులభంగా వస్తుందంటారు. లార్డ్ ఇర్విన్ ఇంగ్లీషు ఉచ్చారణని దిద్దిన రైట్ ఆనరబుల్ శ్రీనివాస శాస్త్రిగారు, ఆశువుగా 14 భాషల్లో కవిత్వాన్ని తర్జుమా చేయ గలిగిన పుట్టపర్తి

నారాయణాచార్యులు గారు, మరో బహుభాషాకోవిదుడు పి.వి. నరసింహారావు గారు మన కెంతో గర్వకారణం.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, మనం దేశ రాజకీయాల్లో చాల ప్రభావం చూపుతూ వస్తున్నాం. అందాకా ఎందుకు? సాక్షాత్తు ప్రధానమంత్రి చేతులు జోడించి నమస్కరించ వలసిన వ్యక్తి రాష్ట్రపతి. అలాంటి రాష్ట్రపతి పదవిలో ఇప్పటివరకు మన వాళ్ళే ఎక్కువ మంది ఉన్నారని అందరికీ తెలుసు. ఇంత మంది ఇచ్చిన స్ఫూర్తితో మనం ప్రగతి కోసం నిరంతరం పరుగులు పెడుతూనే ఉన్నాం. మన సంస్కృతి అంటే, ఒక్క మాటలో చెప్పాలంటే, ఏ రంగంలోనైనా మనం పెట్టే ఈ పరుగే.

అయితే మనలో కొంత మంది తెలుగు మాట్లాడటం చిన్నతనమని అనుకుంటున్నారు. ఇంగ్లీషు మీద మోజు మంచిదే కానీ, మాడుగుల నాగఫణిశర్మ గారు అన్నట్లు ఇంగ్లీషుని కాటుకలా వాడితే మంచిది, వొళ్ళంతా పూసుకోకూడదు. వంటలో ఇంగువ లాగా ఉండాలి ఇంగ్లీషు. సొంతం ఇంగువే తినాలని అనుకోకూడదు. అందుచేత, మనందరము ఆంధ్ర సంస్కృతిని ఇలాగే ఇంకా ఇంకా అభివృద్ధి చెయ్యాలి.

4. కవిత్వానికి నిర్వచనం చెప్పిన అవధాని

నేను ఢిల్లీలో పనిచేస్తున్న రోజుల్లో ఒక సాయంకాలం అవధాన సహస్రఫణి బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ గారితో పిచ్చాపాటీ మాట్లాడే అవకాశం కలిగింది. ఎంత సేపు మాట్లాడినా అటు జేసి ఇటు జేసి విషయం కవిత్వం మీదకి రాకుండా ఉండదు కదా. అదే జరిగింది.

కవిత్వానికి కవులు, పండితులు రక రకాల నిర్వచనాలు ఇచ్చారు. ఉదాహరణకి, ఆంగ్ల కవి Wordsworth "Poetry is the spontaneous overflow of powerful feelings: it takes its origin from emotion recollected in tranquility." అని అన్నాడు. "విశ్వశ్రేయః కావ్యం" అన్నది ఆర్యోక్తి. "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం" అని రస గంగాధర కర్తయైన సంస్కృత కవి జగన్నాథ పండిత రాయలు చెప్పాడు. "చేతము చల్లఁ జేయవలె జిల్లన జల్ల వలెన్ మనోహర ద్యోతక గోస్తనీ ఫల మధుద్రవ గోఘృత పాయస ప్రసారాతి రస ప్రసార రుచిర ప్రసరంబుగ సారె సారెకున్" అని ముగిస్తూ ఆంధ్ర కవితా పితామహుడు అల్లసాని పెద్దన ఏకంగా ఒక ఉత్పల మాలిక చెప్పాడు. కదిలేదీ కదిలించేదీ, మారేదీ మార్పించేదీ, పాడేదీ పాడించేదీ, పెనునిద్దర వదిలించేదీ, మున్ముందుకు సాగించేదీ, పరిపూర్ణపు బ్రతుకునిచ్చేదీ, కావాలోయ్ నవకవనానికి - ఈ విధంగా సాగింది అభ్యుదయ మహాకవి శ్రీశ్రీ గారి కవితావేశం, కవితకు నిర్వచనం.

ఇట్లా, అనేక విధాలుగా కవిత్వాన్ని నిర్వచించారు పెద్దలు. అవి గుర్తు చేస్తూ, కవిత్వము ఎలా ఉండాలి అన్న విషయం మీద మీ అభిప్రాయాన్ని పద్య రూపంలో చెప్పండి అని అడిగిన మీదట నాగఫణి శర్మగారు ఆశువుగా చెప్పిన పద్యం క్రింద ఇవ్వబడింది:

ఉ. చంద్రుడు తొంగి చూచినటు, చయ్యన వెన్నెల జారినట్లు, ని
స్తంద్ర సముద్ర మా దివిని తాకగ చేతులు చాచినట్లు, లీ
లం ద్రుమవల్లరీ తతి విలాసపు వాసన చిమ్మినట్లు, ధీ
సాంద్రుడు చెప్పి చెప్పక లసత్కృతి సత్కృతి జెప్పగా వలెన్.

(తొంగిచూచు = పొంచి చూచు, చయ్యన = హఠాత్తుగా, నిస్తంద్ర = అలసట లేనిది, దివి = ఆకాశము, లీల = విలాసము, ద్రుమ = వృక్షము, వల్లరీ = పూగుత్తి, తతి = సమూహము, విలాసము = సొగసు, ధీసాంద్రుడు = బుద్ధిమంతుడు, లసత్ = ప్రకాశమానమైన, కృతి = కావ్యము, సత్కృతి = సమ్మానము)

కవిత్వం అనేది మరీ సరళంగా ఉంటే బాగుండదు. అలా అని, ఎవరికీ అర్థం కాకుండా మరీ ప్రౌఢంగానూ ఉండకూడదు. కవిత్వం అర్థం అయ్యీ అవనట్లుగా చంద్రుడు తొంగి చూసినట్లుగా ఉండాలి. శబ్దాల వెల్లువ వెన్నెల జారినట్లుగా ఉండాలి. ఆశావాదంలోనూ, ఉత్సాహాన్ని రేకెత్తించడం లోనూ, కవిత్వం, అలుపూ సులుపూ లేకుండా ఆకాశాన్ని అందుకోవడానికి చెయ్యి చాచే సముద్రం లాగా ఉవ్వొంగుతూ ఉండాలి. పూల తీగలు విలాసంగా ఊగుతూ సువాసనలు వెదజల్లినట్లు కవిత్వంలో మృదుత్వము, లాలిత్యము ఉండాలి. అలాంటి లక్షణాలు కవిత్వానికి ఉండాలని నాగఫణి శర్మగారు భావన చేశారు.

5. కాటూరివారి పౌలస్త్య హృదయము

(ఈ వ్యాసం సంచిక మాస పత్రిక అనబడే తెలుగులో తొలి డైనమిక్ వెబ్ పత్రికలో (నవంబరు 01, 2024) ప్రచురించబడింది. అందుబాటులో ఉన్న లింకు:
https://sanchika.com/katurivaari-paulastya-hrudayamu-mvsr-essay/)

[ఈ వ్యాసంలో వ్రాసిన చాలా విషయాలు, సుమారు 44 సంవత్సరాల క్రితం మా గురువుగార్లలో ఒకరైన కీ. శే. లక్కరాజు శ్రీనివాసరావుగారు నాకు చెప్పినవి. ఆ రోజుల్లో వారు విజయవాడలో 'ఆంధ్రపత్రిక'లో ఉపసంపాదకులుగా పనిచేసేవారు. సాహిత్యాభిలాష చేత వారికి కాటూరి వేంకటేశ్వరరావుగారితో చాల దగ్గర అనుబంధం ఉండేది. శ్రీనివాసరావుగారికి వేంకటేశ్వరరావుగారు పెదమామగారు కూడా అవుతారు. అందుచేత, ఈ వ్యాసం శ్రీనివాసరావుగారి దివ్యస్మృతికి అంకితం.]

పౌలస్త్య హృదయము తొలి ముద్రణ 1944వ సంవత్సరంలో మచిలీపట్నంలో ప్రకటించబడింది. ఇందులో గ్రంథకర్తలు పింగళి లక్ష్మీకాంతంగారు, కాటూరి వేంకటేశ్వరరావుగారు. వీరిరువురూ జంట కవులు. ఇప్పుడు నాకు వెబ్సైట్లో (website) దొరికిన ముద్రణ 2016వ సంవత్సరంది. ఇందులో, కృతి కర్త ఒక్కరే. ఆయనే కాటూరి వేంకటేశ్వరరావుగారు. దీన్ని బట్టి, మొదట ఇద్దరి పేర్ల మీద ప్రకటించినా, అసలు కృతికర్త కాటూరి వేంకటేశ్వరరావుగారు అని తెలుస్తోంది. మొదట్లో, ఎందుకు ఇద్దరి పేర్ల మీద ప్రకటించారో కారణాలు తెలియవు.

కవిత్రయంలో మూడవ వాడైన ఎర్రాప్రగడ తన వంశదీపకుడని చెప్పుకున్న కాటూరివారు, ఐదు పద్యాలో తమ అన్నగారైన రామకృష్ణయ్యగారికి వినయ విధేయతలతో 'పౌలస్త్య హృదయము' కృతిసమర్పణము చేశారు. వీటిల్లో మొదటి పద్యంలో "ఇరువదేండ్లాయె, బౌలస్త్య హృదయమును రచించి" అని చెప్పుకున్నారు. భారతి సాహిత్యమాస పత్రిక ఫిబ్రవరి 1959 సంచికలో "కాటూరి ఖండకావ్యాలు" అన్న శీర్షికతో శ్రీ పి. గణపతిశాస్త్రి గారు "ఈ కవి ఇతః పూర్వమే రచించిన 'పౌలస్త్య హృదయము' ఒక చిన్న పుస్తక రూపంలో వెలువడింది. ఇటీవల మచిలీపట్టణంలో త్రివేణీ

ప్రకాశకులు 'గుడి గంటలు', 'పౌలస్త్య హృదయము' కలిపి ప్రత్యేకంగా ఒక కవితా సంపుటి ప్రకటించారు." అని వ్రాశారు. అంటే, 1958-59 ప్రాంతాల్లో ఈ సంపుటి ప్రచురింపబడి ఉండవచ్చు. అక్కడి నుండి 20 సంవత్సరాలు వెనక్కి వెళితే, "పౌలస్త్య హృదయము" రచనాకాలము 1938-39 అయి ఉండవచ్చు.

కాటూరి వేంకటేశ్వరరావు గారు (1895-1962) వ్రాసిన "పౌలస్త్య హృదయము" ఒక విలక్షణమైన ఖండకావ్యము. పులస్త్య బ్రహ్మ కుమారుడైన రావణ బ్రహ్మ అంతరంగాన్ని చక్కగా ఆవిష్కరించిన అరుదైన ఘనత ఈ కావ్యానికి ఉంది. ఈ కావ్యంలో వస్తువే కాక దాన్ని వ్యక్తీకరించిన పద్ధతి కూడా ఒక అపూర్వమైన అనుభూతిని పాఠకులకు కలిగిస్తుంది. తెనుఁగులెంక తుమ్మల సీతారామమూర్తిగారు కాటూరివారిని ప్రశంసిస్తూ చెప్పిన 15 పద్యాలలో, ఒక పద్యం పౌలస్త్య హృదయం కావ్యం గురించినది. రావణుని వైరభక్తిపై వ్రాసిన కావ్యం చిన్నదయినా, అది ఒక్కటీ చాలు, ఆయన అపర వాల్మీకిగా నాలుగు దిశలా కీర్తింపబడడానికి, అని చెప్పారు. ఆ పద్యం క్రింద ఇవ్వబడింది.

తే. గీ. రావణుని వైరభక్తిపై వ్రాసినట్టి
కబ్బ మితనిది చిన్న దౌఁ గాక, యదియ
చాలు నపర వాల్మీకినా నేల నాల్గు
దిశల నితఁ డజరామరయశము నంద.

ఆంగ్ల సాహిత్యంలో 'సొలిలాక్వీ' (soliloquy) అంటే 'స్వగతము' అని, నాటకాలలో, ముఖ్యంగా షేక్స్పియర్ (1564-1616) నాటకాల్లో, ఒక ప్రక్రియ క్రీ.శ. 17వ శతాబ్దం నుండి చాలా ప్రజాదరణ, ప్రాముఖ్యత సంతరించుకుంది. సొలిలాక్వీ (స్వగతము) అంటే నాటకంలో ఒక పాత్ర తనతో తనే కొన్ని మాటలు చెప్పుకోవడం.

షేక్స్పియర్ నాటకాల్లో అలాంటి స్వగతాలు స్వతంత్ర కవితాఖండాలుగా నిలిచాయి. షేక్స్పియర్ నాటకాలు పూర్తిగా చదవని వాళ్ళు కూడా, వాటిల్లో ఉన్న స్వగతాలను లేదా వాటి భాగాలను,

వేరువేరు సందర్భాలలో ఉదాహరించడానికి పనికొచ్చే నిత్యసత్యాలుగా భావించారు. ఆ సొలిలాక్వీలు విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ఉంటూ వచ్చాయి. తెలుగులో, "స్వగతము" అన్న పదానికి "తన గడచిన కాలము" అని అర్థము. నాటక సాహిత్యంలో "స్వగతము" అంటే తనలో తాను మాట్లాడుకోవడము లేక తనకు తానే తలపోసుకోవడము. తెలుగు నాటకాల్లో, స్టేజి (stage) మీద ఒక పాత్ర ఒకటి-రెండు మాటలు తనలో తాను అనుకుని (మెల్లగా, ప్రేక్షకులకి మాత్రమే తెలియాలి అన్నట్లుగా), తర్వాత బిగ్గరగా (ప్రకాశముగా) ఇతర పాత్రలతో ఏదో చెప్పినట్లుగా చూపిస్తారు. పాత్ర మనసులో ఉన్న భావం, వాళ్ళ మానసిక సంఘర్షణ, ప్రేక్షకులకి తెలియజెప్పడానికి ఈ స్వగతాలు ఉపయోగపడ్డాయి.

ఇంచుమించు, సొలిలాక్వీల లాంటివే తెలుగులో స్వగతాలు లేక ఏకపాత్ర రూపకాలు కూడా. 1920 దశకంలో బందరులో (మచిలీపట్నంలో), తెలుగులో ఏకపాత్ర రూపకాలు ('మయసభ' లాంటివి), షేక్స్పియర్ నాటకాలలోని ప్రసిద్ధ ఘట్టాలు (ఒక్కరే అభినయించేవి) ప్రదర్శింపబడేవిట. ఆ తర్వాత, ఏకపాత్ర రూపకాలు (జనసామాన్యంలో, వాటిని ఏక పాత్రాభినయాలు అంటారు) చాలా ప్రాచుర్యంలోకి వచ్చాయి. కాటూరి వారు అదే కాలంలో బందరులో పనిజేయడం వలన, వీటి ప్రభావం కచ్చితంగా వారిమీద ఉండి ఉండాలి. నాటకాల్లోనే కాకుండా, కేవలం కవితాత్మకంగా ఉండే స్వగతాలు కూడా తెలుగులో వ్రాయబడ్డాయి. పద్యరూపంలో కూడా కొన్ని స్వగతాలు తెలుగులో వచ్చాయి. ఇవన్నీ, 'పౌలస్త్య హృదయము' వ్రాయడంలో కాటూరివారిపై ప్రభావం చూపి ఉండవచ్చు. ఎందుకంటే, 'పౌలస్త్య హృదయము' ఒక స్వగతము. రావణుడు తన గోడు చెప్పుకోవడమే 'పౌలస్త్య హృదయము' లోని కథాంశము. ఇందులో ఉన్న కథకి మూలం ఏ పురాణంలోనూ దొరకదు. కథ ఈ కావ్యంలో కూడా స్పష్టంగా చెప్పబడలేదు. కాకపోతే, కథకి ప్రేరణ నిచ్చేవి మాత్రం, భాగవత పురాణంలోను, వాల్మీకి రామాయణం ఉత్తరాకాండములోను ఉన్నాయి.

వైకుంఠంలో శ్రీమహావిష్ణువు దగ్గర ద్వార పాలకులుగా ఉన్న జయ విజయులు, సనక సనందనాదుల శాపం కారణంగా మూడు సార్లు మహావిష్ణువుకి ఆగర్భ శత్రువులుగా ఆయనకు సమానమైన శక్తివంతులుగా జన్మించి ఆయన చేతిలోనే మరణం పొంది వైకుంఠానికి తిరిగి

వస్తారని భాగవత పురాణంలో ఉంది. ఆ ప్రకారమే వారు కృతయుగంలో హిరణ్యాక్ష హిరణ్య కశిపులుగా, త్రేతాయుగంలో రావణ కుంభకర్ణులుగా, ద్వాపర యుగంలో శిశుపాల దంతవక్త్రులుగా జన్మించి తిరిగి విష్ణు సాన్నిధ్యం పొందుతారు.

వాల్మీకి రామాయణంలో అనేకానేక ప్రక్షిప్తములు (తరువాత చేర్చబడినవి) ఉన్నాయని అంటారు. ఉత్తర రామాయణంలో 37వ, 38వ సర్గలకు మధ్య 5 సర్గలు ప్రక్షిప్తము చేశారని అంటారు. అలా ప్రక్షిప్తము చేసిన భాగంలో, రాముడితో అగస్త్యుడు చెప్పినట్లుగా కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు ఉన్నాయి. అందులో ఒకటి రావణ సనత్కుమారుల మధ్య కృతయుగంలో జరిగిన సంభాషణ ఉంటుంది.

రావణుడికి సనత్కుమారుడు అనేక విషయాలు చెబుతాడు. అందులో ముఖ్యమైనది ఏమిటంటే, విష్ణువు చేతిలో మరణించినవారికి తరువాతి పుట్టుకలు, చావులు ఉండవని, నేరుగా వైకుంఠానికి వెళతారని. అది వినగానే, రావణుడి మనస్సులో "విష్ణువు చేతిలో చావడం ఎలాగా" అనే అలోచన మొదలవుతుంది. అది పసిగట్టిన, సనత్కుమారుడు, విష్ణువు గురించి చెబుతూ, త్రేతాయుగంలో విష్ణువు రాముడుగా పుట్టడం, లక్ష్మీదేవి సీతగా పుట్టడం, వివాహానంతరం కారణాంతరాల వల్ల వారు దండకారణ్యానికి వెళ్ళవలసి రావడం, వారు పర్ణశాలలో నివాసం చేయడం జరుగుతాయని చెప్పాడు.

అప్పటినుంచి, రావణుడు జననమరణ చక్రం తప్పించుకోవడానికి రామావతారంలో విష్ణువుతో ఎలా వైరం పెట్టుకోవాలి, విష్ణువు చేతిలో ఎలా మరణించాలి అని ఆలోచింపసాగాడు. ఆ అవకాశం సీతారామలక్ష్మణులు దండకారణ్యంలో పర్ణశాలలో ఉన్నప్పుడు దక్కింది. మారీచుడి సాయంతో రామలక్ష్మణులని బయటికి పంపి సీత ఒంటరిగా ఉండగా అపహరించి రామునికి ఆగ్రహం కలిగించి రామునితో వైరం తెచ్చుకున్నాడు.

ఇదంతా రామునికి అగస్త్యుడు చెబుతూ – "రామా, నీకు తెలియక పోయినా నీవు విష్ణువువని రావణునికి తెలుసు. నీ చేతిలో మరణించడానికే నీ భార్య సీతని అపహరించాడు." అని చెప్పాడు.

పైగా, రావణుడు సీతను లంకలో ఉంచి జాగ్రత్తగా రక్షించాడని, ఒక తల్లిని కొడుకు ఎలా చూసుకుంటాడో అలా చూసుకున్నాడు రావణుడనీ చెప్పాడు. విష్ణువు చేతిలో మరణిస్తే జననమరణ చక్రం నుండి విముక్తి లభిస్తుంది అని సనత్కుమారుడు చెప్పడం, రావణుడు అలా మరణించినా కూడా, భాగవత పురాణంలో చెప్పినట్లుగా మళ్ళీ ద్వాపర యుగంలో శిశుపాలుడుగా పుట్టడం, వీటి మధ్య వైరుధ్యం కొట్టొచ్చినట్లుగా కనబడుతుంది. ఏది ఏమైనా, ఈ వృత్తాంతము కాటూరివారి అందమైన కల్పనకి ఆధారమైంది.

'పౌలస్త్య హృదయము' లో పౌలస్త్యుడు అంటే పులస్త్య బ్రహ్మవంశమువాడు, అనగా రావణుడు, 'హృదయము' అంటే అంతఃకరణము లేక మనస్సు. "పౌలస్త్య హృదయము" అంటే రావణుని అంతఃకరణము. సందర్భ మేమిటంటే సముద్రుడు వచ్చి రాముడు లంకపై యుద్ధానికి వచ్చాడని రావణునికి చెప్పినపుడు, దానికి రావణుని ప్రతిస్పందన. ఈ సముద్రుడు అన్నది రావణుడి లంకా రాజ్యానికి ఆనుకునే ఉన్న సముద్రాని కిచ్చిన మానవ రూపము. సముద్రుడు ఒక మనిషి అయినట్లు అతనికి మనుషుల్లాగే కష్టసుఖాలు పంచుకునే తత్వం ఉన్నట్లు, ఒక మంచి పొరుగువాడి (neighbour) లాగా, మిత్రుడి లాగా రావణుని దగ్గరికి వచ్చి నీకేదో కొంప లంటుకుంటున్నాయని చెప్పడం (అంటే కొంప మీదికి ఎవరో పోట్లాటకి వచ్చారని), దానికి సమాధానంగా రావణుడు ఒక చిరకాల మిత్రునికి చెప్పినట్లు సముద్రునికి తన గోడంతా చెప్పడం, ఇందులోని కథాంశం. సముద్రుడిది కల్పిత పాత్ర కాబట్టి, అతనికి మాటలు ఏమీ లేవు కాబట్టి, ఇది రావణుని స్వగతము, ఏకపాత్ర పద్య రూపకము. ఈ ఖండకావ్యం లోని 39 పద్యాలలో రావణుని అంతరంగం ఆవిష్కరించబడింది.

ఈ సందర్భం మన నిత్య జీవితంలో ఎలా ఉంటుందో చూద్దాము. మనం ఒకళ్ళ దగ్గిర అదివరకు కొంతకాలం పనిజేసి మానేశాము. తర్వాత వేరే ఎక్కడో బ్రతుకుతూ అంత వాళ్ళమయ్యాము. ఆ తర్వాత, ఆ పాత యజామనితో కావాలని ఏదో తగువు పెట్టుకున్నాము. ఇప్పుడు ఆ యజమాని మనతో పోట్లాటకి వస్తున్నాడన్న కబురు తెలిస్తే మనకి అతనితో ఉన్న అనుబంధంలో మంచి విషయాలు, చెడు విషయాలు అన్నీ వరసగా గుర్తొస్తాయి. ఆ కబురు తెచ్చింది మిత్రుడైతే,

అతనితో మన ఆలోచనలు, అక్కసు అన్నీ పంచుకుంటాము. రావణుడి స్వగతము కూడా సరిగ్గా అలాగే ఉంటుంది. ఆ ధోరణి ఎలా ఉంటుందో ఇంకొంచెం వివరంగా చూద్దాం.

రానీ నువ్వెందుకు భయపడతావు. మనిద్దరం ఏమన్నా తక్కువ వాళ్ళమా. చేతకాని వాళ్ళమా. ఎప్పుడన్నా, దేనికయినా భయపడ్డామా. ఏది ఏమయినా, మనం అమర్యాదగా ఉండద్దు. ఆయన వచ్చినప్పుడు, చక్కగా స్వాగతించు. ఎంతమందిని తీసుకొస్తాడో తీసుకుని రానీ. ఈ విధంగా అయినా అయన్ని మళ్ళీ చూసే భాగ్యం నాకు కలుగుతోంది. ఆయన్ని తొందరగా రప్పించడానికి నేను ఏమేమి పనులు చేశానో తెలుసా. ఆయనకి ఒళ్ళు మండే పనులన్నీ చేశాను. అయినా, ఇంత ఆలశ్యం చేస్తాడా, రావడానికి. అవును, నువ్వెందుకు కంగారు పడతావు. అసలు ఎవరతోనన్నా, గొడవైతేనే కదా మన గొప్ప ఏమిటో ప్రపంచానికి తెలిసేది. ఆయనకి నేను పెట్టిన కష్టానికి, ఎక్కడెక్కడికో వెళుతున్నాడు, ఎవరెవరినో కలుస్తున్నాడు, అంతా తెలుసుకుంటూనే ఉన్నాను. నా సాయం అడగచ్చుగా. అంత కానివాణ్ణయి పోయానా, నేను? అసలు నన్ను ఆయన తప్పించుకు తిరుగుతుంటే ఆయన్ని రెచ్చగొట్టే పనులు చాలా చేశా. అయినా, లాభం లేకపోయింది. ఇప్పుడెక్కడికి పోతాడు. ఈసారి మాత్రం అయనకి బాగా ఒళ్ళుమండే పని ఒకటి చేశా. ఇప్పుడు నాకు చాలా తృప్తిగా ఉంది. ఆయన్ని రప్పించాలని ఇదంతా నేను చేస్తే, ఆయన నాకు నమ్మక ద్రోహం చేస్తాడా. అది చూసి నేను ఊరుకుంటానా. నీకు తెలియదు కానీ, అసలు మొదట్లో బానే ఉండేవాడు. ఎందుకో, ఈమధ్యే ఇలా అయిపోయాడు. సరే వస్తున్నాడుగా, రానీ. ఆయన పోట్లాటకి వచ్చినా, మనం మంచిగానే ఉందాం. బాగానే, మన స్థాయికి తగ్గట్లుగా, స్వాగతిద్దాం. తర్వాత, ఏం జరిగితే అది జరుగుతుంది. అంతగా, గొడవకి సిద్ధమయితే మన తడాఖా చూపిద్దాం. ఇలా సాగుతాయి రావణుడి మిశ్రమ భావోద్వేగాలు (mixed emotions) కూడా. ఇవన్నీ, వరసగా తన పద్యాలలో మనోహరంగా, అక్కడక్కడా వ్యంగ్యంగా, కాటూరివారు ఎలా చూపించారో, చూద్దాం.

మొదటి పద్యంలో, "ఎందుకిలా నురుగులు కక్కుకుంటూ, రొప్పుకుంటూ, కంగారుగా, భయంగా వస్తున్నావు? ఎవరి వల్ల నీకీ స్థితి కలిగింది? చెప్పవయ్యా సముద్రుడా" అని రావణు డంటాడు.

ఇక్కడ పద్య నిర్మాణం, సహజంగా ఉండే సముద్రఘోషని, పరిస్థితికి తగ్గట్టుగా అన్వయిస్తూ కాటూరివారు ఎలా అభివర్ణించారో చూడండి.

మ. నురుఁగుల్ గ్రక్కుచు నూర్పుసందడులు మిన్నుల్ ముట్ట నొక్కుమ్మడిన్
బరుగుల్ ద్రొక్కుచు శీర్ణ కేశముల నుద్బాహుండవై వచ్చు త
త్తరమున్ గాంచిన నుత్తలంపడెడిఁ జిత్తం, బీ భయోద్వేగ మె
వ్వరిచే, నీ కొనఁగూడె నర్ణవపతీ! వాక్రుచ్చవయ్యా! వెసన్. ... 1

ఇద్దరు మిత్రులు కలుసుకున్నపుడు, వాళ్ళిద్దరు మాత్రమే గొప్పగా ఉన్నట్లు, మిగిలిన ప్రపంచం సరిగాలేనట్లు, చెప్పుకోవడం పరిపాటి. దానికి తగ్గట్లుగానే, రావణుడు ఇలా అంటున్నాడు, - "మనిద్దరం మమూలు వాళ్ళమా! మనం కళ్ళెర్రజేస్తే మూడులోకాలు వణుకుతాయి. నీకేం కావాలన్నా, నా ఇరవై చేతులతో సాయం చేయడానికి నేనున్నాను. నాకు (నా లంకా రాజ్యానికి) అండగా పెద్దపెద్ద అలలతో ఒక పెట్టని కోటలాగా నువ్వున్నావు. మనం ఎవ్వరికీ భయపడాల్సిన పనిలేదు.". ఈ భావాన్నే 2వ పద్యంలో ఎలా పలికించారో చూడండి.

తే. గీ. భ్రుకుటి మాత్రముచే మూడు భువనములకు
విలయము ఘటించు జగదేక వీరుల మఁట!
నీకు మద్బాహువింశతి, నాకు నీదు
వీచికాకోటి యఁట కోట! వెఱ పిఁకేల? ... 2

"ఎందుకు భయం? ఏమన్నా కొంప లంటుకుంటున్నాయా? ఆకాశమేమన్నా ఊడి పడుతోందా?" అని అంటాము కదా. అదే విధంగా, రావణుడు అంటున్నాడు. సూర్యుడి ప్రకాశంలో గాని, గాలి వీచడంలో గాని, ఏమన్నా మార్పుందా? ప్రళయం వచ్చినట్లుగా మేఘాలు గర్జిస్తున్నాయా? చుక్కలు రాలడంలేదు కదా? దేనికి భయం? అసలు భయం అనే మాట మనం ఏనాడైనా ఎరుగుదుమా? ఈ విధంగా రావణుడి చేత పలికించిన మాటలు 3వ పద్యంలో చూడండి.

శా. నాకున్నీకు భయం బఁటన్న నుడి యెన్నండైన విన్నామ? నేఁ
డీ కంపమ్మునకుస్ గతమ్ము కనరాదే! సుంతయుస్ భాస్కరుం
డేకాకారత వెల్గు, వాయువును మున్నె ట్టట్టులే వీచు, లే
దే కల్పాంత పయోద గర్జ, కనరాదే తారకల్ రాలుటల్.   ... 3

ఆ భయం తాలూకు తెచ్చిపెట్టుకున్న గాంభీర్యం ప్రదర్శిస్తూ రావణుడు "నా కత్తి (చంద్రహాసం) నా చెయ్యి జారలేదు, నీ లోపల బడబాగ్ని ఆరలేదు, శ్రీరాముడు ధనుష్టంకారం ఇంకా చేయనే లేదు" అని అంటున్నాడు. ఇది 4వ పద్యంలో చూడవచ్చు.

తే. గీ. చంద్రహాసము నా చేయి జాఱలేదు
ఔర్వశిఖియు నీ జఠరమం దాఱలేదు
సజ్యకార్ముకుఁడై రామచంద్రమూర్తి
శింజినీటాంకృతియు నింత సేయ లేదు.   ... 4

ఇంకాస్త విషయాన్ని ముందుకు తీసుకుని వెళ్ళి, రావణుడు "ఏమీ భయపడకు. రామలక్ష్మణులకీ, సుగ్రీవుడికీ, హనుమకీ, వాళ్ళ వానర సైన్యానికీ చక్కగా రావడానికి త్రోవ ఇవ్వు." అని అంటున్నాడు. ఇది 5వ పద్యంలోని సారాంశం.

తే. గీ. ఎట్లు! చెప్పవు? రాఘవుఁడే! మఱేల!
విడువు కంపము, త్రోవ రా విడువు మతని
కనుజ సౌమిత్రితో, సూర్యతనయు తోడ,
హనుమతోఁ దరుచర వరూధినుల తోడ.   ... 5

వాళ్ళు యుద్ధానికి వస్తున్నారని వాళ్ళని చూడవచ్చని ఉత్సాహం చూపిస్తూ, రావణుడు "ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు. నాకు ఇరవై కళ్ళున్నందుకు ఫలితం రాబోతోంది. నా భుజపరాక్రమం చరితార్థమయే సుముహూర్తం వచ్చింది." అని అంటున్నాడు. మామూలుగా అయితే రెండు

కళ్ళతో చూస్తాము. ఇరవై కళ్ళతో అంటే, ఇంకా బాగా చూడవచ్చని భావం. ఇది 6వ పద్యంలో చెప్పిన విషయం.

కం. ఎన్నాళ్ళకు! ఎన్నాళ్ళకు!
కన్నులు వింశతియు, నాకుఁ గల్గిన ఫల మా
సన్నమయి వచ్చె! భుజ గ
ర్వోన్నతి, చరితార్థమగు ముహూర్తము వచ్చెన్. ... 6

వెనకటి విషయాలు గుర్తు చేసుకుంటూ, అంటే, విష్ణువు తనే స్వయంగా వచ్చి చంపుతాను అన్న మాటలు గుర్తు చేసుకుంటూ (వాచ్యంగా చెప్పకుండా), రావణుడు "వైకుంఠంలో తనన్న మాటలు ఇప్పుడు గుర్తొచ్చాయా నా స్వామికి. చాలా ఆలస్యం చేసి ప్రభువు నన్ను దగా చేశాడుగా." అని వాపోతున్నాడు. 7వ పద్యంలో చెప్పిందిదే.

కం. నాఁటికి నేఁడా? తలపున
నాటెను సామికి, వికుంఠ నగరోదితమౌ
మాటలు, దీర్ఘ విలంబము
వాటించి విభుండు నన్ను వంచించెఁ గదే. ... 7

వాణ్ణి కొట్టాను, వీడ్ని తన్నాను, వేరొకణ్ణి గజగజలాడించాను అని దర్పంగా కొంతమంది చెబుతారు కదా. అలాగే, రావణుడు, స్వామి ఆలస్యం చేసినా, ఆయన్ని తొందరగా రప్పించడానికి తాను ఏమేమి చేశాడో చెబుతున్నాడు. ఏమని అంటే "పాతాళంలో సర్పరాజు తోక తొక్కాను. ఇంద్రుణ్ణి జుట్టు పట్టుకుని ఆడించాను. శివుడు, పార్వతి సమేతంగా వెండికొండని అల్లల్లాడించాను. మరి, నా సంగతి తెలిసి ఈ విశ్వవిక్షోభాన్ని స్వామి ఎందుకు తప్పింపడు?". ఈ విధంగా 8వ పద్యంలో రావణుడి చేత పలికించారు.

శా. పాతాలాధిపు తోఁకఁ ద్రొక్కితి, శచీ ప్రాణేశు కైశ్యమ్ము౦ డా

చేతం బట్టితి, వెండి కొండ శివుతో శీతాచలేంద్రాత్మజో
పేతం బల్లల నాడఁ జేసితిఁ గదా! యీ విశ్వవిక్షోభ మే
లా తప్పింపఁడు సామి నన్నెఱిగి? మేలా నన్ను వంచించుటల్. ... 8

స్వామిని రప్పించడానికి ఇంకా ఏం చేశాడో చెప్పే ముందు దానికి నేపథ్యము ఏమిటో చెబుతున్నాడు రావణుడు. ఏమని అంటే "శివుడి విల్లు విరిచాడు, సీతను చేపట్టాడు రాముడు" అన్నప్పుడే, అది విష్ణువు చేసిన పని అని అర్ధమయింది. పరశురామ గర్వభంగం అయిన నాటినుండి దినమొక సంవత్సరంగా గడుపుతూ అసహనంతో అవివేకంతో కన్నుగానక, కీడు తలపెట్టాను.". ఆ కీడు ఏమిటో తర్వాత వస్తుంది. 9వ పద్యంలో చెప్పిన విషయం ఇది.

మ. "శివ కోదండముఁ ద్రుంచె, సీత వరియించెన్ రాముఁ" డన్నప్డె మా
ధవు కార్యం బనుకొంటి భార్గవ భుజాదర్పాపహారక్రియా
శ్రవణంబున్ సరిదాకఁగా దినము వర్షంబైన యుత్కంఠచే
నవివేకమ్మునఁ గన్నుగాన కటు ద్రోహారంభమున్ జేసితిన్. ... 9

'ఎక్కడ, నా జానకి' అంటూ, దండకారణ్యంలో బిగ్గరగా ఏడుస్తూ, చెట్ల వెంట పుట్టల వెంట వెతుకుతూ, మృగాల్ని పక్షుల్నీ ఆపి అడుగుతూ నా స్వామి అన్వేషించాడుట. కాని నన్ను మాత్రం అడగడం మరచిపోయాడు. ఇది 10వ పద్యంలో రావణుడన్న మాటలు.

తే. గీ. "దేవి! జానకీ! యెచటనే దేవి!" యనుచు
దండకాటవి నెల్గెత్తి తరుల గిరుల
నెమకి, మృగముల ఖగముల నిలిపి యడిగి,
యుఱక వాపోయెనఁట! నన్ను మఱచి విభుఁడు. ... 10

అలా, తమ్ముడి భుజాల మీద చేతులేసి గుండెలు అదిరేలా ఏడుస్తూ తిరుగుతున్న నా స్వామి జాలి గొలిపే రూపం నాకు కనబడుతోంది, అని 11వ పద్యంలో రావణుడి చేత చెప్పించారు, కాటూరివారు.

తే. గీ. తమ్ముఁ గుఱ్ఱ మూపునఁ గేలుఁదమ్మి మోపి
ఉబుకు వక్షమ్ము బాష్పమ్ము లొలుకు కనులు
నగుచు నా తండ్రి యార్తిమై నడలు నాఁటి
జాలి రూపు నా మోమున వ్రేలు నేఁడు. ... 11

తొలి ముద్రణలో, ఈ 11వ పద్యం ఆఖరి లైన్లో "జాలి చూపు" అని ఉంది. దాన్ని కాటూరివారు, తర్వాతి ముద్రణలో "జాలి రూపు"గా మార్చినట్లు తెలుస్తోంది.

సీతని నేను అపహరించినట్లుగా జటాయువు చెప్పగా విని, నామీద కోపంతో ఊగిపోతూ 'రావణా' అని నా పేరెత్తి ప్రతిజ్ఞ చేసినప్పుడే కదా, నాకు మనశ్శాంతి దొరికింది, అని 12వ పద్యంలో స్వామిని రప్పించడానికి తాను ఏమి చేశాడో అసలు విషయం రావణుడు బయట పెట్టాడు.

తే. గీ. పుడమి కానుపు నే నట్లు పుడికి తెచ్చు
టలు జటాయువుచే విని, విలులితాశ్రు
కలుషిత కపోలములఁ గెంపు దొలుకఁ గ్రోధ
ముద్రితాననుఁడై రామభద్రమూర్తి
"రావణా" యని నన్నుఁ, బేర్వాడి ప్రతిన
సలిపినపుడు గదా మనశ్శాంతి దొరకె. ... 12

స్వామిని తన దగ్గరకు రప్పించుకోవడానికి ఇంకా ఏం చేశాడో చెబుతున్నాడు రావణుడు. ఏమని అంటే, "అంతమందిలో నన్ను గుర్తుపడతాడో లేదో అని అన్ని లోకాల్లో పరాక్రమవంతుడుగా పేరు తెచ్చుకొని పిచ్చి పనులు చాలా చేశాను. నలుగురి చేత రాక్షసుడనని నింద మోపించుకున్నాను.

అయినా కూడా, అంత నిశ్చింతా? నన్ను మరచాడు. ఎంత దయలేనివాడో విష్ణువు, చూశావా?". ఈ మాటలు 13వ పద్యంలో చెప్పబడ్డాయి.

చం. పదుగుర లోన, నన్ గుఱుతు పట్టునొ, లేదొ యటంచు సర్వ భూ
విదిత పరాక్రముండనయి వీఁటిడిసేఁతలు పెక్కు చేసితిన్
బదుగురు, 'వీడు రక్కసుఁడ'నన్ పెడ నిందల కగ్గ మైతిఁ, దా
మదిమదినుండి నన్ మఱచె మాధవుఁ డెంతటి క్రూరచిత్తుఁడో! ... 13

తాను చేసి పనులని రావణుడు సమర్థించుకుంటూ ఏమంటున్నాడంటే, "మునులని హింసించడం నాకేమన్నా ఇష్టమా? స్త్రీలను చెరపట్టడానికి నేనేమన్నా పశువునా? ఇదంతా ఎందుకు చేస్తున్నానంటే, దాసజనులని వెతకడంలో ప్రభువుకి శ్రమ తగ్గించడం కోసమే. క్రూర కర్మలు చేస్తే తొందరగా గుర్తింపు వస్తుంది కదా? అంతే గాని వేరే ఉద్దేశ్యం కాదు." మామూలుగా బడి పిల్లలు కొందరు బాగా అల్లరి చేసి మాష్టారి దృష్టిని ఆకర్షిద్దామని చూస్తారు. ఇది కూడా అలాగే ఉంది. ఈ వైరభక్తి స్ఫోరకమైన మాటలు 14వ పద్యంలో ఉన్నాయి.

తే. గీ. మునుల హింసించుటలు నాకు మనసొ? సతులఁ
జెఱ నిడుట కేను బశువునో? సెప్పు మీవె!
ఇటులు దాసు నృశంసుఁ జేయుటలు గూడఁ
బ్రభునకు వినోదమైన గావచ్చు దాస
జన గవేషణాయాసము దనకు గూర్చు
క్రూరకర్మము మాత్ర మే నేర నిజము. ... 14

మొదటి ముద్రణలో, ఈ పద్యంలో "జెఱ నిడుట కెను బశువునో?" అని ఉంది. "ఎను బశువు" అన్న ప్రయోగం "దున్నపోతు" అన్న అర్థంలో ఇక్కడ వాడినట్లు తెలుస్తోంది. ఛందస్సు ప్రకారం ఈ ప్రయోగం సరేయైనా, తరువాతి ముద్రణలో "జెఱ నిడుట కేను బశువునో?", అన్నప్పుడు "జెఱ నిడుటకు నేను పశువునో" అని ధ్వనించడం ఇంకా బాగుంది అని కాటూరి వారికి అనిపించి

ఉంటుంది. ఇంకో విషయం, పద్యం నాల్గవ లైనులో మొదటి ముద్రణలో "బ్రభునకు" అని ఉంటే, తరువాతి ముద్రణలో "బ్రభువునకు" అని ఉంది. ఛందస్సు ప్రకారం, "బ్రభువునకు" అనడం కుదరదు కాబట్టి, "బ్రభునకు" అన్న ప్రయోగమే తీసుకోవడం జరిగింది. బహుశా, ఇది టైపు చేయడంలో వచ్చిన తప్పు కావచ్చు.

ఎన్ని దుష్టకార్యాలు చేసినా స్వామి స్పందించడం లేదని దోషం ఆయన మీదకు నెట్టుతూ, రావణుడు ఏమంటున్నాడంటే, "ఇంత చేసినా, ఏమన్నా ఫలితం దక్కిందా? ఆఖరికి, సీతమ్మ తల్లిని అపహరింపక తప్పలేదు. నాకేమైనా, మంచి దక్కనిచ్చాడా విష్ణువు?". ఈ భావన 15వ పద్యంలో చెప్పబడింది. “ఒక తల్లిని కొడుకు ఎలా చూసుకుంటాడో అలా సీతను చూసుకున్నాడు రావణుడు” అని అగస్త్యుడు రాముడుకి చెప్పిన మాటను ఇక్కడ రావణుడి చేత పరోక్షంగా చెప్పించారు కాటూరివారు.

తే. గీ. ఇంత జేసినఁగాని నాకించుకంత,
మంచి దక్కఁగ నీఁడాయె మాధవుండు,
సాగరా! యేమి వచియింతు? జానకమ్మ
తల్లినే హరియింపక తప్పదాయె. ... 15

"ఈ మనుషుల రాజనీతి ఎలా ఉంటుందో విన్నావా? వైకుంఠంలో తను నాకిచ్చిన వాగ్దానం మరచిపోయాడు, విష్ణువు. ఆఖరికి, నా చేత స్వామిద్రోహం చేయించాడు. అయినా, గుడ్డిలోకం ఆయన్నే మెచ్చుకుంది. తప్పులన్ని నామీద రుద్దింది" అన్న రావణుడి దెప్పిపొడుపు మాటలు 16వ పద్యంలో వింటాము.

శా. స్వామిద్రోహము కూడ నేర్పెఁ దుదకుస్ వైకుంఠుఁ డౌరౌర! తా
నేమో నా కిడు బాసలోఁ దలఁపఁడాయెస్, గ్రుడ్డి లోకమ్ము త
న్నే మెచ్చెస్ దోసఁగెల్లఁ జాల్పుదలలస్ నిల్పెస్ మహాంభోనిధి
స్వామీ! మర్త్యుల రాజనీతి నిపుణత్వం బెల్ల విన్నావుగా. ... 16

దెప్పిపొడవడం కొనసాగిస్తూ, ఇంకా రావణుడు ఏమంటున్నాడంటే, "నేమేమైనా ఇక్కడ ఉట్టిగట్టి ఊరేగబోతున్నానా? నాకేమిటి భయం? మంచి అంతా ఆయనకే దక్కనీ. ఆయనకి నేనెవరో తెలిస్తే నాకంతే చాలు.". ఈ మాటలు 17వ పద్యంలో చూస్తాము.

ఆ.వె. ఉట్టిగట్టి యిచట నూరేగ నుంటినా
యేమి? లోకభీతి యేల నాకు?
దక్క నిమ్ము మంచితన మెల్ల విభునకే,
అతఁడు నన్నెఱుంగు టదియ చాలు. ... 17

"అన్నీ తెలిసి కూడా, అప్పుడప్పుడూ, ఏమీ ఎరగనట్లుగా ఉంటాడు విష్ణువు. తెలిసీతెలియక సీతను అపహరించి, నేను మోసపోయాను." అని రావణుడు చేసిన ఆరోపణలు 18వ పద్యంలో చూస్తాము.

ఆ.వె. ఎల్ల యెఱిఁగియుండి యేమి నెరుంగని
యట్లు హరి చరించు నప్పుడపుడు;
ఎఱిఁగియెఱుఁగ లేక యే నక్కటా! భూమి
పుత్రి నపహరించి మోస వోతి. ... 18

ఇద్దరికీ పూర్వపరిచయం ఉన్నట్లుగా స్వాధీనత (possessiveness) ప్రదర్శిస్తూ, రావణుడు ఏం చెబుతున్నాడంటే, "వైకుంఠంలో ఉన్నప్పుడు నిజంగా పరమాత్మలాగా దర్శనం ఇచ్చేవాడు, స్వామి. అప్పుడాయనకి, ఈ మాయలు, నటనలు తెలియవు. భూమిమీదకి వచ్చిన తరువాతే, ఇవన్నీ మొదలయ్యాయి." ఈ హాస్యపు పలుకులు 19వ పద్యంలో చెప్పబడ్డాయి.

ఆ.వె. ఇంట నున్న యప్పు డీ మాయ నటనముల్
లేవు కేశవునకుఁ, గేవలుఁ డయి

దర్శన మ్మొసంగు తండ్రి నే నెఱుగనే!
మాయదారి యయ్యె మహికి డిగ్గి. ... 19

"నేను తనకి చేరువయ్యే మార్గాలన్నీ మూసియుంచినా సహించాను. కాని, ఆయన నన్ను సమీపించే మార్గాలన్నీ తెరచియుంచి, రావణుడంటే భయంలేని నేల సూదిమొనంత కూడా మిగల్చకుండా చేశాను. అయినా, ఎందుకింత ఆలస్యం చేశాడు, విష్ణువు?" అని 20వ పద్యంలో రావణుడు వాపోవడం చూస్తాము.

చం. తన దరి కేను రాఁదగిన దారుల నన్నిటి మూసి యుంచినన్
మనమున నోర్చి, నన్ దరియు మార్గము లన్నిటి విప్పియుంచి, రా
వణ భయదాంఘ్రిముద్ర కనుపట్టని సూది మొనంత నేలయున్
దనకు మిగుల్ప నైతిని గదా! విభుఁ డేటికి జాగు జేసెనో. ... 20

భగవంతుణ్ణి చేరడానికి భాగవతంలో శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అన్న నవవిధ భక్తి మార్గాలు చెప్పబడ్డాయి. ఇవేవీ రావణుడికి నచ్చలేదు. అందుకే, ఆ అధ్వములు (మార్గములు) తనకు అభిగాములు (పోవునవి) కావని అంటున్నాడు. మరి, ఆయన కనిపెట్టిన కొత్త మార్గము ఏమిటంటే, భగవంతుడితో విరోధము పెట్టుకుని, ఆయన ఆగ్రహానికి ఆహుతి అయ్యి ఆ విధంగా ఆయనని చేరుకోవడం. అదే, వైరభక్తి. భగవంతుణ్ణి చేరడానికి ఉన్న ఇతర మార్గాలు తనకు వల్లకాదని, సీతను అపహరించడమే తనకు సరియైన వైరభక్తి మార్గమని రావణుడు అనుకున్నట్లుగా మనకు తోస్తుంది. “అన్ని మార్గాలు నాకు చేతనయినవి కావని నాకు తెలుసు. నా స్వామి మాయలు నా దగ్గరా? నన్ను ఇబ్బందులు పెడితే నేనూరుకుంటానా? అందుకే, సీత నపహరించాను. అదే నాకు రాచబాట అనిపించింది”, అని 21వ పద్యంలో రావణుడు అన్నట్లుగా చూస్తాము.

చం. కల సకలాధ్వముల్ మదభిగాములు గావు టెఱింగి భ్రాంతిమై
నిలుచునొ పాలు వోవ కని నిక్కపు మార్గ మొకండె చేసితిన్,

తొలఁగని రాచబాటగద తొయ్యలి నేఁ గొనిచన్న దారి, న
న్నలమట బెట్టినస్ విడుతునా! తన మాయలు చెల్ల నిత్తునా? ... 21

“రావణుడంటే, రాయి రప్పా కాదు. జాలి చూపించి రక్షించడానికి నాతి (అహల్య), కోతి (సుగ్రీవుడు), కాకి (కాకాసురుడు), గ్రద్ద (జటాయువు) కాదు. లోకాలని గడగడలాడించిన, స్వాభిమానం గల రావణు డిక్కడ. యుద్ధం చేసి విజయమో వీరస్వర్గమో చూసుకుంటాడు కాని, కాళ్ళావేళ్ళా పడతాడా” అని రావణుడు స్వాతిశయంతో అన్నట్లుగా 22వ పద్యంలో ఉంది. "రాయీ రప్పను కానే కాను, మామూలు మణిసిని నేను" అని ఒక సినీకవి అంటే, ఇక్కడ రావణుడు "రాయీ రప్పను కానే కాను మామూలు మణిసిని కూడా కాను" అంటున్నాడు.

ఉ. రావణుఁ డన్నఁ గాళ్ళఁ బడు రాయియు అప్పయుఁ గాదు, జాలిమైఁ
గావగ నాఁతి కోఁతియును గాకియు గ్రద్దయుఁ గాదు, లోక వి
ద్రావణుఁ డుగ్రవీర చరితప్రథితుం డతి మానియౌ దశ
గ్రీవుడు, పోరిలోఁ బొడిచి గెల్చును జచ్చును గాక, వేడునే? ... 22

“నువ్వు స్వామిని చూశావు కదా, ఎలా ఉన్నాడు? సీతావియోగం చేత తపిస్తూ చిక్కిపోయాడా లేక విల్లెక్కు పెట్టి రావణుని తలలు త్రుంచుతానని కోపంతో ఉన్నాడా?” అని భావోద్వేగంతో రావణుడు అన్నట్లుగా 23వ పద్యంలో ఉంది.

ఉ. చూడుము నెచ్చెలీ! విభునిఁ జూచితివే కద! చెప్పు మెట్టు లు
న్నాడొ రఘూద్వహుండు, లలనా విరహవ్యథఁ గ్రాఁగి చిక్కి యు
న్నాఁడొ? దశాస్యకంఠదళనప్రవణాగ్రహవృత్తి వెల్గుచు
న్నాఁడొ? అధిజ్యధన్వుఁ డరుణద్యుతిరంజితనేత్ర కోణుఁడై. ... 23

“రాముని పరాక్రమం గురించిన కథలు మారీచుడు, శూర్పణఖ, హనుమ, సీత చెప్పగా విన్నాను.” అని రావణుడు అన్నట్లుగా 24వ పద్యంలో చూస్తాము.

కం. వింటిని మారీచునిచే
వింటిని శూర్పణఖ చేత, వింటి హనుమచే
వింటిని జనకాత్మజచే
వింటిని రఘువీరు బాహువీర్య కథనముల్.   ... 24

"పాలుగారు చెక్కిళ్ళ వయసులో మునియాజ్ఞతో తాటకను సంహరించుట, జులపాలు వ్రేలాడే వయసులో శివధనుర్భంగము చేసిన శృంగార వీరత్వము, పసుపు బట్టలతో పరశురామ గర్వభంగము చేయుట, సీతావియోగంతో బాధపడుతున్న కొత్తల్లో ఒకే బాణంతో వాలిని వధించడం, వీటిని గురించి విన్నాను. వీటన్నిటి కంటే, రాజ్యాన్ని త్యజించి నార బట్టలు కట్టి అడవికి వెళ్ళడంలో ఉన్న ధీరత్వము, స్వామికే చెల్లింది" అన్న రావణుని స్వామిభక్తి స్ఫోరకములైన మాటలు 25వ పద్యంలో చూస్తాము.

సీ. వసవల్చు చెక్కిళ్ళ వయసున లజ్జమై
    ముని యాజ్ఞ దాటక దునుము నొగసు
జునపాలు వ్రేలు నీడున శైవచాపమ్ము
    విఱిచిన శృంగార వీర మహిమ
పసపు బట్టల నిగ్గు పస భార్గవక్రోధ
    సంధ్య మాయించిన శౌర్యసార
మాలిఁ బాసిన క్రొత్త యలఁతమై వజ్రసా
    రుని వాలి నొక కోలఁ దునుము పటిమ

తే. గీ. వింటయే కాని - ఇన్నింటి కంటె రాచ
పట్టము దొరంగి నారలు గట్టి కాన
మెట్టినట్టి వెక్కసమైన దిట్టతనము
వింటి - సామికే తగుననుకొంటెగాని.   ... 25

రాముని అందచందాలు వర్ణిస్తూ, వైరం కారణంగా ఇతరుల లాగా తాను ఆ అందం చూసి తరించే అదృష్టం చేసుకోలేదని రావణుడు వాపోతూ, ఏమంటున్నాడంటే, "ముందే, స్వామిని యుద్ధానికి ఆహ్వానించడం వల్ల, ఆ నీలమేఘశ్యాముని దివ్యమంగళ విగ్రహము కనులార చూచుటకు మీలాగా నేను నోచుకోలేదు కదా". ఈ భావన 26వ పద్యంలో ఉంది. ఆ ఆహ్వానం ఒక యజ్ఞానికి ఆహ్వానం లాగా రావణుడు అభివర్ణిస్తున్నాడు.

ఉ. శ్యామలకాంతి మోహనము సౌమ్య గభీరము సుప్రసన్న రే
ఖామృదుహాస భాసురము, గన్నుల పండువు నైన రాము నె
మ్మోమును మిమ్ముపోలెఁ గన నోమను గాదె, కఠోర వృత్తినై
సామిని మున్నె ఘోర రణసత్ర నిమంత్రితుఁ జేసి యుంచుటన్. ... 26

"అద్దమై తళతళా వెలిగే చంద్రహాసమే (రావణుని ఖడ్గము) రావణుని విశ్వవిజయకీర్తిని తెలుపుతుంది. నేను, రాముడు పరస్పరం కలియుదుము గాక" అని జరగబోయే యుద్ధానికి ఉత్సాహంగా రావణుడన్న మాటలు 27వ పద్యంలో చెప్పబడ్డాయి.

తే. గీ. వినుము, దశకంధరుని విశ్వవిజయకీర్తి
దర్పణంబయి తళతళత్తళ వెలుంగు
చంద్రహాసమె శ్రీరామచంద్రునకును
నాకు ఘటియించుత మిథోవలోకనమ్ము. ... 27

"ఓ! సముద్రుడా! నీవు ధన్యుడవు. మునుపు, మత్స్య కూర్మ అవతారములు ఎత్తినపుడు స్వామి నీ గర్భంలో ఈత కొట్టాడు. మళ్ళీ ఇప్పుడు, నిన్ను దాటడానికి వస్తున్నాడు. ఇదంతా అయిన తర్వాత, మళ్ళీ నీలోనే పవళించి నీ తరంగాలలో సేదతీరుతాడు." అన్న రావణుని మాటలు 28వ పద్యంలో చూస్తాము. అంటే, నన్ను సంహరించిన తరువాత మళ్ళీ వైకుంఠానికి వెళ్ళి పాలసముద్రంలో సేదతీరుతాడు అని రావణుడు అన్నట్లుగా ధ్వనిస్తుంది. ఇది "చేసిందంతా

చేసి ఏమీ ఎరగనట్లు కూర్చున్నాడు” అని అల్లరి పిల్లల గురించి మన కుటుంబాలలో మామూలుగా చెప్పుకునే వ్యంగ్యం లాగా ఉంది.

తే. గీ. తోయధీ! ధన్యుఁడవు నీవు, తొల్లి మత్స్య
కమఠ రూపత నీదె నీ గర్భము హరి,
నేఁడు వెండి దరింప నున్నాఁడు నిన్ను,
నెల్లి నినుఁ జేరి పవళించు నేమి యెఱుఁగ
నట్టులు తరంగలాలితుం డగుచు శౌరి. ... 28

"మీలాంటి వాళ్ళు చరితార్థులవుతారు. కాదనను కాని, తన మోము ముద్దాడిన దశరథుని కంటె, పాలిచ్చి పెంచిన తల్లి కంటె, అర్థాంగి సీత కంటె, పరిచర్యలు చేసిన తమ్ముని కంటె, ఈ జగదేక కంటకుడే స్వామికి ఎక్కువ ఇష్టము." అని ప్రకటించిన రావణుని వైరభక్తి 29వ పద్యంలో చూస్తాము.

చం. అగుదురు మిమ్ముబోంట్లు చరితార్థులు, కాదనఁ గాని, మోము ము
ద్దు గొనిన తండ్రి కంటె, దయతోఁ జను గ్రోల్చిన తల్లి కంటె, మై
సగమగు సీత కంటెఁ, బరిచర్య లొనర్చిన తమ్ము కంటె నీ
జగదభిఘాతి రక్కసుఁడె సామికి మిక్కిలిఁ గూర్చు నెచ్చెలీ! ... 29

“తల్లి, తండ్రి, భార్య, తమ్ముడు, మీరందరు స్వామి వేసిన బంధంలో ఉన్నారు. కాని, స్వామికి నేనే పెను లంకె వేశాను. ఆ విషయం నాకూ ఆ పరమాత్ముడికే తెలుసు.” అని తాను రాముని ఏ విధంగా తన దోవకు తెచ్చుకున్నాడో రావణుడు దర్పంగా చెప్పడం 30వ పద్యంలో చూస్తాము.

ఆ.వె. తల్లి దండ్రి యాలు దమ్ముండు మొదలు మీ
కెల్ల లంకె వైచె వల్లభుండు
వల్లభునకు నేనె వైచితిఁ బెనులంకె

నోరు లెఱుంగ రిద్ది పరుఁడె యెఱుఁగు. ... 30

"ఆశ్రితుల కభయముద్రలో దర్శన మొసంగు స్వామిని ప్రళయ కాలంలో భయముద్రలో చూచే భాగ్యము నాదే. ఆ అద్వైతము అన్యులకు దుర్లభము." అని రావణుడు విష్ణువుతో తనకున్న సాన్నిహిత్యాన్ని గురించి చెప్పడం 31వ పద్యంలో చూస్తాము.

కం. ప్రియ దర్శనుఁడై శ్రితుల క
భయముద్ర ధరించు సర్వభద్రుని భయ వి
స్మయకారి విలయసమయా
ద్వయభావం బన్యదుర్లభము నేఁ గందుస్. ... 31

"ఇప్పుడాలోచిస్తుంటే, సీతను అపహరించడం ఎంత మంచి పనో అని అనిపిస్తోంది. ఇంతకుముందు ఎవ్వరూ ఈవిధంగా స్వామికి అపకారం చేయలేదు. అందుచేత, నాకు ఎవ్వరికీ దక్కని లోతైన లోకాలు దక్కుతాయి." అని రావణుడన్న మాటలు 32వ పద్యంలో చూస్తాము.

తే. గీ. ఎంచి చూడ జానకి హరియించు టెంత
మంచి పని యయ్యె! స్వాత్మ కిమ్మాడ్కిఁ దొల్లి
ఎవ్వ రపచార మొనరించి? రెవ్వరికిని
దొరకని యగాధతలములు దొరకు నాకు. ... 32

అన్ని జన్మల కన్నా మానవ జన్మ ఉత్తమమైనదని అంటారు. భగవంతుడు అలాంటి మానవ జన్మ ఎత్తాలంటే, మామూలు వాళ్ళకోసమైతే ఎత్తుతాడా. “కింద పడ్డా మాదే పైచేయి” అని మాట్లాడే వాళ్ళు ఎలా ఉంటారో రావణుడు కూడా అలానే ఉన్నాడు. ప్రతికూలతలో అనుకూలత వెతుక్కుంటున్నాడు. ఎలాగో చూడండి. "యుద్ధం స్వామికి కొత్తేమీ కాదుగా. మధుకైటభాది రాక్షసులను వధించాడు. అంతకు ముందు, వరాహ నృసింహ అవతారాలు ఎత్తిన స్వామి, ఇప్పుడు నాకోసం మానవావతారం (జంతువుగా కాకుండా) ఎత్తి నాకు గౌరవ మిచ్చాడు.

అందుచేత, ఆయనకు నా పరాక్రమంతో అపూర్వమైన విందు చెయ్యాలి." అని స్వామిభక్తి చూపిస్తూనే రావణుడు తన గొప్ప తాను చెప్పుకున్నట్లు 33వ పద్యంలో వ్యంగ్య ధోరణి చూస్తాము.

ఉ. పోరు లెఱుంగఁడో, దనుజ పుంగవులన్ మధుకైటభాదులన్
జీఱి వధింపఁడో, కిటి నృసింహ ముఖాకృతులన్ ధరింపఁడో,
గౌరవ మిట్లొనర్చె దశకంఠున కీ పురుషోత్తమాకృతిన్,
శౌరి కపూర్వ విక్రమ రసమ్మునఁ బారణ సేయఁగావలెన్. ... 33

"శచీదేవికి పతిభిక్ష పెట్టి, కుబేరుని బంధించి, కైలాస పర్వతము పెకలించి నా తల ఖండించి ఈశ్వరార్పణము చేసినట్లు గాదు, విష్ణువును ఆరాధించుట. ఓ చంద్రహాస ఖడ్గమా! ఇది ఒక మేటి పండుగ." అని రావణుడు తన దర్పాన్ని, విష్ణువు ప్రత్యేకతని 34వ పద్యంలో చెప్పినట్లుగా ఉంది.

మ. పతిభిక్షన్ శచి కిచ్చి, గుహ్యకపతిన్ బంధించి, కైలాస ప
ర్వతమున్ బాఁతగలించి కంఠదళనారంభమ్ముచే నీశుఁ ద
ర్పితుఁ గావించిన యట్లుగాదు, మురవైరిన్ శ్రీశు నాత్మేశు న
ర్చితుఁ గావించెడి మేటి పండు విదె వచ్చెన్ జంద్రహాసాసిరో! ... 34

"నేను కట్టుబడ్డ వీరవ్రతానికి పక్వదశ, వైర సంబంధానికి ప్రయోజనం నెరవేరేది ఇదే. అనేక యుద్ధము లందు ప్రియత్వము చూపించిన చంద్రహాసమా! స్వామికి కదన భిక్ష ఎలా కల్పిస్తావో?" అని రావణుడు అన్నట్లుగా 35వ పద్యంలో చెప్పబడింది. ఎవరైనా స్వామీజీ వస్తే భిక్ష ఇవ్వడం పరిపాటి. ఇక్కడ, రావణుడు ఇవ్వదలుచుకున్న భిక్ష రణమే.

కం. స్వీకృత వీరవ్రత పరి
పాకము వైరానుబంధ ఫలసిద్ధి యిదే

నైకరణప్రణయిని! యెటు
కాకుత్స్థున కాజి భిక్ష కల్పించెదవో. ... 35

"గరుడ వాహనం లేకుండా, పాంచజన్యము, కౌమోదకి, సుదర్శనము లేకుండా ఉత్త చేతులతో రావణుని గెలవాలని వచ్చాడు, ఎంత తెలివో. నా ఇరవై చేతులు కదనరంగంలో పరాక్రమించి, ఆ ఆయుధములు స్వామి ధరించేటట్లుగా చేస్తాయి." అని ఊరికే చేతు లూపుకుంటూ విష్ణువు యుద్ధానికి వచ్చాడని రావణుడు పరిహాసం చేయడం 36వ పద్యంలో చూస్తాము. ఈ పద్యం చూస్తే, భారత యుద్ధంలో ఆయుధం పట్టనన్న కృష్ణుడి చేత ఆయుధం పట్టించి తీరుతానన్న భీష్ముడి మాటలు గుర్తొస్తాయి.

ఉ. లేదు పతంగ వాహనము, లేవు కరంబులఁ బాంచజన్య కౌ
మోదకులుస్, సుదర్శనము పూనడు, రావణు గెల్వ వచ్చె, దా
మోదరుఁ డెంత నేరుపరియో! పదిజంటల చేతులార! ఆ
కైదువు లాజి వేళ హరి కైకొను మాడ్కిఁ బరాక్రమింపుఁడీ. ... 36

యుద్ధం జరిగినట్లు, అక్కడ తనకు విజయం ప్రాప్తించినట్లు పగటి కలలు కంటున్నాడు రావణుడు. “ఒంటి విలుకాడపై వచ్చి నన్ను ఓడించే సాహసానికి పూనుకోవద్దు. అయ్యో, నీ పాదాల మీద ఒట్టు, నన్ను నా దేవుణ్ణి చంపే పాపాత్ముని చెయ్యద్దు.” అని రావణుడు దయనీయంగా వేడుకోవడం 37వ పద్యంలో చూస్తాము.

తే. గీ. ఒంటి విలుకాడపై నన్ను నోర్చు తెగువ
వలదురా! రాఘవా, రాఘవా! దశాస్యు
నక్కటా! క్రూర విక్రము, స్వాత్మహనన
పాతకుని జేయకుముర! నీ పాదమాన. ... 37

"చాల కాలం నుండి విరహాగ్నితో ప్రజ్వలించే పెరిగే మంటల నిప్పులగుంట లాగా బగ్గుబగ్గుమనే ఇరపై చేతులతో కలిపి పట్టి పదితలలు అంటుకుని రావణుడనే అగ్ని పలు విధాల కాలుస్తుంటే, రణయజ్ఞము అయిపోయేసరికి రాముడో రావణుడో ఎవరో ఒకరే స్థిరత్వము పొందుతారు." అని రావణుడన్న మాటలు 38వ పద్యంలో చెప్పబడ్డాయి. 26వ పద్యంలో "రణసత్ర" అని చెప్పడం వల్ల, రావణుడు యుద్ధాన్ని ఒక యజ్ఞం లాగా చూస్తున్నాడని తెలుస్తుంది. ఈ పద్యంలో రావణుడు ఏమంటున్నాడంటే, ఆ యజ్ఞాంతానికి నేనో, స్వామియో ఒకళ్ళే మిగులుతారు.

చం. చిర విరహాగ్నిఁ గ్రాఁగు నడచిచ్చుల గుండము వోలె బగ్గు బ
గ్గురనెడి చేతు లిర్వదిటఁ గూరిచిపట్టి, దశాస్యమండలిన్
దరికొని రావణాగ్ని బహుధా దహియింప, సవాంతమందు దా
శరథియొ పంక్తికంధరుఁడొ శాశ్వత భావము గాంచుఁగావుతన్. ... 38

"వెళ్ళు స్నేహితుడా! రాముని కెదురేగి ముత్యాల ముగ్గు పెట్టి, ఎత్తైన గంభీరమైన నీ అలల సింహాసనముపై కూర్చుండబెట్టి, సీత కంటె, కౌస్తుభాదుల కంటె ప్రియమైన మణులు చూపి లంకకు పంపుము. ఈ రావణుడు లక్ష్మీదేవి కొలుచు విష్ణువక్షమును తన చంద్రహాస ఖడ్గముతో చీల్చి, ఆ గంటు (చీలిక) వెంట ఆయన హృదయమును చేరి ఏకాంతముగా స్వాగతము పల్కునని చెప్పుము. మనకు అక్కడే పునర్దర్శనమగు గాక." అని అవేదనతో, పరిపూర్ణ వైరభక్తితో, రావణుడన్న ఆఖరి పలుకులు 39వ పద్యంలో చెప్పబడ్డాయి. అంటే, రాముడుకి ఘనస్వాగతం ఇచ్చి లంకకు పంపమని సముద్రుడికి చెబుతూ, తాను చెప్పే స్వాగతము తన స్థాయికి తగ్గట్టుగా యుద్ధంలో ఆయన గుండెలు చీల్చి హృదయంలో చేరి అక్కడ చెబుతానని రావణుడు అంటున్నాడు.

సీ. పొమ్ము నెచ్చెలి! రామమూర్తికి నెదురేగి
పుట్టుముత్తియముల మ్రుగ్గు పెట్టి
అత్యున్నతమ్మును నతి గభీరమ్మైన
గర్భవీచిమతల్లి గద్దె పెట్టి

రమకంటెఁ గౌస్తుభ రత్నంబుకంటె గా
　　రామైన మణులు దర్శన మొసంగి
లంకకుఁ బంపు, పౌలస్త్యుండు సిరి కొల్వ
　　చవికయౌ వక్షమ్ము చంద్రహాస

తే. గీ. దారిత మొనర్చి, ఆ గంటు దారి వెంట
హృదయముస్ జొచ్చి, యేకాంత మిచ్చగించి
స్వాగతముఁ బల్కునని విన్నపమ్ము సల్ప -
మచటనే పునర్దర్శన మగుత మనకు. ... 39

ఈ విధంగా, సముద్రుని లోని భయం పోగొట్టి ఉత్సాహపరచడం, స్వోత్కర్ష, స్వామికి ద్రోహము చేయడానికి పన్నాగము, దోషము విష్ణువు పైకి నెట్టడం, రాజసం, విష్ణుదర్శన కాంక్ష, బల ప్రదర్శనాకాంక్ష, రామాయణంలో ప్రముఖ ఘట్టాలు తనకి అనుకూలంగా ఉండేట్లు చెప్పడం, స్వామి తన్ను మరచాడన్న ఆవేదన, ఒక పక్క రావణుని మీద సానుభూతి కలిగిస్తూనే హాస్యం పండించడం, వైరభక్తి, అన్న అంశాలు ఈ కావ్యంలో రసవత్తరంగా పోషింపబడి రావణుని అంతరంగాన్ని ఆవిష్కరించాయి. ఇలా సాగిన రావణుని స్వగతంలో, అవసరమయిన చోట కఠినమైన సంస్కృత పదాలతో సమాసాలను గుప్పిస్తూనే, అచ్చమైన తెనుగుతనాన్ని మేళవించారు కాటూరివారు. ఈ మిశ్రమశైలికి ఆద్యుడు తిక్కనసోమయాజి. కాటూరివారి వంశదీపకుడైన ఎర్రాప్రగడ, తరువాతి కవులు కొందరు, దాన్ని చక్కగా పరిపోషించారు. అదే బాటలో కాటూరివారు కూడా నడిచారు.

భారత శిక్షాస్మృతి (Indian Penal Code) ప్రకారం, ఎవరైనా ఒక నేరం చేస్తే, న్యాయస్థానాలు ఆ నేరస్థుడి నేరం చేయడానికి కల కారణాలు, అపరాధి మనస్సు తప్పకుండా అన్వేషిస్తాయి. వాటినే న్యాయ శాస్త్రంలో మెన్స్ రియా (Mens rea) అని అంటారు. ఈ కావ్యంలో రావణుడు తనే నేరస్థుణ్ణని చెప్పి, దానికి కారణాలు కూడా తనే చెప్పి, తన మనస్సును మన ముందు ఆవిష్కరిస్తున్నాడు.

సినిమాల లోకి రాక ముందు, ప్రసిద్ధ సినీ దర్శకులు శ్రీ కమలాకర కామేశ్వరరావు గారు కృష్ణా పత్రికలో కొంత కాలం పని చేశారు. బహుశా, అక్కడ ఆయనకి కాటూరి వారితో పరిచయం, తద్వారా పౌలస్త్య హృదయము అనే వారు వ్రాసిన కావ్యం గురించిన పరిచయం కలిగి ఉంటాయి. ఈ కావ్యం ఆధారంగా, తాను దర్శకత్వం వహించిన "సీతారామ వనవాసము" అన్న చిత్రంలో కొన్ని ఘట్టాలు రూపొందించబడ్డాయి, అని కామేశ్వరరావు గారు ఈటీవీ వారి "స్వగతాలు" అన్న ఇంటర్వ్యూలో చెప్పారు.

తన్ను తానే విమర్శించుకోగల సంస్కారి కాటూరివారు. కృతి సమర్పణకి ఆయన వ్రాసిన ఐదు పద్యాలలో "చెల్లె బదియు నైదు వర్షము, లొక పద్యమైన మరల జెప్పినది లేదు, కవినంట సిగ్గు గాదె" అనీ, "ఆలుం బిడ్డలు పైరుపచ్చ లనకే యాగమ్మ కాకిం బలెస్ గా లిచ్చం దిరుగాడు దుర్వ్యసని" అనీ తనపై తనే విమర్శలు గుప్పించారు.

సంస్కృత సమాసాల ప్రయోగం మాట అటుంచి, మామూలుగా మనం మాట్లాడుకునే మాటలు, సూక్తులు తన కావ్యంలో సందర్భానుసారంగా ప్రయోగించారు కాటూరివారు. ఉదాహరణకి, "ఆగమ్మ కాకిం బలెస్", "ఎవ్వరిచే నీ కొనగూడె", "వెర పికేల", "నాకున్నీ కు భయం బటన్న నుడి యెన్నండైన విన్నా మ", "ఎన్నా ళ్ళకు! ఎన్నా ళ్ళకు!", "నన్ను వంచించె గదే", "దినము వర్షంబైన యుత్కంఠచే", "యుఱక వాపోయె నట", "నన్ను బేర్వాడి ప్రతిన సలిపినపుడు గదా", "ఎంతటి క్రూరచిత్తుడో", "హింసించుటలు నాకు మనసొ", "మంచి దక్కగ నీడాయె", "నా కిడు బాసలో తలపడాయెస్", "మర్త్యుల రాజనీతి నిపుణత్వం బెల్ల విన్నా వుగా", "ఉట్టి గట్టి యిచట నూరేగ నుంటినా యేమి", "లోకభీతి యేల నాకు", "ఎల్ల యెఱిగియుండి, యేమి నెరుంగని యట్లు", "ఇంట నున్నయప్పుడీ మాయ నటనముల్ లేవు", "మాయదారి యయ్యె మహికి డిగ్గి", "విభుడేటికి జాగు జేసెనో", "నన్నలమట బెట్టినస్ విడుతునా", "తన మాయలు చెల్ల నిత్తునా", "పోరిలో బొడిచి గెల్చును జచ్చును గాక! వేడునే", "వల్లభునకు నేనె పైచితి బెనులంకె", "ఎంత మంచి పని యయ్యె", ఇలాంటి పదప్రయోగాలు మామూలు భాషలో తెలుగునాట వింటూనే ఉంటాము. ఈ మాటలకి చక్కని కావ్య మర్యాద కలిగించారు కాటూరివారు.

గొల్లపూడి ప్రకాశరావుగారు వ్రాసిన "భారతీయ సాహిత్య నిర్మాతలు పింగళి - కాటూరి" (సాహిత్య అకాడమీ ముద్రణ) అన్న పుస్తకంలో "పౌలస్త్య హృదయము" గురించి ప్రస్తావిస్తూ ఈ క్రింది విధంగా చెప్పారు:

> "నిజాని కీ కావ్యం రూపంలో సన్నదైనా కవితా దీపంగా మిన్నయైనది. ... వస్తు స్వీకరణలో, వస్తు నిర్వహణలో ఈ కావ్యం ప్రత్యేకతను సంతరించుకున్నది. .... రామాయణంలో రామునికి ప్రాధాన్యం. పౌలస్త్య హృదయంలో రావణునికి ప్రాధాన్యం. రామాయణంలో రావణుడు దుర్మార్గ ప్రతినాయకుడు. పౌలస్త్య హృదయంలో రావణుడు ఉదాత్త ప్రతినాయకుడు. .... రావణునిపై పాఠకులకున్న పూర్వభావాల నన్నింటినీ తొలగించి రావణుని పట్ల సానుభూతిని కలిగించే కావ్యం పౌలస్త్య హృదయం. .... తక్కువ పద్యాలలో ఎక్కువ ప్రభావం చూపే రచనలు చేయటంలో కాటూరి వారు మిక్కిలి సమర్థులు. ...."

భారతి మాసపత్రిక ఫిబ్రవరి 1959 సంచికలో "కాటూరికవి ఖండకావ్యాలు" అన్న వ్యాసాన్ని శ్రీ పి. గణపతిశాస్త్రిగారు గారు వ్రాశారు. ఈ వ్యాసంలో వారు ఈ క్రింది విధంగా అన్నారు:

> "పౌలస్త్య హృదయం ప్రారంభించగానే మొట్టమొదట ఈ కావ్య ధోరణి మన కెంతయినా ఆశ్చర్యం కలిగిస్తుంది. .... రావణు డొక విధంగా అత్యాధునికుడయిన పరమేశ్వర భక్తుడు. కనుకనే అన్ని అనుబంధాలకన్న భీషణ విద్వేషానుబంధమే పరమేశ్వరుని కతి సన్నిహితమయినదని ప్రతిపాదిస్తున్నాడు. ... ఈ కవి రచనలలో గాంధీయాదర్శం స్ఫురిస్తున్నదని ఇంతకు పూర్వం పేర్కొన్నాను. ఆ అభినివేశమే ఈ ఖండకృతి రచనకు ప్రోద్బలం కలిగించి ఉండవచ్చును. గాంధీ దృష్టిలో సర్వులు మిత్రులే గాని మరి శత్రువు లెవ్వరు లేరు. ....."

ఈ కావ్యం గురించి, కవి గురించి, పద్యరూపంలో చెప్పాలని చిన్న ప్రయత్నం చేసి క్లుప్తముగా క్రింది విధంగా చెబుతున్నాను. ఈ పద్యకుసుమాంజలి సభక్తికంగా కాటూరి మహాకవికి సమర్పిస్తున్నాను.

శా. స్వామిద్రోహము తానెఁ జేసి, దొసగుస్ స్వాత్మేశుపైఁ బెట్టుచున్,
స్వామిస్ జేరగ వేచి వేసరిన రాజైఁ జెప్పె, కల్లోలినీ
స్వామిస్ మిత్రుగఁ జేసి రావణుడు తత్స్వాంతమ్ము, పౌలస్త్యునిస్
స్వామిస్ వైరిగఁ గొల్చు భక్తునిగ ప్రస్తావించు కావ్యమ్మిదే. ... (i)

తనే స్వామికి కీడు తలపెట్టి, తప్పు తన ఆత్మేశునిపై పెడుతూ, ఆయన్ని చేరడానికి నిరీక్షించి విసిగి పోయిన రాజుగా సముద్రుణ్ణి మిత్రునిగా చేసుకుని రావణుడు తన మనస్సును విశదపరచాడు. ప్రభువును శత్రువుగా ఆరాధించే భక్తుడుగా రావణుని చూపించే కావ్యము ఇదే.

శా. ఔచిత్యం బిట కావ్యనామము, కథస్ వాచ్యంబుగాఁ గాక పా
త్రౌచిత్యంబు నిగూఢ వ్యంగ్య సరళిస్ రౌద్రంపు స్వోత్కర్షలస్
వైచిత్యంబును వైరభక్తినిఁ గడుస్ ప్రత్యేకతస్ జూపుచుస్,
సూచింపస్ స్వగతమ్ము రూపమున తేజోదాత్తు పౌలస్త్యునిస్. ... (ii)

కథను వాచ్యంగా కాక, పాత్రౌచిత్యము, అంతర్లీనమైన వ్యంగ్య ధోరణులతో భయంకరమైన స్వంత ఔన్నత్యము, వేదన, వైరభక్తి అనే అంశాలను మిక్కిలి వైశిష్ట్యంగా చూపుతూ, స్వగతం రూపంలో ఉగ్రస్వభావము, ఉదారత్వము రావణుని యందు సూచించడం వల్ల, ఇక్కడ "పౌలస్త్య హృదయము" సరియైన కావ్యనామము.

కం. పౌలస్త్యహృదయ మొక దివి
టీలా కాటూరి వేంకటేశ్వర కవికిస్
చాల యశమ్ము నిడెను, ప్రతి

కూలుని కావ్యమున భక్త కోవిదుఁ జేయస్.   ... (iii)

శత్రువును కావ్యంలో ఒక భక్త మేధావిగా చూపడం వల్ల, "పౌలస్త్య హృదయము" ఒక కాగడాలా, కాటూరి వేంకటేశ్వర కవికి చాలా కీర్తిని ఇచ్చింది.

ఉ. రావణు మానసంబున పురాకృత కర్మల జ్ఞాన మున్న యే
భావన లుండునో, యతని పక్షము నిల్చి సహేతుకంబుగస్
రీవియు దర్పముస్ యురవడింపగఁ జెప్పగఁ జేయు కావ్యముస్
నీవు రచించు తీరు గణనీయము మాన్యము వైరభక్తికిస్,
భావి కవిత్వమందు నవ ప్రక్రియగా స్వగతమ్ముఁ జేరగస్,
తావిని పెంచితీవు కవితన్నిటు, కాటురి వేంకటేశ్వరా!   ... (iv)

రావణుని మనస్సులో తన పూర్వజన్మమందు చేయఁబడిన కర్మల గురించిన జ్ఞానము ఉంటే, ఆయనలో ఏ రకమైన ఆలోచనలు ఉంటాయో, అతని పక్షాన నిలబడి, కారణ సహితంగా, అతని వైభవము, గర్వము అతిశయించే విధంగా చెప్పేటట్లు చేసే కావ్యాన్ని నీవు రచించిన విధానము ఎంచదగినది. వైరభక్తి విషయంలో సమ్మానింపదగినది. ఓ కాటూరి వేంకటేశ్వర మహా కవీ! భవిష్యత్తులో రాబోయే కవిత్వంలో ఒక కొత్త ప్రకరణముగా స్వగతము అనేది చేరడం వల్ల నీవు కవిత్వంలో ఈ విధంగా పరిమళాన్ని పెంచావు.

ఉ. రాతిని దైవముస్ గనెడు లక్షణ మున్న మహోర్వ సంస్కృతిస్
రాతి మనస్కు రావణుని రాక్షస రూపము లోన యున్న యా
రాతిని ధిక్కరించు నొక లక్ష్యసమన్వితు వైరభక్తికిస్
ప్రీతునిఁ జూపు యీ రచన ప్రేరణయౌ స్వగతమ్ము లల్లగస్.   ... (v)

రాతిలో దైవాన్ని చూసే లక్షణమున్న గొప్ప ఋషిప్రోక్తమైన నాగరికతలో, రాయిలాంటి మనస్సు ఉన్న రావణుని రాక్షస రూపము లోపల ఉన్న ఆ శత్రువును ప్రతిఘటిస్తూ, ఒక లక్ష్యాన్ని

కూడగట్టుకున్న వాడిని, వైరభక్తి యందు ఇష్టము ఉన్న వాడిని, చూపించే ఈ రచన స్వగతాలు ఇంకెన్నో వ్రాయడానికి ప్రేరణగా ఉంటుంది.

'పౌలస్త్య హృదయము' వోకడలో మనకున్న మంచి మంచి పాత్రల మనోవిశ్లేషణ కావ్య రూపంలో వస్తే బాగుంటుందని నా అభిలాష.

<u>రిఫరెన్సు గ్రంథాల జాబితా:</u>

(1) శ్రీ పింగళి లక్ష్మీకాంతము శ్రీ కాటూరి వేంకటేశ్వరరావు గార్లు రచించి జనవరి 1944లో ప్రకటించిన "పౌలస్త్య హృదయము" అన్న కావ్యం అందుబాటులో ఉన్న లింకు:
file:///F:/Telugu%20Literature/Kavyaalu/Paulastya%20Hridayamu.pdf

(2) శ్రీ కాటూరి వేంకటేశ్వరరావు గారు రచించగా 05-04-2016న ప్రకటించిన "పౌలస్త్య హృదయము" అన్న కావ్యం అందుబాటులో ఉన్న లింకు:
https://andhrabharati.com/kavitalu/kATUri/paulastya_hRidayamu.html

(3) శ్రీ పి. గణపతి శాస్త్రిగారు రచించిన భారతి సాహిత్య మాసపత్రికలో (ఫిబ్రవరి 1959) ప్రచురించిన "కాటూరికవి ఖండ కావ్యాలు" అన్న వ్యాసం అందుబాటులో ఉన్న లింకు:
file:///F:/Telugu%20Literature/Sahitya%20vimarsa/katuri%20kavi.pdf

(4) తెనుగు లెంక తుమ్మల సీతారామమూర్తిగారు రచించిన "సుకవి స్తుతి" అన్న కావ్యం (37వ పేజీ) అందుబాటులో ఉన్న లింకు:
https://kamyasiddhi.wordpress.com/wp-content/uploads/2019/02/kavisthuthulu_final.pdf

(5) శ్రీ గొల్లపూడి ప్రకాశరావుగారు రచించగా సాహిత్య అకాడమీ ప్రచురించిన "భారతీయ సాహిత్య నిర్మాతలు పింగళి - కాటూరి" అన్న గ్రంథం అందుబాటులో ఉన్న లింకు:
https://dn790003.ca.archive.org/0/items/in.ernet.dli.2015.386273/2015.386273.pingali-kaatuuri.pdf

6. గర్భకవిత్వం వ్రాయడం ఎలా?

[ఈ వ్యాసం సంచిక మాస పత్రిక అనబడే తెలుగులో తొలి డైనమిక్ వెబ్ పత్రికలో (నవంబరు 17, 2024) ప్రచురించబడింది. అందుబాటులో ఉన్న లింకు:
https://sanchika.com/garbhakavitvam-vraayadam-elaa-mvs-r/]

ఒక ఛందస్సులో ఉన్న ఒక పద్యంలో ఒకటి లేక అంతకన్నా ఎక్కువ ఛందస్సులలో ఉన్న పద్యాలు ఇముడ్చటమే కాకుండా, ఇముడ్చుకున్న పద్యము ఇమిడిన పద్యాలు అర్థవంతంగా ఉండేటట్లు చూడడాన్ని గర్భకవిత్వం అంటారు. ఈ వ్యాసం సీస పద్యంలో మత్తేభ కంద పద్యాలను, ఉత్పలమాల పద్యంలో తేటగీతి కంద పద్యాలను, ఇమిడ్చి చూపించడానికి చేసిన ఒక చిన్న ప్రయత్నం. గణాల ఎంపిక ప్రత్యేక పద్ధతిలో చేస్తే గర్భకవిత్వం సాధ్యపడుతుంది. అది ఎలాగో ఉదాహరణల ద్వారా చూద్దాము.

ముందుగా సీస పద్యం పూర్వ భాగంలో మత్తేభం, ఉత్తరభాగంలో (తేటగీతిలో) కంద పద్యాన్ని ఇముడ్చడాన్ని పరిశీలిద్దాము. నాలు పాదాల మత్తేభ పద్యంలో, ఒక్కొక్క పాదంలో 20 అక్షరాల చొప్పున 80 అక్షరాలు, ప్రాస నియమం (2, 22, 42, 62వ అక్షరాలకి), ప్రతి పాదంలో మొదటి అక్షరానికి 14వ అక్షరానికి యతిమైత్రి (అంటే 1-14, 21-34, 41-54, 61-74వ అక్షరాలకు), ప్రతి పాదంలో "స, భ, ర, న, మ, య, వ" అన్న 7 గణాలు, ఉంటాయి.

సీస పద్యం పూర్వభాగంలో 4 పెద్ద పాదాలు, ఒక్కొక్క పెద్ద పాదం రెండు చిన్న పాదాలుగా ఉంటాయి. ఒక్కొక్క పెద్ద పాదంలో 8 గణాలు (మత్తేభం కన్నా ఒక గణం ఎక్కువ), అంటే 6 ఇంద్ర గణాలు, 2 సూర్య గణాలు ఉంటాయి. ఒక్కొక్క పెద్ద పాదంలో ఉన్న రెండు చిన్న పదాలలో మొదటి దాన్లో 4 ఇంద్ర గణాలు, రెండవ దాన్లో మిగిలిన రెండు ఇంద్ర గణాలు రెండు సూర్య గణాలు ఉంటాయి. రెండు చిన్న పాదాలలో మొదటి అక్షరానికి 3వ గణము మొదటి అక్షరానికి యతిమైత్రి ఉంటుంది. ప్రాస యతి కూడా చెల్లుతుంది. ప్రాస నియమం లేదు.

సీస పద్యం పూర్వ భాగంలో ఉన్న ఒక్కొక్క పెద్ద పాదంలో ఒక మత్తేభ పద్యపాదం ఇముడ్చాలి. మత్తేభ పద్యపాదం కన్నా సీస పద్యం పెద్ద పాదం పెద్దది కాబట్టి మత్తేభంలో ఏమి చేరిస్తే సీస పద్యపాదం అవుతుందో చూడాలి. మత్తేభంలో ఉన్న మొదటి గణం సగణం (IIU). అది ఇంద్ర గణం కాదు. దాన్ని ఇంద్ర గణం చెయ్యాలంటే మొదట్లో ఒక లఘువు కలుపుకోవాలి. అప్పుడది నగము (IIIU) అవుతుంది. మత్తేభంలోని తరువాతి రెండు గణాలయిన భగణము (UII), రగణము (UIU) ఇంద్ర గణాలే కాబట్టి మార్పు అవసరం లేదు. తరువాతిది నలము (III). అది ఇంద్ర గణం కాదు. దాన్ని ఇంద్ర గణం చెయ్యాలంటే తరువాతి మగణంలోని మొదటి గురువును దీనితో జోడించాలి. ఆ విధంగా, నగము, భగణము, రగణము, నగము అన్న నాలుగు ఇంద్ర గణాలతో 14 అక్షరాలతో సీస పద్యం పెద్ద పాదం లోని మొదటి చిన్న పాదం పూర్తవుతుంది. మత్తేభంలోని తరువాతి ఆరు అక్షరాలు రెండు భగణాలు, అంటే రెండు ఇంద్ర గణాలు అవుతాయి. ఇంక ఒక్క గురువు మిగులుతుంది. దానికి ఒక లఘువు ఒక గురువు ఒక లఘువు గానీ, నాలుగు లఘువులు కానీ, కలిపితే రెండు సూర్య గణాలు అవుతాయి. అంటే, రెండు గలములు (UI) కానీ, ఒక గలము ఒక నలము కానీ అవుతాయి. ఈ వ్యాసంలో తీసుకున్న ఉదాహరణలో రెండు గలములు (UI) వచ్చేటట్లుగా ఒక లఘువు ఒక గురువు ఒక లఘువు కలపడం జరిగింది. ఆ విధంగా, రెండు భగణాలతో రెండు గలములతో, 10 అక్షరాలతో సీస పద్యం పెద్ద పాదం లోని రెండవ చిన్న పాదం పూర్తవుతుంది. అలా, 20 అక్షరాల మత్తేభ పాదాన్ని మొదట్లో ఒక లఘువు, చివర్లో ఒక లఘువు ఒక గురువు ఒక లఘువు కలిపి, 24 అక్షరాలతో సీస పద్యం పెద్ద పాదం తయారు చెయ్యవచ్చు. అంటే, 80 అక్షరాల మత్తేభంలో కొన్ని అక్షరాలు కలిపితే 96 అక్షరాల సీస పద్యం పూర్వభాగం అవుతుంది. అలా తయారైన సీస పద్యంలో ప్రతి పాదంలో మొదటి అక్షరం, ఆఖరి మూడు అక్షరాలు వదిలేసి చదివితే మత్తేభ పద్యం అవుతుంది. ఇదే విషయం క్రింది పట్టికలో వివరంగా చూడవచ్చు.

సీస పద్యం:

మొదటి	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
చిన్న పాదం:	I	I	I	U	U	I	I	U	I	U	I	I	I	U

రెండవ	15	16	17	18	19	20	21	22	23	24
చిన్న పాదం:	U	U	I	U	U	I	U	I	U	I

ఇందులో 2వ అక్షరం నుండి 21వ అక్షరం వరకు తీసుకుంటే 20 అక్షరాల మత్తేభ పద్య పాదం అవుతుంది. యతి ప్రాస నియమాలు రెండు ఛందస్సులలో ఏవి పాటించాలో అవి పాటిస్తే, సీస పద్యం పూర్వభాగం లోని 24 అక్షరాల ప్రతి పెద్ద పాదంలోను 20 అక్షరాల మత్తేభ పద్య పాదం ఇముడ్చవచ్చు. ఇక చూడాల్సినవి, 96 అక్షరాల సీస పద్యం పూర్వభాగంలో యతి, ప్రాసకి సంబంధించిన నియమాలు.

యతిమైత్రి (సీస పద్యం కోసం): 1-8, 15-21, 25-32, 39-45, 49-56, 63-69, 73-80, 87-93

యతిమైత్రి (మత్తేభ పద్యం కోసం): 2-15, 26-39, 50-63, 74-87

అంటే 96 అక్షరాలలో యతిమైత్రి ఉండవలసిన అక్షరాలు: 1-8, 2-15-21, 25-32, 26-39-45, 49-56, 50-63-69, 73-80, 74-87-93

మత్తేభ పద్యం కోసం ప్రాస నియమం పాటించాల్సిన అక్షరాలు: 3, 27, 51, 75

ఇక, సీస పద్యానికి ఉత్తర భాగమైన ఎత్తుగీతలో కంద పద్యాన్ని ఎలా గర్భితం చెయ్యాలి అన్న విషయం చూద్దాం. నేను తీసుకున్న ఉదాహరణలో తేటగీతి పద్యంలో కంద పద్యాన్ని ఇమిడ్చాను. తేటగీతి పద్యానికి ప్రతి పాదంలో 1 సూర్య గణము, 2 ఇంద్ర గణాలు, 2 సూర్య గణాలు ఉంటాయి. అంటే, నాలుగు పాదాలు కలిపి 20 గణాలు ఉంటాయి. ప్రాస నియమం లేదు. ప్రతి పాదంలో మొదటి అక్షరానికి 4వ గణము మొదటి అక్షరానికి యతి చెల్లుతుంది. ప్రాస యతి చెల్లుతుంది.

కంద పద్యంలో 1, 3 పాదాలకి 3 గణాలు, 2, 4 పాదాలకి 5 గణాలు ఉంటాయి. గణాలు చతుర్మాత్రా గణాలు. అంటే, 2 గురువులు గాని, 4 లఘువులు గాని, లేదా ఒక గురువు, 2 లఘువులు గాని ఉంటాయి. ప్రాస నియమం ఉంటుంది. 2, 4 పాదాలలో మొదటి అక్షరానికి 4వ గణము మొదటి అక్షరానికి యతి చెల్లుతుంది. 2, 4 పాదాల్లో 3వ గణము నలము గాని జగణము

గాని కావాలి. జగణము బేసి గణము కాకూడదు. 2, 4 పాదాల్లో ఆఖరి అక్షరం గురువు అయ్యి ఉండాలి.

నేను వ్రాసిన తేటగీతి పద్యంలో గణాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

మొదటి పాదము: III IIUI UII III III (16 అక్షరాలు)
రెండవ పాదము: UI IIIU IIII UI III (15 అక్షరాలు)
మూడవ పాదము: III IIIU IIUI III III (17 అక్షరాలు)
నాల్గవ పాదము: III IIII UII UI III (15 అక్షరాలు)

అంటే, మొత్తం 63 అక్షరాలు ఉన్నాయి. యతిమైత్రి ఉన్న అక్షరాలు: 1-11, 17-27, 32-43, 49-59. నేను వ్రాసిన తేటగీతి పద్యంలో 1, 3 పాదాల్లో ప్రాస యతి వేశాను. ఇక కంద పద్యం విషయాని కొస్తే, ప్రాస నియమము ఉన్న అక్షరాలు: 2, 12, 29, 40, యతిమైత్రి ఉన్న అక్షరాలు: 11-22, 39-50. తేటగీతిలోని ఆఖరి 7 అక్షరాలు తీసేస్తే, 56 అక్షరాల కంద పద్యం అయింది. కంద పద్యంలో గణాలు క్రింది విధంగా ఉన్నాయి.

మొదటి పాదము: IIII IUI UII (10 అక్షరాలు)
రెండవ పాదము: IIII IIU IIII UII IIU (17 అక్షరాలు)
మూడవ పాదము: IIII IIII IIU (11 అక్షరాలు)
నాల్గవ పాదము: IIU IIII IIII IIII IIU (18 అక్షరాలు)

పై పథకం ప్రకారం వ్రాసిన సీస పద్యం అర్థవంతంగా ఉండాలి. దానిలో గర్భితమైన మత్తేభ, కంద పద్యాలు కూడా అర్థవంతంగా ఉండాలి. అలా, చిన్న ప్రయత్నం జేసి వ్రాసిన 159 అక్షరాల సీస పద్యం, దానిలో గర్భితమైన 80 అక్షరాల మత్తేభ పద్యం, 56 అక్షరాల కంద పద్యం క్రింద ఇవ్వబడ్డాయి.

సీ. వినయ సంపన్నుడు విద్యతో చతురతస్
నానా విధాలస్ వినా పరాజ
య భయముస్ సంపద యంతయుస్ విహితముస్
భార్యా సమేతప్రభల్ విశాల
విజయముస్ గోరుచు విశ్వశాంతి కొరకై
జాత్యమ్ము స్వీయప్రజస్ త్యజించి
విలయముస్ జేసిన విశ్వకీర్తి యొకడే
లక్ష్యంబు సాధించిలస్ యతండు

తే. గీ. అనిశమును సత్య నిష్టను తన వ్రతముగ
జేసెను భరతావని యొక చేతను నడి
పెను విన హరి చంద్రుని గాధ తనువు మనసు
లను పులక కలిగెస్ యది జ్ఞానగుళిక.

(వినయంలో ధనవంతుడు, జ్ఞానముతో, నేర్పరితనముతో అనేక విధాలుగా, ఓడిపోతాననే భయం లేకుండా తన సంపద అంతటినీ, తనకు విహితమైనది, భార్యతో సహా సమస్త ప్రభలు, విస్తృతమైన విజయాన్ని ఆకాంక్షించి విశ్వశాంతి కోసం, తన మంచిని, స్వంతజనాల్ని వదలి త్యాగం చేసిన విశ్వకీర్తి ఒక్కడే. ఈ లోకంలో లక్ష్యాన్ని సాధించి, అతడు నిత్యము సత్యనిష్ఠ తన వ్రతంగా చేసుకున్నాడు. భారతదేశాన్ని ఒంటిచేత్తో నాయకుడుగా నడిపాడు. హరిశ్చంద్రుని కథ వింటే, శరీరములోను, మనసులోను పులకరింత కలిగింది. అది జ్ఞానగుళిక.)

మ. నయ సంపన్నుడు విద్యతో చతురతస్ నానా విధాలస్ వినా
భయముస్ సంపద యంతయుస్ విహితముస్ భార్యా సమేతప్రభల్
జయముస్ గోరుచు విశ్వశాంతి కొరకై జాత్యమ్ము స్వీయప్రజస్
లయముస్ జేసిన విశ్వకీర్తి యొకడే లక్ష్యంబు సాధించిలస్.

(ఈ లోకంలో లక్ష్యాన్ని సాధించిన, నయ సంపన్నుడు (అంటే పెద్ద అందగాడు), జ్ఞానముతో, నేర్పరితనముతో అనేక విధాలుగా, భయం లేకుండా, తన సంపద అంతటినీ, తనకు విహితమైనది, భార్యతో సహా సమస్త ప్రభలు, జయాన్ని ఆకాంక్షించి విశ్వశాంతి కోసం, తన మంచిని, స్వంతజనాల్ని వదలి త్యాగం చేసిన విశ్వకీర్తి ఒక్కడే.)

కం. అనిశమును సత్య నిష్టను
తన వ్రతముగ జేసెను భరతావని యొక చే
తను నడిపెను విన హరి చం
ద్రుని గాధ తనువు మనసులను పులక కలిగెన్.

(నిత్యము సత్యనిష్ఠ తన వ్రతంగా చేసుకున్నాడు. భారతదేశాన్ని ఒంటిచేత్తో నాయకుడుగా నడిపాడు. హరిశ్చంద్రుని కథ వింటే, శరీరములోను, మనసులోను పులకరింత కలిగింది.)

ఇక రెండవది ఉత్పలమాల పద్యంలో ఒక కందపద్యాన్ని, ఒక తేటగీతి పద్యాన్ని గర్భితం ఎలా చెయ్యాలా అన్న విషయం గురించి. ఉత్పలమాలలో గణాలు - భ, ర, న, భ, భ, ర, వ, అంటే, UII UIU III UII UII UIU IU. ఒక్కొక్క పాదంలో 20 అక్షరాలు, మొత్తం 4 పాదాలకీ 80 అక్షరాలు ఉంటాయి. ప్రాస నియమం కలదు. ప్రతి పాదమునందు 10 వ అక్షరము యతి స్థానము.

తేటగీతి పద్యానికి ప్రతి పాదంలో 1 సూర్య గణము, 2 ఇంద్ర గణాలు, 2 సూర్య గణాలు ఉంటాయి. అంటే, నాలుగు పాదాలు కలిపి 20 గణాలు ఉంటాయి. ప్రాస నియమం లేదు. ప్రతి పాదంలో మొదటి అక్షరానికి 4వ గణము మొదటి అక్షరానికి యతి చెల్లుతుంది. ప్రాస యతి కూడా చెల్లుతుంది. కంద పద్యం లక్షణాలు పైన వివరించడం జరిగింది.

ఉత్పలమాల పద్యంలో ప్రతి పాదంలో మొదటి రెండు గణాలు (భగణము, రగణము), ఆఖరి అక్షరం (గురువు) వదిలేస్తే, తేటగీతికి కావలసిన ఒక సూర్య గణం, 2 ఇంద్ర గణాలు, 2 సూర్య గణాలు సరి పోతాయి. ఆ గణాలు – III UII UII UI UI. ఈ తేటగీతిలో ప్రతి పాదంలో మొదటి

అక్షరానికీ, 10వ అక్షరానికీ (4వ గణము మొదటి అక్షరం) యతి మైత్రి ఉండాలి. అంటే, తేటగీతి కోసం, అదనంగా ఉత్పలమాల పద్యంలో, ప్రతి పాదంలో 7వ అక్షరానికీ 16వ అక్షరానికీ యతి మైత్రి ఉండాలి. అంటే, తేటగీతి కోసం ఉత్పలమాల పద్యంలో యతిమైత్రి ఉండాల్సిన అక్షరాలు: 7-16, 27-36, 47-56, 67-76.

ఇక, కంద పద్యం విషయానికొస్తే, కావలసిన గణాలు చతుర్మాత్రా గణాలు. ఉత్పలమాలలో, మొదటి పాదంలో మొదటి అక్షరం (గురువు), రెండవ పాదంలో 5వ అక్షరం తర్వాత వదిలేస్తే కంద పద్యానికి కావలసిన మొదటి రెండు పాదాలు వస్తాయి. వాటి గణాలు ఏమిటంటే: IIU IUI IIU, IIU IIU IUI UU IIU. అదే విధంగా, ఉత్పలమాలలో, మూడవ పాదంలో మొదటి అక్షరం (గురువు), నాల్గవ పాదంలో 5వ అక్షరం తర్వాత వదిలేస్తే కంద పద్యానికి కావలసిన తరువాతి రెండు పాదాలు, అవే గణాలతో వస్తాయి. ఉత్పలమాల లాగానే, కంద పద్యంలో కూడా, ప్రతి పాదంలో రెండవ అక్షరం ప్రాసాక్షరం. అంటే, ఉత్పలమాలలో ప్రాస నియమం ఉండ వలసిన అక్షరాలు: 2-22-42-62, 3-12-43-52.

కంద పద్యంలో యతి మైత్రి ఉండవలసిన అక్షరాలు, రెండు, నాలుగు పాదాల్లో, మొదటి అక్షరానికీ నాల్గవ గణం మొదటి అక్షరానికీ ఉండాలి. అంటే, ఉత్పలమాలలో మామూలుగా యతి మైత్రి ఉండ వలసిన అక్షరాలు: 1-10, 21-30, 41-50, 61-70, అదనంగా యతిమైత్రి ఉండవలసిన అక్షరాలు: 11-20, 51-60.

సంగ్రహంగా చెప్పాలంటే, ఉత్పలమాల కడుపులో ఒక కంద పద్యాన్ని ఒక తేటగీతి పద్యాన్ని కూర్చాలంటే, ప్రాస నియమం పాటించాల్సిన అక్షరాలు: 2-22-42-62, 3-12-43-52, యతిమైత్రి ఉండ వలసిన అక్షరాలు: 1-10, 7-16, 11-20, 21-30, 27-36, 41-50, 47-56, 51-60, 61-70, 67-76. అలా, భ, ర, న, భ, భ, ర, వ గణాలతో నాలుగు పాదాలూ, మూడు పద్యాలూ కూడా అర్థవంతంగా ఉండేటట్లుగా వ్రాస్తే గర్భకవిత్వం అవుతుంది. పైన చెప్పిన విధంగా వ్రాసిన 80 అక్షరాల ఉత్పలమాల పద్యం, దానిలో గర్భితమైన 52 అక్షరాల తేటగీతి పద్యం, 46 అక్షరాల కంద పద్యం క్రింద ఇవ్వబడ్డాయి.

ఉ. ఈ మనుజన్మలో హితము నీయని నైజము హేయమే నయా,
కామన తోడనే జటిల కర్మలు, బాధలు చాల చూచియున్,
వే మననంబుచే వగచి, వేదన పద్యపు బాణి జెప్పె, తా
వేమనయే కదా, రసిక విశ్వము నందభి రామమూర్తియై.

(ఈ మానవ జన్మలో హితము నివ్వని స్వభావము నీచమైనదేనయా. సంకల్పంతోనే, చిక్కులున్న పనులు, బాధలు చాలా చూసి, అనేక విధాలైన (త్వరిత గతిని) చింతనతో దుఃఖించి తన పరితాపాన్ని పద్యపు బాణిలో చెప్పిన వాడు, సహృదయ లోకంలో అందరికి ప్రియమైన వ్యక్తిత్వము ఉన్న వేమనయే కదా.)

కం. మనుజన్మలో, హితము నీ
యని నైజము హేయమే నయా, కామనతో
మననంబుచే వగచి, వే
దన పద్యపు బాణి జెప్పె, తా వేమనయే.

(మానవ జన్మలో హితము నివ్వని స్వభావము నీచమైనదేనయా. సంకల్పంతో, చింతనతో దుఃఖించి తన పరితాపాన్ని పద్యపు బాణిలో చెప్పిన వాడు, వేమనయే.)

తే. గీ. హితము నీయని నైజము హేయమేన,
జటిల కర్మలు బాధలు చాల చూచి,
వగచి వేదన పద్యపు బాణి జెప్పె,
రసిక విశ్వము నందభి రామమూర్తి.

(హితము నివ్వని స్వభావము నీచమేనా. చిక్కులున్న పనులు, బాధలు చాలా చూసి, దుఃఖించి తన పరితాపాన్ని పద్యపు బాణిలో సహృదయ లోకంలో అందరికి ప్రియమైన వ్యక్తిత్వము ఉన్న వాడు చెప్పెను.)

7. గురుశిష్యుల సంబంధాలు

సంచార (nomadic) జీవనం పోయి జనపదాలలో (settlements) స్థిరనివాసం ఏర్పరచుకున్న నాటి నుండి మనుష్యుల అవసరాలు మారడమే కాదు, పెరుగుతూ వచ్చాయి. అవసరాల కనుగుణంగా, నాలుగు రకాల వృత్తులు (occupations) వాడుక లోకి వచ్చాయి. తమ తరమే (generation) కాకుండా తరువాతి తరాలకు కూడా పనికి వచ్చే చదువు (education), వృత్తులు (occupations), వ్యాపకాల్లో (avocations) శిక్షణ (training) ఇవ్వడం మొదటి తరగతి. ఇప్పటి కాలంతో పోలిస్తే, టీచర్లు, ట్రైనర్లు (Teachers and Trainers), అంటే, ఒక కాలంలో వున్న వృత్తి, విద్యలు ఆ తరానికే కాకుండా తరువాతి తరాలకి కూడా అందేటట్టు చూసే వాళ్ళు, ఇందులోకి వస్తారు. రెండవది, జనపదాలలో ఉన్న మనుష్యులకు, సంపదకు (wealth) రక్షణ (security) కల్పించడం. అంటే, అందరికీ, అందరి సంపదకీ రక్షణ (security) కలిపిస్తూ దానికి కావాల్సిన పరిపాలనా వ్యవస్థని (public administration) నిర్మించే వాళ్ళు రెండవ తరగతి లోకి వస్తారు. మూడవది, జనులకు, పశువులకు కావలసిన ఆహారము (food) పండించడం (వ్యవసాయం), వస్తువుల తయారీ (manufacturing), పంపిణీ, వాణిజ్యం (trade & businesses) లాంటివి చెయ్యడం. ఇక నాల్గవ తరగతి వాళ్ళు, పై మూడు తరగతుల వాళ్ళకి అన్ని విధాల సాయం చేసే వాళ్ళు (support staff). మొదటి మూడు వృత్తులకి సరియైన శిక్షణ అవసరం. నాల్గవ వృత్తికి కొద్దిపాటి అవగాహన కలిగిస్తే చాలు. ఎవరైనా చెయ్యవచ్చు.

మన సంఘంలో ఇప్పుడు కూడా కుటుంబ వ్యవస్థ (institution) మొదలుకొని ప్రతి వ్యవస్థలోను ఈ నాలుగు విభాగాల (Divisions) సోషల్ స్ట్రక్చర్ (social structure) మనం చూడవచ్చు. ఉదాహరణకి, ఒక కంపెనీలో (company) బ్రాడ్ గా (broad) చూస్తే, ఉద్యోగులకి శిక్షణ ఇచ్చేవారు, వ్యాపార రహస్యాలకి (business secrets) సంపదకి రక్షణ ఇచ్చేవారు, కంపెనీ వ్యవహారాలు నడిపేవారు, ఈ పనులన్నీ చెయ్యడానికి మద్దతు ఇచ్చే వాళ్ళు ఉంటారు. కుటుంబంలో కూడా, తల్లిదండ్రులు తమ వృత్తి విద్యలు పిల్లలకు నేర్పడం, కుటుంబానికి ఉన్న ధన మరియు ధనేతర ఆస్తి (property) కాపాడుకోవడం, కావలసిన ఆహారము పండించడం

మరియు సంపాదించడం, ఇవన్నీ చేసే వాళ్ళకి సాయం చెయ్యడం అనేవి ఉంటాయి. ఈ వృత్తులు విడివిడిగా కనపడవచ్చు లేదా విడదీయరానివిగా కలిసిపోయి కనిపించవచ్చు. ఒక మనిషి ఒకటి కంటే ఎక్కువ వృత్తులు చెయ్యవచ్చు. అంటే, పైన చెప్పిన నాలుగు వృత్తుల వ్యవస్థ ఒక సార్వత్రిక సత్యం (universal truth) అని తెలుస్తుంది. అంటే, ఏదైనా ఒక క్రొత్త వ్యవస్థను స్థాపించేటప్పుడు కూడా ఈ నాలుగింటిలో ఏ ఒక్క దాన్ని వదిలేసినా (leave out) లేక అలక్ష్యం (ignore) చేసినా సమస్యలు ఉంటాయి అని అర్థం చేసుకోవడానికి పెద్ద జ్ఞానం అక్కరలేదు.

సరియైన శిక్షణ లేకుండా మొదటి మూడు రకాల వృత్తులలో ఏది చేపట్టినా సమాజానికి నష్టం. అన్ని వృత్తులను సమానంగా చూడాల్సి ఉన్నా కాలక్రమేణా కొన్నిటికి సంఘంలో గౌరవ ప్రతిపత్తులు ఎక్కువవ్వడం వల్ల మనుష్యుల సహజీవనంలో ఎక్కువ తక్కువలు చోటుచేసుకోవడం మొదలయ్యింది. తన కన్నా ప్రక్కవాడు గొప్పగా బ్రతుకుతున్నాడనే అపోహలో నిరంతరం మనిషి కొట్టుమిట్టాడుతున్నాడు. అందుచేత, ఒక్కోసారి అర్హత లేకపోయినా కొన్ని వృత్తుల కోసం అర్రులు సాచడం మనుషులకి పరిపాటి అయిపోయింది. ఇలాంటి శంబూకులని శిక్షించడానికి శ్రీరామచంద్రులు లేకపోవడం వల్లనే సమాజం అస్తవ్యస్తమవుతోంది.

అది అలా ఉంచి, రాను రాను పైన చెప్పిన నాలుగు విభాగాల వృత్తులను నాలుగు పేర్లతో పిలవడం మొదలయింది. అవే, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర తెగలు. కుటుంబ వ్యవస్థలో తల్లిదండ్రుల నుంచి సంతానం శిక్షణ పొంది వారి వృత్తినే చేపట్టడం మొదలవ్వడంతో కులవృత్తులన్న నానుడి సంఘంలో బాగా పాతుకుపోయింది. దాంతో, నాలుగు వర్ణాలు నాలుగు కులాలయ్యాయి. వాటి నుంచి ఉపకులాలు ఉపజాతులు పుట్టుకొచ్చాయి. కుటుంబ వ్యవస్థలో ఆస్తికి సంబంధించిన వారసత్వము వచ్చిపడింది. అది బాగానే ఉంది కానీ వృత్తిపరమైన వారసత్వం కూడా వచ్చి పరిస్థితిని (situation) మెరుగు పరిచింది కానీ, అది ఒకపాటి గర్వం మనుషుల్లో పెంచి సమాజాన్ని ఇంకా భ్రష్టు పట్టించిందేమో అని అనిపిస్తుంది. సంఘానికి కావలసిన నాలుగు ప్రధాన వృత్తులే ఆనాటి నాలుగు వర్ణాలు. పైన చెప్పిన కారణాల వల్ల, ఇప్పుడున్న కుల వ్యవస్థకి ఆ కాలంలో వున్న చాతుర్వర్ణ్య వ్యవస్థకి ఎక్కడా పొంతన లేదు అని నా అభిప్రాయము.

ఎప్పుడైతే వృత్తులు కులాలుగా మారాయో, ఎక్కువ తక్కువలు, వాటితో పాటు మమత్వము, నేర్చుకున్న విద్యను చదువు రాని వారిని మోసగించడానికో లేక ఎక్కువగా పీడించడానికో ఉపయోగించడం, అన్యాయంగా సంపదని కూడబెట్టడం లాంటి వన్నీ మొదలయ్యాయి. ఈ స్వార్థ ప్రవృత్తికి దేవుణ్ణి కూడా ఒక పావుగా ఉపయోగించడం మొదలయ్యింది. ఎవరికి వాళ్ళు మేము ఆస్తికులమనో లేక నాస్తికులమనో లేక ఒక దైవానికి లేదా ఒక నమ్మకానికి సంబంధించిన ఆస్తికులమనో వర్గీకరించుకోవడం మొదలయ్యింది. మళ్ళీ వాటిల్లో ఎక్కువతక్కువలు, అవి ధృవీకరించడానికి సాధువులు, ప్రవక్తలు అబ్బో ఎన్నెన్ని సృష్టించామో.

మొదటి తరగతి వాళ్ళ పనేమిటంటే, తమ తరగతి వాళ్ళకే కాక, మిగిలిన మూడు తరగతుల వాళ్ళకి కావలసిన వృత్తి, విద్య నేర్పడం. అందుకే, వాళ్ళు ముఖ్యము. "గోబ్రాహ్మణేభ్యః శుభం భవతు" అన్న సంస్కృత వాక్యంలోని సందేశంలో ఉన్న బ్రాహ్మలం మనమే అని చంకలు గుద్దుకునే వాళ్ళు ఉన్నంత కాలం మనం అణగద్రొక్క పడుతున్నామనుకునే వాళ్ళు కూడా ఉంటారు. అది ఒక కులం గురించి కాదు, చుట్టుప్రక్కల ఉన్న వాళ్ళలో ఇప్పటి తరానికి తరువాతి తరానికి పనికివచ్చే విద్యతో పాటు ఇతరమైన వృత్తుల్లో కూడా శిక్షణ ఇచ్చే వాళ్ళు మంచిగా ఉండాలనేది అర్థం చేసుకుంటే మనం బాగు పడతాం. అంటే ఉదాహరణకి, మన ఊళ్ళో ఒకాయన అందరికీ కుండలు తయారు చేయడమో లేక తాళ్ళు పేనడమో నేర్పుతున్నాడనుకోండి. ఆయన బ్రాహ్మణుడు అని అర్థం. ఆయనకి సరియైన గుర్తింపు, మర్యాద మనం ఇవ్వకపోతే వచ్చే నష్టం ఆయనకి కాదు, మనకి, అంటే సంఘానికి. ప్రపంచానికి ప్రళయం వచ్చినప్పుడు కూడా కాపాడ వలసిన వాళ్ళలో మొదట ఉండేది ఇలాంటి వాళ్ళే అని, బహుశా మత్స్యావతార కథలో అనుకుంటాను, చదివాను. ఇది తర్కబద్ధమైన (logical) ఏర్పాటే. ఎందుకంటే, సమాజం ఎప్పట్లా కొనసాగాలంటే, వీళ్ళు ఉండడం అవసరం. వాళ్ళని సరిగ్గా చూసుకోకపోతే, సమాజం మెల్లమెల్లగా పతనం (deterioration) వైపు పయనిస్తుంది.

కం. చాతుర్వర్ణ్య వ్యవస్థను,
యే తీరుగ విద్య, వృత్తు లెగుదల పొందుస్,

జాతీయ సంప దెయ్యది,
యా తీవంచను, తొలుతను యాచార్యులెగా.

(చాతుర్వర్ణ్య = బ్రాహ్మణాది చతుర్వర్ణములు, అనగా, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర జాతులు; వ్యవస్థ = పరంపరగా వచ్చిన ఏర్పాటు; విద్య = జ్ఞానము, విద్య, అష్టాదశ విద్యలు (చతుర్వేదములు, షడంగములు, మీమాంస, న్యాయశాస్త్రము, పురాణములు, ధర్మశాస్త్రము, ఆయుర్వేదము, ధనుర్వేదము, నీతిశాస్త్రము, అర్థశాస్త్రము); వృత్తి = జీవనోపాయము; ఎగుదల = అభివృద్ధి; తీవంచ = నాలుగు; తొలుత = మొదట; ఆచార్యుడు = గురువు, ఉపాధ్యాయుడు)

ఈ పద్యము భావములోకి వస్తే, నాలుగు వర్ణాల వ్యవస్థలో, ఏ విధంగా విద్య, వృత్తులు అభివృద్ధి సాధిస్తాయో, ఎవరైతే జాతీయ సంపదగా పరిగణింప బడతారో, అటువంటి నాలుగు వర్ణాలలో మొదట నిలచేది గురువులే కదా.

ఇదంతా, ఎందుకు చెబుతున్నానంటే, బ్రాహ్మణులని (ఆ కులం వాళ్ళమని చెప్పుకునే వాళ్ళు కాదు), అంటే గురువులని, మనం సరిగా గౌరవించకపోతే ముందు ముందు చాలా పెద్ద మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే చెల్లిస్తున్నామేమో. మనం చదువుకున్న రోజుల్లో (నా కిప్పుడు 66 ఏళ్ళు) మన ఉపాధ్యాయులలో చాలా మంది ర్యాంకు హోల్డర్లు (rank holders). మన పిల్లలు, మనవళ్ళు, మనవరాళ్ళు చదువుకి వచ్చే సరికి పరిస్థితి అలా లేదు. ఆదాయం, సమాజంలో గుర్తింపు రీత్యా, ఉపాధ్యాయ వృత్తి ఆకర్షణీయంగా లేకపోవడంతో ర్యాంకు హోల్డర్లు మంచి ఉద్యోగాలు వెతుక్కుంటూ వెళ్ళిపోతూ ఉండడం వల్ల, వేరే గత్యంతరం లేని వాళ్ళు టీచర్ (teacher) ఉద్యోగాల్లో ఎక్కువగా చేరుతూ వస్తున్నారు. అదివరకు, వివిధ వృత్తులలో నైపుణ్యం (skilled rural artisans) ఉన్న వాళ్ళు ప్రతి పల్లెటూళ్ళోను ఉండేవారు. ఇప్పుడలా లేదు. కొన్ని ఊళ్ళకి కలిపి ఒక వృత్తి నిపుణుడు (skilled person) దొరుకుతున్నాడు. జాగ్రత్త పడకపోతే, పరిస్థితి ఇంకా అధ్వాన్నం అవ్వవచ్చు.

మనం ఇలా తయారవ్వడానికి మూల కారణం ఏమిటి అని ఆలోచిస్తే, పుట్టి బుద్ధెరిగిన తర్వాత తల్లిదండ్రులు కాకుండా మనకి దగ్గరయే వ్యక్తియైన గురువు(ల)తో సంబంధ బాంధవ్యాలు మనలో చాలా మందికి లేకుండా పోవడమే అని నా కనిపిస్తోంది. ఇది చేజేతులారా మనము చేసుకున్న పాపమా? అదివరకటి కాలంలో ఎలా ఉండేది? మన ఆలోచనలు ఈ విధంగా సాగితే మనకి సమస్య కొంత అర్థం అవుతుందేమో.

రాచరికాలు శోభిల్లిన కాలంలో గురుకులాలు నడపబడుతూ ఉండేవి. గురువులను చాలా ఎక్కువగా గౌరవించేవారు. గురువు దగ్గరకి పిల్లవాణ్ణి పంపడం కోసమే వానికి ఉపనయనం (పిల్లవాణ్ణి గురుసమీపానికి పంపించడానికి చేసే సంస్కారము) చేసే వారు. ఇప్పుడు వేరే కారణాలకి ఉపనయనం చేస్తున్నారు అన్న మాట పక్కన పెట్టెయ్యండి. గురువులు కుటుంబం కోసం గానీ తమ గురుకులం కోసం గానీ సంపాదించే అవసరం లేకుండా సమాజము, రాజు గారే ఆ ఖర్చులు భరించేవారు. ఇది కాక, రోజు కొన్ని ఇళ్ళకి గురువుగారు శిష్యులు భిక్షకి వెళ్ళి ఆ వచ్చిన దాంతో పొట్ట నింపుకునే వారు. ఈ విధంగా సమాజమే గురుకులాల పోషణ భారం వహించేది. మెడలో ఉన్న జంధ్యము చూసి గురుకులానికి సంబంధించిన పిల్లలుగా గుర్తించి గృహస్థులు భిక్ష వేసేవారు. అలా చదువుకున్న విద్యార్థులు పెద్దయిన తర్వాత గురువుల పట్ల గౌరవమే కాకుండా సంఘం పట్ల కూడా చాలా బాధ్యతగా ఉండేవారు.

ఇంకో కథ కొంచెం ఎగతాళికి అన్నట్లుగా మా చిన్నప్పుడు వినబడేది. గురుకులంలో ఉన్న విద్యార్థులు అక్కడ ఉన్నంత కాలం గురుపత్ని ఏమి పెడితే అది తిని చదుకోవాలి. గురుపత్ని చిన్నపిల్లలు కదా అని కొంచెం ఉప్పుకారం తగ్గించిన వంటకాలతో భోజనం పెట్టేది. ఇలా కాలం సాగి విద్యార్థులు చదువు నేర్చుకుంటూ కొంచెం పెద్ద వాళ్ళవుతారు. ఒక రోజు ఒక శిష్యుడు భోజనాల దగ్గర ఈ కూరలో ఉప్పు తక్కువయ్యిందమ్మా అంటాడు. అందరూ ఆశ్చర్యంగా చూస్తారు. ఎందుకంటే, రోజు తినేదే అది, ఇవ్వాళ కొత్తగా ఇతనికి అలా ఎందుకు అనిపించింది అని. గురువుగారు అప్పుడు ఏమీ అనకుండా, భోజనాలు అయిన తర్వాత తనని విడిగా కలవమని శిష్యుడికి చెబుతారు. శిష్యుడు కలవగా, నీకు ఇప్పుడు రుచి తెలుస్తోంది, ఇక చదువు ఎక్కదు, వెళ్ళి పెళ్ళి చేసుకొని గృహస్థాశ్రమం స్వీకరించు అని గురువు గారు చెబుతారు. దీన్ని

బట్టి చదువుకునే రోజుల్లో ఆవేశకావేశాలు పెంచేది కాకుండా చక్కటి సాత్వికాహారం తినాలి అని తెలుస్తోంది. గురుకులాలలో పిల్లల్ని అంత జాగ్రత్తగా పెంచేవారు.

శిష్యుడు తన విద్య పూర్తియైన పిదప గురుకులం వదలిపెట్టే ముందు నగదు రూపేణా లేక వస్తు రూపేణా గురువుకు ఇచ్చే బహుమతిని గురుదక్షిణ అంటారు. ఒక్కొక్కసారి, ఏం కావాలో గురువు గారు అడగడం, వారు అడిగినదే గురుదక్షిణగా శిష్యులు ఇవ్వడం జరుగుతూ ఉంటుంది. అసలు గురుదక్షిణ గురించి చాలా ఉదంతాలు చిన్నప్పటి నుండి విన్నాము. చదువు అయిపోయిన తర్వాత గురుకులం వదిలి వెళ్ళే ముందు గురువుగారిని మీకు గురుదక్షిణ ఏమి కావాలో ఆజ్ఞాపించండి అన్న శిష్యుడితో ఏమీ వద్దులే అని గురువుగారనగా, ఏదో ఒకటి మీరు అడిగి తీసుకోవాలని శిష్యుడు మళ్ళీ మళ్ళీ బలవంతపెట్టగా, ఆ ఆవకాశాన్ని కూడా శిష్యుడికి జ్ఞాన బోధ చెయ్యడానికి ఆ గురువు ఉపయోగించుకున్నాడని ఎక్కడో చదివాను. ఎలా అంటే, అలా అయితే సృష్టిలో పనికిరాని వస్తువు తెచ్చి నాకు గురుదక్షిణగా ఇవ్వు అని గురువు అనడం, శిష్యుడు వెతికి వేసారి అలాంటి వస్తువు లేదని గ్రహించి దాంతో గురుదక్షిణ ఇచ్చే ప్రయత్నం విరమించుకోవడం గురించి చదివాను.

మనకున్న పురాణేతిహాసాల్లో గురుశిష్యుల అనుబంధం ఎలా ఉండేది అన్నది చూద్దాం. శ్రీరాముని తాతగారైన రఘుమహారాజు రాజ్యంలో అనేక గురుకులాలలో, ఒక్కొక్క గురుకులంలో 1000 మందికి తక్కువ కాకుండా, శిష్యులు ఉండేవారట. ఆ కాలంలో గురు శిష్యుల అనుబంధం చాలా గొప్పగా ఉండేదిట. ఒక గురుకులంలో కౌత్సుడు అనే శిష్యుని శిక్షణ పూర్తి అవ్వగా, గురువుగారు “నాయనా! నాకు తెలిసిన దంతా నీకు నేర్పాను. నువ్వు కూడా శ్రద్ధగా నేర్చుకున్నావు. ఇక గృహస్థాశ్రమము స్వీకరించు.” అని అన్నారు. కౌత్సుడు వినయంగా ఇలా జవాబిచ్చాడు “విద్యాబుద్ధులు నేర్పించి నన్ను సంస్కారవంతుడిని చేశారు. కృతజ్ఞతగా గురుదక్షిణను ఇచ్చే అవకాశాన్ని కలిగించండి”. “పేద వాడివి, నువ్వేమి ఇచ్చుకుంటావు, ఏమీ వద్దు" అని ఎంతో నచ్చచెప్పాడు గురువు. ఎంత చెప్పినా వినని కౌత్సుణ్ణి పరీక్షిద్దామని గురువు ఇలా అన్నాడు “ఒక మనిషి ఏనుగుపై నిలబడి రివ్వున ఓ రాయి విసిరితే ఎంత ఎత్తు వెళుతుందో అంత ఎత్తు ధనరాశులు తెచ్చి ఇవ్వు”. ఏం చెయ్యాలో తెలియక కౌత్సుడు రఘుమహారాజును

అడిగాడు. మహాయజ్ఞం చేసి అప్పటికే సర్వం దానం ఇచ్చిన ఆ రాజు వశిష్ఠుని సలహా మేరకు ఇంద్రునిపై దండెత్తగా, ఇంద్రుడు విషయం తెలుసుకొని ఆ రాజు కోశాగారాన్ని ధనరాసులతో నింపిస్తాడు. దాంతో రాజు దానం ఇవ్వగా కౌత్సుడు గురుదక్షిణ చెల్లిస్తాడు.

రామాయణంలో ఉన్న గురువులు వశిష్ఠుడు విశ్వామిత్రుడు తమ శిష్యులైన రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులంటే చనువుతో కూడిన ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. విద్యాబుద్ధులు నేర్పించడమే కాకుండా వారు శిష్యులకు విభిన్న పరిస్థితుల్లో కర్తవ్యబోధ కూడా చేశారు. భరద్వాజ, శరభంగ, అగస్త్యాది మహర్షులు రామలక్ష్మణులకు సన్మార్గాన్ని, హితాన్ని, కర్తవ్యాన్ని, ధైర్యాన్ని బోధించారు. గుర్వాజ్ఞ పాటించడ మనేది రామాయణం మొత్తంలో ఒక గొప్ప ధర్మంగా చెప్పబడింది. వశిష్ఠుని గురుకులంలో విద్యాభ్యాసం తరువాత శిష్యులు ప్రత్యేకంగా గురుదక్షిణ చెల్లించినట్లు ఎక్కడా లేదు. మామూలుగా రాజగృహం నుండి అందించాల్సినవే గురుకులానికి అందించారని ఉంది. అన్నిటి కన్నా ముఖ్యం, గురుశిష్యుల బంధం రామాయణం ఆసాంతం ఒక సదాచారంగా కొనసాగింది.

ఇక భాగవతంలోకి వస్తే, రామాయణంలో లాగానే గురువైన సాందీపని బలరామ కృష్ణులను, కుచేలుని తన గురుకులంలో స్వంత బిడ్డలుగా చాలా ఆప్యాయంగా చూసుకొని అన్ని విద్యలు నేర్పిస్తాడు. పుత్రవియోగంతో బాధపడుతున్న గురువును గురుపత్నిని సంతోషపెట్టడానికి గురుకులం వదిలిపెట్టే ముందు బలరామ కృష్ణులు యమునితో పోరి దివంగతుడైన వారి కుమారుణ్ణి వెనక్కి తీసుకొని వస్తారు. గురువు నేర్పిన విద్యా సంస్కారాలతో పెద్దయిన తరువాత కృష్ణుడు నిరుపేద అయిన తన సహాధ్యాయుడు కుచేలుణ్ణి ఆదుకుంటాడు (వేరే సందర్భంలో నిరుపేద అయిన సహాధ్యాయుణ్ణి ఒక రాజు నిరాదరించడం కూడా జరిగింది). రాచరికపు వ్యవహారాలకు సాందీపని దూరంగా ఉండటం వల్ల తరువాతి కాలంలో ఈ గురుశిష్యులకి ఎక్కడా సంపర్కం ఉన్నట్లు కనపడదు.

ఇంకా భాగవతంలో కనిపించే ఇతర గురుశిష్య బంధాలు బలి శుక్రాచార్యులది మరియు ప్రహ్లాద చండామార్కులది. విష్ణువు వామనుడుగా బలి జరిపే యజ్ఞప్రాంగణం లోకి వచ్చి మూడడుగులు దానం అడుగగా శుక్రాచార్యుడు ఇవ్వద్దని శిష్యుడైన బలిని అడ్డుకుంటాడు.

కం. ఇవ్వటుడే విష్ణు వతని
కివ్వకు దాన మనగ, బలి, యిష్యుని యాజ్ఞన్
యవ్వలికింప, ద్విజు లనిరి
గవ్వకుఁ గొఱగావు మేటికవి నెదిరిచినన్.

(వటుడు = బ్రహ్మచారి, ఇష్యుడు = గురువు, అవ్వలికించు = తోసివేయు, ద్విజుడు = బ్రాహ్మణుడు, గవ్వ = చిన్న నాణెము, కొఱగావు = పనికిరావు, మేటి = శ్రేష్ఠుడైన, కవి = శుక్రుడు, ఎదురుచు = ఎదిరించు)

తా: ఈ బ్రహ్మచారే విష్ణువు, అతనికి దానము ఇవ్వవద్దు అన్న గురువు ఆజ్ఞను బలి చక్రవర్తి తోసివేయగా, శ్రేష్ఠుడైన శుక్రాచర్యుని ఎదిరిస్తే గవ్వకి కూడా పనికి రాకుండా పోతావు అని బ్రాహ్మణులు అన్నారు. గుర్వాజ్ఞ పాలించకపోవడం వల్ల బలికి ఏ గతి పట్టిందో మనకి తెలిసిందే.

హిరణ్యకశిపుడు తన పుత్రుడైన ప్రహ్లాదుడికి చదువు చెప్పమని తన గురుపుత్రులైన చండామార్కులకు చెబుతాడు. ప్రహ్లాదుడు అన్ని శాస్త్రాలు శ్రద్ధగా నేర్చుకుంటాడు కాని తనకు అనుచితమని అనిపించిన విష్ణువైరము, హిరణ్యకశిపుణ్ణి అర్చించడం నేర్చుకోడు. అట్లా అని గురువుల ఎడ అగౌరవం కూడా చూపించడు. ప్రహ్లాదుని ఈ ధోరణి హిరణ్యకశిపుని ఎదుట ఎక్కడ బయట పడుతుందో అని చండామార్కులు చాలా భయపడతారు. ఆ రోజు రానే వస్తుంది. అప్పుడు ఏం జరిగిందో చూద్దాం.

కం. చదివించిరి నిను గురువులు
చదివిన దేమన జనకుడు, సారము హరి ప్రాఁ

జదువుల కని ప్రహ్లాదుడు
ముద మారగ పద్య (శ్లోక) మొకటి ముద్దుగ పల్కెన్.

(సారము = ప్రధానాంశము, ప్రాజదువులు = వేదము, ముదము = సంతోషము, ఆరు = నిండు)

తా: నిన్ను గురువులు చదివించారు, ఏమి చదివావు అని తండ్రి అడుగగా వేదసారము హరి యని ప్రహ్లాదుడు సంతోషము నిండునట్లుగా ఒక పద్యము (శ్లోకము) ముద్దుగా చెప్పాడు.

అది విని తొలుత గురువుల మీద కోపగించిన హిరణ్యకశిపుడు తరువాత మెల్లిగా కారణం వేరని తెలుసుకొని ప్రహ్లాదుణ్ణి శిక్షించాలని విఫల ప్రయత్నం చెయ్యడం, తరువాత తనే తన వరముల పరిధికి అతీతంగా నరసింహస్వామి కోరలచే చీల్చబడడం మనకి తెలిసినదే.

మహాభారతంలో రకరకాల గురుశిష్య బంధాలు మనకి కనపడతాయి. మొదటిది, పైలుడు అనే గురువు ఉదంకుడు అనే శిష్యుడిని గురుదక్షిణగా మహారాజు పౌష్యుని భార్య చెవులకు ఉన్న బంగారు కుండలాలు తెచ్చి తన భార్యకు ఇమ్మని అడగటం. నానా కష్టాలు పడి మొత్తానికి ఉదంకుడు అవి తెచ్చి గురుపత్నికి ఇస్తాడు.

పరశురాముడు భీష్ముడికి అతడు భీష్ముడు కాక ముందు, అంటే దేవవ్రతుడుగా ఉన్నప్పుడు, గురువు. అంబ ప్రార్థన విని ఆమెను నువ్వు వివాహం చేసుకోవాల్సిందే అని పట్టుబట్టిన గురువైన పరశురాముని ఆజ్ఞను తిరస్కరించి భీష్ముడు ఆజన్మ బ్రహ్మచారిగా ఉంటానని ప్రమాణం చేయడం వల్ల ఆయనతో యుద్ధం చెయ్యడానికి కూడా వెనకాడడు.

భారతంలో ముఖ్యమైన ఇతర గురుశిష్య సంబంధాలు ద్రోణాచార్యుని కథ చుట్టూ తిరుగుతాయి. ద్రోణుడు ద్రుపదుడు ఒకే గురువు దగ్గర చదువుకుంటూ చాలా స్నేహంగా ఉంటారు. రాజైన తరువాత నా సంపదను నీతో పంచుకుంటానని సహాధ్యాయుడైన ద్రోణుడితో ప్రమాణం చేస్తాడు ద్రుపదుడు. పెద్దయిన తరువాత పేదరికంతో బాధపడుతున్న ద్రోణుడు చిన్ననాటి స్నేహితుని

మాటలు గుర్తుపెట్టుకుని అప్పటికే రాజైన ద్రుపదుణ్ణి సాయం అడిగితే కుచేలుడికి కృష్ణుడు సాయం చేసినట్లు సాయం చేయకపోగా అవమానించి పంపిస్తాడు.

అది గుర్తు పెట్టుకుని మనస్సు కష్టపెట్టుకున్న ద్రోణుడి వృత్తాంతం విన్న భీష్ముడు ఆయనను ఆదరించి అన్ని సౌకర్యాలు ఇచ్చి శిక్షణ ఇవ్వమని కౌరవపాండవులను అప్పజెబుతాడు. తన పేదరికానికి అవమానానికి తగిన సమాధానం దొరికింది కదా అని ఊరుకోక ద్రోణుడు శిష్యులను కూర్చోబెట్టి నాకు ఒక కోరిక ఉంది అని చెబుతాడు, వివరాలు చెప్పకుండా. అందరూ మౌనంగా విని ఊరుకుంటే, అర్జునుడు మాత్రం ఆ కోరిక తీరుస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. ద్రోణుడు ఇప్పుడు బాగానే ఉందిగా అని గతం మర్చిపోయి ఊరుకుంటే కథ ఇంకో విధంగా ఉండేది.

ద్రుపదుడి గొడవ కొంచెం సేపు ప్రక్కన పెడితే, కురుపాండవులకి తన గురుకులంలో శిక్షణ ఇచ్చే కాలంలో ద్రోణుడు అశ్వత్థామకి కొంచెం ఎక్కువ చదువు చెబుదామని ప్రయత్నం చేసేవాడు. నీళ్ళు తేవడానికి అందరికీ చిన్న మూతి ఉన్న జలపాత్ర ఇచ్చి అశ్వత్థామకి మాత్రం వెడల్పు ముఖం ఉన్న పాత్ర ఇచ్చేవాడు. అది నింపుకొని అశ్వత్థామ తొందరగా వస్తే అతనికి రహస్యంగా అస్త్రప్రయోగంలోని ఒక ఉత్తమమైన విధానం నేర్పేవాడు. ఇది అర్జునుడు కనిపెట్టి తన కిచ్చిన పాత్రను వారుణాస్త్రంతో వెంటనే నింపుకొని అశ్వత్థామతో పాటు వచ్చేవాడు. ఈ పక్షపాతం ద్రోణునికి ఉన్నా కూడా అర్జునుడు శుశ్రూష చేసి ఆయన మనస్సు గెలుచుకున్నాడు. దీపం లేనప్పుడు చీకటిలో భోజనం చెయ్యడం అలవాటు చేసుకున్న అర్జునుడు, అదే ఆలోచనతో రాత్రి వేళల్లో ధనుర్విద్యాభ్యాసము చేసేవాడు. ఒకసారి చెరువులో మొసలి ద్రోణుణ్ణి పట్టుకుంటే అర్జునుడు ఆయన్ను రక్షించాడు. ధనుర్విద్యకు సంబంధించి ద్రోణుడు పెట్టే పరీక్షలలో అర్జునుడు అన్ని విధాల తగినవాడుగా నెగ్గేవాడు. చెట్టు మీద గ్రద్ద శిరస్సుకు బాణం గురిపెట్టే పరీక్ష అటువంటిదే. ద్రోణుని గురుకులంలో అర్జునుడు జిజ్ఞాస, అభ్యాసం, బాహుబలం, ప్రయత్నాలలో మిగిలిన శిష్యులను మించుతూ ద్రోణుని మెప్పు పొందుతూ ఉండేవాడు. ద్రోణుణ్ణి దైవంగా భావించి, ఆయన్ను ఆకట్టుకుని ఆయన్నించి బ్రహ్మశిరోనామకాస్త్రం పొందడమే కాకుండా నిన్ను జగదేక ధనుర్ధారిని చేస్తాను అన్న మాట కూడా తీసుకున్నాడు అర్జునుడు.

ద్రోణుని అస్త్రవిద్యానైపుణ్యం గురించి విని అనేక మంది రాజులు రాజకుమారులు ఆయన దగ్గరకి శిక్షణ కోసం వచ్చేవారు. ఒక నాడు నిషాద రాజైన హిరణ్యధనువు కుమారుడైన ఏకలవ్యుడు శిక్షణ కొరకు వచ్చాడు. ద్రోణుడు అతన్ని శిష్యునిగా అంగీకరించి కూడా కౌరవుల మీద దృష్టి ఉంచి (అర్జునుడి కారణంగా కాదు) ఇంటికి పంపించేశాడు. అప్పటికే, కర్ణుని మూలంగా గురుకులంలో కౌరవపాండవుల మధ్య సంఘర్షణతో కూడిన వాతావరణం నెలకొని ఉండడమే దానికి కారణం కావచ్చు. ఏకలవ్యుడు అడవికి వెళ్ళిపోయి ద్రోణుని మూర్తి ఎదురుగా పెట్టుకుని విలువిద్య అభ్యాసము చేస్తూ గొప్ప నైపుణ్యం సంపాదిస్తాడు.

ఒక రోజు కౌరవపాండవులు ఒక కుక్కను వెంట బెట్టుకొని అడవికి వేటకి వెళతారు. అక్కడ ఆ కుక్క అటూ ఇటూ తిరుగుతూ, వికృతరూపంలో ఉన్న ఏకలవ్యుడిని చూసి మాటిమాటికి మొరుగుతూ ఎదుటను నిలబడగా, ఆ భిల్లుడు ఏడు బాణాలు ఆ కుక్క నోట్లో కొట్టి దాని మూతి మూసుకోవడానికి లేకుండా చేశాడు. ఆ హస్తలాఘవాన్ని శబ్దాన్ని అనుసరించి లక్ష్యాన్ని కొట్టే శక్తిని రాజకుమారు లందరూ ప్రశంసించి ఆ చేసింది ద్రోణశిష్యుడను అని చెప్పుకునే ఏకలవ్యుడని తెలుసుకొని వెనక్కి వచ్చి ద్రోణాచార్యుడికి ఆ విషయం చెబుతారు. అర్జునుడు ఏకాంతంలో ద్రోణుణ్ణి మాటిమాటికి కలుసుకొని ఆయన తన కిచ్చిన మాట గుర్తు చేసి నా కన్నా గొప్ప ధనుర్ధరుడు మీ శిష్యుడు ఇంకోడు ఎలా ఉన్నాడు అని సతాయిస్తుంటాడు. అప్పుడు అర్జునుడితో పాటు ద్రోణుడు ఏకలవ్యుడి దగ్గరకి వెళ్ళి నువ్వు నా శిష్యుడివైతే గురుదక్షిణ ఇవ్వు అని అడుగుతాడు. అందుకు ఒప్పుకున్న ఏకలవ్యుడు, ద్రోణుడు అడిగిన తన దక్షిణ అంగుష్ఠాన్ని (కుడి చేతి బొటనవ్రేలు) కోసి ఇస్తాడు.

ఏకలవ్యుడి విషయాని కోస్తే, ద్రోణాచార్యుడిని తిట్టని వాళ్ళు లేరేమో. వ్రేలు కోసి ఇమ్మని అడగకుంటే, ధనుర్విద్యలో ఏకలవ్యుడు అర్జునుణ్ణి మించి పోయి ఉండేవాడేమో అన్న సందేహంతో ఆలోచిస్తే వాళ్ళ దూషణ సబబే అనిపిస్తుంది. కానీ, దీనికి రెండో కోణం కూడ ఉందని అనిపిస్తోంది. వేటకుక్క అరవడం భరించ లేక అది ఎప్పటికీ అరవలేకుండా అది తిండి కూడా తినడానికి లేకుండా, ఏడు బాణాలతో దాని నోరు మూసుకోవడానికి లేకుండా ఏకలవ్యుడు చేయడం ఆశ్చర్యం కలిగించడం మాట అటుంచి కొంచెం లోతుగా ఆలోచిస్తే అది నేరానికి మించిన

శిక్ష (excessive penalty) అనిపిస్తుంది. ఏకలవ్యుడు కుక్కకు వేసిన శిక్ష అసహనంతోను క్రోధంతోను వేసినదే కాకుండా నేరము యొక్క తీవ్రతను (gravity of the offence) దృష్టిలో పెట్టుకుని వేసింది కాదు. కొంచెం స్థిమితంగా ఆలోచిస్తే, ఇంత చిన్న తప్పుకి అంత పెద్ద శిక్షా అని మనకి అనిపించక మానదు. అంత చిన్న వయస్సులోనే ఒక మనిషి ప్రవర్తన అంత అక్రమంగా అతిగా ఉంటే, ఆయుధ శిక్షణ / అభ్యాసము పూర్తయితే వాడు పెద్దయిన తర్వాత, ఇప్పటి పరిభాషలో చెప్పాలంటే, తప్పకుండా తీవ్రవాది (terrorist) అవుతాడు. సమాజానికి రక్షణ విషయంలో ఉండాల్సిన అభ్యాసము తీవ్రవాదిగా తయారవ్వడానికి చేసే అభ్యాసము అయ్యే అవకాశం ఉంది. అస్త్రనైపుణ్యం ఉన్న వాళ్ళకి ఇలాంటి అసహనం (impatience) ఉండడం లోక కంటకం అని ద్రోణునికి అనిపించి ఉండవచ్చు. సహేతుకమైన ఆ భయం (reasonable apprehension) ఉన్నందు వల్లే, ద్రోణుడు అటు సంఘానికి అన్యాయం జరగకుండా, ఇటు ఏకలవ్యుడు పనికిరాని వాడు కాకుండా ఉండే విధంగా ఏకలవ్యుడికి గురుదక్షిణ రూపంలో శిక్ష వేశాడు. అందుకే, అతని సామర్థ్యము తగ్గించాలని కుడి చేతి బొటనవ్రేలు అడిగాడు ద్రోణుడు. అంత శిక్ష వేసి కూడా గురువుగా తన బాధ్యతను మరువకుండా ద్రోణుడు అతని కులవృత్తికి భంగం కలగకూడదని చూపుడు నడిమి వ్రేళ్ళతో బాణాలు ఎలా వెయ్యాలో ఏకలవ్యుడికి నేర్పాడు. దాంతో బాణ సంధానంలో ఏకలవ్యుడికి అదివరకటి వేగం తగ్గిన మాట నిజం. అది చూసి అర్జునుడు సంతోషించిన మాట కూడా నిజం. దాని వల్ల ఏకలవ్యుడికి అనర్హమైన శిక్ష పడింది, అతని బ్రతుకు దుర్భరమైంది అన్న మాటలు మాత్రం నిజం కావు. అందుకని, ఏకలవ్యుడు కుక్కకి వేసిన శిక్ష నేరానికి మించినదే ఐనా, ద్రోణుడు వేసిన శిక్ష ఈ నేపథ్యంలో చూస్తే నేరానికి మించినది కాదని అనిపిస్తుంది.

కం. అది నిర్దాక్షిణ్యమగు గు
రు దక్షిణ యనంగ రాదు, ద్రోణు డెరుంగుస్
యది యేకలవ్యు భవితను
పదిలముగా నుంచు, సంఘు బాధ్యత నెఱపస్.

(నిర్దాక్షిణ్యము = దయ లేకపోవడం, గురుదక్షిణ = విద్యార్థి తన విద్య పూర్తియైన తరువాత గురువునకు ఇచ్చే కానుక, భవిత = జరుగవలసినది, పదిలముగా = భద్రముగా, సంఘము = సమాజము, బాధ్యత = జవాబుదారీ, నెఱపు = నెఱవేర్చు)

తా: అది నిర్దయతో కూడిన గురుదక్షిణ అనడానికి లేదు. అది సమాజానికి సంబంధించిన బాధ్యత నెఱవేర్చడానికి ఏకలవ్యుడి భవిష్యత్తును భద్రపరుస్తుందని ద్రోణునికి తెలుసు.

ఆ కాలంలోనే కర్ణుడు (ధృతరాష్ట్రుని రథసారథియైన అధిరథుని పెంపుడు కొడుకు) కూడా సహాధ్యాయిగా ఉంటాడు. గురుకులంలో ఉండే నిత్యవ్యవహారాలలో కర్ణుడు ఎప్పుడూ దుర్యోధనాదుల పక్షమే వహిస్తుంటాడు, బహుశా, తండ్రి యజమాని కొడుకులనేమో. కర్ణుడికి పాండవులతో స్పర్థ దుర్యోధనాదులతో సాన్నిహిత్యము కొనసాగుతూ వచ్చి కుమారాస్త్ర ప్రదర్శనం నాడు అతడు పిలవని పేరంటానికి వచ్చినట్లుగా వచ్చి అర్జునుడితో తగువు పెట్టుకోవడంతో ఇంకా బట్టబయలు అయ్యి అంగరాజ్యానికి అతన్ని రాజును చేసింది. కానీ, బహుశా ఈ కారణాల వల్లనో, అతని కులము (వృత్తి) తదితర కారణాలు ఉండడం వల్లనో కర్ణుడు అడిగినా కూడ ద్రోణుడు అతనికి బ్రహ్మాస్త్రం ఇవ్వలేదు. మన రాష్ట్రంలో సీటు దొర్కకపోతే పక్క రాష్ట్రానికి వెళ్ళినట్లు కర్ణుడు పరశురాముని వద్దకు వెళ్ళడం, అబద్ధాలు చెప్పి కావలసినది సాధించడం, అది తెలుసుకుని గురువు శపించడం, మనకి తెలిసినవే. దీన్ని బట్టి శిష్యులు వాళ్ళు నేర్చుకున్న విద్యను దురుపయోగం చేస్తారనే సహేతుకమైన భయమో అనుమానమో (reasonable apprehension) గురువులకి ఉంటే అది నేర్పకుండా ఉండడమో లేక ఒకవేళ వారు అదివరకే పొరపాటున నేర్పి ఉంటే అది అందుబాటులోకి రాకుండా చూడడమూ, సామాజిక ప్రయోజనాలు (social benefits) దృష్టిలో పెట్టుకుని, చేసేవారని తెలుస్తోంది. అశ్వత్థామకి బ్రహ్మాస్త్రం ప్రయోగమే నేర్పి ఉపసంహరణ నేర్పక పోవడానికి కూడ ద్రోణుడికి ఇదే కారణం ఉంది.

కుమారాస్త్రప్రదర్శనము ముగియడంతో ద్రోణుడు కౌరవపాండవులకు శిక్షణ ముగిసిందని తలచి వారిని పిలచి పాంచాల రాజు ద్రుపదుణ్ణి బంధించి తన వద్దకు తీసుకొని రావడమే వారు తన కిచ్చే గురుదక్షిణ అని చెబుతాడు. అది విని దుర్యోధనాదులు కర్ణునితో సహా ద్రుపదుడి మీదికి

యుద్ధానికి వెళ్ళి బాగా ఆయన చేతిలో తన్నులు తిని పరుగెత్తుకొస్తారు. ఆ తరువాత, భీమార్జునులు ద్రుపదుణ్ణి బంధించి ద్రోణుడి దగ్గరకు తీసుకొస్తారు. ద్రోణుడు ఆయన్ను ఆదరించి అర్ధరాజ్యం ఇచ్చి పంపించేస్తాడు. పాంచాల రాజ్యంలో సగం కాక అహిచ్ఛత్రనగరాన్ని యుద్ధంలో జయించి అర్జునుడు ద్రోణుడికి గురుదక్షిణగా ఇస్తాడు. ద్రుపదుడు వెళ్ళిన సంవత్సరానికి యుధిష్ఠిరుణ్ణి యువరాజును చేస్తాడు ధృతరాష్ట్రుడు. అప్పుడు, విచిత్రంగా ధృతరాష్ట్రుని సభలో సామంతరాజులు కాక నలుగురు రాజులు ఉంటారు. ఎవరంటే, ధృతరాష్ట్రుడు, కర్ణుడు, ధర్మరాజు (యువరాజు) మరియు ద్రోణుడు. రాజైన ద్రోణుడి మనస్సులో ఏముందో ఏమో, కౌరవ సభలో సోదరులు, గురుబాంధవుల సమక్షంలో మరో చిత్రమైన గురుదక్షిణ అడిగాడు అర్జునుణ్ణి. అది ఏమంటే, "ఒక వేళ యుద్ధంలో నేను కూడ నీతో పోరాడడానికి వస్తే నువ్వు తప్పక నన్ను ఎదిరించాలి" అని అర్జునుడి దగ్గర నుండి తనకు గురుదక్షిణగా వాగ్దానం తీసుకున్నాడు. దీంతో గురువైన ద్రోణుని గురువృత్తి మారి ఆయన రాజైనట్లుగా అనిపిస్తుంది.

ఇక ద్రుపదుడి విషయాని కొస్తే, ఆయన ఆవేశకావేశాలు ద్రోణుడు తనను కొంచెం దెప్పిపొడిచి తరువాత అర్ధరాజ్యం ఇవ్వడంతో చల్లార లేదు. బంధించబడి ద్రోణుడి దగ్గరకు వెళ్ళాడు కనుక ద్రుపదుడు అది అవమానంగా భావించి తపస్సు చేసి ద్రోణుణ్ణి చంపే కొడుకుని (దృష్టద్యుమ్నుడు) అర్జునుణ్ణి పెళ్ళి చేసుకునే కూతుర్ని (ద్రౌపది) పొందుతాడు. చిత్రమేమిటంటే, ఇదంతా తెలిసి కూడా ద్రోణుడు దృష్టద్యుమ్నుణ్ణి తన దగ్గరకు రప్పించి అస్త్రవిద్య నేర్పి ఉపకారం చేస్తాడు. వృత్తిధర్మం మీద ఆయనకు ఉన్న నిష్ఠ దీన్ని బట్టి తెలుస్తుంది.

ఇదంతా జాగ్రత్తగా పరిశీలిస్తే, ద్రోణుడు గురుకులం నడిపే తొలినాళ్ళలో విద్య నేర్పడంలో అశ్వత్థామ మీద కొంత పక్షపాతంతో వ్యవహరించినా, తరువాతి కాలంలో వృత్తిధర్మానికి కట్టుబడి ఉన్నాడని, ఆ కారణం చేత అందరి మన్ననలు పొందాడని తెలుస్తోంది. ఎప్పుడైతే, గురువు బాధ్యతలను వదలి రాజ్యసంబంధమైన విషయాలలో శ్రద్ధ వహించడం మొదలు పెట్టాడో, అధర్మాన్ని సమర్థిస్తూ కౌరవుల వైపు నిలవాల్సి వచ్చినందుకు తన దృష్టిలో తానే దిగజారాడు. ద్రోణుడు తప్ప మిగిలిన గురువులు ఎవరూ కూడా రాజ్యసంబంధమైన విషయాలలో అడిగితే సలహాలు ఇవ్వడమే కానీ వాటిల్లో నిండా కూరుకు పోలేదు. ఒళ్ళూపై తెలియకుండా, అధర్మ

పక్షాన్ని సమర్థిస్తూ, ధర్మరాజును పట్టిస్తాననడం, అభిమన్యుణ్ణి అన్యాయంగా చంపడానికి ఉపాయం చెప్పడం లాంటివి చేసి గురువు స్థాయిని ద్రోణుడు భ్రష్టు పట్టించాడు. ఒకప్పుడు పేదరికంతో బాధపడ్డ వాళ్ళకి నడమంత్రపు సిరి దక్కితే వాళ్ళు విచ్చలవిడిగా చెయ్యరాని పనులు చెయ్యడం ఎలాంటిదో ద్రోణుడు సంపద దక్కగానే గురువుగా తన స్థానం మరచిపోయి ఒక నరహంతకుడి స్థాయికి దిగజారడం అలాంటిది. మనం ఏకలవ్యుడి విషయంలో ద్రోణుణ్ణి తిడతాము కానీ, ఆయన కురుపాండవ యుద్ధంలో పాల్గొనడం, అందులో చెయ్యకూడని పనులు చెయ్యడం మాత్రం నిందనీయం. అర్థానికి దాసుణ్ణయాను అని ఆయనే యుద్ధ ప్రారంభంలో ధర్మరాజుకు చెప్పిన మాటలు దీనికి రుజువు.

కురుక్షేత్రంలో యుద్ధం ప్రారంభం కాక ముందు తమను సమీపించి యుధిష్ఠిరుడు ప్రణామం చేసి తమతో యుద్ధం చెయ్యడానికి అనుమతి కోరినప్పుడు భీష్మ, ద్రోణ, కృప, శల్యులు దాదాపుగా ఒకే లాగు చెప్పిన మాటలు ఏవంటే: "పురుషుడు అర్థమునకు దాసుడు. అర్థము ఎవరికినీ దాస్యము చేయదు. ఇది యదార్థము. కౌరవులు నన్ను అర్థము చేత బంధించినారు. ఈ విషయము నీకు నపుంసకుని వలె చెప్పుచున్నాను. ధృతరాష్ట్ర పుత్రులు ధనము చేత నన్ను భరించి పోషించినారు. కనుక నీ వైపు చేరి యుద్ధం చెయ్యడం తప్ప ఏదయినా కోరుకో ఇస్తాను." "నేను ఆయుధము విడిచి అచేతనుడనై మరణాంతము నిరశనవ్రత దీక్షలో ఉన్నప్పుడు తప్ప నన్ను ఎవ్వడూ చంపలేడు. అట్టి స్థితిలోనే ఎవడైనా ఉత్తమ యోధుడు నన్ను చంపగలడు. విశ్వసనీయు డెవడైనా నాకు అప్రియమైన మాట వినిపిస్తే అప్పుడు అస్త్రములను క్రింద పడేస్తా." అని తన వధోపాయము ద్రోణుడు యుధిష్ఠిరుడికి చెప్పాడు. "అశ్వత్థామా హతః" అన్నదే ఆ అప్రియమైన మాట అని తేలింది చివరకు.

జీవితంలో విభిన్న దశలలో గురువుల సాంగత్యం, సలహా అందుబాటులో ఉన్న వాళ్ళు ప్రగతి వైపు, అవి లేని వాళ్ళు పతనం వైపు ప్రయాణించి నట్లు, మనకి చాలా ఆధారాలు ఉన్నాయి, ముఖ్యంగా మహాభారతం అంతా. కురుక్షేత్ర సంగ్రామంలో కృష్ణార్జునుల సంబంధము గురుశిష్య సంబంధమే. గురువులు చెప్పినట్లుగా వ్యవహరించిన పాండవులు ధర్మబద్ధులై రాజ్యసంపదను పొందడం, గురువులని నిరాదరించిన దుర్యోధన కర్ణాదులు శాపగ్రస్తులై అధర్మవర్తనులై

శిక్షించబడడం మనకి తెలుసు. విద్యాభ్యాసం అయిన తర్వాత కూడా ఒక వ్యక్తి సమస్యల వలయంలో చిక్కుకున్నపుడో లేదా తప్పుదోవలో నడుస్తున్నపుడో, గురుసాంగత్యం (తల్లిదండ్రులు కూడా గురువులే) వానికి సమాధానాలు తెలియ జేసి సరియైన దారిలో పెడుతుంది. మహాభారత కాలంలో గురుశిష్య సంబంధాలకు క్షీణ దశ ప్రారంభమై, నందరాజులు చాణక్యుని అవమానించడంతో తారాస్థాయి కెగసి చంద్రగుప్తుని గురుభక్తి వల్ల మౌర్యసామ్రాజ్యానికి పునాదులు పడ్డాయి. ఆధునిక యుగంలో, ఒక గురువు - ఇద్దరు శిష్యుల మోడల్ (model) మనం బహుశా ఇప్పటికే మూడు సార్లు చూశాము. మహాత్మా గాంధి మరియు పటేల్ నెహ్రూలు, జయప్రకాశ్ నారాయణ్ మరియు నితీష్ లాలూలు, అన్నా హజారే మరియు కిరణ్ బేదీ కేజ్రీవాలులు ఇలాంటి మోడళ్ళే. గురుశిష్యులు ఎవరి పని వారు చేసి నంత కాలం అంతా సవ్యంగానే సాగింది, మహాభారత కాలమైనా తదనంతరమైనా. అంటే, సలహా ఇవ్వవలసిన వాళ్ళు ఆ పని చేస్తూ, దాన్ని అమలు చెయ్యవలసిన వాళ్ళు ఆ పని చేస్తూ ఉన్నంత కాలం అంతా బాగుంది. పాత్రల మార్పిడి (role reversal) ఎప్పుడెప్పుడు జరిగినా, గురు సాంగత్యం లేకుండా పోయినా, ఎలా కొంప మునిగిందో మనందరికీ తెలుసు.

ఇప్పుడు మనం ఆ నాటి గురుకులం వ్యవస్థను క్షుణ్ణంగా నిర్మూలించాము. విద్యాలయాలకి ప్రజా ప్రభుత్వాలు పెట్టే ఖర్చు కాక పిల్లల కుటుంబాలు కూడా ఫీజుల రూపంలోను ఇతరత్రా కూడా విద్య కోసం వ్యయం చేస్తున్నారు. జనాభా పెరగడంతో విద్య కావలసిన వాళ్ళందరికీ వివిధ కారణాల వల్ల (ఫీజులు కట్టే స్తోమత లేకనో, కుటుంబంలో సంపాదన తక్కువ అవడం వల్లనో, మరో కారణం చేతనూ, విద్యాలయాలలో అందరికీ సదుపాయాలు లేకపోవడం వల్లనో) విద్య అందుబాటులోకి రావడం లేదు. దాంతో, ఎవరికి విద్య అందించాలి అన్న దానికి సూత్రాలు కనిపెట్టాము. మెరిట్, రిజర్వేషన్లు అలా వచ్చినవే. ఈ ఆటలో ఒక్కోసారి మనం ప్రత్తి రైతుల లాగా వ్యవహరిస్తాము. ఏ చదువు చదివితే పెద్ద ఉద్యోగాలు వచ్చాయో తెలుసుకొని అందరం దాని కోసమే ఎగబడుతూ ఉంటాము. తరువాత ఏమౌతుందో ఏమయ్యిందో చెప్పక్కర్లేదు. ఇంత చదువూ చదివి వచ్చి మేము ఫలానా కులం వాళ్ళని చెప్పుకోవడం, వేరే వాళ్ళని తక్కువగా చూడడం మన దౌర్భాగ్యం. మనం రోజూ ఇంటి బయటికి అడుగు పెడుతూనే మనకి ఒక రోడ్డు కావాలి. అది మన కులం వాళ్ళు వేయించిందా? రోజూ మన అవసరాలు తీర్చే సౌకర్యాలు మనకి అందించిన వాళ్ళు మన

కులం వాళ్ళా? అన్నీ తెలిసి కూడా, ఈ కులగజ్జిని ప్రోత్సహించే వాళ్ళని మనం ఇంకా భరిస్తూనే ఉన్నాం. ఈ పరిస్థితులు చక్కబడాలంటే గురుశిష్య సంబంధాలు మునుపటి లాగా మెరుగవ్వాలని నా అభిప్రాయము. అందు కోసం, విద్యాలయాల్లో పూర్వవిద్యార్థి సంఘాలు అవిరళ కృషి చెయ్యాలని నా ఆకాంక్ష.

8. చదువులు మన దేశంలో, సేవలు మరో దేశానికి, సబబేనా?

(మా అమ్మాయి, స్వాతి, స్కూలులో చదువుతున్న రోజులలో, తన డిబేటు పోటీ కోసం తయారు చేసిన మెటీరియల్ ఆధారంగా వ్రాసిన వ్యాసం ఇది. ఇప్పటికీ స్కూలు పిల్లలకి చదవడానికి బాగుంటుందని ఇక్కడ ఇస్తున్నాను.)

'చదువులు మన దేశంలో, సేవలు మరో దేశానికి. సబబేనా?' అన్న ప్రశ్న ఉదయించిన సందర్భంలో, మహాకవి గురజాడ అన్న మాటలు గుర్తొస్తున్నాయి. అవి "సొంత లాభం కొంత మానుకు పొరుగు వాడికి తోడుపడవోయ్". ఇక్కడ 'పొరుగువాడు' అన్న పదం మనుషులకే కాక సమాజాలకు కూడా వర్తిస్తుంది. అంటే, ఇప్పటి ప్రపంచంలో దేశాలకు కూడా వర్తిస్తుంది. ప్రతి దేశం, పొరుగు దేశాలకు తోడ్పడాలని గురజాడ సందేశం. మనుషులు, ఎవరి ప్రపంచంలో వాళ్ళుంటే అభివృద్ధి ఎలా సాధ్యం? ఎవరున్న చోటే వాళ్ళుంటే, మనం ఇప్పుడున్న స్థితికి చేరే వాళ్ళమేనా? అలాగనక ఉండి ఉంటే, మనం ఇంకా రాళ్ళతో జంతువులని చంపి పచ్చిమాంసం తింటూ ఉండే వాళ్ళం. నాగరికత అసలు ఉండేది కాదు. అందాకా ఎందుకు. పట్టణాల్లో ఇప్పుడు చాలా మంది గ్రామాల నుంచి వచ్చిన వాళ్ళు ఉన్నారు. వాళ్ళు అలా కాకుండా, ఇప్పుడు కూడా వాళ్ళ వాళ్ళ పల్లెల్లో ఉంటే ఎట్లా ఉంటుంది? అది సాధ్యమేనా? సాధ్యం కానంత మాత్రాన ఆ పల్లెలకి ద్రోహం జరిగినట్లా?

మన వాళ్ళు, ఇక్కడ చదువుకుని, విదేశాలకి వెళ్ళడాన్ని గురించి ఒక పదం అస్తమానం అంటూ ఉంటారు. అదే బ్రైన్ డ్రైన్ (Brain drain). ఆ పదానికి సరియైన అర్థం తెలిస్తే అసహ్యం వేస్తుంది. ఇక్కడ నుండి వెళ్ళిన వాళ్ళంతా మేధావులు, ఇక్కడ ఉన్నవాళ్ళంతా చవటాయిలు - అన్న అర్థం స్ఫురిస్తుంది ఆ మాటకి. ఈ సిద్ధాంతం ఎప్పటికీ ఒప్పుకోదగినది కాదు. అయితే, అలాంటి స్థితిని ఏమనచ్చు అని కొందరడుగ వచ్చు. ఆలోచిస్తే, దాన్ని బ్రైన్ ఓవర్ఫ్లో (Brain overflow) అని అనవచ్చు. అంటే, పాత్రలో నీళ్ళు ఎక్కువైతే పొంగి పొర్లినట్లు, ఈ దేశంలో చదువుకున్నవాళ్ళు ఎక్కువయి, ఇతర దేశాలకు వెళుతున్నారు. అందులో, తప్పేమిటి? వాళ్ళంతా వెళ్ళడం, ఒక రకంగా చూస్తే చాలా సమస్యలకి పరిష్కారం.

ఒకటి, నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. రెండు, వాళ్ళు సంపాదించిన దాన్లో కొంత మన దేశానికి పంపుతున్నారు కనుక మనకి కూడా లాభం. ఇక మూడవది, వెళ్ళిన వాళ్ళలో కొంతమంది అక్కడి సాంకేతిక పరిజ్ఞానం ఇక్కడకు చేరుస్తున్నారు. అందువల్ల, మనకి చాలా మంచి జరుగుతోంది. అందాకా, ఎందుకు? బిల్ గేట్స్ (Bill Gates) మైక్రోసాఫ్ట్ (Microsoft) కంపెనీ లాంటివి, మన వాళ్ళు భారత దేశానికి తిరిగొస్తే, మూత పడతాయంటున్నారు. అది, మన కెంతో గర్వ కారణం.

అదట్లా ఉంచి, ఇప్పటికి మనం సాధించిన అభివృద్ధి అంతా, విదేశీయుల సేవలు లేకుండానే సాధించామంటారా? మనం స్థాపించిన నీటిపారుదల ప్రాజెక్టులు, మనం పెట్టుకున్న పెద్ద పెద్ద పరిశ్రమలు, మనం అంతరిక్ష యానంలో సాధించిన ప్రగతి అంతా మన ప్రతిభే ననుకుంటున్నారా? అందులో ఎంతో మంది విదేశీయుల కృషి కూడా వుంది. ఇంత ప్రగతి విదేశాల సహాయంతో సాధించి, తీరా మన వంతు వచ్చేసరికి మనం ఇతర దేశాలకు వెళ్ళ కూడదనడం బాగుందా?

ఇప్పుడు, ప్రపంచమంతా సమాచార విప్లవం జరుగుతోంది. అంటే, Information revolution. ప్రపంచం చాలా దగ్గరవుతోంది. ఏ విషయమైనా internetలో తెలుసుకో గలుగుతున్నాము. World Trade Organization (WTO) అగ్రిమెంటుకు (agreement) మన దేశం కూడా భాగస్వామి. అంటే, వ్యాపార వాణిజ్యాలకి ఇక నుంచీ సరిహద్దులే లేవు. ఎవరైనా ఏ వస్తువునైనా ఎక్కడైనా అమ్మవచ్చు. అలాగే, సేవలు కూడా అందించవచ్చు. సామూహిక ప్రగతి కోసం చాలా దేశాలు తలపెట్టిన ఈ మహాకార్యంలో మనం కూడా మన వంతు కర్తవ్యం నిర్వహిద్దాము. దేశం సరిహద్దులు దాటటమేమిటి, అవసరం అయితే అంతరిక్షంలో సేవ లందించాల్సిన సమయం ఇది.

అందుచేత, చిన్న ఆలోచనలకి స్వస్తి చెప్పండి. విదేశాలకి, చదువుకీ ఆ తర్వాత ఉద్యోగావకాశానికీ, South Africa వెళ్ళకుండా వుంటే, మోహన్ దాస్ కరం చంద్ గాంధీ లాంటి అతిసామాన్య వ్యక్తి మహాత్ము డయ్యేవాడా? ఆలోచించండి. కనుక, మన దేశంలో చదివి మరో దేశంలో సేవ చేయడం సబబే.

9. చలపతి చాతుర్యం

[ఈ వ్యాసం సంచిక మాస పత్రిక అనబడే తెలుగులో తొలి డైనమిక్ వెబ్ పత్రికలో (జూన్ 08, 2025) ప్రచురించబడింది. అందుబాటులో ఉన్న లింకు: https://sanchika.com/chalapati-chaaturyam-mvs-r/]

అనగనగా ఒక ఊరు. ఏదో ఒక ఊరు ఎందుకు. అది మా ఊరే అనుకోండి. మా ఊళ్ళో ఒక మహా మేధావి "చలపతి" అని ఉండేవాడు. నేను పుట్టక ముందు మా గురువు గారి దగ్గర చదువుకున్నాడట. శిష్యుడుగా అతను వేసిన ముద్ర తాలూకు వివరాలు అప్పటి తరాలే కాక ఆ తరువాతి తరాలు కూడా చెప్పుకుని చెప్పుకుని తరించారు. చలపతి మా ఊరికే ఒక మరపురాని గొప్ప గుర్తింపు. చిలకమర్తి వారి గణపతికి, మొక్కపాటి వారి బారిష్టరు పార్వతీశానికి, గురజాడ వారి గిరీశానికి, ఏ మాత్రం తీసిపోని వాడు మా చలపతి.

అసలు చలపతి అన్న పేరుకి అర్థం ఉందా? అని ఎవరో పండితుణ్ణి అడిగితే, అది "చలపతి" కాదురా, "అచలపతి" అనాలి, అది "వేంకటాచలపతి"యో "శేషాచలపతి"యో అయ్యుంటుంది అని జ్ఞాన బోధ చేశాడు. ఆ జ్ఞానం ఉన్న వాళ్ళు కూడా "చలపతి" అని పిలవడానికే అలవాటుపడ్డారు. దానికి కారణం, చలపతిని "అచలపతి" అని పిలిస్తే అతనిలో ఉన్న చైతన్యం (dynamism) పోయి ఏదో ఒక అచల స్థితి (static state) వస్తుందని భయం. అదేమి వింతో గానీ, నాకు తెలిసిన "చలపతి" అని పిలవబడేవాళ్ళు (మా ఊళ్ళోనే కాదు, వేరే ఊళ్ళలో కూడా) అందరూ విచిత్రమైన చైతన్యం కలవారు. మామూలు వాళ్ళు కాదండోయ్.

ఇక మా చలపతి మాటకొస్తే, పరమానందయ్య గారి శిష్యుల కున్న మహిమతో కూడిన వింత జ్ఞానం అతనికి ఉంది. ఉదాహరణకి, చిన్నప్పుడు గురువు గారు గణితంలో బోధించిన "కాలము-పని" అన్న అధ్యాయంలో ఉన్నదంతా తప్పుల తడక అని మా చలపతి చెప్పేవాడు. బియ్యం కిలో 50 రూపాయలైతే, 2 కిలోలు 100 రుపాయలు చేస్తుంది అన్న లెక్క సర్వత్రా వర్తిస్తుందని

మా చలపతి గట్టి నమ్మకం. ఒక పనిని 2 మనుషులు 3 రోజుల్లో చేస్తే, 6గురు మనుషులకి అదే పని పూర్తిచేయడానికి 9 రోజులు పడుతుంది అనే వాడు. ఈ విషయంలో మా గురువు గారే కాదు, అతని సమకాలీకులు తరువాతి తరం వాళ్ళు ఎవ్వరూ కూడా మా చలపతిని తప్పని ఒప్పించ లేకపోయారు. ఇది విని తెగ నవ్వుకు చచ్చిన వాళ్ళలో నేనూ ఉన్నాను కానీ, నాకు తర్వాత ఎప్పటికో ఒక క్రొత్త వాదన వినబడింది, మానేజిమెంట్ థీరీ (Management theory) లోను, ఆర్థిక శాస్త్రం (Economics) లోను. అవసరానికి మించి ఎక్కువ మందిని పనిలో పెట్టుకుంటే ఆ ఎక్కువైన వాళ్ళది, ఒక రకమైన నిరుద్యోగమే. దాన్ని ప్రచ్ఛన్న నిరుద్యోగం (Disguised Unemployment) అంటారు. ఎక్కువ మందిని పనిలో పెట్టుకుంటే పని తొందరగా అవుతుందనడం భ్రమ. అలా ఎప్పుడూ జరగదు. కూసే గాడిద వచ్చి మేసే గాడిదని చెడగొట్టదా. పనిలో మంది ఎక్కువైతే బాతాఖానీ పెట్టుకుంటారు కానీ పని చేస్తారా ఏమిటి? ఈ ఆలోచనలన్నీ, మానేజిమెంట్ థీరీలో చెబుతారు. ఏమిటి వీళ్ళు చెప్పింది, మా చలపతి చెప్పింది, మీరే చెప్పండి. మా చలపతి చెప్పింది వింటే మాకు చిన్నప్పుడే జ్ఞానోదయం అయ్యుండేది. ఏమిటో ఏమనుకుంటే ఏమి లాభం, జరగాల్సింది జరిగిన తర్వాత.

మా చలపతి చదువు దగ్గర కూడా బేరాలు ఆడేవాడు, ఆ రోజుల్లో. మా గురువు గారు గురుకులం పద్ధతిలో పద్యాలు గాని శ్లోకాలు గాని నిన్న చెప్పింది ఇవ్వాళ అప్పజెబితే కానీ ఆ తరువాతది చెప్పేవారు కాదు. ఈ విషయంలో ఆయన చాలా స్ట్రిక్ట్ (strict). కానీ, మా చలపతి మొన్నటిది, నిన్నటిది, ఇవ్వాళ చెప్పబోయేది కలిపి రేపు అప్పజెబుతాను అని బేరం ఆడేవాడు. మా చలపతి ఉద్దేశ్యం ఏమిటంటే, గురువుగారు ఈ వాక్యం రోజూ మననం చేసుకోవాలి గానీ ఏ రోజూ తనని అప్పజెప్పమని అడగకూడదు. పెద్ద పెద్ద వ్యవహారాల్లోను, కాంట్రాక్టులలోను, బ్యాంకుల్లో అప్పు తీసుకున్న లావాదేవీల్లోను, అప్పు తిరగరాయడమే కానీ తీర్చడం ఉండకూడదన్నది మా చలపతి పాండిత్యం లాంటిది కాక మరేమిటి.

మాది చిన్న పల్లెటూరు. దగ్గరలో ఉన్న పెద్ద పల్లెటూరులో గానీ బస్తీలో గానీ మా ఊళ్ళో వాళ్ళకి ఏదో ఒక పని ఉంటూ ఉండేది. ఎవరి పనికి వాళ్ళే వెళితే ఇక మా చలపతి ఎందుకు? అలాంటి వాళ్ళలో ప్రతి వాళ్ళ దగ్గరకు వెళ్ళి ఇంత చిన్న పనికి అంత దూరం మీరే వెళ్ళాలా నేను

చేసుకొస్తాను అని వాళ్ళ దగ్గర ఆ పని తాలుకు ఖర్చు, దారి ఖర్చు వసూలు చేసేవాడు. అట్లా, పని ఉన్న వాళ్ళు అందరి దగ్గరా వసూలు చేసి, అక్కడక్కడ తిరిగి వచ్చి పని కాలేదని అందరికీ కుంటి సాకులు చెప్పేవాడు. ఏ రోజునా ఎవరి పనీ చలపతి చేయగా ఎవరూ చూడలేదు. తరువాతి కాలంలో, నేను ఇటువంటి ఒక సంగీత విద్వాంసుణ్ణి చూశాను. ఆయన పాట కచేరీకి డబ్బులు తీసుకోను, ఉచితంగా కచేరీ చేస్తాను అని చెప్పి ఒకే ప్రదేశంలో నాలుగయిదు బేరాలు ఒప్పుకుని అందరి దగ్గర ఖర్చులు వసూలు చేసేవాడు. ఆ ఖర్చులు కూడా మామూలుగా కాదు, ప్రయాణం ఖర్చులే కాకుండా ఫైవ్ స్టార్ (Five-star) హోటల్లో ఉండడాని కయ్యే ఖర్చులు. ఖర్చులకి పుచ్చుకున్న సొమ్ము కనుక విడివిడిగా చూపిస్తే (ఒక కచేరీకే అని కాకుండా) ఎంచక్కా ఆదాయపు పన్ను కూడా కట్టక్కర్లేదు. ఇది మా చలపతి పాండిత్యం లాంటిది కాదని మీ సందేహమా.

మా చలపతి మృదుభాషి. ఎవరి పైనా కోప్పడటం గానీ విసుక్కోవడం గానీ చేసేవాడు కాదు. అలా ఉండటం ఒక రకంగా మా వాడికి ఊళ్ళో మంచి పలుకుబడిని ఇచ్చింది. అది ఎన్నిక (Election) లప్పుడు బాగా వినియోగంలోకి వచ్చింది. ఏ పార్టీ వాళ్ళు తనకి ఎక్కువ డబ్బు లిస్తే వాళ్ళ తరఫున పని చేసేవాడు. ఆ పని ఎలా చేసేవాడు అన్నదే తెలుసుకోవాల్సిన విషయం. ఎలక్షనుకి రెండు రోజుల ముందు వరకు ఏమీ చేసేవాడు కాదు. అది రెండు రోజులుందనగా, అన్ని గూడెములలో పలుకుబడి ఉన్నవాళ్ళని పిలిపించేవాడు. "ఏరా! ఎవరికి ఓటు వేద్దాం అనుకుంటున్నారు. (సమాధానం కోసం ఆగకుండా) మీ ముఖం. ఎవరికేస్తారు. ఫలానా గుర్తుకి (పేరు చెప్పేవాడు) వెయ్యండి. మీరు వెయ్యటమే కాదు. మనాళ్ళందరి చేతా వేయించాలి. ఏంటి, అర్థం అయ్యిందా? తెలుసుగా, మనాళ్ళకి కావాల్సిన డ్రమ్ములు పంపించాను. ఈ రెండు రోజులు ఆళ్ళని దగ్గరుండి చూసుకోవాల. మీరు మాత్రం ముట్టుకోకండి. ఏంటి తెలిసిందా? అదుగో, అక్కడ కొత్త సైకిళ్ళు (cycles) పెట్టించాను. తలోటి పట్టుకు పొండి. జాగ్రత్తగా పని కానిచ్చి నా కొచ్చి చెప్పండి." అని వాళ్ళకి ఉపన్యాసం ఇచ్చేవాడు మా చలపతి. ఇది సుగ్రీవాజ్ఞ లాగా పనిచేసేది. చూడండి, ఎంత ప్రశాంతంగా జరిపించేవాడో ఎలక్షన్లు, చలపతి ఆ రోజుల్లో. ఇప్పుడు ఎలక్షనుల్లో జరిగే హంగామా చూస్తే చలపతి లేని లోటు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

ఎంత అడ్డగోలుగా సంపాదించినా వేషధారణలో కనపడనిచ్చేవాడు కాదు మా చలపతి. చాలా సింపుల్గా (simple) ఉండేవాడు. సన్నిహితులు ఎందుకని ఇలా ఉన్నావు అని అడిగితే, ఊళ్ళోవాళ్ళ దృష్టి మన మీద పడకూడదురా అని చెప్పేవాడు. చాలా కాలం తర్వాత నేను ఢిల్లీలో (Delhi) పనిచేసే రోజుల్లో ఇలాంటి కారక్టర్ని (character) చూశాను. ఆఫీసుల (Offices) రద్దీ ఉండే ప్రాంతంలో సౌతిండియస్ కాంటీన్ (South Indian Canteen) నడిపేవాడతను. కాంటీన్లో ఎప్పుడూ రష్ (rush) ఎక్కువగా ఉండేది. ఆదాయం చాలా ఎక్కువే అనడానికి సందేహం లేదు. ఇదంతా బాగానే ఉంది కాని ఆ ఓనరు (owner) నీరకాయ బట్టల్లో వెర్రి పీనుగ లాగా ఉండేవాడు. ఆ కాంటీన్ రేకుల షెడ్డులో బయటి నుంచి చూసే వాళ్ళకి చాలా సామాన్యంగా ఉండేది. నీకు ఆదాయం బాగా వస్తోంది కదా, ఇవన్నీ సరి చేసుకోవచ్చు కదా అని అడిగాను అతనిని హిందీలో ఒక సారి. "నజర్ పడేగీ" అంటే "దిష్టి తగులుతుంది" అని హిందీలో జవాబు ఇచ్చాడు. అతను గవర్నమెంటుకి టాక్సు (Tax) కడతాడో లేదో మీకీపాటికి అర్థం అయ్యుండాలి.

ఇవన్నీ మా చలపతి గొప్పతనం గురించి చెప్పడం కోసం కాదు కానీ చలపతి అన్న కారక్టర్ మా ఊళ్ళోనే కాదు సర్వత్రా ఉంటుంది అని చెప్పడానికి చెబుతున్నాను. అందుకు నాకు చాలా గర్వంగా ఉంది.

10. ద్యూత సభలో ద్రౌపది ప్రశ్న సబబేనా?

[ఈ వ్యాసం “సంచిక మాస పత్రిక” అనబడే తెలుగులో తొలి డైనమిక్ వెబ్ పత్రికలో (సెప్టెంబరు 22, 2024) ప్రచురించబడింది. అందుబాటులో ఉన్న లింకు: https://sanchika.com/dyoota-sabhalo-draupadi-prashna-sababenaa-mvs-r/]

మహాభారతం లోని సభా పర్వంలో ద్యూత ప్రసక్తి వస్తుంది. ధృతరాష్ట్రుడు విదురుణ్ణి ఇంద్రప్రస్థం పంపి ధర్మరాజాదులని ద్యూతం ఆడడానికి హస్తినకు ఆహ్వానిస్తాడు. వాళ్ళు వచ్చిన తరువాత, ద్యూత సభలో పెద్దలందరి సమక్షంలో, శకుని ఆడతాడు నా తరపున, పందెం మాత్రం నేను కడతాను, అని దుర్యోధనుడు చెబుతాడు. ఆ విధంగా ధర్మరాజు శకుని ఆట మొదలుపెడతారు.

మొత్తం 20 సార్లు పాచికలు వెయ్యడం జరుగుతుంది. అన్ని సార్లూ కూడా శకునియే పాచికలు వేస్తాడు. ముందుగా సకల సంపదలనూ, తరువాత వరుసగా తన తమ్ముళ్ళనూ, ఆ తరువాత తననూ, ఆఖరిగా భార్యయైన ద్రౌపదినీ పందెం ఒడ్డి ధర్మరాజు ఓడిపోతాడు. ఆటకి ముందూ, పది పందేలు వరుసగా ధర్మరాజు ఓడిన తరువాతా, విదురుడు కలగజేసుకుని ఆటని ఆపించడానికి తగిన ఉపదేశం చేస్తాడు. దుర్యోధనుడి చేత తిట్లు తింటాడు కాని ఆట కొనసాగుతుంది. 14 పందేలలో ఏ ఒక్క పందెం గెలవకుండా ఉన్నదంతా పోగొట్టుకుంటాడు ధర్మరాజు. ఇక మనుషులే మిగులుతారు. అప్పుడు వరుసగా, 15వ, 16వ, 17వ, 18వ పందేలలో నకులుణ్ణీ, సహదేవుణ్ణీ, అర్జునుణ్ణీ, భీముణ్ణీ ఒడ్డి ఓడిపోతాడు ధర్మరాజు.

18వ పందెంలో భీముణ్ణి గెలుచుకున్న తరువాత, శకుని, నీవు నీ తమ్ముళ్ళని గజాశ్వాదులని ధనాలను కోల్పోయావు, ఇక ఇప్పుడు నీ వద్ద ఓడకుండా మిగిలిన ధన మేదైనా ఉంటే చెప్పు అని ధర్మరాజుతో అంటాడు. అప్పుడు, ధర్మరాజు, నన్నే పందెంగా పెడుతున్నాను, ఒక వేళ నేను ఓడిపోతే సేవకుడి లాగా అన్ని పనులు చేస్తాను, అని అంటాడు.

ఆ విధంగా పందెంలో తనను తానే ఒడ్డి ఓడిపోతాడు ధర్మరాజు. అప్పుడు, శకుని తమాషాయైన మాట ఒకటి అంటాడు. ఇంకా నీ వద్ద ధనం మిగిలి ఉండగా నిన్ను నువ్వు ఓడిపోవడం మహాపాపం అని ధర్మరాజుతో అంటాడు శకుని. ఇంకాస్త రెట్టించి, నీ కిష్టమైన ద్రౌపదిని ఇంకా ఓడలేదు, ఆమెను పందెంగా ఒడ్డు అని శకుని ధర్మరాజుతో మళ్ళీ అంటాడు. శకుని చెప్పినట్లుగానే ధర్మరాజు చేసి పందెం ఓడిపోతాడు. ఇక అప్పుడు, కర్ణుడు దుర్యోధనాదులు విచ్చలవిడిగా ప్రవర్తించడం మొదలు పెడతారు. వాళ్ళ సంతోషానికి పట్టపగ్గాలు ఉండవు.

విదురుణ్ణి ఉద్దేశించి, భవనంలో ఊడవడానికి ద్రౌపదిని తీసుకురమ్మని, దుర్యోధనుడు అంటాడు. దానికి విదురుడు ఆగ్రహించి ద్రౌపది ఎప్పటికీ దాసి కాజాలదు, ఎందుకంటే ధర్మరాజు తాను ముందే ఓడటం వల్ల తరువాత ద్రౌపదిని పందెం పెట్టే అధికారం పోగొట్టుకున్నాడు, కనుక ద్రౌపది ఓడబడ లేదు, అని చెబుతాడు.

విదురుణ్ణి ఛీత్కరించి దుర్యోధనుడు ప్రాతికామి అనే సూతుడికి ద్రౌపదిని పిలుచుకొచ్చే పని అప్పజెబుతాడు. ప్రాతికామి వెళ్ళి చెప్పగానే, ద్రౌపది ఒక ప్రశ్న వేసి సమాధానం ధర్మరాజు నడిగి వచ్చి చెప్పమని ప్రాతికామిని వెనక్కి పంపుతుంది. ఆ ప్రశ్న ఏమిటంటే, నీవు నిన్ను తొలుత ఓడితివా? లేక, నన్ను ఓడితివా?, అని. ప్రాతికామి సభలో ధర్మరాజుకి ఇది వినిపిస్తే అతడు అచేతనుడై ఉండిపోతాడు కానీ సమాధానం చెప్పడు.

ఆవిణ్ణి (ద్రౌపదిని) ఇక్కడికే వచ్చి ధర్మరాజుని అడగమను, ఆ ప్రశ్న, అతడు దానికి చెప్పే జవాబు సభలోని వారు అందరూ వింటారు అని దుర్యోధనుడు ప్రాతికామిని మళ్ళీ పంపిస్తాడు. అప్పుడు, ద్రౌపది సభకి మళ్ళీ వెళ్ళి కురువంశీయులను నేను ఏమి చెయ్యాలో అడుగు, వాళ్ళు ఎలా చెబితే అలా నేను నడుచుకుంటాను అని అంటుంది. ఆ మాట సభలో ప్రాతికామి చెప్పిన తరువాత కూడా దుర్యోధనుని మొండిపట్టు తెలిసిన వారవడం చేత ఎవరూ నోరెత్తరు. ద్రౌపదిని సభకు తీసుకొనిరా అని మళ్ళీ చెప్పగా ఆమె దగ్గరకు వెళ్ళడానికి భయపడుతున్నట్లు కనిపించిన ప్రాతికామిని వద్దని ఆ పని దుశ్శాసనుడికి అప్పజెప్పాడు, దుర్యోధనుడు. అప్పుడు,

దుశ్శాసనుడు ఆమె జుట్టు పట్టుకొని సభలోకి ఈడ్చుకు రావడం, ఆమె రోదించడం, అందరికీ తెలిసందే.

ద్రౌపది వేసిన ప్రశ్నకి సంబంధించి సభలో జరిగిన వాదోపవాదాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. అందరూ చెప్పక ముందే, విదురుడు స్పష్టంగా ధర్మరాజు ముందే ఓడడం వల్ల ద్రౌపది ఓడింపబడలేదు అని చెప్పాడు. భీష్ముడు సమాధానం చెప్పీచెప్పనట్లుగా చెప్పాడు. భీష్ముడు ఏమన్నాడంటే: "ధర్మస్వరూపము అతి సూక్ష్మము. ఇతరుల ధనం ఎవరూ పందెంలో పెట్టరు. స్వామి కాబట్టే అలా చేశాడు అని అనుకోవాలి. స్త్రీ ఎప్పుడూ తన స్వామికి అధీనురాలే. ధర్మరాజు తాను ఓడినట్లు స్వయంగా చెప్పాడు. అతడు ఎప్పుడూ ధర్మం తప్పడు."

దుర్యోధనుని తమ్ముడు వికర్ణుడు ఏమన్నాడంటే: "ధర్మరాజు ధూర్తులైన జూదరుల చేత ప్రేరితుడై ద్రౌపదిని పందెం పెట్టాడు. ఆమె కేవలం ధర్మరాజుకి మాత్రమే కాదు, పాండవు లందరికీ భార్య. అదీ కాక, అతడు ముందు తాను ఓడి తరువాత ద్రౌపదిని పందెం పెట్టాడు, అదీ శకుని ప్రోత్సాహం వల్ల. ఇదంతా చూస్తే, ద్రౌపది ఓడబడలేదని అనిపిస్తోంది."

కర్ణుడు ఏమన్నాడంటే: "ద్రౌపది ధర్మానుసారం ఓడిందని అనుకోవడం వల్లనే పెద్దలు మిన్నకున్నారు. ధర్మరాజు తన సర్వస్వం పందెం ఒడ్డినప్పుడు ఆ సర్వ ధనములో ద్రౌపది కూడా ఉంది. ధర్మరాజు ద్రౌపదిని పందెం పెట్టినప్పుడు, ఆయన తమ్ముళ్ళు మౌనంతో అంగీకరించారు (acquiescence)."

ఆ తరువాత, సభలో జరిగిన గలాభా, ద్రౌపది వలువలు ఒలవడానికి దుశ్శాసనుడు చేసిన విఫల ప్రయత్నము, కృష్ణలీల అందరికీ తెలిసిందే. అయినా, విషయం తేలలేదు. విదురుడు ప్రహ్లాదోపాఖ్యానంలోని ధర్మప్రసంగము గురించి చెప్పి, మౌనంగా ఉంటే లాభం లేదు, ద్రౌపది ప్రశ్న గురించి మీ అభిప్రాయాలు చెప్పండి అని అందరినీ కోరాడు. భీష్ముడు ధర్మనిర్ణయం చెయ్యడంలో తన అశక్తతను తెలియజేస్తూ, బలవంతులు ఏది ధర్మం అంటే అదే నెగ్గుతుంది, ఇప్పుడు

కర్ణదుర్యోధనులు నిర్ణయించిన ధర్మమే అన్నిటి కన్నా పైన ఉంది, అని చెప్పి, ధర్మరాజు ఒక్కడే ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో ధర్మం నిర్ణయించడానికి ప్రామాణికుడు అని చెప్పాడు.

విదురుడు తాను అంతకు ముందు చెప్పిన అభిప్రాయమే కొంచెం విడమరచి ఇలా చెప్పాడు: "ధర్మరాజు తాను ఓడక ముందే ద్రౌపదిని పందెం పెట్టియుండిన యెడల, అప్పుడు అతనికా అధికారం ఉండేది. కాని, తాను ఓడి అతడు పందెం పెట్టే అధికారాన్నే పోగొట్టుకున్నాడు. అనధికారి వేసిన పందెం గురించి గెలుపోటముల ప్రసక్తే అసంగతం."

భీముడు భీషణ ప్రతిజ్ఞలు చెయ్యడం, తరువాత అశుభ సూచకాలు కనిపించడం అయిన తరువాత, చివరకు ధృతరాష్ట్రుడు కలిపించుకుని ద్రౌపదిని వరాలు కోరుకోమనడం, ఆమె మొదట ధర్మరాజుని తరువాత మిగిలిన నలుగురు భర్తలని స్వతంత్రులను చేయమని కోరడం అందరికీ తెలిసిందే. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఆమె తన స్వతంత్రం గురించి ధృతరాష్ట్రుణ్ణి ఏమీ కోరలేదు. కారణం, తాను ఓడబడలేదని తనకు తెలియడం వల్ల.

ఈ మొత్తం వృత్తాంతం పరిశీలిస్తే, విదురుడికి స్పష్టంగా ధర్మం ఏమిటో తెలుసని, శకునేమో ధర్మరాజు తనను తాను ఒడ్డి ఓడిన తరువాత నాలుక కరుచుకున్నంత పని చేశాడని (ధర్మరాజు దగ్గర ద్రౌపది రూపంలో ధనం ఉండగానే తనను తాను ఓడిపోయాడుగా, అందుకని), స్త్రీధనం అంటే కొంతమంది ఉద్దేశ్యంలో స్త్రీ రూపంలో ఉన్న ధనం అని, స్త్రీ ఒకరికి అధీనురాలని ఆమెకు స్వతంత్రమైన ఉనికి (independent existence) లేదని సభలో వ్యక్తమైన అభిప్రాయాలు, మనకి అర్థమవుతాయి. స్త్రీని ధనంగా చూడకూడదు, స్త్రీ దాసియైనా కూడా జూదరి గృహాల్లో ఆమెను ఎవరూ పందెం ఒడ్డరు అన్న అభిప్రాయం కూడా వ్యక్తమయ్యింది. ధర్మరాజు మౌనానికి అర్థం యజమానికి వ్యతిరేకంగా దాసుడికి (slave) మాట్లాడే స్వతంత్రం లేదని.

విదురుడు చెప్పిన తీర్పుని ఇప్పటి న్యాయశాస్త్రం ప్రకారం ఆలోచిస్తే విషయం చాలా బాగా అర్థం అవుతుంది. మన 1872 కాంట్రాక్టు చట్టం (Indian Contract Act, 1872) ప్రకారం అనుచిత ఒత్తిడిలో (undue influence) చేసుకున్న కాంట్రాక్టులు చెల్లవు. ఆ చట్టంలోని 16వ సెక్షనులో

కాంట్రాక్టులలో అనుచితమైన ఒత్తిడి గురించి చెప్పబడింది. దాని ప్రకారం, కాంట్రాక్టులు కుదుర్చుకొనే రెండు పక్షాలలో ఒక పక్షం వారు రెండో పక్షం వారి ఇచ్ఛ (free will) మీద ప్రాబల్యం కలిగియుండే స్థితిలో ఉండి ఆ స్థితిని అనుచితమైన అనుకూల్యము (undue advantage) పొందడానికి ఉపయోగిస్తే ఆ కాంట్రాక్టు అనుచితమైన ఒత్తిడితో ప్రేరితమైంది అని అంటారు.

దీనికి ఉదాహరణలు చాలా చెప్పవచ్చు. ఒక పోలీసు అధికారి తన కస్టడీలో ఉన్న ముద్దాయి నుండి పది లక్షల రూపాయలు విలువ చేసే ఆస్తిని ఒక లక్ష రూపాయలకే కొంటే ఆ కాంట్రాక్టు చెల్లదు. ఎందుకంటే, ముద్దాయిని లొంగతీసుకొనే స్థితిలో ఆ అధికారి ఉన్నాడు కాబట్టి. అలాగే, ఒక యజమాని తన నౌకరుతో ఉద్యోగం నుండి తొలగిస్తాం అన్న బెదిరింపు మీద చేసుకునే వేరే ఒప్పందం ఏదీ చెల్లదు. అలాగే, వెంటనే ఆపరేషను చెయ్యాల్సిన పరిస్థితిలో ఉన్న రోగికి వైద్యం నిమిత్తం అయ్యే ఖర్చు కోసం హెచ్చు వడ్డీకి డాక్టరే అప్పు ఇస్తే ఆ కాంట్రాక్టు చెల్లదు. ఇవ్వన్నీ చెల్లుబాటు అయ్యేటట్లు చట్టం ఉంటే జరిగే అన్యాయాలు ఊహించడం కష్టం కాదు.

ధర్మరాజు తాను ఓడిన తరువాత దాసుడు (బానిస) ఐపోయాడు. ఆ తరువాత యజమాని తన దాసుడితో వేసే పందెం ఏదైనా చెల్లదు. దాసుడు పందెం వేసినా అది తన ఇష్టంతో వేసినది అవదు. యజమాని ప్రోద్బలంతో వేసినది అవుతుంది. నిజానికి ధర్మరాజు తాను ఓడిన తరువాత శకుని చెబితేనే ద్రౌపదిని పందెంలో ఒడ్డాడు. అందుకని, అసలు ఆ పందెమే చెల్లదు. ఇంకొంచెం లోతుగా పరిశీలిస్తే, అసలు ద్యూతంలో పాల్గొనడమే ధర్మరాజు తన ఇచ్ఛతో చేసినది కాదు. తన పెద్దరికాన్ని అడ్డుపెట్టుకొని ధృతరాష్ట్రుడు ఆయన మీద బలవంతంగా రుద్దిన ఒక బాధ్యత. అందుచేత, ఆసాంతము ద్యూతంలో అనుచితమైన ఒత్తిడి ధర్మరాజు మీద పనిజేసింది. ఆ కోణంలో చూస్తే, పందేలు ఏవీ కూడా చెల్లవు. ఈ విషయాలు విదురుడు మొత్తుకుంటున్నా కూడా సమర్థించకుండా మౌనంగా ఉండో లేక ఇంకేదో చెప్పో తప్పించుకున్న వాళ్ళందరూ భారత యుద్ధంలో దారుణంగా శిక్షించబడ్డారు.

ఏది ఏమైనా, ఉన్నతమైన స్థితిలో ఉండి ఇతరులనీ వాళ్ళతో తమకున్న బంధాలనీ తమకి అనుగుణంగా మలచుకోవాలని చూసే వాళ్ళు ఎన్ని కాలాలలో ఉన్నా వాళ్ళకి ద్రౌపది వేసిన ప్రశ్న ఒక పెద్ద గుణపాఠం.

11. నా కల్పతరువు నా గురువు

[ఈ వ్యాసం సంచిక మాస పత్రిక అనబడే తెలుగులో తొలి డైనమిక్ వెబ్ పత్రికలో (జనవరి 5, 2025) ప్రచురించబడింది. అందుబాటులో ఉన్న లింకు: https://sanchika.com/naa-kalpataruvu-naa-guruvu-mvsr/ . ఈ వ్యాసం సంస్కృతి సంగీత సాహిత్య నృత్య నాటక సంస్థ, గుంటూరు వారు 03-11-2024 వ తేదీన ప్రచురించిన "గురు స్మరణ" అన్న సజ్జాజు శ్రీవేణుగోపాలరావు స్మృతి సంచికలో ఉన్న వ్యాసాల్లో ఒకటి.]

మా గురువు గారైన కీ.శే. శ్రీ చిరువోలు దుర్గాప్రసాదరావు గారు (జీవన కాలము: 1902 - 1983) ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లా మోపిదేవి మండలంలో ఉన్న చిరువోలు గ్రామ నివాసి. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. Jack of all trades and master of many - అన్న నానుడి ఆయనకి చాలా బాగా సరిపోతుంది. ఆయన చదివింది మెట్రిక్ (Matric), ఆ తరువాత టీచర్ ట్రైనింగు (Teacher training) అయినా, స్వయంకృషితో చాలా రంగాలలో జ్ఞానం సముపార్జించారు. దేశకాలమాన పరిస్థితులకి అతీతంగా, ముందు చూపుతో ఆచరణాత్మకంగా ప్రబోధాలిచ్చిన వాళ్ళలో మా గురువు గారొకరు. ఆయన ఎప్పుడూ తన స్వార్థం చూసుకోలేదు. ఏ ప్రలోభాలకీ లొంగకుండా నమ్మింది చెప్పారు, చెప్పింది చేశారు. తన తరమే కాకుండా, ముందు తరాల గురించి కూడా ఆలోచించారు. వివిధ రంగాలలో ఆయన కృషి (contribution) ఎలా జరిగిందీ చెప్పే ప్రయత్నం చేస్తాను.

ప్రసాదరావు గారు నాకు మాతామహులు. మా అమ్మ అనారోగ్య కారణాల వల్ల నేను పుట్టినప్పటి నుండి చిరువోలులో ఆయన దగ్గరే ఉండి పెరిగాను. ఆయనే నా తొలి గురువు. అప్పటికే ఆయన ఒక విశ్రాంత ఉపాధ్యాయుడు. రిటైరు అయిన తరువాత కూడా, ఆయన ఆ వ్యాపకాన్ని కొనసాగించారు. మా గురువు గారు చదువు చెప్పే పద్ధతి చాలా విలక్షణంగా ఉండేది. ఆ వివరాల్లోకి వెళ్ళే ముందు ఒక విషయం చెప్పాలి. నిరక్షరాస్యులు, కూలీలు, బీదవారు ఉన్న కుటుంబాలలో, పిల్లల్ని చదువుకి పంపడం కన్నా పనికి పంపడం ఇష్టపడేవారు. అలాంటి

తల్లిదండ్రుల్ని నయానో భయానో ఒప్పించి, పనితో పాటు చదువు కూడా నేర్పుతాను అని చెప్పి వాళ్ళ పిల్లలని తన దగ్గరకు రప్పించుకునే వారు మా గురువు గారు. పగలు చదువుకోవడం కుదరని పిల్లలకి రాత్రి పూట చదువు చెప్పేవారు. ఆ క్రమంలోనే, చిన్నప్పుడు చదువుకోకుండా పెద్దయిన వాళ్ళకి ఓనమాలు దిద్దించడం నేను చూశాను. ఈ విధంగా, నేను చిరువోలులో ఉన్న కేవలం 14 ఏళ్ళ (1958 - 1972) కాలంలో, మా గ్రామంలోను, చుట్టుపక్కల గ్రామాలలోను, చాలా మందిని మా తాతగారు అక్షరాస్యులను చేశారు.

మా గురువుగారు తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషల్లో ప్రావీణ్యం కలవారు. ప్రతి విద్యార్థికి వివిధ దశల్లో మూడు భాషలు (తెలుగు, ఇంగ్లీషు, హిందీ) నేర్పేవారు. ఓనమాలుతో మొదలు పెట్టించి, చిన్న చిన్న లయబద్ధమైన పదాలు (అల, తల, కల, వల లాంటివి), తరువాత కొంచెం పెద్ద పదాలు, క్రమ పద్ధతిలో నేర్పించేవారు. దాని కోసం ప్రతి ఒక్క విద్యార్థికి ఒక పుస్తకం తానే, ఆ పదాలతోనూ ఒక్కొక్క పదం ప్రక్కన దాన్ని సూచించే బొమ్మ తోనూ, స్వహస్తాలతో తయారు చేసి ఇచ్చేవారు, మా గురువు గారు. మామూలుగా పిల్లలకి మాటలు నేర్చే కాలానికి 100 - 150 పదాలు తెలుస్తాయని అంటారు. వాటిల్లో చుట్టూ ఉన్న వస్తువుల పేర్లు, సంబంధాల పేర్లు (అమ్మ, నాన్న, అక్క, తాత లాంటివి) ఎక్కువగా ఉంటాయి. మా గురువు గారు తయారు చేసిన పుస్తకంలో అలాంటివి, పిల్లలకి అప్పటికే తెలిసిన పదాలు, ఎక్కువగా ఉండేవి. అట్లా చెయ్యడం వల్ల, పిల్లలకి చదువంటే ఆసక్తి చిన్నప్పటి నుండే ఏర్పడేది. ముఖ్యంగా, చదువు రాని తల్లిదండ్రులు ఉన్న కుటుంబాలలో, పిల్లలు ఉత్సాహంగా వాళ్ళు రోజు మాట్లాడుకునే పదాలు వ్రాసి పెద్దలకి చూపించే వారు. అలా, ఆ కుటుంబాల లోనే కాకుండా వాళ్ళ చుట్టుపక్కల కూడా, ఆ పద్ధతి పిల్లల్ని చదివించడానికి ప్రేరణగా (motivation) పని చేసింది. తరువాతి దశలో చిన్న చిన్న వాక్యాలు, కొంచెం వ్యాకరణం నేర్పేవారు. ఆ తర్వాత ఒక్కొక్క పిల్లవాడి శ్రద్ధని బట్టి కవిత్వము, వ్యాసాలు, గ్రంథాలు చదవడం నేర్పేవారు. ఇదే పద్ధతిని, కొంచెం పెద్ద పిల్లలకి ఇంగ్లీషు, హిందీ నేర్పించడానికి కూడా పాటించేవారు. ఈ విధంగా, మూడు భాషలూ నేర్పేవారు.

మాకు మా గురువుగారు, తన పద్ధతి ప్రకారం చెప్పే చదువు కాక ప్రభుత్వం ప్రచురించిన పాఠ్య పుస్తకాలలో ఉన్న విషయాలు కూడా నేర్పేవారు. ఆయన సిలబస్ (syllabus) ప్రకారం

చదుకున్న వాళ్ళకి ఆ పాఠ్య పుస్తకాలలో ఉన్నది నేర్చుకోవడం చాలా తేలికగా ఉండేది. ఎందుకంటే, ఆయన చెప్పే చదువు ఒక ఆకు ఎక్కువ ఉండేది. మా గురువుగారు తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలలో ఒక్కొక్క పదానికి అర్థం చెప్పేటప్పుడు, ఆ పదానికి ఉన్న పర్యాయపదాలు, వాటిని వాక్యాలలో ప్రయోగించే పద్ధతి (usage) చెప్పేవారు. 8-9 ఏళ్ళ వయసులో తెలుగులోనే కాదు ఆంగ్లంలో కూడా చిన్న చిన్న పదాలతో నేను మా నాన్నకి ఉత్తరం వ్రాయ గలిగే వాణ్ణి. కొంచెం పెద్ద పిల్లలకి, భాషకి సాహిత్యానికి ఉన్న అంతరం (difference) వివరించేవారు. పర్యాయపదాలు భాషలో ఉంటాయి కానీ, సాహిత్యంలో ఉండవని చెప్పేవారు. పర్యాయపదాలు అనబడే వాటిల్లో ప్రయోగ పద్ధతుల్లో అంతరం ఉంటుంది, ఆ వివరాలు మహాకవుల, పెద్దల ప్రయోగాల నుండి మీరు పెద్దయిన తరువాత శోధించి తెలుసుకోవాలని చెప్పి, పదాల పరిణామం (evolution) గురించి మాలో ఆలోచనలు రేకెత్తించేవారు.

చదువుకున్న వాళ్ళకి శ్రమపై గౌరవం ఉండడం లేదని గుర్తించిన మా గురువుగారు, పని చేస్తూ చదువు నేర్చుకోవడం అనే పద్ధతిని పాటించేవారు. మా చిన్నప్పటి చదువులో కొంత భాగం పొలంలోనో, పెరట్లోనో, గుడి / బడి ప్రాంగణంలోనో, పనిచేస్తున్నప్పుడు సాగేది. మాకు పని నేర్పుతూ మా గురువుగారు అక్కడే మట్టిలో అక్షరాలు, అంకెలు, లెక్కలు, దూరం కొలవడాలు - ఇలాంటి వన్నీ నేర్పేవారు. ఒకట్లు, పదులు, వందలు - వీటి గురించి చెప్పడానికి చింత గింజలు లెక్కించడం, చిన్న చిన్న సంచులలో పది - పది గింజలు చొప్పున గింజలు పెట్టించి పదులు, వందలు అంటే ఏమిటో చెప్పడం చేసేవారు. కూడికలు, తీసివేతలు కూడా అలాగే నేర్చుకున్నాము. ఎక్కాలు బట్టీ పట్టించడం మా గురువుగారికి ఇష్టం ఉండేది కాదు. మనస్సులోనే మననం చేసుకుంటూ హెచ్చవేతలు, భాగహారాలు చేయడం అభ్యాసం చేయించేవారు. పద్యాలు, గేయాలు వల్లె వేయించడం, మొక్కలు పెంచడం నేర్పించడంతో పాటే సాగేది. ఇలా చెయ్యడం వల్ల శ్రమ అంటే గౌరవం (dignity of labour) మా నరనరాల్లో చిన్నప్పటి నుండే జీర్ణించుకు పోయింది.

వ్యవసాయ పద్ధతులు, నార (తాటినార, జనప నార, గోగు నార) తీయడం, నారతో తాళ్ళు మోకులు పేనడం, చాపలు తడికెలు అల్లడం, మట్టితో ఇంటి గోడలు మెత్తడం, చిన్న చిన్న పాకలు

పందిళ్ళు వెయ్యడం, పశు సంరక్షణ, నీళ్ళలో ఈత కొట్టడం (ముఖ్యంగా మునుగీత), ధాన్యం భద్రపరచడానికి పురి కట్టడం, గడ్డివామి ఏర్పాటు చెయ్యడం, పిడకలు చెయ్యడం, పొలాల్లో జల్లడానికి పేడ ఆకుపొట్టులతో సహజ ఎరువులని తయారు చెయ్యడం, నుయ్యి తవ్వడం, తాపీ పనులు, చిన్న చిన్న వడ్రంగం పనులు, ఒకటేమిటి, పల్లెటూరిలో బ్రతకడానికి కావాల్సిన పనులన్నీ నేర్పేవారు. కులవృత్తులకి అవసరమైన చదువు కూడా నేర్పేవారు. పెద్ద పిల్లలకి చుట్టుకొలత, వైశాల్యం లెక్కలు, దిగుబడిని కొలిచే లెక్కలు (కుంచం, మరకం లాంటివి), వడ్డీ లెక్కలతో పాటు వ్యవసాయానికి సంబంధించిన లెక్కలు, అంటే, ఉదాహరణకి ఎకరానికి ఎన్ని మరకాల గింజలు చల్లించాలి, నారుమడి వేస్తే ఎరువు (సహజ) ఎంత వెయ్యాలి, నీళ్ళు ఎప్పుడెప్పుడు పట్టాలి, వేరే పంటలయితే మొక్కకి మొక్కకి మధ్య ఎంత దూరం ఉంచాలి, నాట్లకి ఇతర వ్యవసాయపు పనులకి ఎకరానికి ఎంతమంది మనుషులని పెట్టాలి, ఇలాంటివి నేర్పేవారు. ఇలా, చదువుతో పాటు, పనులు కూడా నేర్చుకున్నాము.

మరో విచిత్రమైన విషయం చెబుతాను. ఒక పొలం రూపు ఎంత వంకరటింకరగా (irregular shape) ఉన్నా దాని వైశాల్యం ఎలా కొలవాలో మాకు పురికొస, కట్టుకొయ్యల సాయంతో నేర్పేవారు. ఉన్న రూపాన్ని చతురస్రాలుగా (squares), దీర్ఘచతురస్రాలుగా (rectangles), త్రిభుజాలుగా (triangles) విభజించి విడివిడిగా వాటి వైశాల్యాలు గణించి కూడడం వల్ల మొత్తం పొలం వైశాల్యం వస్తుందని మాకు నేర్పారు. పెద్దయిన తర్వాత, బహుశా డిగ్రీ (degree) కోర్సులో (course) అనుకుంటా, న్యూమరికల్ ఎనాలసిస్ (Numerical Analysis) అనే సబ్జెక్ట్ (subject) లో ట్రెపీజాయిడల్ రూల్ (Trapezoidal rule) అనే టాపిక్ (topic) లో ఇదే నేర్పారు.

మా చిన్నప్పుడు, మా గురువుగారు మాతో జ్ఞాపక శక్తి పెంచుకోవడానికి ప్రయోగాలు చేయించేవారు. మాకు చదవడం, వ్రాయడం రాని రోజుల్లోనే, పద్యాలు, శ్లోకాలు, అంటే లయబద్ధంగా ఉండేవి, మాకు చెప్పి మా చేత చెప్పించేవారు. ఒక పెద్ద పళ్ళెంలో రకరకాల వస్తువులు పెట్టి ఒక గుడ్డతో కప్పి ఉంచేవారు. మమ్మల్ని పళ్ళెం ఎదురుగా కూర్చోపెట్టి, ఒక్క సారి గబాల్న ఆ గుడ్డ తీసేసి మళ్ళీ కప్పేవారు. తర్వాత, మమ్మల్ని పళ్ళెంలో ఏ ఏ వస్తువులు చూశామో జాబితా (list) వ్రాయమనేవారు. ఇలా ప్రయోగం రిపీట్ (repeat) చేసేవారు. ఈ

ప్రయోగాల ఫలితంగా, మనం కళ్ళు మూసుకుని కొంచెం ఏకాగ్రత వహిస్తే, అదివరకు చూసిన వస్తువుల్ని, మనుషుల్ని మనోనేత్రంతో చూడవచ్చునని తెలిసింది. ఈ సామర్థ్యం వివిధ వస్తువులని, సంఘటనలని, మనుషులని (గతించిన వారిని కూడా) కళ్ళు మూసుకొని కూడా చూడడానికి పనికొచ్చింది. ముఖ్యంగా చదువుల్లో ఇది చాలా ఉపయోగపడింది.

ఈ విధంగా మాకు మూడు భాషలతో మంచి చదువు, వ్యవసాయము, పశు సంరక్షణ అన్నిటి కన్నా ముఖ్యంగా శ్రమైక జీవన సౌందర్యం అబ్బాయి. ఏ పని చెయ్యడానికైనా సిగ్గు పడకపోవడం, పనుల్లో పెద్ద పని - చిన్న పని అన్న తేడా చూపించక పోవడం, మాకు చిన్నప్పటి నుండే అలవడ్డాయి.

మా గురువు గారు చరిత్ర పాఠం చెప్పేటప్పుడు తన నాటకానుభవం అంతా ఉపయోగించి, పాత్రలు సజీవంగా మన కళ్ళ ఎదుట కదలాడుతున్నట్లే చెప్పేవారు. పురాణ కథలు చాలా ఆసక్తికరంగా క్రొత్త విధంగా చెప్పేవారు. ఆయన వివరణ (interpretation) చాలా భిన్నంగా ఉండేది. కొన్ని ఉదాహరణలు చెబుతాను.

రామాయణంలో శ్రీరాముడు పితృవాక్యాన్ని పాలించాడంటే, ఆయన సొంతం నిజం కాదని చెప్పేవారు. రాముడు అడవికి వెళ్ళే ముందు అసలు దశరథుడు రాముణ్ణి అడవికి పంపాలన్న మాటే మాట్లాడ లేదు. ఎప్పుడో తనకి ఇచ్చిన వరాలని కైక ఆ విధంగా వివరిస్తే (interpret), అది ఎంకి పెళ్ళి సుబ్బి చావు కొచ్చింది అన్నట్లుగా రాముణ్ణి అడవికి పంపాలన్న విషయం బయటి కొచ్చింది. దీని కంతటికీ మూలం దశరథుడు కాబట్టి, ఆ అడవికి పంపడం అనేది పితృవాక్య మయ్యింది. ఇలా చెబుతూ, మా గురువుగారు ఆవేశంగా ఇంకో విషయం, మనస్తత్వానికి సంబంధించినది, చెప్పేవారు. రాముడు అడవికి వెళ్ళే ముందు దశరథుణ్ణి ఏమీ నిందించ లేదు. అంత చిన్న వయస్సున్న తన కొడుకు రాజ్యాధికారాన్ని తృణప్రాయంగా తలచి ఒక్క మాట కూడా తనని అనకుండా అడవికి వెళ్ళడానికి సిద్ధ మయ్యాడు, తాను బహు భార్యలతో రాజ్యం ఏలి సర్వ సౌఖ్యాలు అనుభవించి కూడా ఇంకా కాంక్షలు తీరక పట్టుకు వేళ్ళాడం ఏమిటన్న

సిగ్గుతో తనలో తానే మథనపడి దశరథుడు కన్నుమూశాడు. రాముడు తిట్టి ఉంటే బహుశా దశరథుడు బ్రతికేవాడు అని చెప్పేవారు మా గురువుగారు.

పురాణాలు ప్రతీకాత్మకం (symbolic) అని చెబుతూ, కొన్ని ఘట్టాలకు చాలా గొప్ప వివరణ ఇచ్చేవారు. నేను ఒకసారి శివుడి వేషధారణ గురించి చాలా వ్యంగ్యంగా మాట్లాడుతూ ఏమిటీ తత్వం అని అడిగాను. దానికి, ఆయన ఎదురుగా ఉన్న ఒక మానసిక రోగిని చూపించి, అతనికి ఉన్న సమస్య అందరికీ సమానంగా తగులుకుంటే ఎట్లా ఉంటుందో ఊహించు, అన్నారు. దాన్ని ఇంకా బాగా అర్థం అయ్యేటట్లు చెప్పారు. సంఘంలో ఉన్న సమస్యలు అందరికీ సమానంగా పంచిపెట్టబడితే ఎవ్వరూ ఎందులోనూ ఔన్నత్యాన్ని సాధించక పోవచ్చు. అలా కాకుండా, ఆ సమస్యలు కొందరికే ఉంటే, మిగిలిన వాళ్ళు ఎక్కువ ప్రగతి సాధించగలరు. అంటే, ఆ కొందరు చేసే పని, శివుడు విషం తాగడం లాంటిది. అవతల మనిషి కష్టాలలో ఉన్నప్పుడు, అంటే ఏదో ఒక వత్తిడి (tension) లో ఉన్నప్పుడు, ఆ వత్తిడిని మీరు ఏదో విధంగా తీసేసుకుంటే, అది శివ తత్త్వాన్ని ఆచరించడంతో సమానం. క్షీరసాగర మథన వృత్తాంతములో విశ్వాన్ని విషం నుండి రక్షించడానికి శివుడు విషం త్రాగాడని చెప్పడం, దీనికే ప్రతీక అని చెప్పారు, మా గురువుగారు. క్షీర సాగర మథనం గురించి ఇంకొక వివరణ ఇచ్చేవారు, వారు. మనం ఏ కార్యం మొదలుపెట్టినా, ముందు వ్యతిరేక ఫలితాలు (విషం) వస్తాయి. నిరాశ పడకుండా, వాటిని సంయమనంతో నిర్వహిస్తే (manage), తరువాత మంచి ఫలితాలు (అమృతం) వస్తాయి అని చెప్పేవారు.

మా గురువుగారు చిన్న పిల్లల్ని ఎత్తుకున్నప్పుడు వాళ్ళ పాదాలని తన నుదుటికి అద్దుకునేవారు. అదేమిటి, చిన్నవాళ్ళకి నమస్కారం చేస్తే వాళ్ళకి ఆయుక్షీణం కాదా అని నేను అడిగాను. అప్పుడు, వామనావతార ఘట్టంతో దాన్ని అనుసంధించి నాకు వివరణ ఇచ్చారు. పెద్దవాళ్ళు ఏ స్థితిలో ఆలోచించడం మానేస్తారో చిన్న వాళ్ళు ఆ స్థితి నుండి ఆలోచించడం మొదలు పెడతారు. అది తెలిసిన పెద్ద వాళ్ళు చిన్న వాళ్ళని తక్కువగా చూడడం, వాళ్ళ ముందు తమ అహంకారం ప్రదర్శించడం, చేయరు. అది తెలియని బలిచక్రవర్తి లాంటి పెద్ద వాళ్ళని తరువాతి తరానికి చెందిన వామనుడి లాంటి వాళ్ళు పాతాళానికి తొక్కుతారు, అంటే, వాళ్ళ అహంకారాన్ని పోగొడతారు. నా తరువాతి తరం వాళ్ళు నాకన్నా బాగా ఆలోచించడం

నేర్చుకుంటే వాళ్ళ ముందు నా అహంకారం వదిలి పెట్టడానికి నేను సిద్ధం, చిన్న పిల్లలలో నేను వామనుణ్ణి చూస్తాను, అని మా గురువుగారు చెప్పేవారు.

అందరితో పాటు చెప్పే చదువు కాక, నా కున్న శ్రద్ధను గుర్తించి మా గురువుగారు నాకు భగవద్గీత, మంత్రపుష్పం లాంటివి బట్టీ పట్టించేవారు. నాకు భగవద్గీత గురుకులం పద్ధతిలో నేర్పారు. అంటే, ఇవాళ ఒక శ్లోకం నేర్పాలంటే నిన్న నేర్పిన శ్లోకం అప్పచెప్పాలి. మర్నాడు ఇంకో శ్లోకం నేర్పాలంటే, మొన్న నేర్పినది నిన్న నేర్పినది అప్పజెప్పాలి. ఈ విధంగా సాగేది నా శిక్షణ. అలా, ఒక అధ్యాయంలోని ఆఖరి శ్లోకం చెప్పిన మర్నాడు ఆ అధ్యాయంలో ఉన్న అన్ని శ్లోకాలు అప్పచెప్పాల్సి వచ్చేది. ఈ అభ్యాసం నా జ్ఞాపక శక్తి పెంపుదలకి చాలా ఉపయోగపడింది.

భగవద్గీత శ్లోకాలకి మా గురువుగారు చెప్పే వ్యాఖ్యానం చాలా వివరంగా భిన్నంగా ఉండేది. ఉదాహరణకి, ఆయనకి "యద్యదాచరతి శ్రేష్ఠః, తత్తదేవేతరో జనః, స యత్ప్రమాణం కురుతే, లోకస్తదనువర్తతే" అన్న శ్లోకం చాలా ఇష్టం. జీవితంలోను, సంఘంలోను ఉన్నతమైన స్థానంలో ఉన్న వాళ్ళు (శ్రేష్ఠులు) ఏ విధంగా నడుచుకుంటారో, మిగిలిన వాళ్ళు దాన్ని ఒక ప్రమాణంగా స్వీకరించి, ఆ విధంగా నడుచుకోవాలని చూస్తారు, అని దీని కర్థం. ఇలాంటి వ్యవస్థ ఒక రకంగా శ్రేష్ఠులుగా చూడబడే వాళ్ళకి అలాంటి స్థానంలో (position) ఉన్న వాళ్ళకి హెచ్చరిక, అని మా గురువు గారు చెప్పేవారు. మనకి తెలియకుండా చాలా కళ్ళు మనని శ్రద్ధగా చూస్తూ ఉంటాయి. అంటే, మనం మన పై తరం (generation) వాళ్ళ నుండి, మన నుండి మన తరువాతి తరం వాళ్ళు ఎప్పుడూ నేర్చుకోవాలని చూస్తారు. అందుచేతనే, మనకి మన పై తరం వాళ్ళ కన్నా మన తరువాతి తరం వాళ్ళు ముఖ్యం. అలా, అడుగడుగునా ఎవరో ఒకరు మనని అనుసరించాలని చూస్తారు కనుక, మనం చాలా అప్రమత్తంగా (alert) ఉండాలి. ఎప్పటికప్పుడు, మన నడవడి గురించి ఆత్మపరిశీలన (introspection) చేసుకుని తప్పులుంటే దిద్దుకోవాలి. మన తరువాతి తరం వాళ్ళు మన నుండి ఏమీ చెడు నేర్చుకోకుండా జాగ్రత్త పడాలి. వివిధ సందర్భాలలో మనం నడుచుకునే తీరు, ఆయా సందర్భాలలో మన ప్రవర్తన (behaviour), మన తరువాతి తరం వాళ్ళకి ఆదర్శంగా ఉండాలి. మనం తప్పుగా ప్రవర్తించినా, మాట్లాడాల్సిన

విషయాల్లో మౌనం వహించినా, కర్ణుడు భీష్ముడు ద్రోణుడు లాంటి వాళ్ళకి పడినట్లు శిక్ష పడుతుంది అని చెప్పేవారు మా గురువు గారు.

మా గురువుగారు కావ్యాలలో ఉన్న మంచి మంచి పద్యాలు వ్యాఖ్యాన సహితంగా మాకు చెప్పేవారు. ఉదాహరణకి, ఆయనకి ఆంధ్ర మహాభారతం లోని "ఒరు లేయవి యొనరించిన ..." అన్న పద్యము, "సారపు ధర్మముస్ విమల సత్యము ..." అన్న పద్యము చాలా ఇష్టం. ఇతరులు మీకు ఏం చేస్తే, మీ పట్ల ఎలా ప్రవర్తిస్తే మీకు నచ్చదో, ఆ పని గాని ఆ ప్రవర్తన గాని ఇతరుల నుద్దేశించి మీరు చెయ్యకుండా ఉండడమే సత్ప్రవర్తన (ethics, good manners), మీకు మీ ప్రవర్తన మీద ఎప్పుడు సందేహం వచ్చినా, ఈ standard apply చేసుకుని చూడండి, అని చెప్పేవారు మా గురువుగారు. అన్యాయాన్ని ఎదిరించడంలో ఎప్పుడూ వెనకంజ వేయవద్దని "సారపు ధర్మముస్ ..." అన్న పద్యం సారాంశాన్ని బోధించేవారు.

జాతకాలు, దోషాలు, పరిష్కారాలు అన్న విషయం గురించి చెప్పేటప్పుడు, పురాణ కథలలోని ఉదాహరణలతో అవి అనవసరం అని చెప్పేవారు. బోలెడు వరాలు పొంది విర్ర వీగిన వాళ్ళకి ఏ గతి పట్టిందీ తెలుసుకోండి, జరగ వలసిన వాటికి ఏదో పరిష్కారం ఎవరో చెప్పినంత మాత్రాన ఏమీ ఒరగదు అని చెప్పేవారు. "కష్టే ఫలి" అన్న దొక్కటే నమ్ముకోమని అనేవారు.

మా గురువుగారు మంచి కవి. నేను పుట్టక ముందు, వారు కామేశ్వరీ శతకం రచించారు. తరువాత కూడా కొన్ని శతకాలు రచించారు. నేను చదువుకునే రోజుల్లో కూడా ఆయన అప్పుడప్పుడు పద్యకవిత్వం చెప్పేవారు. సామాజిక సమస్యల మీద, విభిన్న రంగాలలో జరుగుతున్న అవకతవకలను గురించి పద్యాలు, శతకాల రూపంలో, అంటే ఆత్మాశ్రయ కవిత్వము ఎక్కువగా చెప్పేవారు. నిజాన్ని నిర్భయంగా చెప్పడం, అన్యాయాన్ని ఎదిరించడం మామూలుగా మాట్లాడేటప్పుడే కాకుండా పద్యాలలో కూడా చేసేవారు. ఆయన ఆశువుగా పద్యాలు చెబుతుంటే, నేను డిక్టేషన్ (dictation) వ్రాసేవాడిని. పద్యం వ్రాసేటప్పుడు ఛందస్సు సరిగ్గా ఉందో లేదో చూసుకుని, సరిగ్గా లేకపోతే ఆయనకి చెప్పాలి. ఆ క్రమంలో, ప్రతి వృత్తానికి ఉండే లయ (rhythm) నాకు నేర్పారు. ఒక పద్యం చెప్పేటప్పుడు, గణ విభజన చేస్తూ

కూర్చోకుండా, లయకి అనుగుణంగా ట్యూన్ (tune)ని అనుసరిస్తూ పదాలు వెయ్యడం, యతిస్థానం దగ్గర ఆటోమాటిక్ (automatic) గా ఆపి యతి వేసుకోవడం నాకు నేర్పారు. ఈ విధంగా, నాకు పద్య నిర్మాణం, సాహిత్యాభిలాష అబ్బాయి. ఇప్పటికీ, ఆ శిక్షణే (training) నా చేత పద్యాలు వ్రాయిస్తోంది.

మా గురువుగారికి నాటకానుభవం ఉంది. రాగయుక్తంగా పద్యాలు పాడడం వారికి వచ్చు. గయోపాఖ్యానం లోని "ధరణీ గర్భము దూరు గాక" అన్న పద్యం వారు పాడుతుంటే చాలా శ్రావ్యంగాను, గంభీరంగాను, ప్రక్క ఊరికి వినబడే అంత బిగ్గరగాను ఉండేది. ఆయనకి ఈలపాట రఘురామయ్య గారంటే చాలా ఇష్టం. వారు పద్యం ఆలాపించే పద్ధతి, once more అని ప్రేక్షకు లడిగితే రాగం మార్చి పద్యం ఎలా పాడేవారో మాకు పాడి వినిపించే వారు, మా గురువుగారు. గుడివాడలోని గురురాజు హోమియో కళాశాల స్థాపకులలో (founders) మా గురువు గారు ఒకరు. దానికి కావలసిన ధనం కోసం, "కన్యాశుల్కం" నాటకం వేశారు. అందులో మధురవాణి పాత్రని స్థానం నరసింహారావుగారు, అగ్నిహోత్రావధానులు పాత్రని మా గురువు గారు వేశారు. మా గురువు గారికి రాగతాళ జ్ఞానం ఉన్నాయి. కొన్ని కీర్తనలు స్వయంగా రచించి, వాటికి సంగీతం సమకూర్చి, భజనలుగా గుళ్ళో తాను పాడి మా చేత పాడించేవారు. అవి కాక, రామదాసు కీర్తనలు, త్యాగరాజ కీర్తనలు, తరంగాలు కూడా గుళ్ళో ఆయనతో పాటు మేము కూడా పాడే వాళ్ళం. ఆ విధంగా మాకు కొంచెం భక్తి, కొంచెం సంగీతం, కొంచెం లయజ్ఞానం, అన్నిటికీ మించి సామూహిక కార్యక్రమాలలో పాల్గొనే ఉత్సాహం, అబ్బాయి.

మా గురువుగారు మంచి హోమియో వైద్యుడు. చిన్న చిన్న దెబ్బలకి కట్టుకట్టడం, సామాన్య ఆరోగ్య సమస్యలకి ఏ మందులు వాడాలో నాకు నేర్పారు. చిరువోలులోను, ఆ చుట్టుపక్కల గ్రామాలలోను ఉన్న జనాలకి దాదాపుగా ఉచిత వైద్యం చేసేవారు. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలకి ఆరోగ్య సమస్యలకి మంచి వైద్యం చేసేవారని బాగా ప్రసిద్ధి. ఆయన సేవాభావం, రోగులపై ఆయన చూపించే కరుణ, ఓర్పు నాకు చాలా పాఠాలు నేర్పింది.

క్రొత్త విషయాలు, క్రొత్త భాషలు నేర్చుకోవడం మీద ఆయన కున్న జిజ్ఞాస మాకు అనుసరించదగినది. ఆయన తన స్వయం కృషితో నేర్చుకున్న తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషలు, హోమియో వైద్యము, కొంచెం సంగీతం, కొంచెం తాళ జ్ఞానంతో పాటు, వయసు మీరిన తరువాత రష్యను, ఫ్రెంచ్ భాషలు నేర్చుకున్నారు. ఆయన చదివింది మెట్రిక్ అయినా, ఆయన మాట్లాడే ఇంగ్లీషు భాష చాలా పై స్థాయిలో ఉండేది. BA, MA విద్యార్థులకి కూడా ఇంగ్లీషు బోధించగలిగే స్థాయిలో వారి జ్ఞానం ఉండేది. నేను దాని వల్ల చాలా లాభం పొందాను.

మా గురువు గారు సామాజిక బాధ్యతలని (social responsibility) నిర్వహించే పద్ధతి వాటిల్లో పాలుపంచుకోవడానికి మాకు అవకాశం కలిగించిన తీరు చాలా ముఖ్యమైనది. సంఘానికి పనికొచ్చే పనులు చెయ్యడంలో మా గురువుగారు ఎప్పుడూ ముందుండేవారు. చిరువోలు గ్రామంలో ఒక గుడి, ఒక బడి కట్టించారు. వాటి నిర్మాణంలో తన విద్యార్థులు పాల్గొనేటట్లుగా చేశారు. బడిలో పిల్లలు కూర్చోడానికి నేల బల్లలు (పొడుగాటి పీటలు), మాష్టారికి కుర్చీ, మేజా (table) ఆ రోజుల్లో విద్యార్థులే తయారు చేశారు. అప్పటి నేల బల్లలు ఇప్పటికీ వాడుతున్నారు ఆ బడిలో.

గుడిలో మొక్కలు పెంచడం, కొబ్బరి మొక్కలకి ప్రత్యేక సేవ (అంటే, ప్రతి ఆదివారం ఒక్కొక్క మొక్కకి పెద్దగా పాదు తవ్వి అందులో రక్కెస తాటాకులు కొట్టి వెయ్యడం, మొవ్వులో కప్పలు రాకుండా ఉప్పు మూట పెట్టడం, వంద కడవలు నీళ్ళు పొయ్యడం) చేసే వాళ్ళం. వేసం కాలంలో చెరువులోను పంట కాలువలోను పూడిక తీయించే వారు. తొలకరి వాన మొదలయితే, ఇద్దరిద్దరు పిల్లలని జట్లుగా చేసి, కంచెలలోనూ, ఇవతలా ఒకడు పలుగుతో గాత వెయ్యడం రెండవ వాడు గింజలు పాతడం, చేయించేవారు. కంచెల్లో కర్రతుమ్మ (poor man's fuel) విత్తనాలు నాటించేవారు. వానలో తడవాలన్న మా ఇష్టాన్ని ఈ విధంగా పనికొచ్చేటట్లుగా చేసేవారు, మా గురువు గారు.

సంఘానికి మనం చేసింది చేయంది ఏమిటని ఆలోచించక పోగా వేరే వాళ్ళ తప్పొప్పులు ఎంచడం, మన వరకు మనం ఏం చేసినా అది సబబే అనుకోవడం, అందులో అవినీతి ఉన్నా అది

పరిస్థితుల ప్రభావం అని సరిపెట్టుకోవడం, అంతకు మించి ఎవరైనా చేస్తే అది మాత్రమే తప్పనడం - ఇలాంటి వన్నీ నిశితంగా ఖండించేవారు మా గురువుగారు. చేసే ప్రతి పనీ మన సంఘానికి, ముఖ్యంగా ముందు తరాల వారికి, పనికొస్తుందా అని చూడడం, అన్ని విషయాలలో క్రమశిక్షణ పాటించడం చాలా ముఖ్యమని చెప్పేవారు. సాంఘిక జీవనం లోను లక్ష్యం నిర్దేశించుకోవడం లోను సప్త సంతానాల ప్రాశస్త్యం గురించి చెప్పేవారు మా గురువుగారు. ఆ ఏడు సంతానాలు ఏమిటంటే, తమకు పుట్టిన సంతానం, తాము వ్రాసిన కృతి, తాము తవ్వించిన చెరువు, తాము కట్టించిన దేవాలయం మొదలైనవి. మనిషి మరణించిన తర్వాత కూడా బ్రతికి ఉండడానికి ఈ సంతానాలే కారణం. జీవిత గమనంలో సప్త సంతానాల మీద దృష్టిని పెట్టి సాధించడమే సామాజిక బాధ్యతను (social responsibility) నిర్వర్తించడం అవుతుంది, అని చెప్పేవారు మా గురువుగారు.

పండుగలు (శ్రీరామ నవమి, దీపావళి లాంటివి) సామూహికంగా అన్ని కులాల వారు కలిసి గుడి ప్రాంగణంలో జరుపుకునేటట్లు చేశారు మా గురువు గారు. బంతి భోజనాలు కూడా ఉండేవి. దసరా పండగకి మా పిల్ల లందరం కలిసి మా గురువు గారితో ఊరేగింపుగా వెళ్ళే వాళ్ళం. "ధర సింహాసనమై .." మొదలైన పద్యాలు, "... అయ్య వారికి చాలు ఐదు వరహాలు, పిల్ల వాళ్ళకి చాలు పప్పు బెల్లాలు, ..." మొదలైన గేయాలు పాడేవాళ్ళం ఊరేగింపులో. అది వెనుకటి గురుకుల వ్యవస్థ నాటి కాలంలో ఉన్న సామాజిక బాధ్యతను (గురుకులం ఖర్చు సమాజం భరించడం, గురువులు సంపాదన కోసం వేరే మార్గాలు వెతక వలసిన అవసరం కలిగించక పోవడం) గుర్తు చేసేది.

ఊళ్ళో ఏమన్నా తగువు లొస్తే మా గురువుగారిని న్యాయం చెప్పమని పిలిచేవారు. అలాంటి సందర్భాలలో ఒక్కోసారి రెండు పక్షాలలో ఒక పక్షం బంధు వర్గం నుండి ఉండేవారు. అయినా సరే మా గురువు గారు, తన-మన చూసుకోకుండా న్యాయం నిష్పాక్షికంగా నిర్భయంగా చెప్పేవారు. తప్పు చేసిన వాళ్ళని దండించడం కన్నా సంస్కరించాలని ఎక్కువగా చూసేవారు. ఒక సారి మా ఇంట్లో ధాన్యం దొంగతనం జరిగితే, ఆ దొంగలని చాకచక్యంగా పట్టుకొని, వాళ్ళు నిరక్షరాస్యులు

బీద వాళ్ళు అని తెలుసుకొని, వాళ్ళ బ్రతుకు తెరువు కోసం రిక్షాలు కొని ఇచ్చారు. అంతటి కరుణామూర్తి ఆయన.

మా గురువు గారు ఒక స్వాతంత్ర్య సమరయోధుడు. అప్పట్లో కృష్ణా జిల్లాలో జరిగిన స్వాతంత్ర్య పోరాట ఘట్టాలలో వారు పాలుపంచుకున్నారు. జైలు శిక్ష కూడా అనుభవించారు. ఆ సంఘటనలు మాకు పూస గుచ్చినట్లు చెప్పేవారు. స్వాతంత్ర్య సమరయోధులకు ప్రభుత్వం ఇచ్చిన పింఛను (pension), భూమి లాంటి సదుపాయాలేవీ వారు స్వీకరించ లేదు. అంతటి విరాగి ఆయన. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా సామాజిక రాజకీయ సమస్యల మీద తన సూచనలు ప్రధాన మంత్రికి, ముఖ్య మంత్రికి, ప్రాంతీయ స్థాయిలో సంబంధిత అధికారులకి, లిఖితపూర్వకంగా పంపేవారు. వాటిల్లో కొన్ని ఆచరణలో పెట్టబడ్డాయి. ఉదాహరణకి, విద్యార్థుల చేత తాను చేయించే శ్రమ దానం, రాష్ట్రవ్యాప్తంగా సంఘానికి కావలసిన పనులు చేయడానికి అన్ని గ్రామాల్లో ఉన్న ప్రజలు చేస్తే, అందుకు అర్థికపరమైన పాలనాపరమైన ఆసరా ప్రభుత్వం ఇస్తే, చాలా మంచి జరుగుతుందని భావించి ఆ విధంగా అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సూచించారు.

దేశభక్తి అణువణువునా మూర్తీభవించిన మా గురువు గారు, మాకు దేశభక్తి గీతాలు నేర్పడమే కాకుండా, రేడియోలో "వందే మాతరం", "జనగణమన" గీతాలు వినబడితే గౌరవంగా లేచి నిలబడాలని చెప్పేవారు. 1965వ సంవత్సరంలో పాకిస్తానుతో యుద్ధం వచ్చినప్పుడు దేశ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి గారు ఒక పూట పస్తులుండాలని దేశ ప్రజలకి చేసిన విజ్ఞప్తిని తూచా తప్పకుండా మా ఇంట్లో పాటించేటట్లు చూశారు మా గురువు గారు. మా కళ్ళ ఎదురుగా బాల్యంలో జరిగిన ఈ సంఘటనలు మాలో దేశభక్తిని, సంఘం పట్ల బాధ్యతగా ఉండాలన్న సందేశాన్ని నింపాయి.

ఒక మనిషి తనని ధనం, విద్య, ఆస్తి, పొజిషన్ (position) లాంటి విషయాల్లో ఇంకోళ్ళతో పోల్చుకోవడం సరియైన పద్ధతి కాదని, మా గురువుగారు పోటీ (competition) అంటే ఏమిటో చెప్పారు. ఒక మనిషి తన కోసం తనే పెట్టుకున్న కొన్ని విలువలు, ప్రమాణాలు, ధ్యేయాల

ననుసరించి, ప్రతి రోజూ ఆ ముందు రోజు కన్నా మెరుగ్గా ఉండటానికి ఏమేం చేయాలో, అవన్నీ చేయాలి. ఇలా చేస్తూ ఉన్న పక్షంలో కొన్ని కొన్ని సార్లు, మొన్నటి తన కన్నా నిన్నటి తాను ఓటమి పాలు అవచ్చు. కొంచెం కటువుగా చెప్పాలంటే, తన దృష్టిలో తానే దిగజారడం, జరగచ్చు. దాన్ని పట్టించుకోకుండా, నిన్నటి తన కన్నా ఇవాల్టి తనని సరియైన దారిలో పెట్టడం ఎలాగ అన్న దాని మీద దృష్టి పెట్టాలి. ఎప్పటికప్పుడు, మొన్న- నిన్నల మధ్యన జరిగిన పోటీ మర్చిపోయి, నిన్న- ఇవాళల మధ్య ఉన్న పోటీలో గెలవడానికి ప్రయత్నించాలి. ఇదే నిజమైన కాంపిటీషను అని మా గురువుగారు చెప్పేవారు.

నేను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (Union Public Service Commssion) నిర్వహించిన ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ (Indian Statistical Service) 1982 పరీక్షలో దేశ స్థాయిలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సంపాదించి సర్వీసులో చేరిన తరువాత, నవంబరు 1982లో ఆఖరి సారిగా వారు నాకు వ్రాసిన ఉత్తరంలో నాకు బోధించిన దాన్లో ఒక చిన్న భాగం క్రింద ఇస్తున్నాను:

“Stand like a mighty rock facing all tough and rough weather, making your way boldly through the path of life. Uphold and bring success to the needy, kicking the greedy in its face. I think you will not hesitate nor be afraid of putting down the culprit even though he may belong to higher cadre and treat kindly and tenderly the weaknesses of subordinates, but only with a severe threatening (warning).”

నా లాంటి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అవ్యాజమైన ప్రేమతో అంకిత భావంతో అవిరళ కృషి చేసి మా జీవితాల మీద చెరగని ముద్ర వేసిన మా గురువు గారికి, వారు నేర్పిన విద్యతోనే అక్షరాక్షతలు క్రింది పద్యాలతో సమర్పిస్తున్నాను (ఈ పద్యాలు "నా కవితా ఖండికలు" అన్న నా నాల్గవ ఈ-బుక్ లో "గురువులు" అన్న శీర్షికలో వేరే పద్యాలతో పాటు ఇచ్చాను. పునరుక్తి అయినా కూడా ఇక్కడ కూడా ఇవ్వడం ఉచితమని మళ్ళీ ఇస్తున్నాను.):

ఉ. విద్యలు నేర్పి శిష్యులను విజ్ఞులఁ జేయుటె వృత్తి, హోమియో
వైద్యముఁ జేసి బీదలకు బాధలు తీర్చుటె సేవ, ధాటిగా
పద్యము లందు వ్యాసముల భాషణలం దవినీతి నేకుటల్,
సేద్యము, దైవభక్తి, కడు చిత్రపు భాష్యములన్ పురాణముల్
హృద్యముగా వచించుటయు, రేవగలున్ జన భవ్యమే జపం
బుద్యమమై తలిర్చిన గురూత్తముడున్, బహు త్యాగశీలి, సౌ
హృద్యము రూపుగొన్న ఘనుడే చిరువోలు ప్రసాదరావగున్.

(విజ్ఞులు = సమర్థులు, ధాటిగా = నిర్ణయాత్మకంగా, భాషణ = మాటాడుట, ఏకుట = నిందించుట, సేద్యము = వ్యవసాయము, చిత్రపు = మనోహరమైన, భాష్యము = వ్యాఖ్యానము, హృద్యముగా = మనస్సున కింపుగా, వచించు = చెప్పు, రేవగలు = అహూరాత్రము, భవ్యము = శ్రేయము, జపము = మంత్రావృత్తి, ఉద్యమము = ప్రయాసము, తలిర్చు = అతిశయించు, ఉత్తముడు = శ్రేష్ఠుడు, సౌహృద్యము = స్నేహము, రూపుగొన్న = మూర్తీభవించిన)

అన్ని రకాల చదువులు నేర్పి శిష్యులను సమర్థులుగా చేయడమే వృత్తిగా, హోమియో వైద్యము చేసి పేదవాళ్ళ బాధలు తీర్చడమే సేవగా, తన పద్యాలలో, వ్యాసాలలో, మాటలలో ధాటిగా అవినీతిని తూర్పారబట్టడం, వ్యవసాయము, దైవభక్తి, పురాణాలకి అతి మనోహరమైన వ్యాఖ్యానము చెప్పడం, అహోరాత్రము జనశ్రేయస్సే జపంగా, ఉద్యమంగా విలసిల్లిన గురూత్తముడు, గొప్ప త్యాగశీలి, స్నేహము మూర్తీభవించిన మహనీయుడే, మా గురువుగారైన కీర్తిశేషులు శ్రీ చిరువోలు దుర్గాప్రసాదరావు గారవుతారు.

కం. తన వారని పెర వారని
మనమున భేదంబు లేక మసలిన మహితా
త్ముని నా గురువును మదిఁ దల
తు నెపుడు, యహమును మమత్వ ధోరణి వీడన్.

(పెర వారు = అన్యులు, మసలిన = నడయాడిన, మహితాత్ముడు = గొప్ప మనస్సు కలవాడు, అహము = అహంకారము, మమత్వ = 'నాది' అను భావము, ధోరణి = పద్ధతి, వీడస్ = విడుచుటకు)

అహంకారాన్ని, మమత్వాన్ని విడిచిపెట్టడానికి, తనవారు, అన్యులు అన్న భేదం మనస్సులో లేకుండా నడయాడిన నా గురువును ఎప్పుడూ మనసులో తలుచుకుంటాను.

సీ. అన్యాయ మన్నది యణు మాత్రమైనను
యెదురు బెదురు లేక యెగయు చేయి
పాండితీ విభవమ్ము పక్కదోవలుఁ బట్ట
కంటకమ్ములఁ దుంచిఁ గాచు చేయి
సత్కార్యములుఁ జేయు సన్మార్గు లందర
నొక తాటిపైఁ దెచ్చి యొడియు చేయి
భిన్నత్వమందు నభేదమ్ము కలదంచు
సమతా నినాదంబు సలుపు చేయి

తే. గీ. నాకు మార్గదర్శకముగ, నాకు నండ
దండ, నాకు నన్ని విధాల ధైర్య మొసగి
తీర్చి దిద్దిన ఘనమైన తీరుఁ జూడ
గుర్తు కొచ్చెను యదియె నా గురువు చేయి.

(ఎగయు = పైకిలేచు; విభవము = సంపద; కంటకము = ముల్లు, విరుద్ధము, తప్పు; కాచు = రక్షించు; ఒడియు = ఆకర్షించు, లాగు, పట్టుకొను; భిన్నత్వము = భేదము, నానాత్వము; అభేదము = భేదములేమి, ఏకీభావము; సమత = సమత్వము; నినాదము = ఏదేని ఒక

కార్యసాధనకై చేయు అఱపు; సలుపు = చేయు; మార్గదర్శకము = దారి చూపునది; అండదండ = దిక్కు, ప్రాపు, సహాయము; తీర్చిదిద్దు = సవరించు, చక్కగా నుంచు)

అన్యాయం కొంచెమైనా ఎదురు బెదురు లేకుండా పైకి లేచే చేయి, పాండిత్య సంపద పనికిరాకుండా పక్కదోవలు పట్టినప్పుడు ఆటంకంగా వున్న ముళ్ళు తొలగించి రక్షించే చేయి, మంచి పనులు చేస్తూ మంచి మార్గంలో నడిచే వాళ్ళని ఒకే తాటి పైకి తెచ్చే చేయి, భిన్నత్వంలో ఏకత్వమున్నదను సమతా నినాదాన్ని చేసే చేయి, నాకు దారి చూపుచు, నాకు అండదండ, నాకు అన్ని విధాల ధైర్య మిచ్చి తీర్చిదిద్దిన ఆ గొప్ప తీరు చూస్తుంటే నా గురువు చేయి గుర్తుకొచ్చింది.

కం. భగవద్గీతా పఠనము
సుగమంబుగ స్మరణ పెంచు సొబగగు కవితల్
జగతికి చెందిన జ్ఞానము
ఒగి బోధనఁ జేసి నట్టి యొజ్జకు ప్రణతుల్.

(సుగమము = సులభము, స్మరణ = జ్ఞాపకము, సొబగు = సౌందర్యము, ఒగి = యథాక్రమముగా)

భగవద్గీత చదవడం, తేలికగా జ్ఞాపకశక్తిని పెంచే అందమైన కవిత్వం, లోకజ్ఞానము యథాక్రమముగా బోధించిన గురువుకు నమస్కారాలు.

12. నా చిన్నప్పటి జ్ఞాపకాలు కొన్ని

తెలుగు మాష్టారి హాస్యం:

మా తెలుగు మాష్టారు దిట్టకవి లక్ష్మణరావు గారు చాలా హాస్యప్రియులు. ఆయన పైకి గంభీరంగా ఉంటూ సునిశితమైన హాస్యం పలికించేవారు. ఆయన చెప్పే మాటలకి కడుపు పగిలేటట్లు నవ్వేవాళ్ళం. ఒక ఉదాహరణ చెబుతాను.

మేము చదుకునే రోజుల్లో ప్రతి సబ్జెక్ట్ (subject) కి ప్రశ్నలు సమాధానాలు ఉండే గైడ్లు (Guides) ఉండేవి. మా దిట్టకవిగారికి గైడ్లు చదివే వాళ్ళంటే చాలా మంట. అది ఎలా చెప్పేవాళ్ళో చూద్దాం. తెలుగుకి ఫైవ్ పండిట్స్ గైడ్ (Five Pandits Guide) ఉండేది. అది అందరం చదివి పరీక్షలో సమాధానాలు రాసేవాళ్ళం. ఉపమాలంకారానికి ఉదాహరణగా 'అమె ముఖము చంద్రబింబము వలె మనోహరముగా నున్నది' అని గైడ్లో ఉంది. అందరం పరీక్షలో అదే రాసేవాళ్ళం. ఇక గురువుగారి రియాక్షను (reaction). 'ఏరా! అందరికీ ఒకలాగే కనపడిందిరా, దాని మొహం. ఏం, కుడప్పిడక వలె అసహ్యముగా ఉన్నది, అని రాయచ్చుగా, ఒక్కడన్నా.' అనే వాళ్ళు.

కుమ్మరి చక్రం:

మా మోపిదేవి స్కూలు (school) భవనంలో హెడ్మాష్టారి (Headmaster) రూము (room) మొదట్లోనే ఉంది. ఆ రూముకి వెనకాల ఒక సందు ఉండేది. ఇప్పుడు అది మూసేశారు. ఆ సందు మొగలో ఒక కుమ్మరి కుండలు చేస్తూ ఉండేవాడు. అది, ఆ రోజుల్లో నాకొక వింత. ఎందుకంటే, మావూళ్ళో, అంటే చిరువోలులో, ఎవరూ కుండలు చేసేవారుకారు. ఆ కుమ్మరి, చక్రంమీద మట్టిసుద్దపేసి చక్రం తిరుగుతుండగా, ఆ ముద్దకి, చేతులతో నీళ్ళు జల్లుతూ, ఒక చక్కనిరూపం ఇచ్చేవాడు. ఆ చక్రం తిప్పి మధ్యలో అతను అటూ ఇటూ వెళుతూ ఉండేవాడు. అదే సందని, మేము మట్టిముద్దకి చేతులు తగిలించి ఏదో చేద్దామని ట్రై (try) చేసేవాళ్ళం. అది అతను చూసి

కర్ర పుచ్చుకుని వెంటబడేవాడు. పెద్దయిన తర్వాత తెలినదేమంటే, కుమ్మరి చక్రం క్రీ.పూ. 4000 సంవత్సరాల క్రితం కనుక్కున్నారనీ, చక్రం ఆవిష్కరణ చరిత్ర గమనాన్ని మార్చివేసిందనీ.

శతక వీరుడు:

మేము మోపిదేవిలో మా స్కూలుకి వెళ్ళాలంటే పున్నయ్య (పుల్లయ్య) గారి దుకాణం మీదుగా వెళ్ళాల్సిందే. ఆ దుకాణం పక్క సందులో ఒక పెద్దాయన ఉండేవాడు. ఆయన పేరు ఏమిటో తెలియదు. బాగా బక్కపల్చగా పొడుగ్గా ఉండేవాడు. నేను చెప్పబోయే సంఘటన నాటికి ఆయన వయస్సు 90 సంవత్సరాల పైనే ఉండేది. ఆయనికి మా స్కూలు పిల్లలలో 'లేత బొవికలాడు' అని ఒక మారుపేరు అంటే నిక్ నేం (nick name), బహుశా మా సీనియర్లు పెట్టి ఉంటారు, ఉండేది. రోజూ స్కూలికి వెళ్ళేడప్పుడు పున్నయ్య గారి దుకాణం పరిసరాల్లో ఆయన్ని చూస్తూ ఉండేవాళ్ళం. ఒక రోజు హఠాత్తుగా ఆయన ఉలుకూ పలుకూ లేకుండా ఉంటే, పోయాడనుకుని ఆయన బంధువులు, ఆ పక్కవాళ్ళు, పాడె మీద పడుకోబెట్టి శ్మశానానికి తీసుకెళ్ళారు. అక్కడ మామూలు తంతులన్నీ అయిన తర్వాత కాటికాపరి శవం మీద కట్టెలు పేరుస్తూ ఉండంగా 'ఎవర్రా అదీ' అన్న మాట వినబడింది. అంతే. కాటికాపరితో సహా అక్కడ ఉన్న వాళ్ళంతా భయమేసి, పరుగో పరుగు. అలా మెలకువ తెచ్చుకున్న ఆయన్ని, మొత్తానికి ఇంటికి తీసుకొచ్చారు. అప్పటి నుండి, ఆయన ఇంకో పదేళ్ళు పైగా బతికి సెంచరీ (century), అంటే వంద సంవత్సరాలు, పూర్తిచేసి పోయాడు. ఆ తర్వాత, మా వేపు ఇలాంటి శతక వీరుల గురించి, అంటే 100 ఏళ్ళు బతికిన వాళ్ళ గురించి, చెప్పుకోగా నేను వినలేదు.

గట్టి జీడెలు:

మా మోపిదేవి హైస్కూలుకి చిరువోలులోని మా తాతగారి ఇంటికి మధ్య రెండు మూడు దారులు ఉన్నాయి. వాటిలో ఒక దారిలో కరగట్టు తగిలేది. మోపిదేవిలో, ఆ కరగట్టు ఎక్కే చోట ఒక తుమ్మ చెట్టు ఉండేది. ఇప్పుడు ఉందో లేదో తెలియదు. ఆ చెట్టుకి ఒక పొడుగాటి మేకు కొట్టబడి ఉండేది. అక్కడ మిఠాయి రాఘవయ్య అనబడే ఒకాయన జీడెలు తయారు చేసేవాడు. బాగా

ముదరపాకం పట్టి జీడెల పిండి దానిలో వేసి పొడుగ్గా చుట్టలాగా చుట్టి ఆ మేకుకి పట్టిచ్చి సన్నగా తీగ లాగా రావడానికి లాగుతూ ఉండేవాడు. లాగి మళ్ళీ ముద్ద చేసి మళ్ళీ లాగుతూ అది చక్కగా నిగనిగలాడుతూ బాగా సన్నగా గట్టిగా (కాదు ఘట్టిగా) అయిన తర్వాత తీసి దాన్ని ముక్కలుగా చేసి ఎండబెట్టి అమ్మేవాడు. ఆయన తయారు చేయడం అంతా ఇంటికి వెళ్ళే దారిలో కరగట్టు దగ్గర నిలబడిపోయి వింతగా చూసేవాళ్ళం. ఆ జీడెలు ఎంత గట్టిగా వుండేవంటే కొరకటానికి వీలయేది కాదు. ఒక జీడి బుగ్గన వేసుకుంటే చాలాసేపు వచ్చేది. అవి నాకు చాలా ఇష్టం. అలాంటి జీడెలు మళ్ళీ నాకెక్కడా దొరకలేదు.

13. నా చిన్నప్పటి విద్యాభ్యాసము

మా ఊరు, చిరువోలులో, మా తాతగారు కీ.శే. శ్రీ చిరువోలు దుర్గాప్రసాదరావు గారు స్థాపించిన ప్రాథమిక పాఠశాల (Elementary School) ఉంది. ఆ పాఠశాలలో నేను పుట్టక ముందు కొన్నాళ్ళు పనిచేసి మా తాతగారు పదవీ విరమణ చేశారట. నన్ను కూడా ఆ స్కూలులో చేర్చారు కానీ, అక్కడ వివిధ కారణాల చేత నా చదువు సాగలేదు. అందుచేత, నా ప్రాథమిక విద్యాభ్యాసము అంతా ఇంట్లోనే మా తాతగారి దగ్గర సాగింది. అంటే, నేనొక స్కూలు డ్రాపౌట్ (dropout) ని అన్న మాట.

మా తాతగారి దగ్గర చదువుకోడానికి, మా ఊరి నుండే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా పిల్లలని పంపించేవారు. కొంచెం పెద్ద పిల్లలయితే, ఇంట్లోనే బయట ఔట్ హౌస్ (out-house) లాగా ఉండే పాకలో ఉండి గురుకులంలో లాగా చదువుకునే వారు.

మా ఊరికి చుట్టుపక్కల ఉన్న కుటుంబాలన్నీ, కులమతాలు ఏవయినా గానీ, చాలా వరకు వ్యవసాయ కుటుంబాలే. వాటిల్లో, ఎక్కువగా రైతు కూలీల కుటుంబాలే ఉండేవి. ఆ కుటుంబాలలో చాలా భాగము, పిల్లలకి చదువు చెప్పించాలని అనుకునే వాళ్ళు కారు. అందుకు వాళ్ళకి గట్టి కారణాలు ఉండేవి. ముఖ్యమైన కారణం ఏమిటంటే, పిల్లలకి ఎక్కువగా చదువు ఎలాగూ చెప్పించలేము, చదువులో పెడితే తరువాత పనికి కూడా పనికిరాకుండా పోతారని అనుకోవడమే.

చదువుకున్న వాళ్ళకి శ్రమపై గౌరవం ఉండడం లేదని గుర్తించిన మా గురువుగారు పని చేస్తూ చదువు నేర్చుకోవడం అనే పద్ధతిని పాటించేవారు. పిల్లలని చదువుకోవడానికి పంపని తల్లిదండ్రులను పిలిచి, నా దగ్గరకి పంపితే పిల్లలకి చదువుతో పాటు పని కూడా నేర్పుతానని చెప్పేవారు. వినకపోతే గట్టిగా మందలించేవారు. పగలు చదువుకోవడం కుదరని పిల్లలకి రాత్రి పూట చదువు చెప్పేవారు. ఆ క్రమంలోనే, కొందరు చిన్నప్పుడు చదువుకోకుండా పెద్దయిన

పిల్లలకి ఓనమాలు దిద్దించడం నేను చూశాను. ఈ విధంగా, మా గ్రామంలోను, చుట్టుపక్కల గ్రామాలలోను, చాలా మందిని మా తాతగారు అక్షరాస్యులను చేశారు.

మా తాతగారు చదువు చెప్పే పద్ధతి చాలా విలక్షణమైనది. ప్రతి పిల్లవాడికి వివిధ దశల్లో మూడు భాషలు (తెలుగు, ఇంగ్లీషు, హిందీ) నేర్పేవారు. ముందుగా తెలుగులో అక్షరాలతో మొదలు పెట్టి, చిన్న చిన్న పదాలు, లయబద్ధంగా ప్రాసయుతంగా ఉండే పదాలు (అల, కల వంటివి), చుట్టుపక్కల కనపడే వస్తువులకి సంబంధించిన పదాలు, వాటి బొమ్మలతో సహా ప్రతి పిల్లవాడికి ఒక పుస్తకం స్వహస్తాలతో తయారు చేసి ఇచ్చి, వ్రాయడం చదవడం నేర్పించేవారు. ఆ పుస్తకం ఇప్పుడు మాకు దొరకడం లేదు. తరువాతి దశలో చిన్న చిన్న వాక్యాలు, కొంచెం వ్యాకరణం నేర్పేవారు. ఆ తర్వాత ఒక్కొక్క పిల్లవాడి శ్రద్ధని బట్టి కవిత్వము, వ్యాసాలు, గ్రంథాలు చదవడం నేర్పేవారు. ఇదే పద్ధతిని, కొంచెం పెద్ద పిల్లలకి ఇంగ్లీషు, హిందీ నేర్పించడానికి కూడా పాటించేవారు. ఈ విధంగా, మూడు భాషలూ నేర్పేవారు.

మా తాతగారు గణితం నేర్పే విధానం కూడా చాలా విశిష్టమైనది. పొలాల్లోను మొక్కల పాదులలోను మాతో పనిచేయిస్తూ, మాకు పని నేర్పుతూ మాకు గణితం బోధించేవారు. ఒకట్లు, పదులు, వందలు - వీటి గురించి చెప్పడానికి చింత గింజలు లెక్కించడం, చిన్న చిన్న సంచులలో పది పది గింజలు చొప్పున గింజలు పెట్టించి పదులు, వందలు అంటే ఏమిటో చెప్పడం చేసేవారు. కూడికలు తీసివేతలు కూడా అలాగే నేర్చుకున్నాము. ఎక్కాలు బట్టీ పట్టించడం మా గురువుగారికి ఇష్టం ఉండేది కాదు. మనస్సులోనే మననం చేసుకుంటూ హెచ్చవేతలు, భాగహారాలు చేయడం అభ్యాసం చేయించేవారు.

పెద్దపిల్లలకి చుట్టుకొలత, వైశాల్యం లెక్కలు, వడ్డీ లెక్కలతో పాటు వ్యవసాయానికి సంబంధించిన లెక్కలు, అంటే, ఉదాహరణకి ఎకరానికి ఎన్ని మరకాల గింజలు చల్లించాలి, నారుమడి వేస్తే ఎరువు (సహజ) ఎంత వెయ్యాలి, నీళ్ళు ఎప్పుడెప్పుడు పట్టాలి, వేరే మొక్కలయితే మొక్కకి మొక్కకి మధ్య ఎంత దూరం ఉంచాలి, నాట్లకి, ఇతర వ్యవసాయపు పనులకి ఎకరానికి ఎంతమంది మనుషులని పెట్టాలి, ఇలాంటివి నేర్పేవారు. ఇవే కాక, గోగునార తీయడం, తాళ్ళు

పేనడం, పందిళ్ళు వెయ్యడం, దళ్ళు కట్టడం, పురి కట్టడం, నుయ్యి తవ్వడం, గడ్డివామి కట్టడం, తాపీ పనులు, చిన్న చిన్న వడ్రంగం పనులు, ఒకటేమిటి, పల్లెటూరిలో బ్రతకడానికి కావాల్సిన పనులన్నీ నేర్పేవారు. అప్పుడప్పుడు, వేసం కాలంలో, చెరువులో, కాలువలో పూడిక తీయించేవారు. మొక్కలకి, చెట్లకి మా చేత కావలసిన సేవ చేయించేవారు. తొలకరి వాన మొదలయితే, ఇద్దరిద్దరు పిల్లలని జట్లుగా చేసి, కంచెలలోనూ, ఇవతలా ఒకడు పలుగుతో గాత వెయ్యడం రెండవ వాడు గింజలు పాతడం, చేయించేవారు. ఇలా, చదువుతో పాటు, పనులు కూడా నేర్చుకున్నాము.

మాకు మా గురువుగారు, తన పద్ధతి ప్రకారం చెప్పే చదువు కాక ప్రభుత్వం ప్రచురించిన పాఠ్య పుస్తకాలలో ఉన్న విషయాలు కూడా నేర్పేవారు. ఆయన సిలబస్ (syllabus) ప్రకారం చదుకున్న వాళ్ళకి ఆ పాఠ్య పుస్తకాలలో ఉన్నది నేర్చుకోవడం చాలా తేలికగా ఉండేది. ఎందుకంటే, ఆయన చెప్పే చదువు ఒక ఆకు ఎక్కువ ఉండేది. ఉదాహరణకి, 8-9 ఏళ్ళ వయసులో తెలుగులోనే కాదు ఆంగ్లంలో కూడా చిన్న చిన్న పదాలతో ఉత్తరం వ్రాయడం నేర్చుకున్నాము. నేను, విజయవాడలో ఉన్న మా నాన్నగారికి, పోస్టుకార్డు (postcard) మీద ఉత్తరం వ్రాసేవాడిని.

మరో విచిత్రమైన విషయం చెబుతాను. ఒక పొలం రూపు ఎంత వంకరటింకరగా (irregular shape) ఉన్నా దాని వైశాల్యం ఎలా కొలవాలో మాకు పురికొస, కట్టుకొయ్యల సాయంతో నేర్పేవారు. ఉన్న రూపాన్ని చతురస్రాలుగా (squares), దీర్ఘచతురస్రాలుగా (rectangles), త్రిభుజాలుగా (triangles) విభజించి విడివిడిగా వాటి వైశాల్యాలు గణించి కూడడం వల్ల మొత్తం పొలం వైశాల్యం వస్తుందని మాకు నేర్పారు. పెద్దయిన తర్వాత, బహుశా డిగ్రీ (degree) కోర్సులో (course) అనుకుంటా, న్యూమరికల్ ఎనాలసిస్ (Numerical Analysis) అనే సబ్జెక్ట్ (subject) లో ట్రపీజాయిడల్ రూల్ (Trapezoidal rule) అనే టాపిక్ (topic) లో ఇదే నేర్పారు.

ఈ విధంగా మాకు మూడు భాషలలో చదువు, వ్యవసాయము, పశు సంరక్షణ అన్నిటికన్నా ముఖ్యంగా శ్రమైక జీవన సౌందర్యం అబ్బాయి. ఏ పని చెయ్యడానికైనా సిగ్గు పడకపోవడం,

పనుల్లో పెద్ద పని - చిన్న పని అన్న తేడా చూపించక పోవడం, మాకు చిన్నప్పటి నుండే అలవడ్డాయి.

మావూరి (చిరువోలు) చెరువుగట్టుకు ఆనుకుని కావూరి కోదండరామయ్య గారి పొలాలు ఉండేవి. మేము ఆ దోవను స్కూలుకి వెళ్ళేటప్పుడు, అప్పుడప్పుడు, ఆయన దర్శనం అయ్యేది. ఆయన వ్రాసిన "కావూరి కోదండరామయ్య స్వీయచరిత్ర" (ఈ లింకులో చదవచ్చు: http://www.teluguone.com/grandalayam/biography/KavuriKodandaRamayya-Biography.pdf) అన్న పుస్తకంలో కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఉన్నాయి. ముఖ్యంగా, నీలి పంట, పులిగడ్డ అక్విడెట్టు, కోహినూర్ వజ్రం గురించి వివరాలు ఉన్నాయి. ఆ రోజుల్లో ఉన్న విద్యావిధానం గురించి కూడా కొంత సమాచారం మనకి తెలుస్తుంది. ముఖ్యంగా, ఆ రోజుల్లో పరీక్షల్లో ఉత్తీర్ణులైన పిల్లల సంఖ్యను బట్టి కొంత గ్రాంటు ఇచ్చే పద్ధతి చాలా బాగుంది. "అట్టి పద్ధతి అమలులోనున్న కాలములో ఎక్కువ మంది విద్యార్థులను పరీక్షలలో నెగ్గించవలెననే పూనికతో మాష్టార్లు వారు స్వయముగా చెప్పుటకు పిల్లల సంఖ్య హెచ్చుగానున్నపుడు వారే స్వంతముగా ఎవరినైనా తగిన ఉపాధ్యాయులను తమకు సహాయముగా తెచ్చుకుని వారుభయులు శ్రద్ధతో చదివించెడివారు." అని కోదండరామయ్యగారు తమ స్వీయచరిత్రలో వ్రాసుకున్నారు. హైజీను, అగ్రికల్చర్ టెస్టు, మెన్సురేషన్, ఇంగ్లీషు మొదలగునవి స్పెషల్ టెక్కుస్టులుగా చదివి పరీక్షలలో గెలుపొందితిని అని కూడా వారు వ్రాసుకున్నారు. కోదండరామయ్యగారి పుస్తకం చదివిన తరువాత, మా గురువుగారి బోధన పద్ధతి ఇంకా బాగా అర్థమయ్యింది.

అందరితో పాటు చెప్పే చదువు కాక, నా కున్న శ్రద్ధను గుర్తించి మా గురువుగారు నాకు భగవద్గీత, మంత్రపుష్పం లాంటివి బట్టీ పట్టించేవారు. రోజూ ఒక శ్లోకం చెప్పించి, మర్నాడు అది అప్పచెప్పిన తర్వాత రెండవది చెప్పడం, ఆ మర్నాడు మొదటి రెండు శ్లోకాలు అప్పచెప్పితే మూడవది చెప్పడం చేసేవారు. ఆ విధంగా, ఒక అధ్యాయంలోని ఆఖరి శ్లోకం చెప్పిన మర్నాడు ఆ అధ్యాయంలో ఉన్న అన్ని శ్లోకాలు అప్పచెప్పాల్సి వచ్చేది. ఈ అభ్యాసం నా జ్ఞాపక శక్తి పెంపుదలకి చాలా ఉపయోగపడింది. ఆ రోజుల్లోనే, దీన్ని మెరుగు పెట్టే సంఘటన ఒకటి జరిగింది.

నేను సెలవులకి బెజవాడ మా తల్లిదండ్రుల దగ్గరకి వచ్చినప్పుడు, ఇంటికి ఎవరు వచ్చినా వాళ్ళ ముందర నా చేత భగవద్గీత చెప్పించేవారు. వాళ్ళలో ఒకాయన, మా నాన్నకి చిన్న తాతయ్య అయిన మద్దాలి నరసింహారావు గారు. ఆయన బెజవాడలో ఆ రోజుల్లో పేరు మోసిన న్యాయవాది. ఆయన నా చేత భగవద్గీత చెప్పించుకుని మురిసిపోయి ఒక రూపాయి ఇచ్చేవాడు. ఇది అలవాటయి పోయి, నేను ఆయన్ని చూడగానే భగవద్గీత చెప్పడం మొదలు పెట్టేవాడిని. ఆయన డబ్బులు ఇవ్వకుండా ఉండలేకపోయేవాడు. ఇలా లాభం లేదనుకున్నాడో ఏమో, ఒక రోజు ఆయన నాకొక సవాలు విసిరాడు. ఏమిటంటే, భగవద్గీతలో ఏదైనా ఒక అధ్యాయం అప్పచెప్పేటప్పుడు ఆఖరి లైనుతో మొదలు పెట్టి వెనక్కి అప్పచెప్పమని. దాంతో, నేను కొంచెం బిజీ అయిపోయాను. రెండు - మూడు రోజులు బాగా ప్రాక్టీసు చేసి 15వ అధ్యాయం, ఆయన అడిగినట్లుగా, వెనక నుంచి అప్పచెప్పాను. ఆయన చాలా మెచ్చుకుని తగిన పారితోషికం ఇచ్చారు. ఇది ఎందుకు చెబుతున్నానంటే, ఈ అభ్యాసాలు నా జ్ఞాపక శక్తిని చాలా పెంచడమే కాక, తర్వాత తర్వాత నాకు పై చదువుల్లోను ఉద్యోగంలోను కూడా బాగా ఉపయోగపడ్డాయి.

నేను భగవద్గీత లాంటివి గడగడా అప్పచెప్పడం చూసి మా గురువుగారు నాకు సంస్కృతం నేర్పించాలని అనుకున్నారు. అక్కడ దగ్గరలో రావివారిపాలెంలో ఉన్న తన మిత్రుడు, సంస్కృత పండితుడు అయిన భమిడిపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి గారిని పిలిపించారు. తర్వాత నాకు తెలిసిందేమంటే, ఆయన మహా పండితుడనీ, సంస్కృతంలో కావ్యం వ్రాశాడని, కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారికి, మా పెద్ద మామయ్య చిరువోలు విజయనరసింహారావు గారికి కూడా గురువు అనీ. సుబ్రహ్మణ్యశాస్త్రి గారి దగ్గర నా చదువు బహుశా ఒక నెల సాగిందేమో. ఆ తర్వాత నేను మోపిదేవి హైస్కూల్లో చేరడం వల్ల నా సంస్కృతం చదువు అటకెక్కింది. కానీ, ఆ ఒక్క నెలలో (1967 మే నెలలో అనుకుంటాను) సుబ్రహ్మణ్యశాస్త్రి గారు చెప్పిన చదువు, నాకు ఇప్పటికి రిటైర్ అయ్యి ఏడు సంవత్సరాలు అయినా కూడా గుర్తే. అంత బాగా, ఆయన శ్లోకాలు అవీ కంఠస్థము చేయించారు. ఆయన అప్పుడు కలిగించిన ఆసక్తి నాలో ఇప్పటికీ ఉంది.

ఇంకో విషయం. మా గురువుగారు మంచి కవి. నేను పుట్టక ముందు, వారు కామేశ్వరీ శతకం రచించారు. నేను చదువుకునే రోజుల్లో కూడా ఆయన అప్పుడప్పుడు పద్యకవిత్వం చెప్పేవారు. ఆయన చెబుతుంటే, మా పిన్ని వ్రాసేది. రాను రాను, ఆవిడ ఇంటి పనుల్లో బిజీ (busy) అవడం వల్ల, మెల్లమెల్లగా ఆ డ్యూటీ (duty) నా మీద పడింది. అప్పుడర్థ మయ్యింది నాకు, మా గురువుగారి నిబంధన. ఏమిటంటే, పద్యం వ్రాసేటప్పుడు ఛందస్సు సరిగ్గా ఉందో లేదో చూసుకుని సరిగ్గా లేకపోతే చెప్పాలి. అప్పుడు, మా గురువు గారు దాన్ని సరిగ్గా ఉండేటట్లుగా మార్చి చెప్పేవారు. ఒక్కొక్కప్పుడు, అదే బాగుంది, అలాగే ఉంచెయ్యి, అని "నిరంకుశాః కవయః" అని దాన్ని సమర్థించేవారు. ఈ క్రమంలో, ప్రతి వృత్తానికి ఉండే లయ నాకు నేర్పారు. ఒక పద్యం చెప్పేటప్పుడు, గణ విభజన చేస్తూ కూర్చోకుండా, లయకి అనుగుణంగా ట్యూన్ (tune)ని అనుసరిస్తూ పదాలు వెయ్యడం, యతిస్థానం దగ్గర ఆటోమాటిక్ (automatic) గా ఆపి యతి వేసుకోవడం నాకు నేర్పారు. ఈ విధంగా, నాకు పద్య నిర్మాణం, సాహిత్యాభిలాష అబ్బాయి. ఇప్పటికీ, ఆ ట్రైనింగే (training) నా చేత పద్యాలు వ్రాయిస్తోంది.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, ఈ విధంగా చదువుకున్న పిల్లలు, పెద్దయిన తరువాత చాలా ఆత్మవిశ్వాసంతో ఉన్నారని, ఉద్యోగాల కోసం వెంపర్లాడకుండా ఏదో ఒక పని చేస్తూ సమాజానికి బాగా ఉపయోగపడుతున్నారనీ పలువురు అనగా విన్నాను.

14. పరమానందయ్య శిష్యుల కథలో పరమార్థం

[ఈ వ్యాసం సంచిక మాస పత్రిక అనబడే తెలుగులో తొలి డైనమిక్ వెబ్ పత్రికలో (మార్చి 23, 2025) ప్రచురించబడింది. అందుబాటులో ఉన్న లింకు:
https://sanchika.com/paramaanandayya-shishyula-kathalo-paramaartham-mvs-r/]

పరమానందయ్య శిష్యుల కథలు హాస్యానికి ప్రతీతి. చిన్నప్పుడు అవి సినిమాలో చూసి తెగ నవ్వుకునే వాళ్ళం. శాపగ్రస్తులైన ఆ శిష్యులు (ఎనిమిది మంది అనుకుంటాను) చేసే పనులు పైకి మూర్ఖంగా నష్టం కలిగించేవిగా ఉన్నా కూడా చివరకు మేలు చేసేవిగా పరిణమిస్తాయి అన్నది ఆ కథల్లోనే ఉంది. ఒక కథ విన్న తరువాత ఆ విషయం మనకి తెలుస్తుంది. ఆ తరువాతి కథల్లో వాళ్ళు చేసే పనులకి నవ్వుకుంటూనే ఆ జరగబోయే మంచి ఏమిటని ఉత్కంఠగా ఎదురు చూస్తాం. ఇది కాక ఇంకా ఏదో సందేశం వీటిల్లో నిగూఢంగా ఉంది అని నాకు ఎందుకో చాలా కాలం నుంచి మనస్సులో ఒక అనుమానం ఉంది. అలా ఆలోచిస్తుంటే, ఒక తలంపు మనస్సులోకి వచ్చింది. అదే ఇప్పుడు చెబుతున్నాను.

ఒక సారి శిష్యు లందరు నదీ స్నానానికి వెళ్లి వస్తారు. వాళ్ళల్లో ఒకడికి అందరూ తిరిగి వచ్చారో లేదో అని అనుమానం వస్తుంది. వాడు మిగిలిన వాళ్ళని వరసగా నుంచోమని చెప్పి లెక్కపెట్టడం మొదలు పెడతాడు. ఎన్ని సార్లు లెక్కపెట్టినా ఏడుగురే ఉంటారు. అయ్యో! మనలో ఒకడు తప్పిపోయాడని ఏడుపు మొదలుపెడతాడు. నువ్వు తప్పుకోరా అని ఇంకోడు వాణ్ణి తన స్థానంలో నిలబెట్టి తను విడిగా నుంచుని లెక్క పెడతాడు. వాడికి కూడా ఏడుగురే తగులుతారు. ఇట్లా అందరికీ ఏడుగురే ఉన్నట్లు ఒకడు బహుశా నదిలో మునిగిపోయాడేమో అని అనిపిస్తుంది. అందరూ కలిసి ఏడుస్తూ గురువుగారికి ఈ విషయం చెబుతారు. ఆయన, "ఓరి చవటల్లారా! ఎవరు లెక్కపెడుతున్నా, ముందు తనను తాను లెక్కపెట్టి అప్పుడు మిగిలిన వాళ్ళని లెక్కపెట్టాలిరా" అని చెబుతారు. అలా చేసి శిష్యులు విషయం అర్థం చేసుకుంటారు.

నిత్య జీవితంలో మనని మనం వదిలేసి మిగిలిన వాళ్ళని లెక్క పెట్టడమో లేదా పరిగణనలోకి తీసుకోవడమో చాలా సందర్భాలలో చేస్తాము. అందాకా ఎందుకు, ఇద్దరు మాట్లాడుకునేటప్పుడు, వాళ్ళు తమని తాము మినహాయించుకుని మిగతా వాళ్ళంతా చెడ్డ వాళ్ళయినట్లు వేరే వాళ్ళని ఆడిపోసుకోవడం మనకి చాలా సార్లు అనుభవం లోకి వచ్చి ఉండాలి. మనం కూడా అలా చాలా సార్లు చేసి ఉండాలి. అలా మినహాయించుకునే సందర్భాలు నా అనుభవం లోకి వచ్చినవి ఒకటి రెండు చెబుతాను.

గవర్నమెంటులో (Government) వేరు వేరు శాఖలు (Departments or Sections) ఉంటాయి. వాటిల్లో సిబ్బంది (staff) ఎంత మంది ఉండాలో సమీక్షించి చెప్పడానికి ఒక ప్రత్యేక శాఖ ఉంది. దాన్ని స్టాఫ్ ఇన్స్పెక్షన్ యూనిట్ (Staff Inspection Unit) అంటారు. వాళ్ళు సుమారుగా ఐదు సంవత్సరాలకి ఒక మాటు ప్రతి శాఖ లోని ఉద్యోగుల సంఖ్యని సమీక్షించి నిర్ణయిస్తారు. ఆ యూనిట్ వాళ్ళు వచ్చినప్పుడు, వాళ్ళకి కావలసిన సదుపాయాలు రికార్డులు అందించడానికి ఒక ఉద్యోగిని ప్రతి మంత్రిత్వ శాఖ లోను నియమిస్తారు. అతణ్ణి ఎక్కువగా ఎడ్మినిస్ట్రేషన్ (Administration) నుంచి తీసుకుంటారు. యూనిట్ వాళ్ళు, అతడూ కూడా ఆ సమీక్ష చేసేటప్పుడు అలా సాయం చేస్తున్న వ్యక్తిని మినహాయించి మిగతా వాళ్ళని వాళ్ళు చేసే పనిని మాత్రమే సమీక్షించి వాళ్ళు అవసరమా కాదా అని చూస్తారు.

సంబంధ బాంధవ్యాలలో చాలా సార్లు ఈ మినహాయింపులు చేసే అలవాటుని చూస్తాము. చేసిన ప్రతిసారి దురుద్దేశంతో కాకపోవచ్చు, సదుద్దేశంతోనూ కాకపోవచ్చు. ముఖ్యంగా భార్యాభర్తల మధ్య గానీ స్నేహితుల మధ్య గానీ ఒకే చోట పని చేసే వాళ్ళ మధ్య గానీ పేచీలు వస్తే, మమత్వం మిత్రత్వం బాగా పనిచేయడం వల్ల అక్కడ ఉన్న వాళ్ళు వర్గాలుగా ఏర్పడి ఒక వర్గం ఒకళ్ళ వేపు రెండో వర్గం వేరొకరి వేపు వత్తాసు పలకడం మనం చూస్తాము. ఆ పేచీ రావడానికి మూల కారణం వెతికే క్రమంలో ఎవరికి వాళ్ళు తమని తాము మినహాయించేసుకుంటారు. ఉదాహరణకి ఒక భర్త బంధువులు మాట్లాడేటప్పుడు పేచీకి కారణం భార్యలోనో భార్య తల్లిదండ్రులలోనో ఆమె తరఫు

బంధువులలోనో లేదా భర్త మిత్రబృందంలోనో భర్త సహోద్యోగులలోనో వెతుకుతారు. తమలో ఒకళ్ళు కూడా కారణం అయ్యే అవకాశం కూడా ఉందని అనుకోరు.

ఈ మినహాయింపుల సందర్భాలు మనం చాలా చూసుంటాము. కొన్ని సార్లు అలాంటి వాటిల్లో మనం కూడా పాలు పంచుకొని ఉంటాం. మరి, మనం పరమానందయ్య శిష్యుల కన్నా తెలివైన వాళ్ళ మంటారా?

15. ప్రసిద్ధమైన సినిమా పాటైన మొల్ల కల్పన

[ఈ వ్యాసం సంచిక మాస పత్రిక అనబడే తెలుగులో తొలి డైనమిక్ వెబ్ పత్రికలో (ఏప్రిలు 13, 2025) ప్రచురించబడింది. అందుబాటులో ఉన్న లింకు:
https://sanchika.com/prasiddhamaina-cinema-paataina-molla-kalpana-mvs-r/]

వాల్మీకి రామాయణం బాలకాండములో 48వ, 49వ సర్గలలో అహల్యా శాప విమోచనం గురించిన కథ ఉంటుంది. టూకీగా చెప్పాలంటే, మిథిలకు దగ్గరలో ఉన్న ఒక పాతది, నిర్జనమైన ఆశ్రమం గురించి శ్రీరాముడు విశ్వామిత్రుడిని అడగడం వల్ల ఈ కథ ప్రస్తావన వస్తుంది. అప్పుడు విశ్వామిత్రుడు ఈ విధంగా చెబుతాడు.

ఇది గౌతమ మహర్షి ఆశ్రమం. అతడు ఇక్కడ తన భార్యయైన అహల్యతో చాలా కాలం తపస్సు చేశాడు. ఒక రోజు ఇంద్రుడు ఆ ముని లేని సమయంలో అతని వేషం ధరించి ఆమెని సమీపించి నీ సంగమము కోరుతున్నాను అని అడిగాడు. మునివేషంలో వచ్చిన అతడు ఇంద్రుడని తెలిసి కూడా ఆమె దుర్బుద్ధితో వచ్చిన వాడు దేవతలకి రాజు కదా అని ఇష్టంతో ఒప్పుకుంటుంది. తరువాత, "నేను కృతార్థురాల నయ్యాను. ఇక్కడ నుండి వెంటనే వెళ్ళిపో, నిన్ను నన్ను కూడా గౌతముని నుండి రక్షించు.", అని ఆమె ఇంద్రుడితో అంటుంది. ఇంద్రుడు ఆ పర్ణశాల నుండి బయటకు వెళుతూ గౌతముని కంట పడతాడు. తన వేషంలో ఉన్న ఇంద్రుడు ఏమి చేశాడో గ్రహించిన గౌతముడు నీ అండములు పడిపోవు గాక అని ఇంద్రుణ్ణి శపిస్తాడు. "అనేక వేల సంవత్సరాలు ఇక్కడే ఎవరికీ కనపడకుండా బూడిదలో పడియుండి ఆహారం లేకుండా వాయువు మాత్రమే భక్షిస్తూ నివసిస్తావు, కొంత కాలం తరువాత దశరథ సుతుడైన రాముడు ఈ వనంలో ప్రవేశించగానే నీవు శుద్ధురాలవు అవుతావు" అని అహల్యని కూడా శపిస్తాడు, గౌతముడు. రామునకు అతిథి సత్కారాలు చేసిన తరువాత నీ లోభమోహాలు తొలగి నిజరూపంతో నాతో కలిసి జీవిస్తావు అని కూడా గౌతము డంటాడు. రాముడు ఆ ఆశ్రమంలో

ప్రవేశించగానే మంచు, మేఘాలు కప్పిన వెన్నెల లాగా, నీటి మధ్యలో ప్రతిబింబించే సూర్యకాంతి లాగా, శాపవశాత్తు పైకి ఎవరికీ స్పష్టంగా కనపడకున్నా, శాపం అంతం అవడం వల్ల అహల్య రామలక్ష్మణులకి కనపడింది.

అహల్యను శిలగా పడియుండమని గౌతముడు శపించినట్లు, రాముడు అక్కడికి వచ్చినప్పుడు అతని పాదం ఆ శిలను తాకగానే ఆమె నిజరూపాన్ని పొందినట్లు కొన్ని గ్రంథాలలో వాల్మీకి రామాయణంలో లేని విధంగా వర్ణించారు. ఈ ఘట్టాన్ని రామభక్తి ప్రతిబింబించే విధంగా చాలా మంది చాలా రకాలుగా పెంచి వ్రాశారు.

కవయిత్రి మొల్ల, 16వ శతాబ్దంలో అనుకుంటాను, వ్రాసిన రామాయణం పద్య కావ్యంలో అహల్యా శాప విమోచనం ప్రస్తావనకి సంబంధించి చేసిన అద్భుతమైన కల్పన వాల్మీకికి దీటుగా (వాల్మీకి చేయలేదు కానీ) ఉంది. ఆమె అహల్య గౌతముని శాపం వల్ల శిలగా మారడం, రామపాదం సోకగానే మళ్ళీ మనిషిగా మారడం గురించి చెబుతూ ఒక అడుగు ముందుకు వేసింది. ఆ పద్యాలు చూద్దాం.

బాలకాండములో 65వ పద్యము:

ఉ. ఆ ముని వల్లభుండు కొని యాడుచుఁ బాడుచు, వేడ్కతోడ శ్రీ
రాముని జూచి యిట్లనియె, రామ! భవత్పద ధూళి సోఁకి, యీ
భామిని రాయి మున్ను, కులపావన చూడఁగఁ జిత్రమయ్యె నీ
నామ మెఱుంగు వారలకు నమ్మఁగ వచ్చును భుక్తి ముక్తులున్.

అయోధ్యకాండములో 32వ పద్యము:

చం. "సుడిగొని *రాము పాదములు సోఁకిన ధూళి వహించి రాయి యే*
ర్పడ నొక కాంత యయ్యె నఁట, పన్నుగ *నీతని పాద రేణు వి*

యెడ్డ వడి నోడ నోఁక నిది యేమగునో" యని సంశయాత్ముఁడై

కడిగె గుహుండు రామపద కంజయుగంబు భయమ్ము పెంపునన్.

మొల్ల వేసిన ముందడుగు ఏమిటంటే గుహుడికి రాముని పాదరజము సోకి రాయి కాంతగా మారిందట, ఇప్పుడు నా ఓడ (నావ) మీద ఇతని పాదరేణువులు సోకితే నా నావకి ఏమవుతుందో అని సందేహం వచ్చి ఎందుకైనా మంచిదని రాముని పాదాలు కడిగాడని చెప్పడం. కవిరత్న కొసరాజు రాఘవయ్య చౌదరి గారు ఆ పడవ వాని (గుహుడు) చేత సంపూర్ణ రామాయణం సినిమాలో (1971) పలికించిన జానపద సాహిత్యంలో మొల్ల చేసిన కల్పనకి గేయ రూపాన్ని ఇచ్చారు. ఆ గేయం ఇలా ఉంది.

"ఆగు బాబూ ఆగు! అయ్యా నే వత్తుండా!, బాబూ నే వత్తుండ! అయ్యా నే వత్తుండా!, బాబూ నే వత్తుండ!

నీ కాలుదుమ్ము సోకి రాయి ఆడది అయినాదంట, నాకు తెలుసులే! నా నావ మీద కాలు పెడితే యేమౌతాదో తంట,

నీ కాలుదుమ్ము సోకి రాయి ఆడది అయినాదంట, నా నావ మీద కాలు పెడితే యేమౌతాదో తంట!

దయజూపి ఒక్కసారి కాళ్ళు కడగనీయమంట, మూడు మూర్తులా నువ్వు నారాయణ మూర్తివంట!

రామయ తండ్రీ! ఓ రామయ తండ్రీ! మా నోములన్ని పండినాయి రామయ తండ్రీ! మా సామివంటే నువ్వేలే రామయ తండ్రీ!"

ఇంత మంచి కల్పన చేసిన కవయిత్రి మొల్ల, దానికి జానపద మెరుగులు దిద్దిన కవిరత్న కొసరాజు గారు, ఇద్దరూ ప్రాతఃస్మరణీయులే.

16. భజనలో అల్లరి

ఇప్పుడేమో నాకు తెలియదు కానీ, మా చిన్నతనంలో భజన కార్యక్రమం అన్నది మా పల్లెటూళ్ళో అందరూ కలిసి చేసే కార్యక్రమం. ఎక్కువగా గుళ్ళలోను, ఒక్కొక్కప్పుడు ఏదైన పండుగకి, ఎవరింట్లో నైనా జరిగే ఉత్సవాలకి లేదా మూడ్ (mood) వచ్చినప్పుడో ఆ ఆసక్తి ఉన్నవారు భజన చేస్తూ ఉండేవాళ్ళు మా ఊళ్ళో. మిగిలిన వాళ్ళు ప్రేక్షకులుగా ఉండేవారు. ఈ సామూహిక కార్యక్రమాలలో మా గురువు గారు కీర్తనలు, తరంగాలు లాంటివి భజన పద్ధతిలో పాడించేవారు. భజన పద్ధతి అంటే, సంగీతపరంగా సక్రమంగా లేకపోయినా కాస్త ట్యూనుకు దగ్గరగా, ఏదో ఒక మాత్రంగా తాళబద్ధంగా (మా దగ్గర తాళం వెయ్యడానికి చిడతలు, తప్పెటలు, తాళాలు, చిన్న సైజు మృదంగం, కంజీరా, తొడలు, చేతులతో పాటు ఉండేవి), పాడేవాళ్ళు (అనడం కన్నా అరిచే వాళ్ళు అంటే బాగుంటుంది) రెండు మూడు గ్రూపులుగా (groups) విభజించబడి ఒక్కొక్క చరణాన్ని కావలసినన్ని ముక్కలుగా చేసి ఒక్కో గ్రూపు ఒక్కో ముక్కని పోటీపడి బిగ్గరగా పాడడం.

మాకు చిన్నప్పుడు ఇది పెద్ద ఆటగా ఉండేది. కొన్ని చరణాలు మూడు కాలాల్లోనూ పాడడానికి ప్రయత్నించేవాళ్ళం. అంటే, స్పీడుగా ఒక సారి, మెల్లగా ఒక సారి, మధ్యస్థంగా ఒక సారి పాడేవాళ్ళం. అట్లా పాడేటప్పుడు మేం చేసే అల్లరి కాస్తాకూస్తా కాదు. మా గురువు గారి ఎదురుగా కాదు లెండి. భజన కీర్తనలలో మాకు ఆ రోజుల్లో బాగా నచ్చిన కీర్తన "సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము ..." అన్న రామదాసు కీర్తన. ఎందుకంటే, ఆ కీర్తనలో "ఎవడబ్బ సొమ్మని కులుకుచు తిరిగేవు ..." అని వస్తుంది, మధ్యలో ఎక్కడో. మా గురువుగార్ని అవతలికి వెళ్ళనిచ్చి ఆ చరణం అందుకునే వాళ్ళం మూడు కాలాల్లో. పాడి పాడి మెల్లగా, అంతా వదిలేసి కేవలం "ఎవడబ్బ" మాత్రమే పాడుతూ కొంచెం సేపయిన తర్వాత దాన్ని "నీ అబ్బ" కింద మార్చే వాళ్ళం. ఇప్పుడు అర్థమయ్యిందా, మాకు భజన ఎందుకు ఇష్టమో.

తరువాత, నేను విశాఖపట్నం యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లో చినవాల్తేరులో జరిగే భజనల గురించి ఒక ఆశ్చర్యకరమైన విషయం చెప్పాలి. అక్కడ రోడ్డు పక్కన ఉన్న ఒక చిన్న గుడిలోనో లేక ఒక ఖాళీ స్థలంలోనో శనివారం ఆదివారం సాయంత్రాలు భజనలు జరిగేవి. భజన చేసే వాళ్ళలో కొంత మంది కొంచెం పుచ్చుకునో కొంత మంది పుచ్చుకుంటూనో భజన చేసే వాళ్ళు. వడపప్పు నైవేద్యం పెట్టి తీసుకొచ్చి దాని మీద లైటుగా (light) కారం జల్లేవారు. మందుతో పుచ్చుకోడానికి అది మంచి కాంబినేషన్ (combination). భజన చేస్తూ ఆ ప్రసాదం కాని ప్రసాదం కొంచెం కొంచెం మందుతో పాటు సేవించేవారు. ఆ భజనకు పాపులర్ (popular) పాత సినిమా పాటలు (old cinema songs) ఎంచుకునేవారు. అక్కడ కూడా గ్రూపులు ఉండేవి. ఉదాహరణకి, ఒక గ్రూపు "నా పాట నీ నోట" అని అరిస్తే, రెండో గ్రూపు "పలకాల సిలకా" అని అరిచేవారు. ఈ విధంగా తెల్లారే దాకా భజన సాగేది.

అటు తరువాత, ఢిల్లీలో ఉద్యోగం చేసే రోజుల్లో విశాఖపట్నంలో కన్నా ఆశ్చర్యకరమైన విషయం చూశాను. బహుశా, అక్కడి వాళ్ళు ఒక ఆకు ఎక్కువ చదువుకున్నారేమో. భజన చెయ్యడానికి కావాల్సిన హంగులు (తడి, పొడి) విశాఖపట్నంలో లాగా అన్ని ఉండేవి. కాకపోతే, పాత సినిమా పాటలు కాకుండా కొత్త సినిమా పాటలు ఎంచుకుని వాటిని కావలసిన విధంగా వాళ్ళే సందర్భానికి తగినట్లుగా మార్చుకుని (పేరడీ) పాడేవారు. ఉదాహరణకి, "తూ చీజ్ బడీ హై" అని ఒక గ్రూపు పాడితే, "జై మాతా దీ" అని రెండో గ్రూపు పాడేవారు.

ఇదంతా చూసిన తర్వాత, మేము భక్త రామదాసు కీర్తనను పట్టుకుని చేసిన అల్లరి, అన్యాయం, విశాఖ ఢిల్లీలలో చూసిన దానికన్నా చాలా తక్కువ అని అనిపించింది.

17. భవిష్యవాణి తెలుసుకోవడం మంచిదా?

[ఈ వ్యాసం సంచిక మాస పత్రిక అనబడే తెలుగులో తొలి డైనమిక్ వెబ్ పత్రికలో (మార్చి 9, 2025) ప్రచురించబడింది. అందుబాటులో ఉన్న లింకు:
https://sanchika.com/bhavishyavani-telusukovadam-manchida-mvs-r/]

భవిష్యవాణి సరిగ్గా చెప్పేవారు ఉన్నారు అని అనుకుంటే, మనకి భవిష్యత్తులో ఏం జరుగబోతోందో ముందే తెలుసుకోవడం మంచిదా? కాదా? తెలిస్తే, ఏం చేస్తాం? మంచి జరుగుతుందని తెలిస్తే ఇబ్బంది లేదు. మహా అయితే, తెలిసిన వాళ్ళకి తెలియని వాళ్ళకి గొప్పలు చెప్పుకుంటాము. ఒక వేళ ఏదన్నా చెడు జరుగుతుందని తెలిస్తే ఏమిటి గత్యంతరం? ఏమయినా జాగ్రత్తలు తీసుకుని ఆ చెడుని నివారించడం కుదురుతుందా? మహా భారతంలో ధర్మారాజుకి ఎదురైన ప్రశ్నలు చెడుకి సంబంధించినవే.

మహాభారతం లోని సభాపర్వంలో రాజసూయ యజ్ఞం సందర్భంగా శ్రీకృష్ణునికి ధర్మరాజు అగ్ర పూజ చెయ్యడం, దాన్ని శిశుపాలుడు వ్యతిరేకిస్తూ సభలో రాజు లందరి ముందు శ్రీకృష్ణుని నిందించడం, అతడు శిశుపాలుని శిరస్సు ఖండించడం జరిగాయి. యజ్ఞం సమాప్తి అయ్యింది కదా అని వ్యాస మహర్షి ధర్మరాజుకి వీడ్కోలు చెప్పడానికి వస్తాడు. అప్పుడు, ధర్మరాజు వ్యాసుణ్ణి ఒక సందేహం తీర్చమని అడుగుతాడు.

నేను రాజసూయ యాగం చెయ్యాలని, అలా చేస్తే నా పూర్వీకులు ఇంద్రసభకు వెళ్తారని, నా తండ్రి పాండురాజు యమసభలో కలిసినపుడు తనకు చెప్పాడనీ, ఆ యాగం చేయడం వలన ఈ భూమి మీద సర్వ వినాశకరమైన యుద్ధానికి దారితీసే సంఘటన జరిగే అవకాశం కూడా ఉంది, కాబట్టి ఆలోచించుకుని నీకు ఏది మంచిది అనిపిస్తే అది చెయ్యి, అని నారదుడు నాకు చెప్పాడు అని ధర్మరాజు అన్నాడు. నారద మహర్షి ఆ సందర్భంలో నాకు మూడు రకాల ఉత్పాతముల (ఉపద్రవములు) గురించి చెప్పాడు, శిశుపాల వధ వల్ల ఆ మహోత్పాతాలు శాంతించాయా? అని

ధర్మరాజు వ్యాస మహర్షిని సందేహం అడిగాడు. దానికి జవాబుగా వ్యాసుడు "శిశుపాల వధ ఉత్పాతమే, ఆ ఉత్పాత ఫలం 13 ఏళ్ళ వరకు ఉంటుంది, అది సమస్త క్షత్రియ నాశనానికి దారి తీస్తుంది, నీ కారణంగా రాజు లందరు పరస్పరం పోరాడి మరణిస్తారు, ఆ వినాశము దుర్యోధనుడి అపరాధాల వల్ల భీమార్జునుల వీరత్వము చేత కలుగుతుంది" అని ధర్మరాజుకి భవిష్య వాణి చెప్పాడు. అన్నిటికన్నా "నీ కారణంగా రాజు లందరు పరస్పరం పోరాడి మరణిస్తారు" అన్న మాట ధర్మరాజు మనస్సుని బాగా కలచి వేసింది.

అప్పుడు ధర్మరాజు, దైవ నిర్ణయాన్ని పురుష ప్రయత్నముతో తప్పించలేము, వ్యాసుడు చెప్పాడు అంటే అది తప్పకుండా జరిగి తీరుతుంది, అని చింతించి, తమ్ముళ్ళని పిలిచి వ్యాసుడు చెప్పిందంతా చెప్పి, నేను జీవించి ఉపయోగం లేదు, అంత మందిని పొట్టన పెట్టుకోవడం కన్నా నేను చావడమే మేలు, అని అంటాడు. అర్జునుడు అది విని ధర్మరాజుతో మోహంలో పడవద్దు, ఏది మంచో ఆలోచించి ఆ పని చెయ్యి అని ఓదారుస్తాడు.

అప్పుడు ధర్మరాజు చాలా ఆలోచించి ఈ విధంగా సభలో అందరి ముందు ప్రతిజ్ఞ చేస్తాడు: "సోదరుల చావుకి కారణం అవడానికి నేను పదమూడు ఏళ్ళు బ్రతకాలా? ఒక వేళ నేను జీవించి ఉండాల్సొస్తే, ఒక మాట మీద నిలబడతాను. అది ఇవాల్టి నుండే పాటిస్తాను. నేను నా సోదరులతోను ఇతర రాజులతోను ఎప్పుడూ కటువుగా మాట్లాడను. బంధువులు అడిగిందల్లా ఇస్తాను. లోకంలో తగువులకి భేదభావమే కదా కారణం, అందుకని ఎవరితోనూ భేదభావం (difference of opinion) వైరం (enmity) లేకుండా చూసుకుంటాను. అందరికీ మేలు చేస్తూ నింద పడకుండా చూసుకుంటాను.".

భవిష్యవాణి తెలుసుకున్న ధర్మరాజు మనఃస్థితి, అతడు ఎలాంటి విపత్తుకీ తాను కారణం కాకూడదని నిశ్చయించుకుని తనను తాను కట్టడి చేసుకోవడానికి చేసిన ప్రతిజ్ఞ, తరువాతి జీవితంలో అతణ్ణి అతి జాగ్రత్తపరుడుగా చేశాయేమో అని అనిపిస్తుంది. కొన్ని సంఘటనలు ఎలా ఉంటాయంటే, ధర్మరాజు లాంటి ధర్మాత్ముడు ఇలా ఎలా చేశాడు అని ముక్కున వేలేసుకునేటట్లుగా ఉంటాయి. అసలు ధర్మరాజేనా, అట్లా చేసింది, అయ్యుండదు, మళ్ళీ సరిగా

చదవండి అని పాఠకులు ఒకరికొకరు వాదించుకోవడానికి ప్రోత్సహించేటట్లుగా ఉంటాయి కొన్ని ఘట్టాలు. భవిష్యవాణి తెలియకుండా ఉంటే అంత తర్కవిరుద్ధమయిన (illogical) పనులు చేసి ఉండేవాడా ధర్మరాజు అంటే అనుమానం వచ్చే విధంగా ఉంటుంది అతని ప్రవర్తన.

రాజసూయంలో ధర్మరాజు పక్షాన కానుకలు స్వీకరించడానికి నియమింపబడ్డ దుర్యోధనుడు, కానుకల రూపంలో వచ్చిన అపార సంపదని, యజ్ఞ సమయంలో రాజులందరూ ధర్మరాజుని అడుగులకి మడుగులొత్తుతూ సేవించడాన్ని, చూసి ఈర్ష్య చెంది, యజ్ఞం పూర్తయిన తరువాత మయసభలో భ్రమకి గురి అయ్యి, అక్కడ తనని చూసి భీమార్జున నకుల సహదేవులు పరిహసించారని కుపితుడై, కడు దుఃఖంలో ఉండడం చూసి శకుని కారణ మడుగుతాడు. "మామా! పాండవుల అభివృద్ధిని నేను చూడ లేకుండా ఉన్నాను, నాకు చావే శరణ్యము" అని దుర్యోధనుడు వాపోతాడు. అది విని శకుని మొదట్లో న్యాయమే బోధిస్తాడు. "పాండవులు వాళ్ళు సంపాదించుకున్నదే అనుభవిస్తున్నారు, నువ్వు వాళ్ళ పైన పన్నిన కుట్రలన్నీ విఫలమయ్యాయి. నీ కేమి బలగం తక్కవా? నువ్వు కావాలనుకుంటే, మేమంతా తోడుంటాము, ఈ సమస్త భూమండలాన్ని నువ్వు జయించవచ్చు, వాళ్ళని చూసి ఈర్ష్య చెందకూడదు" అని శకుని అంటాడు. ఆ మాట దుర్యోధనుడు ఒప్పుకోకపోవడం వల్ల, వేరే ఉపాయంగా ద్యూతం ఆడి పాండవుల సంపద హరించవచ్చు, నాకు ఆ ప్రజ్ఞ ఉంది అని శకుని చెబుతాడు.

తరువాత, ఇద్దరూ కలిసి ధృతరాష్ట్రుణ్ణి ఒప్పిద్దామని వెళ్తారు. ధృతరాష్ట్రుడు కూడా పలు విధాల జూదం అనర్థదాయకం అని దుర్యోధనుడికి బోధిస్తాడు. కానీ, దుర్యోధనుడు, ధర్మరాజు వైభవాన్ని, తాను మయ సభలో భ్రమ పడడం చూసి భీముడు కృష్ణార్జునులు స్త్రీలతో పాటు ద్రౌపది నవ్వి చేసిన అవమానాన్ని, గురించి చెబుతాడు. మయ సభ నుండి బయటకి వెళ్ళడానికి ద్వారం ఎక్కడ ఉన్నదో తాను తెలుసుకోలేక పోయాననీ, నకుల సహదేవులు తనకు ద్వారం చూపించగా, భీముడు "ధృతరాష్ట్ర పుత్రా" అని తనని సంబోధించి (అంటే, గుడ్డివాడి కొడుకా అన్నట్లు) తాను కూడా ద్వారం చూపించాడని చెబుతాడు. మొత్తానికి రెండబద్ధాలు, ఒకటి ద్రౌపది అక్కడ లేకపోయినా ఉందనీ తనని చూసి నవ్విందనీ, రెండవది భీముడు "గుడ్డివాడి కొడకా" అని తిట్టినట్లు, చెప్పి, ధృతరాష్ట్రుణ్ణి రెచ్చగొట్టి ఒక ద్యూత సభ నిర్మాణం జరగాలని, ఆ సభ

చూడడానికి, అక్కడ మిత్రద్యూతం (friendly match లాంటిది) ఆడడానికి ధర్మరాజుకి విదురుడి ద్వారా ఆహ్వానం పంపాలని ఒప్పిస్తారు.

ధృతరాష్ట్రుడి ఆజ్ఞ ప్రకారం, విదురుడు ధర్మరాజు దగ్గరకు వెళ్ళి, ద్యూతానికి ఆహ్వానం పలికి కౌరవులు చేయదలుచుకున్న కుట్ర గురించి కూడా చెప్పి, నీ ఇష్టం అంటాడు. "నాకు జూద మాడే కోరిక లేదు, నన్ను ధృతరాష్ట్రుడు పిలువకుంటే నేను శకునితో ఎప్పటికీ జూద మాడను, కాని, పిలిస్తే వెనుదీయను, అది నా నియమము" అని తాను చేసిన ప్రతిజ్ఞకి అనుగుణంగా సమాధానం చెబుతాడు ధర్మరాజు. హస్తినాపురం వెళ్ళి, ద్యూతంలో శకుని, దుర్యోధనుడు ఎలా చెబితే అలా నడుచుకున్నాడు, అదే ప్రతిజ్ఞ ననుసరించి. ద్యూతసభలో పాండవులకి, ద్రౌపదికి జరిగిన పరాభవం అందరికీ తెలుసు. వాళ్ళ రాజ్యం, సంపదలు ధృతరాష్ట్రుడు వెనక్కి ఇచ్చిన తరువాత పాండవులు ఇంద్రప్రస్థానికి బయలుదేరుతారు. వాళ్ళు సొంతం చేరకుండానే దారిలోనే, వెనక్కి రావాలి, వచ్చి మళ్ళీ జూదం ఆడాలి, అన్న కబురొస్తుంది ధర్మరాజుకి, ధృతరాష్ట్రుణ్ణించి. మళ్ళీ ధర్మరాజు తన ప్రతిజ్ఞ ప్రకారం ఒప్పుకుని జూద మాడడం, ఓడిపోవడం, 12 ఏళ్ళు వనవాసం ఒక ఏడు అజ్ఞాతవాసం కోసం అడవులకి బయలుదేరడం జరిగాయి. అడవులకి వెళ్ళిన తరువాత కూడా ధర్మరాజుని వ్యాసుడు చెప్పిన మాటలు తరుముతూనే ఉన్నాయి.

వనవాసానికి వెళ్ళిన కొత్తల్లో కృష్ణుడు దృష్టద్యుమ్నుడు వచ్చి ఆవేశంగా కౌరవుల మీద యుద్ధం ప్రకటిద్దామన్నప్పుడు, పదమూడు మాసాల వనవాసం తరువాత భీముడు ఒక రోజు "ఇక చాలు అన్నయ్యా, మనం కౌరవుల మీద దాడి చేసి మన రాజ్యం మనం వెనక్కి లాక్కుందాం" అన్నప్పుడు, ధర్మరాజు, తన సభలో తాను చేసిన ప్రతిజ్ఞ, కురు సభలో తాను 12 ఏళ్ళ వనవాసం ఒక ఏడాది అజ్ఞాతవాసం చేస్తానని ఇచ్చిన మాట, గుర్తుకు రాగా, అలా చెయ్యడం కూడదని వాళ్ళని వారించాడు. తరువాతి వనవాస సమయంలో, తీర్థయాత్రలు చేస్తూ ప్రభాస తీర్థాన్ని పాండవులు సందర్శించినప్పుడు కూడా బలరామాదులు కౌరవులతో యుద్ధ ప్రస్తావన తెచ్చినప్పుడు మళ్ళీ ధర్మరాజు వాళ్ళని అదే కారణం చేత శాంత పరచాడు.

వనవాసము అజ్ఞాతవాసము ముగిసిన తరువాత జరిగిన రాయబార పరంపరలో సంజయ రాయబారము చాలా ముఖ్యమైనది. ఆ సందర్భంలో ఉభయ పక్షాల క్షేమ సమాచారం అరసిన తరువాత, ధర్మరాజు సంజయుడితో ఇలా అన్నాడు: "భీష్మ విదురాదులకు మమ్మల్నందరిని యుద్ధ ప్రసక్తి నుండి కాపాడమని చెప్పు. కౌరవుల మధ్యలో కోపంగా ఉన్న దుర్యోధనుణ్ణి అనునయిస్తూ "నువ్వు చేసిన తప్పులన్నీ క్షమించాము. నువ్వు మాకు కలిగించిన దుఃఖాన్ని మాలోనే అణచుకుని ఓర్పు వహించాము. శాంతిని కోరే మాకు రాజ్యంలో కొంత భాగమైనా ఇవ్వు. అవిస్థలము, వృకస్థలము, మాకంది, వారణావతము అన్న నాలుగు గ్రామాలు, ఐదవది నీ కిష్టమైనది, మా ఐదుగురు సోదరులకి ఇవ్వు, దీనితో మనకు యుద్ధం జరగదు." అని చెప్పు. సంజయుడు వెళ్ళిన తరువాత ధర్మరాజు తన తమ్ముళ్ళతో కృష్ణుణ్ణి కౌరవ సభకు వెళ్ళి మనం భీష్మ ద్రోణ కృప బాహ్లికాది కురువీరులతో యుద్ధం చెయ్యాల్సిన అవసరం రాకుండా చూడమని అడుగుదాము అని అన్నాడు. అదే కృష్ణ రాయబారానికి దారితీసింది. కృష్ణుడికి తన ఆలోచనలు మళ్ళీ చెబుతూ, ధర్మరాజు, ఐదు గ్రామాలు కాని (అవిస్థలము, వృకస్థలము, మాకంది, వారణావతము, ఇంకోటి ఏదైనా) లేకపోతే ఒక పట్టణం కానీ ఇవ్వమని చెప్పు, అని అన్నాడు. తనకి ముందు ఉన్నది, తరువాత తనకి రాజసూయంలో లభించినది లేకపోయినా పరువాలేదనుకొని, ఇలా ధర్మరాజు ఎందుకు చేశాడంటే, యుద్ధానికి తాను కారణం కాకూడదని.

చివరకు యుద్ధం జరగనే జరిగింది. అవ్వాల్సిన నాశనం అయ్యింది. ధర్మరాజు మనస్సులో అంతులేని అశాంతి మొదలై వైరాగ్యం పుట్టించింది. రాజ్యం వద్దు, ముని వృత్తి చేపడతాను అని అతని చేత అనిపించింది. అందరూ సద్ది చెప్పగా తన ప్రయత్నం విరమించుకుని పట్టాభిషేకానికి తయారు అయ్యాడు ధర్మరాజు. దీన్ని బట్టి తెలిసేదేమంటే, ఒక్కొక్కసారి భవిష్యవాణి గురించిన జ్ఞానం ఉంటే, అది మనస్సుకి ఒత్తిడిని కలుగజేసి మన చేత చెయ్యరాని పనులు చేయించవచ్చు. ఆ ఒత్తిడే, భవిష్యవాణిలో చెప్పిన పరిణామాలు మామూలుగా కన్నా ఇంకా త్వరగా ఒనగూడడానికి, ప్రేరకంగా కూడా పని చేయవచ్చు. జరిగేది జరుగుతుంది అని అనుకున్న వాళ్ళు, జరగబోయే దాని వెంటబడి అదేమిటో తెలుసుకుని దాన్ని నిరోధించడానికి వెర్రిమొర్రి ప్రయత్నాలు చేయరు. అదే మంచిదేమో.

18. మహా నాయకులు

(మా అమ్మాయి, స్వాతి, స్కూలులో చదువుతున్న రోజులలో, తన డిబేటు పోటీ కోసం తయారు చేసిన మెటీరియల్ ఆధారంగా వ్రాసిన వ్యాసం ఇది. ఇప్పటికీ స్కూలు పిల్లలకి చదవడానికి బాగుంటుందని ఇక్కడ ఇస్తున్నాను.)

'ఏ దేశ చరిత్ర చూసినా, ఏమున్నది గర్వ కారణం?' అని అడిగితే 'నరజాతి చరిత్ర సమస్తం, మహా నాయకుల ఆదర్శ పరాయణ తత్త్వం' అని చెప్పొచ్చు. 'Lives of great men all remind us, we can make our lives sublime, and, departing, leave behind us, footprints on the sands of time' అన్నాడో ఆంగ్ల కవి. మానవ ప్రవృత్తిలో వీరపూజ అంతర్భాగం.

శ్రీశ్రీ గారు అన్నట్లు, మనకి మొదటి నుంచి బహు నాయకత్వం అలవాటు. ప్రతినాయకులకి కూడా ఈ మధ్య గౌరవం ఇస్తున్నాం. మనకి బోళ్ళుమంది దేవుళ్ళు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు, సినిమా హీరోలు, శాస్త్రవేత్తలు, మతగురువులు, కవులు, కళకారులు, సంస్కర్తలు ఉన్నారు. పేర్లు మనందరికీ తెలుసు. అందరూ నాయకులే. అయితే, నాయకులకీ, మహా నాయకులకీ చాలా తేడా ఉంది. నాయకులు సమకాలీన సమాజంతో పాటే అంతరించారు. మహా నాయకులు తర్వాతి తరాల్లో కూడా జీవించారు. దేశకాలమాన పరిస్థితులకి అతీతంగా, ముందుచూపుతో ఆచరణాత్మకంగా ప్రబోధాలిచ్చిన వాళ్ళు మహా నాయకులు. వాళ్ళెప్పుడూ తమ స్వార్థం తాము చూసుకోలేదు. ఏ ప్రలోభాలకీ లొంగలేదు. నమ్మింది చెప్పారు. చెప్పింది చేశారు. తమ తరమే కాకుండా, ముందు తరాల గురించి కూడా ఆలోచించారు.

రాజ్యం రాజు ఆస్తి కాదనీ, రాజు ప్రజలకి సేవకుడనీ రాజధర్మానికి కొత్త అర్థం చెప్పిన శ్రీరామచంద్రుడు; 'పరోపకారాయః పుణ్యాయ, పాపాయః పరపీడనం' అన్న ధర్మరాజు; 'కర్మణ్యేవాభికారస్తే' అని గీతను బోధించిన శ్రీకృష్ణుడు; అహింస గొప్ప ధర్మం అన్న గౌతమ బుద్ధుడు, మహాత్మాగాంధీ; అద్వైత సిద్ధాంతాన్ని అందించిన ఆదిశంకరుడు; సతీసహగమనం

తప్పన్న రాజా రాంమోహన్ రాయ్; బాల్య వివాహాలు తప్పని వితంతు వివాహాలు ప్రోత్సహించిన ఈశ్వరచంద్ర విద్యాసాగర్, కందుకూరి వీరేశలింగం; మానవసేవయే మాధవసేవ అని ఆచరించి చూపిన స్వామి వివేకానందుడు, మదర్ థెరీసా; ఇలా ఎందరో మహా నాయకులున్నారు. అందరికీ వందనాలు. వీళ్ళే కాక, పాశ్చాత్య నాగరికతలో ఉద్భవించిన లింకన్, టాల్స్టాయ్, లెనిన్, గ్లాడ్స్టన్, వాల్టేర్, సోక్రటీస్, అరిష్టాటిల్, ఏసు క్రీస్తు, ప్రాఫెట్ మహమ్మద్ లాంటి వాళ్ళు కూడా జనజీవితాన్ని ప్రభావితం చేశారు. సమాజాన్ని తప్పుదోవ పట్టించే పద్ధతుల్ని, మూఢనమ్మకాల్ని రూపుమాపడానికి మహా నాయకులు ఎంతో కృషి చేశారు. వీళ్ళందరూ మనకి ఆదర్శప్రాయులు.

నాయకులు మునుపూ ఉన్నారు, ఇప్పుడూ ఉన్నారు, అన్ని రంగాల్లో. కలిసుందాం అన్నవాళ్ళూ నాయకులే, విడిపోదాం అన్నవాళ్ళూ నాయకులే. ఇదే మన సౌభాగ్యం, ఇదే మన దౌర్భాగ్యం కూడా. అప్పటి నాయకులు తమ కున్నది సంఘం కోసం అనుకున్నారు. ఇప్పటివాళ్ళు సంఘానికి ఉన్నవన్నీ తమవే అనుకుంటున్నారు. ఇప్పటి కాలంలో, నిజమైన నాయకత్వం కొరవడడానికి, మహానాయకులు నిజంగా ఉన్నారా అని సందేహం రావడానికి, చాల కారణాలున్నాయి. స్వరాజ్యం వచ్చిన తర్వాత మనకి ఒకే లక్ష్యం అంటూ ఏదీ లేకపోవడం ఒక కారణం. సమాజంలో ఉన్న చెడు తెలిసి కూడా పలాయనతత్త్వం పాటించడం ఇంకొకటి. ఇవే కాక, మనలో కొన్ని వెర్రి ధోరణులున్నాయి. ఇప్పుడున్న పరిస్థితులనుబట్టి వెనకటి వాళ్ళ తప్పొప్పులు ఎంచడం. వీరసావార్కర్ మనలో కొంతమందికి నచ్చక పోవడం ఇందువల్లే. ఈ ధోరణి ఇలాగే వుంటే, మనకి కనిపించేవన్నీ విషవృక్షాలే.

ఇంకోటి, సంఘానికి మనం చేసింది, చేయంది, ఏమిటని ఆలోచించగపోగా, వేరేవాళ్ళ తప్పొప్పులు ఎంచడం. మరోటి, మనవరకు మనం ఏం చేసినా అది సబబే అనుకోవడం, అందులో అవినీతి ఉన్నా అది పరిస్థితుల ప్రభావం అని సరిపెట్టుకోవడం, అంతకుమించి ఎవరైనా చేస్తే అది మాత్రమే తప్పనడం. ఉదాహరణకి, రైల్లో బెర్తు కోసం టీటీకి వంద రూపాయలు లంచమివ్వడం తప్పు కాదనుకోవడం, వేరే ఎవరో కోట్ల మీద లంచాలు తీసుకుంటే అది మాత్రమే తప్పనడం.

ఇవన్నీ మనకి తెలిసినవే. అయితే మనం ఏం చేయాలి. చేసే ప్రతి పనీ, మన సంఘానికి, ముఖ్యంగా ముందు తరాలవారికి పనికొస్తుందా అని చూడడం, అన్ని విషయాలలో క్రమశిక్షణ పాటించడం, తర్వాత, మనకున్న సంకుచిత భావాలు కాకుండా, కేవలం మహానాయకుల సూక్తులే ముందు తరాలవారికి అందేలా చూడడం.

19. మాతృభాషలో విద్యాబోధన అవసరమా?

(మా అమ్మాయి, స్వాతి, స్కూలులో చదువుతున్న రోజులలో, తన డిబేటు పోటీ కోసం తయారు చేసిన మెటీరియల్ ఆధారంగా వ్రాసిన వ్యాసం ఇది. ఇప్పటికీ స్కూలు పిల్లలకి చదవడానికి బాగుంటుందని ఇక్కడ ఇస్తున్నాను.)

ఇప్పుడున్న పరిస్థితుల్లో మాతృభాష అనే పదానికి అర్థం చెప్పడం కష్టం. తల్లి మొదటి గురువు కాబట్టి తల్లి ద్వారా ప్రాప్తమైన భాష, అందరికీ మాతృభాష అవుతుంది. ఇది చెప్పడానికి చాలా సులభంగా ఉన్నా, దీనిలో రకరకాల సమస్యలు ఉన్నాయి. మనం చూస్తూ ఉంటాం, ఢిల్లీలో కొంతమంది తల్లులకి పిల్లలతో మాట్లాడే సమయమే ఉండదు. కాస్తంత టైం దొరికినా వాళ్ళు వాళ్ళ మాతృభాష వదిలి, ఇంగ్లీషులోనో హిందీలోనో పిల్లలతో మాట్లాడుతూ ఉంటారు. అప్పుడు, ఆ పిల్లల మాతృభాష ఏమయినట్టు? ఒక రకంగా, వాళ్ళకి ఏదీ రాకుండా పోతోంది.

ఈ మాతృభాషని కనిపెట్టడానికి కొన్ని పద్ధతులున్నాయి. ఒక మనిషి ఏమయినా వస్తువులు లెక్కపెట్టడానికి ఏ భాష వాడతాడో లేదా తన మనసులో నున్న ఏ రకమయిన అభిప్రాయాన్నయినా వ్యక్తం చెయ్యడానికి ఏ భాషయితే అనుకూలం అనుకుంటాడో ఆ భాష అతని మాతృభాష అవుతుంది. ఎవరయినా దెబ్బ తగిలినప్పుడు ఏ భాషలో స్పందిస్తారో అదే అతని మాతృభాష అవుతుంది. దీన్నిబట్టి చూస్తే ఢిల్లీలో ఉన్న పిల్లల మాతృభాష నిర్దిష్టంగా ఎంచటం కష్టం. సమస్య ఎక్కడ వస్తోందంటే, మాతృభాష ఎక్కువ వాడుకలో లేకపోవడం, మాతృభాషలో విద్యాబోధన జరగకపోవడం.

సరే. ఢిల్లీలాంటి చోట్లలో ఉన్న సమస్య అలా ఉంచి, అసలు పిల్లలలో భాష అనేది ఎలా మొదలవుతుందో ఆలోచిద్దాం. పిల్లలు 3-4 ఏళ్ళ వయస్సులో తల్లి ద్వారా గానీ, ఇతరుల ద్వారా గానీ సుమారుగా 150 పదాలు నేర్చుకుంటారు. ఇవి చాలవరకు చుట్టూ ఉన్న మనుషులు, జంతువులు, ఇతర పరసరాలకు సంబంధించిన పేర్లయి ఉంటాయి. చిన్న చిన్న అంకెలు

లెక్కపెట్టడం కూడా నేర్చుకుంటారు. అసలు సిసలైన మాతృభాషలోనే ఈ విద్యాబోధన జరుగుతుంది. ఇందులో ఏ ఇతర భాషాప్రమేయం ఉండదు. ఈ దశని ఎవరూ ఎందుకనో విద్యాబోధనలో దశగా చూడడం లేదు. అసలు ఇందువల్లే సమస్యలు వస్తున్నాయి. ఎందుకంటే, ఈ దశ తర్వాత పిల్లలు స్కూల్లో చేరతారు. స్కూల్లో విద్యాబోధన అదే భాషలో కొనసాగితే కొత్త లేకుండా సులభంగా ఉంటుంది. కానీ, జరుగుతున్నది ఏమిటంటే, వాళ్ళు నేర్చుకున్న 150 పదాలకి బదులు వాటికి సమానమైన ఇతర భాషా పదాలు లేదా వేరే పదాలు నేర్చుకోవలసి వస్తోంది. ఇది చెయ్యడం వల్ల పిల్లలు చాలా మానసిక వత్తిడులకు లోనయి తల్లి ద్వారా సంక్రమించిన మాతృభాషని మర్చిపోవలసి వస్తోంది. ఆ తర్వాత, ఆ నేర్చుకునే కొత్త భాషయినా క్షుణ్ణంగా నేర్చుకుంటున్నారా అంటే, అదీ లేదు. ఇక, అక్కడినుంచి తిప్పలు మొదలు. కొంచెం పెద్ద క్లాసుల్లోకి వచ్చేసరికి ఇంగ్లీషు బాగా రానిదే అన్ని సబ్జెక్ట్స్, ముఖ్యంగా సైన్స్ సబ్జెక్ట్స్, నేర్చుకోవడం కష్టం.

ఇటు మాతృభాషలో విద్యాబోధన లేక, అటు ఇంగ్లీషు సరిగా రాక, చాలా మంది పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇది ఎదుర్కొనడానికి, రకరకాల దగ్గర దారులు వెతుక్కుంటున్నారు. Examination systemకి తగ్గట్టుగా ఏవో కొన్ని టాపిక్స్ బట్టీ పట్టడం, దాని తయారీకి ట్యూషన్స్ కి ఎగబడడం లాంటివి చేస్తున్నారు.

అసలు ఈ బాధ మనకేనా, అందరికీ ఉందా? ఇతర దేశాల్లో ఏం చేస్తున్నారు? రష్యా, చైనా, అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో విద్యాబోధన పూర్తిగా మాతృభాషలోనే జరుగుతోంది. అయితే, మనవాళ్ళు అంటారు, సైన్స్, లెక్కలు లాంటి సబ్జెక్ట్స్ ఇంగ్లీషులోనే ఉంటే బాగుంటుందని. మరి అక్కడివాళ్ళు ఎలా నేర్చుకుంటున్నారు? శాస్త్ర విజ్ఞానంలో వాళ్ళల్లో కూడా చాలామంది నిష్ణాతులున్నారు. అది ఎలా అంటే, వాళ్ళు సాంకేతిక పదాలని (technical words) అలాగే గ్రహించి మిగిలిన పదాలు వాళ్ళ భాషలో చెప్తున్నారు. ఇక్కడే, మన వాళ్ళల్లో సమస్య వస్తోంది. మనకి, ప్రతి పదానికీ, తర్జుమా లేందే తోచదు. అందువల్ల, సాంకేతిక పదాలకి బదులుగా చాలా క్లిష్టమైన పదాలు మన విద్యాబోధనలో చోటు చేసుకుంటున్నాయి. ఈ కారణంగానే, అందరూ విద్యాబోధన ఇంగ్లీషు (English) లోనే ఉంటేనే

బాగుంటుందనే ధోరణికి వచ్చేశారు. అసలు successful studentsని ఎవరినయినా అడిగి చూడండి. వాళ్ళు నేర్చుకోవడం గానీ అర్థం చేసుకోవడంగానీ మాతృభాషలో చెయ్యడం వల్ల వాళ్ళకి subjects బాగా అర్థం అయ్యాయని చెప్తారు.

మాతృభాషలో విద్యాబోధన ఉండడం కోసమేనేమో, మనదేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాలు (linguistic States) ఏర్పడ్డాయి. మన ఆంధ్రప్రదేశ్ లో భాషా ఉద్యమాలు కూడా నడిచాయి. విద్యాబోధన శిష్ట వ్యవహారికంలో ఉండాలని సమర్థిస్తూ పింగళి లక్ష్మీకాంతం గారి అధ్యక్షతన అప్పటి అధికార భాషాసంఘం తీర్మానించింది. శిష్ట వ్యవహారికం అంటే, కాస్త చదువుకున్న వాళ్ళు మాట్లాడే భాష. ఇప్పుడు మనం చూస్తూ ఉంటాం. ఆఫీసుల్లోనూ, బిజినెస్స్ లోనూ జనాలు సాంకేతిక పదాలు వచ్చినప్పుడు ఇంగ్లీషు ఉపయోగిస్తూ మిగిలిన పదాలు వాళ్ళకి వచ్చిన భాషలో మాట్లాడుకుంటారు. ఈ పని విద్యాబోధనలో చేస్తే ఏమయినా తప్పా? ఏమిటి ఇబ్బంది? మనందరికీ తెలుసు, ఎంత చదుకున్న వాళ్ళయినా వేరే భాష మాట్లాడ వలసి వచ్చినప్పుడు ముందు మాతృభాషలో మనస్సులో అనుకుని, తర్వాత దాన్ని ఆ భాషలోకి తర్జుమా చేసి గబగబా పైకి అంటారు.

మన గురజాడ అప్పారావుగారు ఏమన్నారో తెలుసా? "Italian of the East అనిపించుకున్న ఈ తెలుగులో మన సుఖాలనీ, మన దుఃఖాలనీ వెల్లడించుకోడానికి మనం ఎవరమూ సిగ్గుపడలేదు, కానీ కాగితం మీద పెట్టడానికి మాత్రం మనలో కొంత మంది బిడియ పడుతున్నారు." అందుకనే, మాతృభాషలో విద్యాబోధన ఉండడం చాలా అవసరం.

20. యక్ష ప్రశ్నలు

"యక్ష ప్రశ్నలు" అన్నది మహాభారతం అరణ్య పర్వంలోని పాండవుల అరణ్యవాసానికి సంబంధించిన ఆఖరి ఘట్టము. మహాభారతం నిజంగా జరిగిందా లేదా, జరిగితే అందులో యక్ష ప్రశ్నల ఘట్టం ఉందా లేదా అన్న అనవసర వాదనలు పక్కన పెట్టేస్తే, ఈ ఘట్టంలో నేటి యువతరానికి నేర్చుకోవలసినవి, ముఖ్యంగా వ్యక్తిత్వ వికాసానికి (personality development) సంబంధించిన విషయాలు చాలా ఉన్నాయని నాకనిపిస్తుంది. ఈ ఘట్టం గురించిన ప్రవచనాలు అవీ వింటూ ఉంటే నాకు ఆసక్తి పెరిగింది. ఇంటర్నెట్ (Internet) లో చదివి తెలుసుకుందామని ప్రయత్నం చేశాను. తీరా చూస్తే, "ఈ ప్రశ్నలు అసలు ఎన్ని?" అన్న విషయం మీదే భిన్నాభిప్రాయాలు ఉన్నాయని తెలిసింది. నాకు సంస్కృతం రాదు. అందుకని, సంస్కృత శ్లోకాలతో పాటు తాత్పర్యము కూడా ఉంటే చదివి తెలుసుకుందామని చూశాను. అప్పుడు, నాకు ఈ క్రింద ఇచ్చిన నాలుగు మూలాలు (open sources) దొరికాయి, ఇంటర్నెట్ లో.

(1) శ్రీమత్తిరుమలై కండ్యూరు రామానుజాచార్యుల వారిచే విరచించబడిన 'యక్ష ప్రశ్నలు' అన్న గ్రంథం (1901)

(2) స్వామి సుందర చైతన్యానంద విరచించిన యక్ష ప్రశ్నలు (1995)

(3) Yaksha Prasnah – English translation by KM Ganguli available at: https://ia902905.us.archive.org/24/items/yakshaprasna-sanskrit-english-k.-m.-ganguli/Yakshaprasna%20Sanskrit%20English%20-%20K.M.Ganguli.pdf

(4) యక్షప్రశ్నాః available at: https://sanskritdocuments.org/doc_z_misc_major_works/yaxa-te.pdf

ఇవి చదివి నేను వ్రాసుకున్న నోట్సు అందరికీ పనికొస్తుందనే ఉద్దేశ్యంతో ఇక్కడ ఇస్తున్నాను. మొట్టమొదటగా, భారతం లోని సందర్భము గురించి కొంచెం చెప్పి ప్రశ్నల లోకి వెళదాము.

ఒక బ్రాహ్మణుని అరణి (రాచి నిప్పు పుట్టించు జమ్మికొయ్య) పొరపాటున జింక కొమ్ముకి తగులుకోవడం వల్ల, దాన్ని జింక తీసుకుపోయింది. ఆ అరణి కోసం జింకను తరుముతూ, పాండవులు అడవిలో చాలా దూరం పోయి దాహార్తు లవడం వల్ల, ధర్మరాజు ఆదేశం మేరకు నకులుడు చెట్టు ఎక్కి ఒక కొలనుని చూసి దాని దగ్గరకు నీళ్ళ కోసం వెళతాడు. అక్కడ కొంగ రూపంలో ఉన్న ఒక యక్షుడు అతనిని అడ్డగించి తన ప్రశ్నలకి బదులు చెప్పందే నీరు త్రాగడానికి గానీ, తీసుకుని వెళ్ళడానికి గానీ వీలు లేదని చెబుతాడు. ఆ హెచ్చరికను పట్టించుకోకుండా, నకులుడు నీరు త్రాగి గట్టుకొచ్చే లోపునే క్రింద పడిపోతాడు. ఎంత సేపటికీ నకులుడు రాకపోయే సరికి, అతనిని వెతుక్కుంటూ, ముందు సహదేవుడు, తర్వాత అర్జునుడు, ఆ తర్వాత భీముడు ఆ కొలను దగ్గరకి వచ్చి అలాగే ధిక్కరించి నీరు త్రాగి పడిపోతారు. వీళ్ళని వెతుక్కుంటూ ధర్మరాజు (యుధిష్ఠిరుడు) కూడా వస్తాడు. అతడు తన తమ్ముల వలె యక్షుని హెచ్చరికను అలక్ష్యం చేయక ఆతడు అడిగిన ప్రశ్నలకి సమాధానం చెప్పడానికి పూనుకుంటాడు. శవాల లాగా పడివున్న తమ్ముళ్ళని చూసి విచలితుడయ్యి కూడా, ధైర్యాన్ని కూడదీసుకుని ధర్మరాజు చాలా అద్భుతంగా యక్షప్రశ్నలకి బదులు చెప్పడం చాలా గొప్ప విషయం. బహుశా, మొట్టమొదటి ఉక్కు మనిషి, అనగా ఐరన్ మాన్ (Iron Man), ధర్మరాజేనేమో.

మొత్తం 77 శ్లోకాల యక్ష ప్రశ్నల ఘట్టంలో, 34 శ్లోకాలలో యక్షుడు 124 ప్రశ్నలు సంధించాడు. ధర్మరాజు 43 శ్లోకాలలో వాటికి సమాధానం చెప్పాడు. ఈ ప్రశ్నలు ఎన్నో రంగాల గురించి ఉన్నా, ముఖ్యంగా మంచి మనిషిగా బ్రతకడానికి ఏమేమి కావాలో చెప్పించాయి. ఖగోళ సంబంధమైన ప్రశ్నలు సూర్యుడి గురించి, సూర్యుడి చుట్టూ ఎవరు తిరుగుతారని (పరోక్షంగా సూర్యుడు తిరగడని చెప్పడం), ఎక్కువ జలము ఉన్నది ఏది అని, కాలగమనం గురించినవి, వర్షాలు, మేఘాలు, విత్తనాలు, గోసంపద లాంటి ప్రకృతి, పశుసంపదలకి సంబంధించినవి, ఇలాంటివి చాలా విస్తృతంగా ఉన్నాయి. శ్రోత్రియ, క్షత్రియ లక్షణాలు, సత్పురుషుల లక్షణాలు, మనిషికి ఉండకూడని లక్షణాలు, తల్లిదండ్రుల గొప్పదనము, గృహస్థాశ్రమ ప్రాముఖ్యత, వివిధ సందర్భాలలో మిత్రత్వము, మానసిక దైహిక ఆరోగ్యములకు సంబంధించినవి, మనిషి

జీవచ్ఛవం లాగా బ్రతకడం అంటే ఏమిటి, జనన మరణాలు, తపస్సు, ఇలా అనేక విషయాలు ఈ ప్రశ్నలలో స్పృశింపబడ్డాయి. భగవద్గీతలో ఉన్న "యద్య దాచరతి శ్రేష్ఠః", "స్వధర్మే నిధనం శ్రేయః" లాంటి శ్లోకార్థాలు వేరే శ్లోకాలలో ఈ ఘట్టంలో కనిపిస్తాయి. ఆశ్చర్యం అంటే ఏమిటి?, వార్త అంటే ఏమిటి? లాంటి విచిత్రమైన ప్రశ్నలు ధర్మరాజు చేత చాలా గూఢమైన జవాబులు చెప్పించాయి. "ధర్మేచ అర్థేచ కామేచ - నాతి చరామి" అన్న మంగళ వాక్యాల లోని అర్థాన్ని చాల ఆశ్చర్యకరంగా వేరే విధంగా, పరస్పర విరుద్ధమైన ధర్మార్థకామాలకి సంగమ స్థానం భార్య అని, యక్షుడి చేత అడిగించి ధర్మరాజు చేత జవాబు రూపంలో చెప్పించారు.

ఈ ప్రశ్నలలో చాలా ప్రశ్నలు క్లిష్టంగా ఉంటాయి. వెంటనే జవాబు చెప్పడం అంటే సాధమయ్యే పని కాదు. అందుకనే, ఎవరికైన కష్టమైన ప్రశ్నలు వేస్తే యక్ష ప్రశ్నలు వేశావు అంటారు. ఇక ప్రశ్నలు జవాబులు ఏమిటో చూద్దాము.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కింస్విదా దిత్యమున్న యతి, కే చ తస్యాభితశ్చరాః
కశ్చైనమస్తం నయతి, కస్మిన్చ ప్రతితిష్ఠతి.

తా: (1) సూర్యుణ్ణి ఉదయింప జేసి ఆకాశ మార్గాన ఉండేటట్లు చేసేది ఏది? (2) సూర్యుని చుట్టూ ఎవరు సంచరిస్తారు? (3) సూర్యుని ఏది అస్తమింప జేయుచున్నది? (4) సూర్యుడు దేని యందు శాశ్వతముగ నిలుపబడి యున్నాడు? (నిలుపబడడం అంటే నిలకడ గురించి అడగడం. "ఏ తావున రా! నిలకడ నీకు, .. " అన్న త్యాగరాజ స్వామి కీర్తన వినే ఉంటాము.)

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

బ్రహ్మ౽దిత్యమున్న యతి, దేవా స్తస్యాభితశ్చరాః
ధర్మ శ్చాస్తం నయతిచ సత్యేచ ప్రతితిష్ఠతి.

తా: పరమాత్మ, పరబ్రహ్మమే (విశ్వ నియమమే) సూర్యునికి ప్రేరకుడు. ఆ భయము, ప్రేరణ చేతనే సూర్యుడు ఉదయిస్తున్నాడు. సూర్యునికి చుట్టూ సహాయభూతులుగా దేవతలు తిరుగుతూ ఉంటారు. ధర్మము (అనగా నియమము లేక కర్తవ్యము) వలనే సూర్యాస్తమయం అవుతున్నది. ధర్మస్వరూపుడైన యమధర్మరాజు మూలంగా, సూర్యాస్తమయం వలన ప్రాణుల యొక్క ఆయుస్సులో కొంచెం భాగము తగ్గిందని తెలుస్తోంది. సూర్యుడు సత్యము (ఋతము లేక మూల సత్యము) నందే నిలబడి యుంటున్నాడు. మామూలుగా అయితే సూర్యోదయం సూర్యాస్తమయం అనేవి ఉండవు. సూర్యుడు ఎప్పుడూ ప్రకాశవంతంగా ఉంటాడనేది నిత్యసత్యము. భూమి (పంచభూతాలలో ఒకటి) సూర్యుని చుట్టూ తిరగడం వల్ల ఉదయం, అస్తమయం అన్నవి వివిధ ప్రాంతాలకు వివిధ సమయాల్లో కనిపించే విన్యాసాలు.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కేనస్విచ్ఛ్రోత్రియో భవతి కేనస్విద్విన్దతే మహత్
కేనస్విద్ద్వితీయవాన్ భవతి రాజన్ కేనచ బుద్ధిమాన్

తా: (5) మనుజుడు దేని చేత శ్రోత్రియుడవుతాడు? (6) దేని చేత గొప్పతనమును (బ్రహ్మమును) పొందుతాడు? (7) దేని చేత సహాయవంతు డవుతాడు, అనగా రెండవది కలవాడవుతాడు? (8) దేని చేత బుద్ధిమంతు డవుతాడు?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

శ్రుతేన శ్రోత్రియో భవతి తపసా విందతే మహత్
ధృత్యా ద్వితీయవాన్ భవతి బుద్ధిమాన్ వృద్ధ సేవయా.

తా: శ్రుతం అంటే వినికిడి అన్న అర్థం తీసుకుంటే శ్రవణం చేస్తే శ్రోత్రియుడవుతాడు. అంటే, వేదాలు, ఉపనిషత్తులు, సాధు వృత్తాంతములు వింటే / అధ్యయనం చేస్తే శ్రోత్రియుడవుతాడు అని. తపస్సు (నియమ పాలన) వలన మహత్తును (బ్రహ్మమును) పొందుతాడు. తనొక్కడైనా ధైర్యము చేత మరియొకనితో కూడిన వాడుగా అవుతున్నాడు. అంటే, ధైర్యమే మనిషికి చివరి

దాకా తోడు వస్తుంది. జ్ఞాన వయో వృద్ధుల నుపాసించుట చేత (శుశ్రూష, సేవ లేక అనుసరించడం వల్ల) మనిషి బుద్ధిమంతుడగును. అనగా జ్ఞాన వృద్ధులైనందున తత్వార్థములను వయో వృద్ధులైనందున లోకానుభోగములను చూపించుటచే మనిషి బుద్ధిమంతుడవుతాడని అర్థము. "ద్వితీయ" అంటే భార్య, రెండవది అని రెండర్థాలు ఉన్నాయి. అందుకని, ఒక నిర్దిష్ట సమాధానాన్ని సూచించేలా తప్పుదోవ పట్టించడానికి వేసిన ప్రశ్న "కేనస్విద్ద్వితీయవాన్ భవతి". దానికి "భార్య" అని సమాధానం చెబితే, ధర్మరాజు పప్పులో కాలేసినట్లే. కానీ అలా జరగకుండా, చాలా తెలివిగా మసులుకున్నాడు ధర్మరాజు. చివరి దాకా తోడుండేది భార్య / భర్త కాదు, ధైర్యం అని అందరికి తెలిపాడు.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కిం బ్రాహ్మణానాం దేవత్వం కశ్చ ధర్మస్సతామివ
కశ్చైషాం మానుషో భావః కిమేషా మసతామివ

తా: (9) బ్రాహ్మణులకు దైవత్వము ఎందులో ఉంది? (10) సత్పురుషులకు లాగా వాళ్ళలో ఉన్న లక్షణం ఏమిటి? (11) వాళ్ళలో సామాన్య మానవులకు లాగా ఉండే లక్షణం ఏమిటి? (12) వాళ్ళలో దుష్టులకు లాగా ఉండే లక్షణం ఏమిటి?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

స్వాధ్యాయ ఏషాం దేవత్వం తప ఏషాం సతామివ
మరణం మానుషో భావః పరీవాదో ఽసతామివ

తా: బ్రాహ్మణులకు వేదాధ్యయనము గాని పరమాత్మను తెలుసుకొన వలయునను ఆలోచన గాని దేవ లక్షణము. వీరికి సత్పురుషులకు వలె నున్న లక్షణము తపస్సు. వీరికి ఉన్న సామాన్య మానవ లక్షణం మృతి జెందుట (అనగా శరీరమును విడుచుట). ఇతరులను నిందించడం లేక ఆడిపోసుకోవడం వీరికి ఉన్న దుష్ట లక్షణం.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కిం క్షత్రియాణాం దేవత్వం కశ్చ ధర్మస్సతామివ
కశ్చైషాం మానుషో భావః కిమేషా మసతామివ

తా: (13) క్షత్రియులకు దైవత్వము ఎందులో ఉంది? (14) సత్పురుషులకు లాగా వాళ్ళలో ఉన్న లక్షణం ఏమిటి? (15) వాళ్ళలో సామాన్య మానవులకు లాగా ఉండే లక్షణం ఏమిటి? (16) వాళ్ళలో దుష్టులకు లాగా ఉండే లక్షణం ఏమిటి?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

ఇష్వస్త్ర మేషాం దేవత్వం యజ్ఞ ఏషాం సతామివ
భయం వై మానుషో భావః పరిత్యాగో ఽసతామివ

తా: క్షత్రియులకు అస్త్రశస్త్రములు (విలువిద్య) దేవ లక్షణము. యజ్ఞములు (అశ్వమేధాది - లోక క్షేమం కోసం త్యాగ దృష్టితో చేసేవి) చేయడం వాళ్ళలో ఉన్న సత్పురుష లక్షణం. యుద్ధంలో గాని రాజ్యపాలన సంక్షోభాలని గురించి గాని భయపడడం వాళ్ళలో ఉన్న మనుష్య లక్షణం. ఆర్తులను కాపాడవలసిన క్షత్రియ ధర్మాన్ని విడచిపెట్టడడం వాళ్ళకున్న దుష్ట లక్షణం.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కిమేకం యజ్ఞియం సామ కిమేకం యజ్ఞియం యజుః
కా చైషాం వృణుతే యజ్ఞం కాం యజ్ఞో నాతివర్తతే

తా: (17) యజ్ఞమందలి సామ వేదము యెంత ముఖ్యమైనది? (18) యజ్ఞ యజుస్సెట్టిది? (19) ఏది యజ్ఞమును వరించును? (20) యజ్ఞము దేనిని యతిక్రమించదు?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

ప్రాణోవై యజ్ఞియం సామ మనోవై యజ్ఞియం యజుః

ఋగే కా వృణుతే యజ్ఞం తాం యజ్ఞో నాతివర్తతే

తా: యజ్ఞములో సామ వేదము ప్రాణము, యజుస్సు మనస్సు వంటివి. ఋగ్వేదము యజ్ఞమును వరించును. యజ్ఞము ఋగ్వేదమును యతిక్రమించదు.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కిం స్విదావతతాం శ్రేష్ఠం కిం స్విన్ని వతతాం వరం
కిం స్విత్ప్రతిష్ఠమానానాం కిం స్విత్ప్రసవతాం వరం

తా: (21) నేల మీద పడుచున్న వాటిలో యేది శ్రేష్టము? (22) చల్లెడు వాటిలో యేది శ్రేష్టము? (23) ప్రతిష్ఠకయిన (ప్రతిష్ఠమానానాం అంటే నాలుగు కాళ్ళ జంతువులని కూడా అర్థం చెప్పబడింది) వాటిలో యేది శ్రేష్టము? (24) కనెడి / ప్రసవించెడి వాటిలో యేది శ్రేష్టము?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

వర్ష మావతతాం శ్రేష్ఠం బీజం నివతతాం వరం
గావః ప్రతిష్ఠమానానాం పుత్రః ప్రసవతాం వరః

తా: నేల మీద పడుచున్న వాటిలో వర్షము శ్రేష్టము. ఎందుకంటే, తను క్రింద పడి జీవులకు ఆధార మవుతోంది. చల్లెడు వాటిలో విత్తనము శ్రేష్టము. ఎందుకంటే, తాను క్రమంగా క్షీణించి మొక్కలకు / వృక్షాలకు ప్రాణం పోస్తుంది. ప్రతిష్ఠకయిన వాటిలో గోవు శ్రేష్ఠము, గడ్డి తిని పాలిస్తుంది కాబట్టి. కనెడి వాటిలో పుత్రుడు శ్రేష్ఠము. అంటే, సప్తసంతానాలలో కడుపున పుట్టిన వాడు / పుట్టినది శ్రేష్ఠము.

యక్ష ఉవాచ (ప్రశ్న):

ఇంద్రియార్థా ననుభవన్ బుద్ధిమాన్ లోక పూజితః
సమ్మ తః సర్వ భూతానా ముచ్ఛ్వ సన్ కో న జీవతి

తా. (25) ఇంద్రియభోగాలు అనుభవిస్తూ, బుద్ధిమంతుడుగా లోకంలో పూజలు అందుకుంటూ, అందరికీ ఇష్టుడుగా ఉంటూ, శ్వాస పీలుస్తున్నా కూడా మరణించిన వాడు ఎవడు? అంటే బతికున్నా చచ్చిన వాడితో సమానమైన వాడు ఎవడు?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

దేవతాతిథి భృత్యానాం పితౄణా మాత్మనశ్చ యః
న నిర్వపతి పఞ్చానా ముచ్ఛ్వసన్ న స జీవతి

తా: దేవతలకు, అతిథులకు, సేవకులకు, పితృదేవతలకు, తనకు (అంటే ఎవరినైతే పోషించాలో వారికి) - ఈ ఐదుగురికీ ఎవడైతే ఇవ్వాల్సింది ఇవ్వడో వాడు శ్వాస పీలుస్తున్నా మరణించినట్లే. అంటే, ఇతరులకు పెట్టకుండా తినేవాడు జీవచ్ఛవం లాంటి వాడు.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కిం స్విద్గురుతరం భూమేః కిం స్విదుచ్చ తరం చ ఖాత్
కిం స్విచ్ఛీఘ్రతరం వాయోః కిం స్విద్బహుతరం తృణాత్

తా: (26) భూమి కంటె గురుతరమైనది (పెద్దది లేదా గొప్పది) యేది? (27) ఆకాశము కంటె ఎత్తైనదేది? (28) వాయువు కంటె జవము కలదేది (వేగం కలదేది)? (29) తృణము (గడ్డి పరక) కంటె ఎక్కువగా పెరిగేది (లేదా వ్యాపించేది) ఏది?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

మాతా గురుతరా భూమేః ఖాత్ పితోచ్చ తర స్తథా
మనః శీఘ్రతరం వాతాచ్చింతా బహుతరీ తృణాత్

తా:	భూమి కంటె గురుతరమైనది అమ్మ. అంటే క్షమయా ధరిత్రి కన్న అమ్మకు క్షమ ఎక్కువ. తండ్రి ఆకాశము కంటె ఎత్తైనవాడు. ఆయన పట్టే గొడుగు క్రిందే (ఛత్రఛాయల్లో) సంతానం జీవిస్తుంది. మనస్సు వాయువు కంటె వేగం కలది. అనుకోంగానే ఎక్కడికైనా వెళ్ళగలదు. చింత, అంటే మనోవ్యథ, గడ్డి పరక కంటె ఎక్కువగా (త్రుంచేకొద్దీ) పెరుగుతుంది.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కిం స్విత్సుప్తం న నిమిషతి కిం స్విజ్జాతం న చోపతి
కస్య స్విద్ హృదయం నాస్తి కిం స్విద్వేగేన వర్ధతే

తా:	(30) నిద్ర పోవుచు కన్నులు ముయ్యనిది యేది? (31) పుట్టియు చైతన్యము పొందనిది యేది? (32) హృదయము లేనిది యేది? (33) వేగము చేత పెరుగున దేది?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

మత్స్యః సుప్తో న నిమిష త్యణ్డం జాతం న చోపతి
అశ్మనో హృదయం నాస్తి నదీ వేగేన వర్ధతే

తా:	నిద్ర పోవుచు కన్నులు ముయ్యనిది చేప. చేప ఏ విధంగా ఉభయచరమో, మనిషి కూడ జాగ్రత్స్వప్నావస్థలు రెంటిలో సంచరిస్తూ చూస్తున్నాననుకొని ఏమీ చూడ లేక సుషుప్తావస్థలో పడిపోతాడు. అంటే, నిద్ర పోతాడు. అంటే, చూస్తున్నట్లుగా ఉన్నా చూడకనే ఉన్నది. పుట్టియు చైతన్యము పొందనిది గ్రుడ్డు. జాగ్రత్స్వప్న సుషుప్తావస్థలలో చరిస్తున్నా మనిషి సాక్షిగా మాత్రమే ఉంటాడు కాని నిజంగా చరించే వాడు కాడు. అందుకని కదలని గ్రుడ్డు లాగా పడి ఉంటాడు. రాతికి హృదయము లేదు. శోకమోహాదులకి సుఖసంతోషాలకి అతీతుడైన మహానుభావుడికి హృదయం లేదు, బండరాయి లాంటి వాడు అంటాము. వేగము చేత పెరుగునది నది, నిత్య జీవితంలో. ఆత్మజ్ఞానం కూడా అలాగే పెరుగుతుంది. తెలుసుకున్న కొద్దీ ఎక్కువవుతుంది.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కిం స్విత్ ప్రవసతో మిత్రం కిం స్విన్మిత్రం గృహే సతః
ఆతురస్య చ కిం మిత్రం కిం స్విన్మిత్రం మరిష్యతః

తా: (34) ప్రయాణీకులకు (ప్రవాసం వెళ్ళేవానికి) స్నేహితుడెవడు? (35) ఇంట నుండెడు వానికి స్నేహితుడెవడు? (36) రోగపీడితునికి ఎవడు మిత్రుడు? (37) చచ్చెడి వానికి ఏది మిత్రము?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

సార్థః ప్రవసతో మిత్రం భార్యా మిత్రం గృహే సతః
ఆతురస్య భిషజ్మిత్రం దానం మిత్రం మరిష్యతః

తా: ప్రయాణీకులకు సార్థం అంటే తోటి ప్రయాణీకుల సంఘం స్నేహితుడు. గృహస్తునికి పత్నియే స్నేహితురాలు. రోగపీడితునికి వైద్యుడే మిత్రుడు. చావబోయేవాడికి దానమే మిత్రము. అంటే, మనం నలుగురికి సాయం చేస్తే మనకి నలుగురు సాయం చేస్తారు.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కోఽతిథిః సర్వభూతానాం కింస్విద్ధర్మం సనాతనం
అమృతం కింస్విద్రాజేంద్ర కింస్విత్సర్వ మిదం జగత్

తా: (38) అన్ని భూతములకు ఎవరు అతిథి? (39) సనాతన ధర్మము ఎటువంటిది? (40) రాజశ్రేష్ఠా! అమృత మెటువంటిది? (41) యీ జగత్తంతయు ఏది ముఖ్యముగా కలది?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

అతిథిః సర్వభూతానా మగ్నిః సోమో గవామృతం
సనాతనోఽమృతో ధర్మో వాయుః సర్వమిదం జగత్

తా:   అన్ని భూతములకు యగ్నిహోత్రు డతిథి. జఠరాగ్ని రూపంలో అతడు జీవులు తిన్న ఆహారాన్ని అరిగించడం వల్ల శరీరాల్లో ఎదుగుదల కనపడుతోంది. బాహ్యంగా అతడు అన్నీ గ్రహించి పొగ రూపంలో మేఘాలు సృష్టించడం వల్ల వానలు పడుతున్నాయి. అందువల్లే కదా మనకు పంటలు పండుతున్నాయి. సోమ లత, గోక్షీరములే అమృతము. ఇటువంటివి అగ్నికి సమర్పించడం వల్లే ధూమం ఏర్పడి మేఘాల ద్వారా వర్షం పడుతోంది. ఎప్పటికీ మృతము కానిదైన సనాతన ధర్మమే అమృతము వలె అనుభవింప తగినది. ఈ జగత్తంతయు వాయు ప్రధానముగా కలది. అందుకే మనం బ్రతక గలుగుతున్నాం.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కిం స్విదేకో విచరతే జాతః కో జాయతే పునః
కిం స్విద్ధిమస్య భైషజ్యం కిం స్విదావపనం మహత్

తా:   (42) ఒంటరిగా ఎవరు సంచరిస్తారు? (43) మళ్ళీ పుట్టేది ఏది? (44) మంచుకు ఏది వైద్యము? (45) ఏది గొప్ప ఆధారము?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

సూర్య ఏకో విచరతే చంద్రమా జాయతే పునః
అగ్ని ర్హిమస్య భైషజ్యం భూమిరావపనం మహత్

తా:   ఒంటరిగా తిరిగేవాడు సూర్యుడు. క్షయించుట చేత చంద్రుడు మళ్ళీ పుట్టుచున్నాడు. మంచుకు మందు అగ్ని. అన్నిటికీ గొప్ప ఆధారం భూమే. చలించే వాయువుతో నిండిన జగత్తులో చలిస్తున్నట్లుగా కనపడి అచలంగా ఉండేది సూర్యుడే. అంటే, జ్ఞానసూర్యుడు. అతడు హృదయాకాశంలో చీకటి లేదా అజ్ఞానమనే ద్వైతానికి దూరంగా ఏకాంతంగా ఉంటాడు. మనస్సుకు సంబంధించిన దేవత చంద్రుడు. అతడు మళ్ళీ పుట్టడం అంటే, ఈ ప్రపంచం మనస్సులో నుండి మళ్ళీ మళ్ళీ పుట్టడం. "చంద్రమా మనసో జాతః" అన్న పురుష సూక్తం లోని

వాక్యం చంద్రుడు మనస్సు నుండి పుట్టాడని తెలియజేస్తుంది. అజ్ఞానానికి జ్ఞానానికి దేహమే క్షేత్రము. ఈ క్షేత్రంలో మనం నాటే కర్మలనే విత్తనాలకు సంబంధించిన ఫలాలు అందుకుంటాము. అగ్ని వేడికి మంచు కరిగినట్లు జ్ఞానసూర్యుడనే అగ్నికి అజ్ఞానమనే మంచు కరిగిపోతుంది.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కిం స్విదేక పదం ధర్మ్యం కిం స్విదేక పదం యశః
కిం స్విదేక పదం స్వర్గ్యం కిం స్విదేక పదం సుఖం

తా: (46) ధర్మమునకు ముఖ్యమైన ఒకే ఆధార స్థానము ఏది? (47) కీర్తికి కారణమైన ఏకపదం ఏది? (48) స్వర్గానికి అనుబంధమైన మార్గ మేది? (49) సుఖము దేనిలో ఉంది?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

దాక్ష్య మేక పదం ధర్మ్యం దాన మేక పదం యశః
సత్య మేక పదం స్వర్గ్యం శీల మేక పదం సుఖం

తా: ధర్మము యొక్క ముఖ్యాధార స్థానమైనది దక్షత లేక సామర్ధ్యము. కీర్తికి ముఖ్య మార్గము యీవియే. అంటే, ఈ ప్రపంచంలోకి వచ్చినప్పుడు ఏమీ తీసుకురాలేదు ఏమీ తీసుకుపోము అని గ్రహించి చేసే దానాలు కీర్తికి మార్గము. స్వర్గమునకు ముఖ్యమైన త్రోవ అనృతరహితంగా సత్యం పలుకడమే. సుఖమునకు ఆధారము మంచి స్వభావము, మంచి నడవడిక, అంటే శీలము.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కిం స్విదాత్మా మనుష్యస్య కిం స్వి ద్దైవకృత స్సఖా
ఉపజీవనం కిం స్విదస్య కిం స్విదస్య పరాయణం

తా:   (50) మనుష్యునికి ఆత్మ ఏది? (51) దైవ మిచ్చిన స్నేహితు డెవరు? (52) ఏది జీవితానికి ఆధారము? (53) ఏది గొప్ప వ్రతము?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

పుత్ర ఆత్మా మనుష్యస్య భార్యా దైవ కృతస్సఖా
ఉపజీవనం చ పర్జన్యో దానమస్య పరాయణం

తా:   మనుష్యునికి తన యాత్మ పుత్రుడు (బింబ ప్రతిబింబ భావనచే ఈతని గుణ, శక్తి, కళలు పుత్రుని యందావిర్భవించి నందున యాత్మ యని భావము). "ఆత్మావై పుత్రనామాసి" అన్న వేద వాక్యానికి కూడా ఇదే అర్థం. దైవము చేత ఏర్పడిన స్నేహితురాలు భార్య. అనగా, సుఖ దుఃఖాలలో తోడు నీడగా ఉంటుంది కాబట్టి (ఇతర మిత్రులు అలా ఉండరు) భార్యయే దేవుడిచ్చిన స్నేహితురాలు. అదే కారణాల వల్ల, ఒక భార్య ఐతే చెప్పే సమాధానం భర్త. జీవులకు జీవనాధారము మేఘమే. ఎందుకంటే, మేఘాలు వర్షించడం వల్ల అన్నం పండి జీవులకు ఆకలి తీరుస్తుంది కాబట్టి. ఉత్తమ వ్రతము, ఉత్తమ గతులు లభింప జేసేది ఈవి, అనగా దానం. ఎందుకంటే, మనకు దేవు డిచ్చింది మన లాంటి దేవుని ఇతర సంతానంతో పంచుకోవడం లేక కలిసి అనుభవించడం గొప్ప వ్రతం.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

ధన్యానా ముత్తమం కిం స్విద్ ధనానాం స్యాత్ కిముత్తమం
లాభానాముత్తమం కిం స్యాత్ సుఖానాం స్యాత్ కిముత్తమం

తా:   (54) ధన్యములలో (అంటే మనిషికి గొప్పతనము, పుణ్యము ఇచ్చే వాటిలో) ఉత్తమమైనది ఏది? (ధన్యానాం అంటే ధనవంతులకు శ్రేష్ఠమైన ధర్మం అని కూడా అనుకోవచ్చు.) (55) ధనములలో శ్రేష్ఠమైనది ఏది? (56) లాభములలో ఉత్తమ లాభమెయ్యది? (57) సుఖములలో ఉత్తమ సుఖ మేది?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

ధన్యానా ముత్తమం దాక్ష్యం ధనానా ముత్తమం శ్రుతం
లాభానాం శ్రేయ మారోగ్యం సుఖానాం తుష్టిరుత్తమా

తా: ధన్యములలో ఉత్తమమైనది సామర్ధ్యము. అంటే చెయ్య తగిన వాటిని చేయడానికి, చెయ్య తగని వాటిని మానుకోవడానికి కావలసిన నేర్పరితనము, దక్షత. ధనములలో ఉత్తమ ధనము శాస్త్రపాండిత్యము, అంటే, జ్ఞానము. లాభములలో శ్రేష్ఠమైన లాభము రోగము లేకుండుట, అంటే, ఆరోగ్యం. సుఖములలో గొప్ప సుఖము తృప్తి. తృప్తి లేకపోతే జీవితంలో శాంతి ఉండదు.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కశ్చ ధర్మః పరో లోకే కశ్చ ధర్మః సదాఫలః
కిం నియమ్య న శోచంతి కైశ్చ సంధి ర్న జీర్యతే

తా: (58) లోకంలో ఉత్తమ ధర్మం ఏది? (59) ఏ ధర్మం ఎల్లప్పుడూ ఫలం ఇస్తూ ఉంటుంది? (60) దేనిని అణచుకుంటే పశ్చాత్తాపము ఉండదు? (61) ఎవరి తోటి సంధి (సాంగత్యము) జీర్ణము కాదు (చెడదు)?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

అనృశంస్యం పరో ధర్మః త్రయీ ధర్మః సదా ఫలః
మనో యమ్య న శోచంతి సంధిః సద్భిర్న జీర్యతే

తా: అనృశంస్యము (అక్రూరభావము), అంటే పొరుగువారిని హింసించకుండుటే గొప్ప ధర్మము. "పరోపకారాయ పుణ్యాయ" అన్న వాక్యం కూడా చెప్పేది ఇదే. వేదత్రయము (ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము) బోధించే ధర్మము ఎప్పుడూ ఫలిస్తూ ఉంటుంది. త్రయీ ధర్మాలు అంటే, మన శరీరం పట్ల మన ఆత్మ పురోగతి పట్ల ఇతర ప్రాణుల పట్ల ఉన్న

ధర్మాలు అని కూడా అంటారు. మనస్సనే ఇంద్రియాన్ని నియంత్రిస్తే దుఃఖము ఉండదు. సత్పురుషుల తోడి సాంగత్యము ఏనాటికీ చెడదు.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కిం ను హిత్వా ప్రియో భవతి కిం ను హిత్వా న శోచతి
కిం ను హిత్వాఽర్థవాన్ భవతి కిం ను హిత్వా సుఖీ భవేత్

తా: (62) మనిషి దేన్ని విడిచిపెడితే అందరికీ ఇష్టుడవుతాడు? (63) దేన్ని విడిచిపెడితే విచారించకుండా ఉంటాడు? (64) దేన్ని విడిచిపెడితే ధనవంతుడవుతాడు? (65) దేన్ని విడిస్తే సుఖవంతుడవుతాడు?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

మానం హిత్వా ప్రియో భవతి క్రోధం హిత్వా న శోచతి
కామం హిత్వాఽర్థవాన్ భవతి లోభం హిత్వా సుఖీ భవేత్

తా: అన్ని రకాల అభిమానాల్ని వదలిన వాడు, అంటే గర్వాన్ని విడిచిన వాడు అందరికీ ఇష్టుడవుతాడు. కోపాన్ని వదిలితే శోకం విచారం ఉండవు. అధర్మమైన కామం అంటే దురాశను వదిలిపెడితే ద్రవ్యవంతుడగును. లోభాన్ని వదిలితే సుఖవంతుడగును. అంటే, అభిమానం, క్రోధం, కామం, లోభం అన్న వాటిని నియంత్రిస్తే మంచి జరుగుతుంది.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కిమర్థం బ్రాహ్మణే దానం కిమర్థం నటనర్తకే
కిమర్థం చైవ భృత్యేషు కిమర్థం చైవ రాజసు

తా:   (66) విప్రుని విషయ మందు ఈవి (దానము) యెందుకొరకగును? (67) ఆడెడి ఆడించెడి నట నర్తకుల విషయమైన ఈవి యెందుకొరకగును? (68) సేవకుల విషయమైన ఈవి యెందుకొరకగును? (69) రాజుల విషయమైన ఈవి యెందుకొరకగును?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

ధర్మార్థం బ్రాహ్మణే దానం యశోర్థం నటనర్తకే
భృత్యేషు భరణార్థం వై భయార్థం చైవ రాజసు

తా: బ్రాహ్మణులకు దానం ఇచ్చుట ధర్మము కొరకై యుండును (పాపమును పోగొట్టు కొనుటకు), వాళ్ళ పోషణ భారం సంఘానిది రాజులది కాబట్టి. ఆడెడు వారికి ఆడించు వారికి దానం ఇచ్చుట కీర్తి కోసమై యుండును (దానం పుచ్చుకొని వాళ్ళు తనను పొగుడుతారు కదా). సేవకుల విషయంలో దానం ఇవ్వడము పారితోషికం లాంటిది. జీతము, భరణము అని కూడా అనుకోవచ్చు. రాజుల విషయ మందు దానం భీతి వలన యుండును. అది పన్నుల రూపంలో ఉంటుంది. ఆ ధనం చెల్లించకపోతే పడే శిక్షలంటే ఉన్న భయం వల్ల ప్రజలు ఇస్తారు.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కేన స్విదావృతో లోకః కేన స్విన్న ప్రకాశతే
కేన త్యజతి మిత్రాణి కేన స్వర్గం న గచ్ఛతి

తా:   (70) జగత్తు దేని చేత ఆవరింపబడి యున్నది? (71) దేని చేత ప్రకాశింప లేకున్నది? (72) ఏ కారణం చేత స్నేహితులను వదిలివేయడం జరుగుతోంది? (73) దేని చేత స్వర్గమును పొందడు?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

అజ్ఞానేనావృతో లోకస్తమసా న ప్రకాశతే
లోభాత్త్యజతి మిత్రాణి సంగాత్ స్వర్గం న గచ్ఛతి

తా: అజ్ఞానము చేత లోకం ఆవరింపబడి యున్నది. తమస్సు అంటే అంధకారం చేత లోకం ప్రకాశించకుండా ఉంది. కృపణత లేక లోభము వల్ల మిత్రులను వదలడం జరుగుతోంది. ఇంద్రియ విషయముల సంగత్వము వల్ల స్వర్గమును (ఉత్తమ లోకమును) అందుకోవడం లేదు.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

మృతః కథం స్యాత్ పురుషః కథం రాష్ట్రం మృతం భవేత్
శ్రాద్ధం మృతం కథం వా స్యాత్ కథం యజ్ఞో మృతో భవేత్

తా: (74) జీవముండియు చచ్చినవాడెటులగును? (75) రాష్ట్రము (దేశము) నశించిన దెటులగును? (76) శ్రాద్ధ మెటుల చెడిపోయిన దగును? (77) యాగ మెటుల చెడిపోయిన దగును?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

మృతో దరిద్రః పురుషో మృతం రాష్ట్ర మరాజకం
మృతమశ్రోత్రియం శ్రాద్ధం మృతో యజ్ఞస్త్వ దక్షిణః

తా: బ్రతికిన వాడైనను దరిద్రుడైన (ఉండి లేనట్లు ఉండే లోభి) పురుషుడు చచ్చినవాడు. రాజులేని రాష్ట్రము చెడిపోయినదగును. వేదమును చదివినవాడు లేని శ్రాద్ధము చెడిపోయినదగును. దక్షిణ యివ్వని యాగము చెడిపోయినదగును.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కాదిక్ కిముదకం ప్రోక్తం కిమన్నం కించ వై విషం
శ్రాద్ధస్య కాలమాఖ్యాహి తతః పిబ హరస్వ చ

తా:	(78) అంతటికీ ఏది దిక్కు? (79) నీరు ఏది? (80) ఏది అన్నము? (81) ఏది విషము? (82) శ్రాద్ధమునకు ఏది సరియైన కాలము? చెప్పి పిమ్మట నీరు త్రావుము. తమ్ముల నెత్తుకొనుము.

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

సంతో దిగ్జలమాకాశం గౌరన్నం ప్రార్థనా విషం
శ్రాద్ధస్య బ్రాహ్మణః కాలః కథం వా యక్ష మన్యసే

తా:	సత్పురుషులే అంతటికీ దిక్కు, అనగా, వారు ఏ మార్గములో నడిచి కృతార్థులైనారో అదే అందరికీ ఆదర్శము. ఆకాశమే జలము, అనగా, ఆకాశంలో మేఘాలు వర్షించడం వల్లే జలము లభిస్తుంది. గోవే అన్నము. అంటే, గోవు పాల నుండి వెన్న వస్తుంది, ఆ వెన్నను హోమ ద్రవ్యముగా వాడి యజ్ఞాలు చెయ్యడం వల్ల మేఘాలు సృష్టించబడి వర్షాలు పడతాయి, ఆ వర్షాల వల్ల పంటలు పండి అందరికీ అన్నం లభిస్తుంది. యాచించుట విషము. ఓ, యక్షా! నువ్వు ఏమనుకుంటావో గానీ, శ్రాద్ధమునకు సరియైన కాలము బ్రాహ్మణుడు వచ్చు కాలమే.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

తపః కిం లక్షణం ప్రోక్తం కో దమశ్చ ప్రకీర్తితః
క్షమా చ కా పరా ప్రోక్తా కా చహ్రీః పరికీర్తితా

తా:	(83) తపస్సుకున్న లక్షణము ఏమిటి? (84) దమము అంటే ఏది అని చెబుతారు? (85) ఉత్తమమైన క్షమ అని దేని నంటారు? (86) సిగ్గు అని దేని నంటారు?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

తపః స్వధర్మ వర్తిత్వం మనసో దమనం దమః
క్షమా ద్వన్ద్వ సహిష్ణుత్వం హ్రీ రకార్య నివర్తనం

తా: స్వధర్మము, అనగా, తన కర్తవ్యము తాను అనుసరించుటయే తపస్సని చెప్పబడును. పరధర్మము కంటే స్వధర్మమే శ్రేయోదాయకము అని భగవద్గీతలో కూడా చెప్పబడింది. మనస్సును నిగ్రహించడమే దమము. అనగా ఇంద్రియ నిగ్రహము లేక సంకల్ప రాహిత్యము. శీతోష్ణ సుఖ దుఃఖ లాభాలాభములు మొదలైన ద్వంద్వములను సహించడమే క్షమ. సిగ్గు యనగా చెడు మార్గాలలో ప్రవేశించడానికి వెనుదీయడం.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కిం జ్ఞానం ప్రోచ్యతే రాజన్ కః శమశ్చ ప్రకీర్తితః
దయా చ కా పరా ప్రోక్తా కిం చార్జవ ముదాహృతం

తా: (87) రాజా! జ్ఞానమని దేన్ని అంటారు? (88) శమమంటే ఏది? (89) దేన్ని దయ అని అంటారు? (90) ఆర్జవము అంటే ఋజుత్వము అని ఉదాహరింపబడేది ఏది?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

జ్ఞానం తత్వార్థ సంబోధః శమశ్చిత్త ప్రశాంతతా
దయా సర్వ సుఖైషిత్వ మార్జవం సమచిత్తతా

తా: తత్త్వార్థమును పూర్తిగా తెలుసుకోవడమే జ్ఞానము. చిత్త నైర్మల్యమే శమము. శమ దమములను కొన్ని సార్లు ఇంద్రియశాంతి మనశ్శాంతి యని కూడా చెబుతారు. దయ అంటే సర్వ ప్రాణుల సుఖమును కోరటం. "సర్వేజనా సుఖినో భవంతు" అన్న వాక్యార్థము ఇదే. ఆర్జవము లేక ఋజుభావము అంటే సమ భావము. చెడ్డ ఆలోచన లేకుండా ఉండటం, అందరి పట్లా అన్నిటి పట్లా అన్ని సమయాల్లోను ఒకే విధమైన మనస్సు కలిగి ఉంటే దాన్ని ఆర్జవం అంటారు.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కః శత్రుర్దుర్జయః పుంసాం కశ్చ వ్యాధిరనంతకః
కీదృశశ్చ స్మృతః సాధు రసాధుః కీదృశః స్మృతః

తా:	(91) పురుషులకు జయించుటకు సాధ్యము కాని శత్రువెవరు? (92) అంతం కాని అంటే నయం కాని వ్యాధి యేది? (93) ఎట్టి వానిని సాధువంటారు? (94) అసాధువు ఎటువంటివాడు?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

క్రోధః సుదుర్జయః శత్రుర్లోభో వ్యాధిరనంతకః
సర్వభూతహితః సాధుః అసాధు ర్నిర్దయః స్మృతః

తా:	పురుషులకు జయింపగ లేని శత్రువు కోపము. లోభము, అనగా పిసినిగొట్టుతనము నయం కాని వ్యాధి. ప్రాణులన్నిటికీ మేలు చేసే వాడే సాధువు. సర్వ భూతముల యందు దయ లేనివాడే అసాధువు.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కో మోహః ప్రోచ్యతే రాజన్ కశ్చ మానః ప్రకీర్తితః
కిమాలస్యం చ విజ్ఞేయం కశ్చ శోకః ప్రకీర్తితః

తా:	(95) రాజా! మోహమంటే ఏమిటి? (96) మాన మనగా ఏమిటి? (97) ఆలస్యమని దేన్ని అంటారు? (98) శోకము ఏది అని అనుకుంటారు?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

మోహో హి ధర్మమూఢత్వం మాన స్త్వాత్మాభిమానితా
ధర్మ నిష్క్రియతాఽఽలస్యం శోకస్త్వజ్ఞాన ముచ్యతే

తా:	ధర్మము అనగా కర్తవ్య మందు తెలివి లేకుండుట మోహము. స్వాభిమానము లేక తన యాత్మ యందు గొప్పవాడని పూజించుకొనుట మానము (గర్వము). ధర్మము పట్ల నిష్క్రియత, అంటే, కర్తవ్యాన్ని విస్మరించడం ఆలస్యమనబడును. అజ్ఞానం, అంటే, ధర్మము తెలియక

పోవడం వల్ల దుఃఖించ తగని వాటియందు దుఃఖము కలగడం శోకము. "నత్వం శోచితు మర్హసి" అన్న గీతావాక్యానికి అర్థం ఇదే.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కిం స్థైర్యం ఋషిభిః ప్రోక్తం కిం చ ధైర్యముదాహృతం
స్నానం చ కిం పరం ప్రోక్తం దానం చ కిమిహోచ్యతే

తా: (99) స్థైర్యము అనగా స్థిరత్వము ఏదియని ఋషులచే చెప్పబడుచున్నది? (100) దేన్ని ధైర్యముగా ఉదాహరిస్తారు? (101) గొప్ప స్నానం ఎటువంటిది? (102) ఇక్కడ దానమని దేన్ని అంటారు?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

స్వధర్మే స్థిరతా స్థైర్యం ధైర్య మింద్రియ నిగ్రహః
స్నానం మనోమల త్యాగో దానం వై భూతరక్షణం

తా: తన ధర్మమందు సందేహించక పూని నిలుచుట, అంటే, తన కర్తవ్య నిర్వహణలో నిశ్చయముగా ఉండుట స్థైర్య మనబడును. ఇంద్రియములను స్వాధీనములో నుంచుకొనుటయే ధైర్యము. మనస్సున దుస్సంకల్ప రూపకమైన కల్మషమును లేక మాలిన్యమును కడిగి వేయుటే స్నానము. శ్రమ కాలమున ప్రాణుల కాపాడటమే దానము.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కః పండితః పుమాన్ జ్ఞేయో నాస్తికః కశ్చ ఉచ్యతే
కో మూర్ఖః కశ్చ కామః స్యాత్ కో మత్సర ఇతి స్మృతః

తా:	(103) ఏ పురుషుణ్ణి పండితుడని అంటారు? (104) నాస్తికు డెవడని చెప్పబడుతోంది? (105) మూర్ఖు డెవడు? (106) కామము లేక ఆశ లేక కోరిక అంటే ఏది? (107) మత్సరము (ఈర్ష్య) అని దేన్ని అంటారు?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

ధర్మజ్ఞః పండితో జ్ఞేయో నాస్తికో మూర్ఖ ఉచ్యతే
కామః సంసారహేతుశ్చ హృత్తాపో మత్సరః స్మృతః

తా:	తన కర్తవ్యము (ధర్మము) తాను తెలుసుకున్నవాడే పండితుడు. నాస్తికుడే మూర్ఖుడు. మూర్ఖుడే నాస్తికుడు. జననమరణాలకు కారణమైన సంసారానికి హేతువు ఏదో అదే కామము, అంటే కోరిక. అన్యుల అభివృద్ధిని చూసి ఆవేదన చెంది హృదయంలో తపించడమే మత్సరము.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కో ఽహంకార ఇతి ప్రోక్తః కశ్చ దంభః ప్రకీర్తితః
కిం తద్దైవం పర ప్రోక్తం కిం తత్ పైశున్యముచ్యతే

తా:	(108) అహంకారం అంటే ఏది? (109) దంభము (కాపట్యము) అంటే ఏమిటి? (110) పరదైవం అంటే ఏది? (111) పైశున్యము అంటే కొండెము చెప్పే లక్షణము ఏది?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

మహాఽజ్ఞానమహంకారో దంభో ధర్మో ధ్వజోచ్ఛ్రయః
దైవం దాన ఫలం ప్రోక్తం పైశున్యం పరదూషణం

తా:	అంతులేని అజ్ఞానమే అహంకారము లేక గర్వమునకు మూలము. అంటే తన అసలు స్వరూపం తెలుసుకోకుండా తాను చాలా గొప్పవాడినని అనుకోవడం. దంభము అంటే తాను ఎవరో జనాలకి తెలియడం కోసం ధర్మానికి సంబంధించిన విషయాలతో ఆర్భాటం చేయడం.

దానము వల్ల ఏర్పడే ప్రయోజనమే దైవము. ఇతరులను దూషించడమే కొండెములు చెప్పేవాడి లక్షణము.

యక్ష ఉవాచ (ప్రశ్న):

ధర్మశ్చార్థశ్చ కామశ్చ పరస్పర విరోధినః
ఏషాం నిత్య విరుద్ధానాం కథమే కత్ర సంగమః

తా: ధర్మార్థకామాలు మూడూ ఒకటికి ఒకటి విరోధులు కదా. (112) నిత్య విరోధులైన ఈ మూడూ కలసి ఎలా ఉంటాయి?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

యదా ధర్మశ్చ భార్యాచ పరస్పర వశానుగౌ
తదా ధర్మార్థకామానాం త్రయాణా మపి సంగమః

తా: ఎక్కడైతే ధర్మము భార్య పరస్పరము వశమై ఉంటారో అక్కడ అర్థము కామము కూడా చేరతాయి కాబట్టి ధర్మార్థకామాలు మూడూ కలసి ఉంటాయి. ధర్మార్థకామములు ఆచరించుటలో భర్త భార్య ఒకరికొకరు సహకరించుకుంటే అవి మూడు కలిసి ఉంటాయి. "ధర్మేచ అర్థేచ కామేచ నాతి చరామి" అంటే "ధర్మం, అర్థం, మరియు కామములలో నేను నిన్ను అతిక్రమించను (లేదా విడిచిపెట్టను)" అని "ధర్మేచ అర్థేచ కామేచ నాతి చరితవ్య" అంటే "ధర్మం, అర్థం, కామం (ప్రేమ) అనే వాటిలో నిన్ను ఎప్పటికీ విడిచిపెట్టను" అని వివాహాలలో వధూవరుల చేత ప్రమాణం చేయించడం యొక్క పరమార్థం ఇదే.

యక్ష ఉవాచ (ప్రశ్న):

అక్షయోః నరకః కేన ప్రాప్యతే భరతర్షభ
ఏతన్మే పృచ్ఛతః ప్రశ్నం తచ్ఛీఘ్రం వక్తుమర్హసి

తా.   (113) ఓ భరతవంశ శ్రేష్ఠా! దేని చేత శాశ్వతమైన నరకము లభిస్తోంది? ఈ ప్రశ్నకి త్వరగా జవాబు చెప్పతగిన వాడివని అనుకుంటున్నాను.

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

బ్రాహ్మణం స్వయ మాహూయ యాచమాన మకించనం
పశ్చాన్న స్తీతి యో బ్రూయాత్ సోఽక్షయం నరకం వ్రజేత్

వేదేషు ధర్మ శాస్త్రేషు మిధ్యాయోవై ద్విజాతిషు
దేవేషు పితృ ధర్మేషు సోఽక్షయం నరకం వ్రజేత్

విద్యమానే ధనే లోభా ద్దాన భోగ వివర్జితః
పశ్చాన్నా స్తీతి యో బ్రూయాత్ సోఽక్షయం నరకం వ్రజేత్

తా:   దరిద్రుడై యాచించే బ్రాహ్మణునికి దానము ఇస్తానని తనకు తానుగా పిలిచి మొండి చెయ్యి చూపించే వాడు నిత్య నరకం అనుభవిస్తాడు. వేదాలకి, ధర్మశాస్త్రాలకి, బ్రాహ్మణులకి, దేవుళ్ళకి, పితృదేవతలకి, శ్రాద్ధాది పితృకర్మలకి అసత్య దోషం అంటగట్టేవారికి శాశ్వతమైన నరకం లభిస్తుంది. ధనము ఉన్నా కూడా లోభం చేత ఇతరులకు ఇవ్వక తాను అనుభవింపక లేదు లేదు అని ఎవడు చెబుతాడో వాడు నిత్య నరకం అనుభవిస్తాడు.

యక్ష ఉవాచ (ప్రశ్న):

రాజన్ కులేన వృత్తేన స్వాధ్యాయేన శ్రుతేనవా
బ్రాహ్మణ్యం కేన భవతి ప్రబ్రూహ్యే తత్సునిశ్చితం

తా.   (114) ఓ రాజా! బ్రాహ్మణ లక్షణము వంశము చేతనా, నడవడిక లేక ఆచారం చేతనా, వేదాధ్యయనం చేతనా, పాండిత్యం చేతనా, దేని చేత ఏర్పడుచున్నదో ధృవీకరించి చెప్పుము?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

శృణు యక్ష కులం తాత న స్వాధ్యాయో న చ శ్రుతం
కారణం హి ద్విజత్వే చ వృత్తమేవ న సంశయః

వృత్తం యత్నేన సంరక్ష్యం బ్రాహ్మణేన విశేషతః
అక్షీణవృత్తో న క్షీణో వృత్తతస్తు హతోహతః

పఠకాః పాఠకాశ్చైవ యే చాన్యే శాస్త్ర చింతకాః
సర్వే వ్యసనినో మూర్ఖా యః క్రియావాన్ స పండితః

చతుర్వేదోఽపి దుర్వృత్తః స శూద్రా దతిరిచ్యతే
యోఽగ్నిహోత్ర పరోదాంతః స బ్రాహ్మణ ఇతి స్మృతః

తా: ఓ, యక్షా! వినుము. బ్రాహ్మణ లక్షణానికి కారణము వంశమూ కాదు, వేదాధ్యయనం కాదు, పాండిత్యం కూడా కాదు. కేవలం అతని నడవడికయే కారణము. అందుకని, సందేహం లేకుండా బ్రాహ్మణుడు నడవడికని ప్రయత్నించి కాపాడుకోవాలి. నడవడిక చెడకపోతే వాడు చెడడు. నడవడిక చెడితే చెడిన వాడవుతాడు. వేదాలు చదివే వారు, చదివించే వారు, శాస్త్రార్థాలను గురించి చింతించే వారు, వీళ్ళందరూ మూఢులే. తన ధర్మాన్ని అనుష్ఠించి సన్మార్గంలో చరించే వాడే పండితుడు. కాబట్టి, ఆచరణ ముఖ్యము. నాలుగు వేదాలు చదివినా కూడా చెడు నడవడిక ఉంటే వాడు శూద్రుని కంటే ఏమాత్రం అధికుడు కాడు. యాగాదుల యందు ప్రీతి కలిగి, ఇంద్రియములను జయించి మనస్సును అదుపులో ఉంచుకోగలిగిన వాడు బ్రాహ్మణు డనబడును.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

ప్రియవచన వాదీ కిం లభతే విమృశిత కార్యకరః కిం లభతే
బహు మిత్ర కరః కిం లభతే ధర్మే రతః కిం లభతే కథయ

తా: (115) ప్రియభాషణములు పలుకువాడు అంటే ఎదుటివాడికి ఏం చెబితే నచ్చుతుందో అది చెప్పేవాడు ఏమి పొందును? (116) మంచీ చెడులు విమర్శ చేసి అంటే సమగ్రంగా ఆలోచించి పనులు చేయు వాడు ఏమి పొందును? (117) ఎక్కువ మంది మిత్రులు ఉంటే కలిగే లాభం ఏమిటి? (118) ధర్మము నందు ఇష్టము ఉన్నవాడు ఏమి పొందును?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

ప్రియవచన వాదీ ప్రియో భవతి విమృశిత కార్యకరోఽధికం జయతి
బహుమిత్ర కరః సుఖం వసతే యశ్చ ధర్మరతః సుగతిం లభతే

తా: ప్రియభాషణములు పలుకువాడు ప్రియుడౌతాడు, అంటే అందరికీ నచ్చుతాడు. విచారించి పనులు చేసే వాడు ఎక్కువ విజయాలను పొందుతాడు. పెక్కురు మిత్రులు ఉన్న వారు సుఖంగా ఉంటారు. ధర్మము నందు ప్రీతి కలవాడు సుగతిని పొందుతాడు.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

కో మోదతే కి మాశ్చర్యం కః పంథాః కా చ వార్తికా
వద మే చతురః ప్రశ్నా న్ మృతా జీవంతు బాంధవాః

తా: (119) ఎవడు ఆనందిస్తున్నాడు? (120) ఆశ్చర్యకరమైన విషయము ఏమిటి? (121) మార్గము ఏది? (122) లోకంలో విశేషమైన వార్త ఏది? ఈ నాలుగు ప్రశ్నలకి జవాబు చెప్పుము. మరణించిన నీ తమ్ములు బ్రతుకుదురు గాక.

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

పంచమేఽహని షష్ఠే వా శాకం పచతి స్వే గృహే
అనృణీ చాప్రవాసీ చ స వారిచర మోదతే

అహన్యహని భూతాని గచ్ఛన్తీహ యమాలయం
శేషాః స్థావర మిచ్ఛన్తి కిమాశ్చర్య మతః పరం

తర్కో౽ప్రతిష్ఠః శ్రుతయో విభిన్నా నైకో ఋషిర్యస్య మతం ప్రమాణం
ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం మహాజనో యేన గతః స పంథాః

అస్మిన్మహా మోహమయే కటాహే సూర్యాగ్నినా రాత్రిదివేంధనేన
మాసర్తు దర్వీ పరిఘట్టనేన భూతాని కాలః పచతీతి వార్తా

తా: ఓ, ఉభయచరా! ఇంటిని వదలకుండా, అప్పు చేయకుండా, దినంలో ఐదవ భాగంలో గానీ ఆరవ భాగంలో గానీ కేవలం ఉన్న తక్కువ కూరతో సరిపెట్టుకునే వాడే సంతోషంగా ఉండేవాడు. ప్రతి రోజు అనేక ప్రాణులు యమలోకానికి పోతూవుండటం చూసికూడా వీరిని చూస్తున్న మిగతావారు తాము పోమనీ, చిరంజీవులమనీ, శాశ్వతముగా ఉండాలని అపేక్షిస్తున్నారే, ఇంత కంటే వేరే ఏమి ఆశ్చర్యము ఉంది. ఏ తర్కము కూడా నిర్దుష్టమైన సమాధానం ఇవ్వదు. వేదాలు కూడా ఒకదాని కొకటి విభిన్నంగా ఉంటాయి. అంటే, ఏ విషయాన్ని ఒకే విధంగా చెప్పవు. చాలా మంది ఋషులు ఉండటం వల్ల, ఏ ఋషి యొక్క అభిప్రాయము కూడా సర్వత్రా ఆమోదయోగ్యము కాదు. ధర్మము యొక్క నిజస్వరూప మేదో హృదయ మందున్నది. కనుక పెద్దలైన వారు ఏ మార్గములో నడిచారో అదే మార్గము. "యద్యదాచరతి శ్రేష్ఠః" అన్న గీతావాక్యము యొక్క ఉద్దేశ్యము కూడా ఇదే. విస్తృతంగా అజ్ఞానంతో నిండిన ఈ బ్రహ్మాండమనే కటాహంలో (బానలో), సూర్యుడనే అగ్ని చేత, రాత్రి పగలనే సమిధల చేత, మాసము ఋతువులనే హోమార్థమైన గరిటెలు తిప్పుతూ కాల పురుషుడు సమస్త భూతములను వండుచున్నాడు. ఇదే వార్త.

యక్ష ఉవాచ (ప్రశ్నలు):

వ్యాఖ్యాతా మే త్వయా ప్రశ్నాః యాథాతథ్యం పరంతప
పురుషం త్విదానీం వ్యాఖ్యాహి యశ్చ సర్వధనీ నరః

తా:	ఓ, శత్రువులను తపింప చేయు వాడా! నా ప్రశ్నలకు యదార్థముగా సమాధానాలు చెప్పావు. ఇప్పుడు చెప్పు. (123) ఎవరిని నిజంగా పురుషుడు అని అనవచ్చు? (124) సర్వ సంపదలు కలిగిన వాడని ఎవర్ని అంటాము?

యుధిష్ఠిర ఉవాచ (సమాధానం):

దివం స్పృశతి భూమించ శబ్దః పుణ్యేన కర్మణా
యావత్ స శబ్దో భవతి తావత్పురుష ఉచ్యతే

తుల్యే ప్రియాప్రియే యస్య సుఖదుఃఖే తథైవ చ
అతీతా నాగతే చోభే స వై సర్వధనీ నరః

తా:	పుణ్యకర్మ చేత ఎవని యొక్క శబ్దము (పేరు) భువి నుండి దివి దాకా విస్తరించి యున్నదో, ఆ శబ్దము ఉన్న దాకా అతడు పురుషుడు అనబడును. ఎవరికైతే ప్రియాప్రియములు, సుఖ దుఃఖములు, జరిగెడివి జరుగబొయ్యెడివి, లాంటి ద్వంద్వాలు సమానములో, అట్టివాడు సర్వ ధనములు కలవాడని చెప్పబడతాడు.

ఇక్కడితో 77 శ్లోకాలలో 124 ప్రశ్నలు, వాటికి సమాధానాలు అయిపోయాయి. యక్షుడు (మనం కూడా) చాలా సంతృప్తి చెందాడు. ఇలా అంటున్నాడు.

యక్ష ఉవాచ:

వ్యాఖ్యాతః పురుషో రాజన్యశ్చ సర్వధనీ నరః
తస్మాత్త్వమేకం భ్రాతౄణాం యమిచ్ఛసి స జీవతు

తా:	ఓ, రాజా! పురుషుడు అంటే ఎవరు, సర్వధని అంటే ఎవరు అన్న విషయాలు చక్కగా చెప్పావు. కనుక, నీ యీ నలుగురు తమ్ములలో నువ్వు ఎవర్ని కోరతావో ఆ ఒకరు మాత్రం జీవించు గాక అని చెప్పెను.

ఈ పరీక్షకి ధర్మరాజు ఎలా నిలిచాడో చూద్దాము.

యుధిష్ఠిర ఉవాచ:

శ్యామో య ఏష రక్తాక్షో బృహత్సాల ఇవోద్గతః
వ్యూఢో రస్కో మహాబాహు ర్న కులో యక్ష జీవతు

తా:	ఓ, యక్షా! ఈ శ్యామల వర్ణము, ఎర్రని నేత్రములు, విశాల వక్ష స్థలము, దీర్ఘ బాహువులు, కలిగిన నకులుని పడిన సాల వృక్షము లేచినట్లుగా బ్రతుక నిమ్ము.

ఈ సమాధానానికి ఆశ్చర్య పోయిన యక్షుడు, క్రింది విధంగా తదుపరి విచారణ కొనసాగించాడు.

యక్ష ఉవాచ:

ప్రియస్తే భీమసేనోఽయమర్జునో వః పరాయణం
స కస్మా న్న కులో రాజన్ సాపత్నం జీవమిచ్ఛసి

యస్య నాగ సహస్రేణ దశ సంఖ్యేన వై బలం
తుల్యం తం భీమ ముత్సృజ్య నకులం జీవమిచ్ఛసి

తథైనం మనుజాః ప్రాహుర్భీమసేనం ప్రియం తవ
అథ కేనానుభావేన సాపత్నం జీవమిచ్ఛసి

యస్య బాహుబలం సర్వే పాండవాః సముపాసతే

అర్జునం తమపాహాయ నకులం జీవమిచ్ఛసి

తా: ఓ, రాజా! నీకు భీమసేనుడు ప్రియమైన వాడు. అర్జునుడు ప్రాణము వంటి వాడు. ఇట్లుండగా, సవతితల్లి కుమారుడైన నకులుని బ్రతికించాలని ఎందుకనుకుంటున్నావు? పదివేల ఏనుగుల బలంతో సమానమైన బలం ఉన్న భీముని విడిచి నకులుని ఏల బ్రతికింప కోరుచున్నావు? ఈ భీమసేనుడు నీకు ప్రియమైన తమ్ముడని లోకులు అందరూ అనుకుంటున్నారు. అట్లుండగా, సవతి తల్లి కొడుకుని ఏల బ్రతికింప దలుచుకున్నావు? పాండవు లందరు ఎవరి బాహుబలం మీద ఆశలు పెంచుకున్నారో, అలాంటి అర్జునుణ్ణి విడిచి, నకులుని బ్రతికించాలని ఎందుకనుకుంటున్నావు?

అప్పుడు ధర్మరాజు చెప్పిన సమాధానాలు మనస్సును ద్రవింపజేస్తాయి. అవేమిటో చూద్దాము.

యుధిష్ఠిర ఉవాచ:

ధర్మ ఏవ హతో హన్తి ధర్మో రక్షతి రక్షితః
తస్మాద్ధర్మం న త్యజామి మా నో ధర్మో హతోఽవధీత్

ఆనృశంస్యం పరోధర్మః పరమార్థాశ్చ మే మతం
ఆనృశంస్యం చికీర్షామి నకులో యక్ష జీవతు.

ధర్మ శీలః సదా రాజా ఇతిమాం మానవావిదుః
స్వధర్మాన్న చలిష్యామి నకులో యక్ష జీవతు

కుంతీ చైవ మాద్రీచ ద్వే భార్యే తు పితుర్మమ
ఉభే సపుత్రేస్యాతాం వై ఇతిమే ధీయతే మతిః

యథా కుంతీ తథా మాద్రీ విశేషో నాస్తి మే తయోః

మాతృభ్యాం సమమిచ్ఛామి నకులో యక్ష జీవతు

తా: ధర్మము చెడితే చెరిపిన వానిని చెరుస్తుంది. అందుచేత, నేను ధర్మాన్ని విడిచి పెట్టను. ధర్మాన్ని మనం రక్షిస్తే, ధర్మం మనని రక్షిస్తుంది. అహింసయే, అంటే పొరుగు వారిని బాధింపకుండుట, పరమ ధర్మము. అలాంటి అహింసను పాటించడానికి పూనుకున్నాను కనుక, నకులుడు జీవించు గాక. నన్ను ప్రజలు ఎల్లప్పుడూ ధర్మశీలుడైన రాజని అనుకుంటున్నారు కనుక, నా ధర్మం నుండి నేను చలించను. నకులుడు జీవించు గాక. మా తండ్రికి కుంతి, మాద్రి యను ఇద్దరు భార్యలు కలరు. ఇద్దరికీ పుత్రులు ఉండాలనే ఉద్దశ్యంతో నకులుని బ్రతికించాలని చూస్తున్నాను. నాకు కుంతి ఎలాగో మాద్రి కూడా అలాగే. వాళ్ళిద్దరిలో, విశేషము అంటూ ఎవరి మీదా నాకు లేదు. నాకు ఇద్దరు తల్లులు సమానమే. అందుకనే, నకులుడు జీవించు గాక.

ఈ సమాధానాలు విని ధర్మరాజు విశాల హృదయం, ధర్మ గుణం తెలుసుకున్న యక్షుడు సంతోషించి ఇలా అంటున్నాడు.

యక్ష ఉవాచ:

యస్యతేఽర్థాశ్చ కామాశ్చ ఆనృశంస్యం పరం మతం
తస్మాత్తే భ్రాతరస్సర్వే జీవంతు భరతర్షభ

తా: ఇతరులను హింసించక ఉపకారం చెయ్యాలనే వ్రతం కలవాడివైన నీకు అవే అర్థకామాలుగా ఏర్పడియుండటం వల్ల, ధర్మాత్ముడవైన నీ తమ్ముళ్లు జీవవంతులగుదురు గాక.

21. రామాయణంలో కరప్షను (corruption) అనగా అవినీతి కథ

[ఈ వ్యాసం సంచిక మాస పత్రిక అనబడే తెలుగులో తొలి డైనమిక్ వెబ్ పత్రికలో (అక్టోబరు 6, 2024) ప్రచురించబడింది. అందుబాటులో ఉన్న లింకు: https://sanchika.com/dyoota-sabhalo-draupadi-prashna-sababenaa-mvs-r/]

వాల్మీకి రామాయణం ఉత్తరకాండకి ఆచార్య శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడు గారు రచించిన బాలానందినీ వ్యాఖ్య ప్రకారము 59వ సర్గ తరువాత వరుసగా వచ్చే మూడు ప్రక్షిప్త సర్గలలో ఒక కుక్క ప్రసక్తి వస్తుంది. ఒక రోజు శ్రీరాముడు సభ చేసి యుండగా, అనుజ్ఞ తీసుకొని కుక్క కార్యార్థియై రాజసభలో ప్రవేశిస్తుంది. సర్వార్థసిద్ధుడు అనే బ్రాహ్మణుడు తనని అకారణంగా కొట్టాడని రాజారాముడికి ఫిర్యాదు చేస్తుంది. ఆ బ్రాహ్మణుణ్ణి రాజసభకి పిలిచి విచారిస్తే అతను ఏమి చెబుతాడంటే: "నేను భిక్ష కోసం తిరుగుతుంటే భిక్ష దొరక లేదు. ఆ కోపంలో ఈ కుక్కను కొట్టాను. అది తప్పే. నా అపరాధాన్ని శిక్షించండి. రాజు శిక్షిస్తే, ఇంక నాకు నరకం భయం ఉండదు."

కుక్కను అకారణంగా కొట్టిన నేరానికి ఏం శిక్ష వేయాలో ఆ రోజుల్లో ఉన్న శిక్షాస్మృతిలో ఉన్నట్లు లేదు (ఈ రోజుల్లో కూడా లేదు). ఈ విషయం మీద సభలో చర్చలు జరిగిన తరువాత చాలా మంది పండితులు, మంత్రులు "బ్రాహ్మణుని దండించకూడదు" అని నసుగుతారు. ఆ మాట విని, ఆ కుక్క "రామా! నువ్వు నాకు వరం ఇవ్వదలుచుకుంటే, ఆ బ్రాహ్మణునికి కాలాంజర క్షేత్రంలో కులపతిత్వము, దేవాలయ మఠాద్యాధిపత్యము ఇవ్వు" అంటుంది. వెంటనే ఆ విధంగా అమలు చెయ్యడంతో, ఆ బ్రాహ్మణుడు సంతోషంతో వెళ్ళిపోతాడు. మంత్రులందరూ "ఇదేమిటి, అది బ్రాహ్మణునికి వరం అవుతుంది కాని, దండన కాదు కదా" అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తారు. అప్పుడు, రాముడు "ఉండండి, మీకు తెలియదు. దీనికి కారణం ఆ కుక్కకే తెలుసు" అని అంటాడు.

ఆ కుక్క అసలు విషయం ఈ విధంగా చెబుతుంది: "రామా! నేను పూర్వజన్మలో ఆ క్షేత్రంలో కులపతిత్వం చెయ్యబట్టి, ఈ జన్మలో కుక్కని అయ్యాను". మఠాధిపతిగా, దేవతా బ్రాహ్మణుల పూజ అయిన తరువాత మిగిలిన దాన్నే తినే వాడిననీ, దాసదాసీజనానికి అన్నాదులు ఇస్తూ మంచి బుద్ధితో దేవతాద్రవ్యాన్ని రక్షించే వాడిననీ, సమస్త ప్రాణుల యందు దయగా ఉండేవాడిననీ, అంత పవిత్రంగా జీవితం గడిపినా కూడా తనకు తరువాత జన్మలో కుక్కగా అవస్థా అధమగతీ పట్టాయనీ కుక్క చెబుతుంది. అంత జాగ్రత్తగా ఉన్న నాకే కుక్క జన్మ ప్రాప్తం అవగా, కోపిష్టి, అధార్మికుడు, క్రూరుడు, అయిన ఆ బ్రాహ్మణుడు కులపతిగా ఉంటే అతనికి వెనుకటి ఏడు తరాలు రాబోయే ఏడు తరాలు అపవిత్రం అవుతాయి. అందుకని, కులపతిని చెయ్యడం బ్రాహ్మణునికి దండనే కాని వరం కాదు అని కుక్క చెప్పిన దానికి అంతరార్థం. ఇంకా స్పష్టం చేస్తూ కుక్క ఏం చెబుతుందంటే: "ఎట్టి పరిస్థితుల్లోనూ కులపతిగా ఉండకూడదు. ఎవరినన్నా నరకానికి పంపాలంటే, అతనికి దేవాలయాల మీద, గోవుల మీద, బ్రాహ్మణుల మీద పెత్తనం ఇవ్వాలి. ఆ మాటలు విని రాముడితో పాటు సభలో ఉన్న వారందరూ ఆశ్చర్యపోతారు.

దీన్ని బట్టి మనకి ఏమి అర్థం అవుతుందంటే, దేవాలయాలు, ఇంకా ఇతర ఉమ్మడి ఆస్తులు (సంఘానికి చెందినవి) లాంటి వాటి మీద పెత్తనం చేసే వాళ్ళు ఎంత జాగ్రత్తగా ఉన్నా కూడా ఏదో సమయంలో వాటిని తమ స్వార్థం కోసం ఉపయోగించడం జరుగుతుంది. తెలిసో తెలియకో ద్రవ్యాన్ని హరించడమో, తినడమో, నాశనం చెయ్యడమో కులపతిగా ఉంటే చెయ్యడం జరుగుతుంది. అదే వాళ్ళ కొంప ముంచుతుంది.

ఈ కథ రామాయణంలో ప్రక్షిప్తము, అంటే, కేవలం కల్పితం, తరువాత చేర్చబడినది, అని అనుకున్నా సరే మంచి సందేశం, ఈ నాటికీ పనికొచ్చే విధంగా, ఇస్తోంది. దేవాదాయ ధర్మాదాయ శాఖలో (Endowments Department) పని చేస్తే, అతి జాగ్రత్త అవసరం. రోజూ దేవుని ప్రసాదం తీసుకున్నా కూడా తప్పేనేమో. ఆ మాత్రం దానికే, తరువాతి జన్మలో కుక్కగా పుడతామేమో అన్న భయం వేస్తుంది.

దేవతాద్రవ్యము తెలియక హరించినా (ఉదాహరణకి ప్రసాదం రోజూ తిని), తెలిసి హరించినా పర్యవసానం చాలా తీవ్రంగా ఉంటుంది. తెలిసి హరించే మార్గాలు ఎన్నో. దేవాలయ వ్యవహారాల మీద పెత్తనం చేసేటప్పుడు, దేవాలయ ఆస్తులకి సంబంధించిన అవకతవకలు, దేవాలయ ప్రసాదాల తయారీ - వితరణలకి సంబంధించిన లాలూచీలు, దర్శనానికి సంబంధించిన వ్యవహారాల్లో చూపించే బంధుప్రీతి మరియు ఇతరములైన అవినీతులు, ఇలాంటివి ఎన్నో చెప్పొచ్చు, ఇప్పటి పరిస్థితుల్లో.

కుక్కని అకారణంగా కొట్టడానికి శిక్ష మన శిక్షాస్మృతిలో ఇప్పటికీ లేదుగానీ, పైన పేర్కొన్న తెలిసి చేసే తప్పులకి మాత్రం తగిన శిక్షలు ఉన్నాయి. కాకపోతే, రామాయణంలో బ్రాహ్మణుడి లాగా "నేను తప్పు చేశాను, నన్ను శిక్షించండి, నేను ఇక్కడే శిక్ష అనుభవిస్తే నాకు మరణించిన తరువాత నరక బాధ తప్పుతుంది" అని నిజాయితీగా అనేవాళ్ళు మనకి కనపడరు.

అయితే, జరిగిన తప్పుని తప్పుదోవ పట్టించడానికి మాత్రం చాలా మంది తయారు. ఈ మధ్య తిరుపతి లడ్డూలు తయారు చేసే నేతిలో కల్తీ జరిగిందన్న వివాదం బయటకు వచ్చింది. ఈ కల్తీ అన్నది మనం మొదటిసారి వింటున్నది ఏంకాదు. దీని మీద విచారణ జరిగి అసలు నిజాలు వెలికి వచ్చే లోపే మన హడావిడి మనది. కోడి పందాల్లో పై పందాలు వేసే వాళ్ళ లాగా రకరకాల కోణాలు అన్వేషించి తెర మీదికి తీసుకొస్తాము. ఏ మతమూ కల్తీ చెయ్యమని చెప్పదు అని తెలిసినా మనం మతాన్ని తీసుకొస్తాం, దీన్లోకి. ఇలాంటి తప్పులు చేసే వాళ్ళకి మతం, కులం ఏమిటి అని ఎవరూ ఆలోచించ రెందుకని? అదీ కాక, తిరుపతి లడ్డూలో జరిగింది మనం ఇంట్లో తినే వంకాయ కూరలో జరిగితే పరవాలేదా. కల్తీ నూనో నెయ్యో తయారు చేస్తే పరవాలేదా, తిరుపతి లడ్డూలో వాడడమే అభ్యంతరమా? అసలు కల్తీ వస్తువులు తయారు చెయ్యడానికి అనుమతి ఎవరు ఇచ్చారు, ఎన్నాళ్ళుగా సాగుతోంది అని ఎవరూ ఆలోచించరే? కల్తీ నూనో నెయ్యో తయారయిన తర్వాత తిరుపతి లడ్డూలో వాడనివ్వక పోతే, వేరే ఎక్కడ వాడనిస్తారు? అసలు సమస్య, కల్తీ గురించి గాని, తిరుపతి లడ్డూ గురించి కాదని గ్రహించరేం? రామాయణంలో కుక్క చేసిన హెచ్చరికలు మనకి గుణపాఠాలు కావా?

రిఫరెన్సు గ్రంథాల జాబితా:

వాల్మీకి రామాయణం ఉత్తరకాండకి ఆచార్య శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడు గారు రచించిన బాలానందినీ వ్యాఖ్య అందుబాటులో ఉన్న లింకు:
https://ia903409.us.archive.org/19/items/PullelaRamayanam/07%20%E0%B0%AA%E0%B1%81%E0%B0%B2%E0%B1%8D%E0%B0%B2%E0%B1%86%E0%B0%B2%20%E0%B0%B6%E0%B1%8D%E0%B0%B0%E0%B1%80%E0%B0%B0%E0%B0%BE%E0%B0%AE%E0%B0%9A%E0%B0%82%E0%B0%A6%E0%B1%8D%E0%B0%B0%E0%B1%81%E0%B0%A1%E0%B1%81%20-%20%E0%B0%B0%E0%B0%BE%E0%B0%AE%E0%B0%BE%E0%B0%AF%E0%B0%A3%E0%B0%82%20-%20%E0%B0%89%E0%B0%A4%E0%B1%8D%E0%B0%A4%E0%B0%B0%20%E0%B0%95%E0%B0%BE%E0%B0%82%E0%B0%A1%E0%B0%AE%E0%B1%81.pdf

22. రైళ్ళలో మట్టి కప్పులు మంచికి కాదు

(మా అమ్మాయి, స్వాతి, స్కూలులో చదువుతున్న రోజులలో, తన డిబేటు పోటీ కోసం తయారు చేసిన మెటీరియల్ ఆధారంగా వ్రాసిన వ్యాసం ఇది. ఇప్పటికీ స్కూలు పిల్లలకి చదవడానికి బాగుంటుందని ఇక్కడ ఇస్తున్నాను.)

అసలీ గోల 2004 సంవత్సరం జులై 6న మన రైల్వే మంత్రి గారు పార్లమెంటులో చేసిన రైల్వే బడ్జెట్ ప్రసంగంతో మొదలయ్యింది. ఆయన తన ప్రసంగంలో రైళ్ళలో plastic, thermocoal కప్పులు ఎత్తేసి మట్టి కప్పులు, అంటే 'kulhars', ప్రవేశపెడతామని అన్నారు. ఎందుకంటే, ఆయన ఉద్దేశంలో, వాటివల్ల శుభ్రం పెరుగుతుందని, పర్యావరణానికి కుడా మంచిదని.

అయితే, రైళ్ళల్లో మట్టికప్పుల్లో కాఫీ, టీలు తాగేవాళ్ళెంతమంది వుంటారు. శుచీ, శుభ్రం లేకుండా ఆ కప్పుల్లో దుమ్ము పడుతూవుంటే వాటిల్లోనే కాఫీ, టీలు పోసి అమ్ముతుంటే ఎవరు తాగుతారు. అందుకే, ఇంకా ఆచరణలోకి రాలేదు, ఈ ప్రయోగం. ఇదంతా వింటుంటే, మా గురువుగారి మాటొకటి గుర్తొస్తోంది. ఆయననేవారు, ఆ రోజుల్లో తుగ్లక్ అంటూ పాపం ఒక్కడే వుండేవాడని. లేకపోతే ఏమిటండీ. చక్కగా బోలెడు డబ్బు పోసి రైల్లో కూచుని ఆఖరికి మట్టి కప్పుల్లో కాఫీ తాగడం ఏమిటండీ, ఖర్మ కాక పోతే.

పర్యావరణ కాలుష్యం, దాని నివారణోపాయాలు అంటూ ఒక వేలంవెర్రి మొదలయ్యింది. ప్రతి విషయాన్ని దీనితో లంకె పెడుతున్నారు. ఎవరు ఎన్ని ఎక్కువ విషయాల్లో లంకె పెడితే వాళ్ళంత గొప్పగా చెలామణీ అవుతున్నారు, కాల మహిమ. ఓ చిన్న విషయం. మనం రైళ్ళల్లో కూచున్నంత సేపు మట్టి కప్పుల్లో కాఫీ తాగి, ఆ తర్వాత ఏమి ఉపయోగించినా పర్వాలేదా? పర్యావరణం బాగు పడుతుందా?

రైళ్ళల్లో రోజుకి సుమారుగా 13 మిలియన్ల మంది ప్రయాణం చేస్తూ వుంటారు. వీళ్ళందరూ, మన రైల్వే మంత్రిగారు అనుకున్నట్లు మట్టి కప్పుల్లో కాఫీ, టీలు తాగాలంటే సుమారు ఎన్ని కప్పులు తయారు చెయ్యాలో అలోచించండి. మట్టి కప్పులు తయారు చెయ్యాలంటే, అవి కాల్చి కదా తయారు చేసేది. ఊరికే ఎండబెడితే సరిపోదుగా. అవి కాల్చడానికి ఇంధనం ఎక్కడనుండి వస్తుందో అలోచించండి. కట్టెలతో కాలుస్తారు, లేకపోతే బొగ్గుతో కాలుస్తారు, అవి తయారు చేసే కుమ్మరులు. ఏది చేసినా, చెట్లు నరకాల్సిందేగా. ఎన్ని చెట్లు నరికితే, రైల్వే మంత్రిగారు చెప్పినట్లు, మనకి కాఫీ, టీలు అందుతాయి. అన్ని చెట్లు నరికితే మనకుండేది బూడిదా, పర్యావరణమా? ఈ మాత్రం చిన్న విషయం మన రైల్వే మంత్రిగారికి ఎందుకు తట్టలేదు?

మనకిప్పుడు, చాలామంది plastic పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. సుమారుగా, 3000 కోట్ల రూపాయలు ప్రతి ఏడాది మన జాతీయాదాయానికి ఇస్తున్నారు. అయితే, మనకున్న సమస్యలేంటంటే plastic తయారీలో వాళ్ళు వాడే రసాయనాలు ఒకటి, plastic వస్తువుల్ని మనం ఎక్కడ పడితే అక్కడ పారేసే లక్షణం, వాటివల్ల వచ్చే ప్రమాదాలు. వాళ్ళకి విషవాయువులు ఉత్పత్తి చేసే రసాయనాలు వాడకండర్రా అని చెప్తే సరిపోతుంది. అట్లాగే, ఎక్కడబడితే అక్కడ పారేసే వాళ్ళకి కొన్ని పద్ధతులు అలవాటు చేస్తే సరిపోతుంది. ఇంత చిన్న విషయం కోసం, ఇన్నాళ్ళ మన నాగరికతలో భాగమైన plasticని సాంతం మర్చిపొండి, అనడం సబబు కాదు. అది అయ్యే పని కూడా కాదు. ఎందుకంటే, మనమాట అట్టావుంచి, ఈ పరిశ్రమలో పనిచేసే వాళ్ళంతా, రేపటినుంచి అడుక్కుతినాలా, ఆలోచించండి.

మన రైల్వే మంత్రిగారికి ఈ ఆలోచన రాక ముందు కూడా రైళ్ళల్లో మట్టికప్పుల్లో కాఫీ, టీలు ఇవ్వడం ఒరిస్సా, బీహార్ ప్రాంతాల్లో వుంది. అవి ఎంతమంది తాగుతున్నారో మనకి తెలుసు. అందాకా ఎందుకు, ఇప్పుడు మట్టి కప్పుల్లో కాఫీ ఇస్తే మనలో ఎంతమంది తాగుతారు? ఎందుకొచ్చిన పిచ్చి ఆలోచనలండీ ఇవి. అందుచేత, రైళ్ళల్లో మట్టి కప్పులు మంచికి కాదని అందరూ ఒప్పుకుంటారు కదా.

23. విగ్రహారాధన ఒక నమ్మకం

"మా ఇష్టమండీ, మా నమ్మకం, అయితే ఏంటంట? మనిషన్న వాడికి ఏ నమ్మకమూ లేకుండా ఉంటుందా?" అన్నాడు, కోపంగా వెంకట్రావు, తన మిత్రుడు శ్రీనివాసరావుతో.

"అడిగితేనే అంత కోపం రావాలా?" అన్నాడు శ్రీనివాసరావు.

"అది కాదోయ్. ఏవో పుస్తకాలు చదివేసి వాటిల్లో ఉన్న విషయాలు ఏకరువు పెట్టడం ఒక ఫ్యాషన్ అయిపోయింది ఈ రోజుల్లో." అన్నాడు వెంకట్రావు.

"అరె! అంత గింజుకుంటావెందుకోయ్." అని అన్న శ్రీనివాస రావుకి, "మరి! లేకపోతే ఏమిటి? వివేకానందు డంతటి వాడు చెప్పినా వినరా?" అని బదులు ప్రశ్న వేశాడు వెంకట్రావు.

"ఏం, చెప్పాడేమిటి?" అని అడిగిన శ్రీనివాసరావుకి, వెంకట్రావు చెప్పడం మొదలు పెట్టాడు.

"ఎక్కడో చదివినట్లు గుర్తు. వివేకానందుడు ఒకసారి ఒక జమీందారుగారి ఆస్థానానికి వెళ్ళాట్ట. ఆ జమీందారు, విగ్రహారాధన గురించి చాలా తేలిగ్గా మాట్లాడాట్ట. అప్పుడు వివేకానందుడు, ఆయన ఫొటో (photo) ఒకటి తెప్పిచ్చి ఆయన చూస్తుండగానే దాని మీద ఉమ్మేశాట్ట. చెప్పొద్దూ, జమీందారుకి చాలా కోపం వచ్చిందట. స్వామీ వివేకానంద కాబట్టి సరిపోయింది గానీ, ఆ పని మన బోటిగాడు చేస్తే, ఆ జమీందారు తాట ఒలిపించి ఉండేవాడు. ఆ తర్వాత, జమీందారు మొహంలో కోపం చూసి, వివేకానందుడు "ఆ ఫొటోలో ఉన్న విగ్రహం మీరు కాదు కదా, ఎందు కంత కోపం వచ్చింది." అని అడగడం, దానికి జమీందారు సిగ్గుపడి తన తప్పు తాను తెలుసుకోవడం జరిగాయి. ఇది పుస్తకాల్లో చదివిన నా బోటివాళ్ళు మన నమ్మకం తప్పు కాదనుకుంటూ వచ్చారు."

అంతా విని, "చాలా బాగుందే, నీ నమ్మకం కథ. ఇది వింటే నాకు బోలెడు విషయాలు గుర్తొస్తున్నాయి. ఈ నమ్మకం అన్నది ఎంత స్ట్రాంగో, ఒక్కొకప్పుడు ఎన్ని విధాలుగా పనికొస్తుందో అని అనిపిస్తోంది." అన్నాడు శ్రీనివాసరావు.

"అంటే ఏమిటి నీ ఉద్దేశ్యం?" అని వెంకట్రావు ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఉదాహరణకి, మన వాళ్ళు పిల్లలకి పేరు పెట్టేటప్పుడు పెద్దవాళ్ళ పేర్లు పెడదామని చూస్తారు. అంటే, అత్తమామల పేర్లు ఏదో విధంగా చేర్చి పిల్లలకి నామకరణం చేస్తారు. ఎందుకనుకుంటున్నావు?" అని ఎదురు ప్రశ్న వేశాడు శ్రీనివాసరావు.

"ఎందుకేమిటి?" అని జవాబు కోసం చూశాడు వెంకట్రావు.

"ఎప్పుడన్నా అత్తామామలని తిట్టాలనిపించినప్పుడు, డైరెక్టుగా తిట్టడం కుదరదుగా, ..." అని క్లూ (clue) అందించాడు శ్రీనివాసరావు.

"అంటే, పిల్లలని తిట్టి అత్తమామల మీద కసి తీర్చుకుంటారా?" అని ఎత్తిపొడిచిన వెంకట్రావుకి "అంతేగా, మరి!" అని విషయం తేల్చేశాడు శ్రీనివాసరావు.

"వీళ్ళ దుంప తెగ. ఇందులో ఇదా గూఢార్థం, ..." అని వాపోయిన వెంకట్రావుకి "ఏంటనుకున్నావు. ఇంకో విషయం చెప్తా. వింటే, దిమ్మ తిరుగుతుంది." అని చెప్పడం మొదలు పెట్టాడు, శ్రీనివాసరావు.

"ఒకావిడ స్కూల్లో పని చేసేది. అక్కడ పనిచేసే స్వీపర్లు, వర్కర్లు ఎప్పుడో ఆవిణ్ణి ఏమన్నా పాత బట్టలు ఉంటే ఇమ్మని అడిగారట. ఆవిడ వాళ్ళాయన పాత బట్టలు వాళ్ళకి ఇస్తూ ఉండేది. "పోన్లే మంచి పనే కదా" అని అనుకుంటే, దాని పరిణామం చాలా విచిత్రంగా కనిపించింది. ఏమిటంటే, ఆ బట్టలు తీసుకున్న వాళ్ళలో ఎవరో ఒకరికి రోజూ తిట్లు శాపనార్థాలు పడేవి, ఆవిడ నుంచి.

అలా, ఎందుకు అవుతోందీ, అంటే, ఆవిడ రోజు వాళ్ళాయన మీద ఏదో ఒక విషయం మీద ఉన్న కోపం ఆయన బట్టలు వేసుకున్న వాడి మీద చూపించేదన్న మాట."

"అంటే, ఏమిటి నువ్వు చెప్పేది? విగ్రహారాధనకి నువ్వు చెప్పిన ఉదాహరణలకి ఏమిటి సంబంధం?" అని వాదన పొడిగిద్దామనుకున్నాడు వెంకట్రావు.

"అన్నీ నమ్మకాలేగా. ఏమిటి తేడా?" అని తేలిగ్గా ముగించాడు శ్రీనివాసరావు.

24. విద్యార్థులకు సందేశం

నా చిన్నప్పుడు నా గురువులు కొందరు (అంటే, నాకు ఆలోచించడం నేర్పిన వాళ్ళు - పేర్లు అనవసరం) చెప్పిన కొన్ని విలువలు (values), ప్రమాణాలు (standards), మంచి మాటలు, నాకు అర్థం అయినంతవరకు, విద్యార్థులకు చెప్పాలని ఉంది. అవి విద్యార్థి దశలోనే తెలుసుకోవడం మంచిది. ముసలితనంలో తెలుసుకున్నా ఉపయోగం లేదు.

ముందుగా, భగవంతుడు, ఆరాధన (పూజ), నైవేద్యం అన్న మాటల గురించి మనకున్న కన్ఫ్యూజన్ (confusion) దూరం చెయ్యాలని ఉంది. భగవంతుడికి ఒక స్వరూపం, ఒక నిర్దిష్ట ప్రదేశంలో నివాసం, అంటూ లేవు. అతడు (ఆమె) సర్వాంతర్యామి. ప్రతి అణువులోను, అంతటా, మనం చూసే, వినే, అన్నిటిలోనూ, మన లోపలా, బయటా, అంతా నిండి ఉన్నాడు (ఉంది). దీన్నే మంత్ర పుష్పంలో ఇలా అన్నారు:

యచ్చ కించిత్ జగత్ సర్వం దృశ్యతే శ్రూయతేపివా
అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః

దీన్ని లోతుగా ఆలోచిస్తే, భగవంతుడు గుళ్ళలోను, మసీదుల్లోను, చర్చిల్లోనూ మాత్రమే ఉన్నాడనుకోవడం సరి కాదు. ముఖ్యంగా, మనతో సహా మనకి ఎదురుగా కనిపించే వాళ్ళందరూ భగవంతుని రూపాలే. మన తల్లిదండ్రులు, మన టీచర్లు (teachers), మన స్నేహితులు, అందరూ కూడా దేవుళ్ళే. ఈ భావన నిజంగా నమ్మితే, మనం వాళ్ళతో సరిగా ఉండ గలుగుతాం. అలా ఉంటే, చాలా సమస్యలు పరిష్కారం అవుతాయి.

మనం ఏ పనికి నియోగింప బడ్డామో లేదా ఏ పని ఎంచుకున్నామో, ఆ పనిని సక్రమంగా చేయడమే పూజ లేక ఆరాధన. ఆ పని సరిగా చేయకుండా, రోజు ఏదో ఒక సమయంలో దేవుని (మనం కల్పించుకున్న ఏదో ఒక రూపం) ఎదుట కూర్చుని మనకి అర్థం కాని ఏవేవో మంత్రాలు

చదివితే అది పూజవదు. పని చేసేటప్పుడు దానికి సంబంధించిన మనుషులను దేవుళ్ళుగా చూడడం, వారితో అలా వ్యవహరించడం ముఖ్యం. ఉదాహరణకి, ఒక మనిషి తను చేసే వృత్తిలో భాగంగా కొంత మంది మనుషులను పీడించో, మోసం చేసో, చేసి, తర్వాత గుడికి వెళ్ళి చాలా భక్తిగా దేవుణ్ణి ఆరాధిస్తే, అది ఆరాధన అనిపించుకోదు. అసలు, వృత్తి ధర్మం సరిగ్గా పాటిస్తే వేరే పూజ చెయ్యక్కరలేదు.

పనుల్లో పెద్ద పనులు, చిన్న పనులు అంటూ ఉండవు. మన శరీరంలో భాగాలకి ఉన్నట్లుగా, అన్ని పనులకీ సంఘంలో వాటి వాటి ప్రాముఖ్యత ఉంది. చేసే పనిని బట్టి మనిషికి ఎంత గౌరవం ఇవ్వాలో తేల్చుకోవడం, మన దౌర్భాగ్యం. ఇది చెప్పడానికేనేమో, భారతంలో కృష్ణుడు చిన్న పని అనుకోకుండా రథం తోలాడు. మనం చేసే పనిలో మనం చూపించే నిజాయితీ, అంకిత భావాన్ని బట్టి, మనకు గుర్తింపు రావాలి కాని, పనిని బట్టి కాదు. ఇక విద్యార్థుల విషయానికొస్తే, ఒక విద్యార్థికి చదువుకోవడమే వృత్తి ధర్మం. దాన్నే భగవంతుని ఆరాధన అనుకొని, శ్రద్ధగా చెయ్యాలి.

ఇక, నైవేద్యం అంటే ఏమిటి? ఎవరో తయారు చేసినవి, పండించినవి బజార్లో కొనుక్కొచ్చి, వాటిని భగవంతుని విగ్రహానికి చూపించి పూజ చెయ్యడం నైవేద్యం కాదు. ప్రతిఫలాపేక్ష లేకుండా, ఎవరికైనా ఏదైనా పనికొచ్చే పని గాని మేలు గాని చేస్తే అది నైవేద్యం అవుతుంది. అసలు ఏ వృత్తికైనా ఆశయం నైవేద్యమే. మనం ఉన్నది, వేరే వాళ్ళ కోసమే. వ్యాసుడు చెప్పిన మాట ఏమిటంటే - పరోపకారాయ పుణ్యాయ పాపాయ పర పీడనం. అంటే, పరులకు ఉపకారం చెయ్యడం పుణ్యం, వాళ్ళని పీడించడం పాపం అని.

ఈ సందర్భంగా, మా గురువుగారు, ఒకాయన, శివతత్త్వం గురించి చెప్పిన మాటలు గుర్తు కొస్తున్నాయి. సంఘంలో ఉన్న సమస్యలు అందరికీ సమానంగా పంచిపెట్టబడితే ఎవ్వరూ ఎందులోనూ ఔన్నత్యాన్ని సాధించక పోవచ్చు. అలా కాకుండా, ఆ సమస్యలు కొందరికే ఉంటే, మిగిలిన వాళ్ళు ఎక్కువ ప్రగతి సాధించగలరు. అంటే, ఆ కొందరు చేసే పని, శివుడు విషం తాగడం లాంటిది. అవతల మనిషి కష్టాలలో ఉన్నప్పుడు, అంటే ఏదో ఒక టెన్షన్ (tension) లో ఉన్నప్పుడు, ఆ టెన్షన్ని మీరు ఏదో విధంగా తీసేసుకుంటే, అది శివ తత్త్వాన్ని ఆచరించడంతో

సమానం. క్షీరసాగర మథన వృత్తాంతములో విశ్వాన్ని విషం నుండి రక్షించడానికి శివుడు విషం త్రాగాడని చెప్పడం దీనికే ప్రతీక. మన జీవితం భగవంతు డిచ్చిన ప్రసాదం. అది సంఘానికి అన్ని విధాల ఉపయోగపడాలి.

అందరినీ దేవుళ్ళని అనుకుంటే, మరి, కొంతమంది మనకి నచ్చడం, కొంతమంది నచ్చక పోవడం అంటే ఏమిటి? అన్ని విధాల, అందరికీ నచ్చే గుణాలు (లక్షణాలు) ఉన్న మనిషి అంటూ ఎవరూ ఉండరు. ప్రతి మనిషికీ ఏదో ఒక లోపం ఉంటుంది. మా గురువు గారొకాయన చెప్పినట్లు, భగవంతుడి చేతిలో పంక్చ్యుయేషన్ పవర్ (punctuation power) ఉంది. ఎవరి కెక్కడ ఫుల్స్టాప్ (Full stop) పెట్టాలో లేక కామా (comma) పెట్టాలో ఆయన చూసుకుంటాడు. అందరికీ అన్నీ ఇస్తే, ఎవరూ భూమి మీద నడవరు. ఆకాశంలో తేల్తారు. అహంకారంతో, వాళ్ళ కళ్ళు నెత్తి కొస్తాయి.

ఒక మనిషి నచ్చడం అంటే, ఆ మనిషి మంచి లక్షణాలను మెచ్చుకో గలగడం, వీలయితే వాటిని మనం పాటించ గలగడం, ఆ మనిషి లోపాలను సహించడం (ఆంగీకరించడం కాదు), వీలయితే ఆ లోపాలను తొలగించడానికి ప్రయత్నం చేయడం. ఇలా అనుకుంటే, మనకి నచ్చని వాళ్ళు అంటూ ఎవరూ ఉండరు. మన వాళ్ళు, వేరే వాళ్ళు అనే భేదాలు మన మనసులో ఉండవు. ఈ భావన ఇంకా విస్తరిస్తే, జాతి కుల మత వర్గ భేదాలు అంతరిస్తాయి.

విద్యార్థి లోకంలో, ముఖ్యంగా రెండు సమస్యలు ఉన్నాయి. ఒకటి రాగింగ్ (ragging), రెండు కాంపిటీషన్ (competition). రాగింగ్ అంటే, సీనియర్లు జూనియర్లని ఏదో విధంగా ఏడిపించడం. ఇది విద్యాలయాలకే పరిమితమని అనుకుంటాము. మన కన్నా ముందు ఈ భూమి మీద పుట్టిన వాళ్ళు (మన తల్లిదండ్రులు, మన మాష్టర్లు కూడా) అంటే మన సీనియర్లు, ఎప్పుడో ఒకప్పుడు మనకు నచ్చనివి చెప్పడమో, మనకు నచ్చని పనులు మన చేత చేయించడమో చేశారు, చేస్తూనే ఉన్నారు. అది కూడా మనం రాగింగ్ అనుకునే అవకాశం ఉంది. ఒక్కొక్కప్పుడు, ఎందుకు చేస్తున్నారో తెలియక విసుగొస్తుంది.

"It is an extraordinary thing, of course, that everybody is answering questions without knowing what the questions are. In other words, everybody is finding some remedy, without knowing what the malady is." - Jawaharlal Nehru

వాల్మీకి రామాయణంలో ఏం చెప్పారంటే –

సులభాః పురుషా రాజన్!
సతతం ప్రియవాదినః!
అప్రియస్య చ పథ్యస్య!
వక్తా శ్రోతా చ దుర్లభః

అంటే ఎదుటి మనిషికి ఏది నచ్చుతుందో, అది మాట్లాడేవాళ్ళు చాల సులభంగా దొరుకుతారు (అంటే చాలా మంది ఉంటారు). కానీ, ఎదుటి మనిషికి ఏది హితమో, అది ఆ మనిషికి నచ్చకపోయినా చెప్పగలిగే వాళ్ళు అరుదు. అలా చెప్తే వినేవాళ్ళు కూడ అరుదే.

దీన్ని బట్టి గ్రహించ వలసిన దేమిటంటే, మనకు మంచి చెప్పే వాళ్ళెవరో, చెడు చెప్పేవాళ్ళెవరో మనమే నిర్ణయించు కోవాలి. మనకు నచ్చే మాటలు, మన హితానికి కాక పోతే, ఆ చెప్పేవాళ్ళు రాగింగ్ చేసినట్లే. అలాంటి పరిస్థితులని ఎట్లా ఎదుర్కోవాలో, మనమే ఆలోచించుకోవాలి. ఎందుకంటే, మనకు అడుగడుగునా ఎక్కువగా అలాంటివే తగులుతాయి. వాటిని నిర్వహించడం చేతకాక పోతే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రవాహంలో కొట్టుకు పోవడం తేలిక, ఎదురీదడానికి మనం ప్రయత్నించాలి, అన్న ఒక మా గురువుగారి మాట కిదే అర్థం.

విద్యార్థులున్న వయస్సులో స్నేహితులతో interaction ఎక్కువగా ఉంటుంది. Human tendency ఎలాంటిది అంటే, ప్రతి మనిషికి ఎదుటి వాడి లోని బలహీనత అంటేనే ఇష్టం కాని strength అంటే కాదు. ఇది తెలిస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవడానికి వీలవుతుంది. ఎప్పుడూ

మనకు నచ్చేటట్లుగా మాట్లాడే వాళ్ళతో జాగ్రత్తగా మసలుకోండి. ఏదో స్వార్థం మనసులో పెట్టుకుని వాళ్ళు మనల్ని ములగ చెట్టు ఎక్కిస్తారు. ఏది ఏమైనా, మనలో ధైర్యాన్ని పెంచుతూ మనల్ని మంచి మార్గంలో నడిపించడానికి ప్రోత్సాహం ఇచ్చే వాళ్ళు, నిర్మొహమాటంగా మన లోపాలని ఎత్తి చూపే వాళ్ళే మన నిజమయిన స్నేహితులు. వాళ్ళని serious తీసుకోవాలి. మనలో ఉత్సాహాన్ని పోగొట్టి మనల్ని నీరు కార్పించే వారు, మనకు పిరికి మందు పోసే వారు చాలా మంది ఉంటారు. మహాభారతంలోని యక్షప్రశ్నల ఘట్టంలో ధర్మరాజు చెప్పినట్లు, జీవితంలో మనకి చివరి దాకా తోడొచ్చేది మన ధైర్యమే. అందుకని, కష్ట సమయాల్లో కూడా మనకు ధైర్యం చెదరనీయకుండా తోడుగా నిలిచే వాళ్ళని గౌరవించడం మనం నేర్చుకోవాలి.

ఇక కాంపిటీషన్ విషయానికి వద్దాం. విద్యాలయాల్లో కాంపిటీషన్ అంటే, పరీక్షల్లో మంచి రాంకు (rank) తెచ్చుకోవడానికి ప్రయత్నించడం. ఇతరత్రా కాంపిటీషన్ అంటే, వేరే వాళ్ళ కన్నా గొప్పగా ఉండటం. ఇట్లా అనుకుంటే, ఆ కాంపిటీషన్ చాలా తేలిక. కాని దాని వల్ల, ఎప్పుడూ టెన్షన్ (tension) ఉంటుంది. ఒక మనిషి తనని ఇంకోళ్ళతో పోల్చుకోవడంలో (ధనం, విద్య, ఆస్తి, పొజిషన్ లాంటి విషయాల్లో) ఇలాంటి అంశమే ఉంది. ఇది సరియైన పద్ధతి కాదు.

జపాన్ దేశంలో కైజన్ (kaizen), అంటే దినదినాభివృద్ధి (continuous improvement), అనే ఒక కాన్సెప్ట్ (concept) ఉంది. ఇది ఎట్లా apply చెయ్యచ్చు అంటే, ఒక మనిషి తన కోసం తనే పెట్టుకున్న కొన్ని విలువలు, ప్రమాణాలు, ధ్యేయాల ననుసరించి, ప్రతి రోజూ ఆ ముందు రోజు కన్నా మెరుగ్గా ఉండటానికి ఏమేం చేయాలో, అవన్నీ చేయాలి. ఇలా చేస్తూ ఉన్న పక్షంలో కొన్ని కొన్ని సార్లు, మొన్నటి తన కన్నా నిన్నటి తాను ఓటమి పాలు అవచ్చు. కొంచెం కటువుగా చెప్పాలంటే, తన దృష్టిలో తానే దిగజారడం, జరగచ్చు. దాన్ని పట్టించుకోకుండా, నిన్నటి తన కన్నా ఇవాల్టి తనని సరియైన దారిలో పెట్టడం ఎలాగ అన్న దాని మీద దృష్టి పెట్టాలి. ఎప్పటికప్పుడు, మొన్న-నిన్నల మధ్యన జరిగిన పోటీ మర్చిపోయి, నిన్న-ఇవాళల మధ్య ఉన్న పోటీలో గెలవడానికి ప్రయత్నించాలి. ఇదే నిజమైన కాంపిటీషను. దీన్లో మనకు ఎలాంటి టెన్షన్ (tension) ఉండదు. పై చెప్పిన కాంపిటీషన్లో పాలు పంచుకోవాలంటే, మరి పెద్దవాళ్ళు చెప్పినట్లు చేస్తూ ఉంటే కొన్ని సార్లు కుదరదు కదా అని మనకు అనిపించవచ్చు. వినదగు

నెవ్వరు చెప్పిన - అంటే ఎవరు చెప్పినా వినాలి. ఎక్కువగా వినాలి, తక్కువగా మాట్లాడాలి, అని అంటారు. అందుకేనేమో, భగవంతుడు మనకి చెవులు రెండు, నోరు ఒకటి ఇచ్చాడు. విన్న తర్వాత ఆచరణ విషయాని కొచ్చేసరికి, ప్రతి మనిషీ తన మాటనే వినాలి. నిర్ణయం తనదే అయి ఉండాలి.

ఒక్కొక్కప్పుడు పైన చెప్పిన విధంగా పాల్గొనే కాంపిటీషన్ ఒక ఒంటరి పోరాటం లాగా అనిపిస్తుంది. అప్పుడప్పుడు నిరాశ, నిస్పృహ కూడా రావచ్చు. అలా, డిప్రెషన్ (depression) రావడానికి వేరే కారణాలు కూడా ఉండొచ్చు. ప్రతి మనిషీ తనకు తానుగా బ్రతకాలనుకున్నా, అది అన్ని సార్లు కుదరదు. పరిస్థితులు, వేరే వాళ్ళ సహాయం తీసుకోవడానికి దారి తీసినప్పుడు ఒక రకమైన అసహ్యం పుట్టి డిప్రెషన్ రావచ్చు. అయితే, దీనికి అర్థం లేదు, ఎందుకంటే సెల్ఫ్ మేడ్ పెర్సన్ (self-made person) అంటూ ఎవరూ ఉండరు. లేచింది మొదలు ఎవరో ఒకరి సాయం లేకుండా మనము బ్రతకలేము. అయితే, డిప్రెషన్ రావడం వల్ల కాంపిటీషన్కి ఆటంకం వస్తుంది. అందుకే, Stephen R. Covey అన్నట్లుగా – Interdependence is a higher value than independence.

డిప్రెషన్ వచ్చినప్పుడు, ఓటమిని ఒప్పుకుని అన్నిటికీ రాజీపడి బ్రతకమని కాదు. ఆ స్థితిని అధిగమించడం ఎలాగో ఆలోచించాలి. ఒక పద్ధతి ఏమిటంటే, మనకి ఇష్టమైన (అంటే మనకి హితం చెప్పే) వాళ్ళతో పిచ్చాపాటీ మాట్లాడటం, మనకి డిప్రెషన్ ఎందు కొచ్చిందో దాన్ని గురించి కాదు, జనరల్ (general) విషయాల మీద. లేదా, కాసేపు బయట తిరిగి రావచ్చు. ఇంకా వేరే పద్ధతు లుండొచ్చు. ఎవరి పద్ధతులు, వాళ్ళే నిర్ణయించుకోవాలి.

కాంపిటీషన్లో పాల్గొనేటప్పుడు ఇంకా వింత సమస్యలు రావొచ్చు, మనల్ని పక్కదారి పట్టించడానికి. అందులో, ఒకటి అహంకారం, రెండోది కోపం. అహంకారం డబ్బు వల్ల గాని, వేరే ఆస్తిపాస్తుల వల్ల గాని, సంఘంలో ఉన్నత స్థితి వల్ల గాని, ఎక్కువ చదువుకున్నామని అనుకోవడం వల్ల గాని, బలం వల్ల గాని, తనకి వత్తాసు పలికే వాళ్ళ వల్ల గాని, ఎవరికైనా దానం గాని సాయం గాని చేసినప్పుడు గాని, అన్నిటికన్నా హీనం ఒక ఉత్తమ జాతిలో (కులంలో)

పుట్టామని అనుకోవడం వల్ల గాని రావచ్చు. ఏ కారణం వల్ల వచ్చినా, అహంకారం అన్నది అన్నిటికన్నా పెద్ద రోగం. దాన్ని అదుపులో పెట్టకపోతే, అది మనలో ఉన్న మనిషిని మెల్లగా తినేస్తుంది. అందుకే, ఒక పాటలో ఇలా అన్నారు.

వయసు పెరిగి ఈసు పెరిగి మదము హెచ్చితే
అంత మనిషిలోని దేవుడే మాయమగునులే

మరి, అహంకారాన్ని అదుపులో పెట్టడం ఎలాగ. వీలయినప్పుడల్లా, ఒక పబ్లిక్ ప్లేస్లో (public place) ఏదైనా మనకి చేతనైన సేవ చేయడం (రోడ్లు ఊడవడం, హాస్పిటల్ లో రోగులకి సేవ చేయడం, వృద్ధాశ్రమాలకి వెళ్ళి వాళ్ళకి సేవ చేయడం లాంటివి, పేపర్లలో ఫొటోలు వేయించుకోవడానికో, నలుగురులో గొప్ప చెప్పుకోవడానికో కాకుండా). దానివల్ల అహంకారం తగ్గుతుంది. ఇంకా వేరే పద్ధతులు కూడా ఉండవచ్చు.

మరి, కోపాన్ని అదుపులో పెట్టడం ఎట్లా? అసలు, కోపం అంటే ఏమిటి? అది మనకు ఉండొచ్చా? కోపం లేని, కోపం ఎప్పుడూ రాని మనిషి అంటూ బహుశా ఉండడేమో. చిన్న పిల్లలు ఏదైనా అల్లరి చేసినా లేదా ఏదైనా పొరపాటు పని చేసినా, వాళ్ళ తల్లిదండ్రులకి గాని వాళ్ళ గురువులకి గాని కోపం వస్తుంది. ఆ తర్వాత ఏమౌతుందో చెప్పక్కర్లేదు. కాని, అది కోపమా? కాదు, ప్రేమ లేక వాత్సల్యము. ఒక లక్ష్యము కోసం, అంటే, పిల్లల్ని సరియైన దోవలో పెట్టడానికి వాళ్ళు కోపం తెప్పించుకుంటారు. కాని, వాళ్ళకి పిల్లల మీద కోపం ఉండదు. అలా కాకుండా, ద్వేషంతోనో అసూయతోనో వచ్చే కోపం ఉండకూడదు. ఒక్కొక్కప్పుడు మన మీద మనకే కోపం వచ్చి, అది వేరే వాళ్ళ మీదికి (వాళ్ళంటే అలుసవడంవల్ల) నెట్టుతాము. ఈ రెండూ మంచివి కావు. దీనర్థం, కోపం ఉండకూడదు గానీ, అవసరం అయినప్పుడు మాత్రం తెప్పించుకోవాలి, రామాయణంలో శ్రీరామచంద్రుడి లాగా. ఇది తెలిస్తే కోపాన్ని అదుపులో పెట్టచ్చు.

ఇకపోతే, విద్యార్థులకి సంబంధించి మరో ముఖ్యమైన విషయం, జ్ఞాపక శక్తి. కొంత మందికి ఇది ఎక్కువ, కొంత మందికి ఇది తక్కువ అని అంటూ ఉంటారు. ఇది అభ్యాసంలో తేడాల వల్ల

వస్తుంది. మా చిన్నప్పుడు, మా గురువుగారు మాతో ప్రయోగాలు చేయించేవారు. ఒక పెద్ద పళ్ళెంలో రకరకాల వస్తువులు పెట్టి ఒక గుడ్డతో కప్పి ఉంచేవారు. మమ్మల్ని పళ్ళెం ఎదురుగా కూర్చోపెట్టి, ఒక్క సారి గబాల్న ఆ గుడ్డ తీసేసి మళ్ళీ కప్పేవారు. తర్వాత, మమ్మల్ని పళ్ళెంలో ఏ ఏ వస్తువులు చూశామో లిస్ట్ (list) వ్రాయమనేవారు. ఇలా ప్రయోగం రిపీట్ (repeat) చేసేవారు. ఇంకా, మాకు చదవడం, వ్రాయడం రాని రోజుల్లోనే, పద్యాలు, శ్లోకాలు, అంటే లయబద్ధంగా ఉండేవి, మాకు చెప్పి మా చేత చెప్పించేవారు. ఇప్పటి రోజుల్లో చూస్తే, టీవీ (TV) ఎడ్వర్టైస్మెంట్లు (advertisements) కొన్ని లయబద్ధంగా ఉన్నవి, పిల్లలు ఇట్టే పట్టేస్తారు. ఇవన్నీ జ్ఞాపక శక్తి పెంచుకోవడానికి మార్గాలు.

ఇంకా చెప్పాలంటే, మనం కళ్ళు మూసుకుని కొంచెం ఏకాగ్రత వహిస్తే, అదివరకు చూసిన వస్తువుల్ని, మనుషుల్ని మనోనేత్రంలో చూడవచ్చు. ఆ వస్తువులు, మనుషులు ప్రస్తుతం భూమి మీద లేకపోయినా కూడా, ఇది సంభవమే. ఎందుకంటే, ఒక్కసారి మన మనస్సులో పడిపోయిన తర్వాత, అవి అలాగే ఉంటాయి. ఇది తెలిస్తే, ఈ ప్రక్రియని పాఠ్యాంశాల విషయంలో చాలా తెలివిగా ఉపయోగించుకోవచ్చు. పుస్తకాల లోవి ఏవైనా కొన్ని ముఖ్యమైన పోర్షన్లు (important portions) ఒక సారి ఏకాగ్రతతో చూచి, వాటిని తర్వాత పుస్తకం లేకుండా కళ్ళు మూసుకుని మనం మనోనేత్రంతో చూడవచ్చు. పుస్తకం అంతా ఆ విధంగా చూద్దామనుకుంటే మాత్రం, దెబ్బ తింటారు.

ఇంకో విషయం ఏమిటంటే, సుమారు మూడు పేజీలు ఉన్న మెటీరియల్ని (material) గుర్తు పెట్టుకోవడం ఎలా అన్నది. దానికి ఒక కిటుకు ఉంది. మెటీరియల్లో ఏ పాయింట్లు (points) గుర్తు పెట్టుకుంటే మొత్తం మెటీరియల్ గుర్తుకు తెచ్చుకోవచ్చో గుర్తిస్తే, ఆ పాయింట్లు మాత్రమే గుర్తు పెట్టుకుంటే సరిపోతుంది. ఈ పద్ధతి ఎన్ని పేజీల మెటీరియల్ కైనా extend చెయ్యవచ్చు.

మరో ముఖ్యమైన విషయం, చదువుకోవడం ఎలా అన్నది. దీనికి time management సరిగా చెయ్యడం చాలా ముఖ్యం. ప్రతి రోజూ ఇంటికి రాగానే విద్యాలయంలో టీచర్లు (teachers) ఆ రోజు చెప్పిన పాఠ్యాంశాలు (lessons) వీలయినన్ని పుస్తకాలలో చదివి అర్థం చేసుకుని, వెంటనే

పుస్తకాలు చూడకుండా నోట్సు (notes) వ్రాసుకోవాలి. ఆ తర్వాత, మర్నాడు విద్యాలయంలో చెప్పబోయే టాపిక్స్ (topics) ఒక్క సారి చదవాలి (plain reading). మొదటి పనికి సుమారు 2 1/2 గంటలు, రెండో పనికి సుమారు 1/2 గంట పట్టవచ్చు. రెండవ పని వల్ల, మర్నాడు క్లాసులో ఏకాగ్రత మెరుగ్గా ఉండి, ఏ విషయాలు టీచర్లని అడిగి తెలుసుకోవాలో ముందుగానే ఆలోచించి పెట్టుకోవడానికి వీలు కలుగుతుంది. ప్రతి వారాంతంలో (week ends) వ్రాసుకున్న నోట్సు చదివి అవసరమయితే update చేసుకోవాలి. దీని వల్ల regularity అలవాటవుతుంది. పరీక్షల సమయంలో ఎక్కువగా చదవాల్సిన పని ఉండదు. Tension కూడా ఉండదు.

ఇంకో విషయం, మనకి చదివింది ఎంతవరకు అర్థం అయ్యిందన్న సంగతి. ప్రతి stage లోనూ, మనకి ఏమి తెలియ లేదు అన్నది మనకి తెలియాలి. సోక్రటెస్ (Socrates) అన్నట్లు - The only true wisdom consists in knowing that you know nothing. మన పరిభాషలో చెప్పాలంటే, మనకి తెలియదన్న విషయం మనకి తెలియడమే జ్ఞానం. తెలియంది తెలుసుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చెయ్యాలి. పుస్తకాలు చదవడం, teachersని గాని తోటి studentsని గాని అడిగి తెలుసుకోవడం లాంటివి చెయ్యాలి. ఈ process continue అవుతూనే ఉండాలి.

ఇవన్నీ ఎందు కోసం అంటే, మనిషిగా తయారవడం కోసం, సంఘానికి పనికి రావడం కోసం, అంటే, social responsibilities fulfil చెయ్యడం కోసం. తల్లిదండ్రులని వాళ్ళ ముసలితనంలో చూడడం కూడా social responsibility కిందకే వస్తుంది. ఈ సందర్భంలో, భగవద్గీత శ్లోకం ఒకటి (క్రింద ఇవ్వబడింది) గుర్తుకొస్తోంది.

యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే

అంటే, జీవితంలోను, సంఘంలోను ఉన్నతమైన స్థానంలో ఉన్న వాళ్ళు (శ్రేష్ఠులు) ఏ విధంగా నడుచుకుంటారో, మిగిలిన వాళ్ళు దాన్ని ఒక ప్రమాణంగా స్వీకరించి, ఆ విధంగా

నడుచుకోవాలని చూస్తారు. ఇలాంటి వ్యవస్థ ఒక రకంగా శ్రేష్ఠులుగా చూడబడే వాళ్ళకి అలాంటి positionలో ఉన్న వాళ్ళకి హెచ్చరిక. అందరూ వాళ్ళ కన్నా చిన్న వాళ్ళకి ఆ positionలో కనిపిస్తారు. ఆ స్థితిలో, మనకి తెలియకుండా చాలా కళ్ళు మనని watch చేస్తూ ఉంటాయి. అంటే, అది policing కాదు. ఆ watch చెయ్యడం, ఒక expectationతో. ఒక కుటుంబంలో parentsని, పెద్దవాళ్ళని పిల్లలు watch చేస్తూ ఉంటారు. ఇది generalise చెయ్యాలంటే, మనం మన పై generation వాళ్ళని watch చేస్తూ ఉంటాము. మనల్ని మన కన్నా చిన్నవాళ్ళు watch చేస్తారు. అలా, అడుగడుగునా ఎవరో ఒకరు మనని అనుసరించాలని చూస్తూ ఉంటే మనం చాలా alertగా ఉండాలి. ఎప్పటికప్పుడు, మన నడవడి గురించి introspection చేసుకుని తప్పులుంటే దిద్దుకోవాలి. ఎందుకంటే:

> *It is not enough not to be found out by others; we refuse to be found out by ourselves. - A.G. Gardener (On Umbrella Morals)*

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, మనకు మన తల్లిదండ్రులు, మన పై generation వాళ్ళు important కాదని తెలియజెప్పడానికి. ఎందుచేత అంటే, వాళ్ళు ఏ విషయంలోను, మనల్ని follow అవరు. మనకు మన తర్వాతి generation వాళ్ళు చాలా important. వాళ్ళు మన దగ్గర నుండి ఏమీ చెడు నేర్చుకోకుండా, మనం జాగ్రత్త పడాలి. వివిధ సందర్భాలలో మనం నడుచుకునే తీరు, ఆ situationsలో మన ప్రవర్తన, వాళ్ళకి ఆదర్శంగా ఉండాలి.

కాల గమనంలో, కొన్నాళ్ళ తర్వాత మన పెద్ద వాళ్ళుండరు. మనం పెద్దవాళ్ళము అవుతాము. మన తరువాతి generation వాళ్ళ ముందు మన పెద్ద వాళ్ళ మీద నేరారోపణ (allegation) చేస్తే, ముఖ్యంగా వాళ్ళ మూలంగా మనం చేరాల్సిన స్థాయికి (స్థితికి) చేర లేక పోయామని అంటే, ఏమీ ఉపయోగం లేదు. మనం పెద్దయిన తర్వాత ఏం అవాలనుకుంటున్నామో, ఎలా ఆ లక్ష్యాలు సాధించాలనుకుంటున్నామో ఆలోచించుకోవాలి. అందుకోసం, ఎవరి సాయం కావాలన్నా సంకోచించకుండా తీసుకోవాలి. మన లక్ష్య సాధనలో సత్ప్రవర్తన (ethics, good manners) చాలా అవసరం. దీనికి మహాభారతంలో గొప్ప ప్రమాణం ఉంది. అది ఏమంటే -

ఒరు లేయవి యొనరించిన నరవర

అప్రియము తన మనంబున కగు

తా నొరులకు నవి సేయకునికి

పరాయణము పరమ ధర్మ పథముల కెల్లన్

అనగా, ఇతరులు మనకు ఏం చేస్తే, మన పట్ల ఎలా ప్రవర్తిస్తే మనకు నచ్చదో, ఆ పని గాని ఆ ప్రవర్తన గాని ఇతరుల నుద్దేశించి మనం చెయ్యకుండా ఉండడం సత్ప్రవర్తన. మనకు మన ప్రవర్తన మీద ఎప్పుడు సందేహం వచ్చినా, ఈ standard apply చేసుకుని చూడాలి.

మనం లక్ష్యం నిర్దేశించుకోవడంలో సప్త (ఏడు) సంతానాలు అన్న concept ఉపయోగపడుతుంది. ఆ ఏడు ఏమిటంటే, తమకు పుట్టిన సంతానం, తాము వ్రాసిన కృతి, తాము తవ్వించిన చెరువు, తాము కట్టించిన దేవాలయం మొదలైనవి. వీటి ఉద్దేశ్యం ఏమిటంటే, మనిషి పోయిన తర్వాత కూడా బ్రతికి ఉండేది అతడు (ఆమె) చేసిన ఇలాంటి మంచి పనుల ద్వారానే. కొంచెం జాగ్రత్తగా గమనిస్తే, సప్త సంతానాల్లో పుట్టిన సంతానం తప్ప మిగిలినవి ఎక్కువ కాలం ఉండడం వల్ల సంఘానికి ఎక్కువ ఉపయోగం. అయితే, పుట్టిన పిల్లలు ఆ ఎక్కువ ఉపయోగకరమయిన పనులు చేస్తే, వాళ్ళ తల్లిదండ్రులకి కూడా మంచి పేరు వస్తుంది. నిజంగా, social responsibilities fulfil చెయ్యడం అంటే ఇదే. మన వల్ల మన తల్లిదండ్రులకి మంచి పేరు రావాలి. మన జీవిత గమనంలో మనకు సహాయం (కొద్దిపాటి దైనా) చేసిన వాళ్ళను ఎప్పుడూ మరచిపోకూడదు. వాళ్ళు ఏపైనా ఇబ్బందులలో ఉంటే ఆదుకోవడం కూడా social responsibilityనే.

మనం ఎవరికైనా సహాయం చేస్తే, దాన్ని గర్వంగా చెప్పుకోకూడదు. సహాయం పొందిన వారి మీద ఏదో విధంగా అజమాయిషీ చెయ్యాలని చూడకూడదు. అలా చెయ్యడంలో దాగి ఉన్న అహంకారం వల్లే బలి చక్రవర్తిని మంచి దాత అని అనరు. అలాంటి అహంకారం లేక పోవడం వల్ల కర్ణుడికి మంచి దాతగా పేరు వచ్చింది.

ఇక్కడ చెప్పబడిన విషయాలు చాలా వరకు మనకు అది వరకు తెలిసినవే అయి ఉండవచ్చు లేదా మనం ప్రయత్నించి తెలుసుకోవచ్చు. కానీ ఎందుకో ఒక్కొక్క సారి అందుబాటులో ఉన్నా ప్రయత్నించాలని ఉండదు. ఎలా అంటే:

> *Aristotle maintained that women have fewer teeth than men; although he was married twice, it never occurred to him to verify his statement by examining his wives' mouths. - Betrand Russel*

మనలో ఎవరన్నా కష్టాలలో మునిగి ఉంటే, వాళ్ళు తెలుసుకోవాల్సింది ఏమంటే, అలాంటి పరిస్థితులు చరిత్రలో వాళ్ళకే మొదటి సారిగా రాలేదని. వాళ్ళ కన్నా ముందు, చాలా మందికి చాలా విధాలుగా గడ్డు సమస్యలు వచ్చాయి. వాటిని అధిగమించి లక్ష్యం సాధించిన వారే హీరోలు అయ్యారు. అటువంటి వాళ్ళదే పనికొచ్చే experience.

> *Experience is not what happens to a man, it is what a man does with what happens to him. - Aldous Huxley*

ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే –

I know of no more encouraging fact than the unquestionable ability of man to elevate his life by conscious endeavour. - Henry David Thoreau

ఈ సుదీర్ఘ వ్యాసం చదివితే, మనకు గుర్తు కొచ్చేది:

I'm sorry this letter is so long, I didn't have time to make it shorter. - Goerge Bernard Shaw

25. సమాజ నిర్మాణంలో స్త్రీల బాధ్యత - ఒక వివరణ

(ఈ వ్యాసం సుమారు 50 సంవత్సరాల క్రితం మా గురువుగారైన కీ. శే. శ్రీ చిరువోలు దుర్గాప్రసాదరావు గారు చెప్పగా [dictation] వ్రాయబడినది.)

స్త్రీలు గ్రహించి అనుసరించవలసిన ముఖ్య ధర్మ మేమిటి? ఈ విషయంలో ఇప్పటికి రచించబడిన ప్రబంధములు, కథలు, కథానికలు, నాటకములు, ఈ ధర్మాన్ని ఎంతవరకు తెలుపుతున్నాయి, అనేది చాలా కాలం నుండి నా మనోపథంలో మెదలుచున్నది.

మనకు కావలసిన హక్కులు, స్వాతంత్ర్యాలు ఎట్లా వస్తాయి అనేది, మొదట మన స్థితి, మన ధర్మాన్ని తెలుసుకున్న తరువాత వాటి కోసం పోరాడ వలసి యున్నది. సూక్ష్మంగా పరిశీలించి చూస్తే పాశవిక దశలో నుంచి మనం ఇప్పటి స్థితికి మారుతూ వచ్చాం. ఎప్పటికప్పుడు, కష్టసుఖాలను దృష్టిలో పెట్టుకుని అవసరమైన మార్పులు చేసుకోగా, ఈ స్థితికి చేరాము. అయితే మారనివి, స్థిరమైనవి, సత్యమైనవి, కొన్ని సూత్రాలు అలాగే ఉంటూ వచ్చాయి. అవి స్త్రీపురుష ధర్మాలు, వాటి ననుసరించి వచ్చే బాధ్యతలు.

స్త్రీపురుష విభాగం అన్ని జీవరాసుల్లోను ఉన్న విభాగం. ఇది సృష్టికి మూల విభాగం. దీనిలో స్త్రీ భూమాత వంటిది. పురుషుడు బీజ ప్రదాత. భూమిలో ఏ సస్యం నాటబడితే, ఆ పంట ఫలించినట్లే, మనుషుల్లో కూడా బీజప్రతాపం మీదనే సంతానం ఆధారపడి ఉంటుంది. ఈ సంపర్క కలాపం, సృష్టి కొనసాగించుటకు మాత్రము అవసరమైనది. లేకపోయిన యెడల, స్త్రీపురుష విభేదమే అవసరం లేదు. ఇదే సృష్టి రహస్యం.

ఇప్పటికీ, పశుపక్ష్యాదులు నియమానుసారం సంతానోత్పత్తి చేస్తున్నాయి. యజమాని విత్తిన వెంటనే భూమి ఫలిస్తున్నది. అరణ్యాదులలో తమ ఇచ్ఛకు పడిన విత్తునే ఆ భూమి ప్రసవిస్తోంది. మానవుడు తన అవసరాన్ని బట్టి సారము, కాలము రెంటినీ దృష్టిలో ఉంచుకుని తనకు కావలసిన బీజాన్ని నాటి ఫలిత మనుభవిస్తున్నాడు. గింజ పడని చోట ఉత్పత్తి లేదు.

అయితే, మానవుని పట్ల మాత్రం, ఈ నియమాలు వర్తించకుండా పోతున్నాయి. మానవుడు తన మేధ ననుసరించి అనేక అభిరుచులు పెంచుకుంటూ అనేక పోకడలు పోతూ ఉండడం వల్ల, విపరీత పరిణామాలు ఏర్పడి, వాటి వల్ల సమాజం అనేక సమస్యలు ఎదుర్కొన వలసి వస్తోంది. ప్రకృతి నియమాలకు భిన్నంగా, మానవుడు ఆహార విహారాదులలో కృత్రిమాభ్యాసాలకు లోనవడం వల్ల, విపరీత భావాలు ఉత్పన్నమౌతున్నాయి. ఈ పరిస్థితుల్లో, తగిన సాహిత్య సృష్టి జరగాలి. సాహిత్యం అంటే హితం కోరేదే. తద్భిన్నం సాహిత్యం కానేరదు.

మొట్టమొదట, స్త్రీ క్షేత్రమనీ పురుషుడు బీజప్రదాత అనీ మనం గ్రహించాలి. తెలియని విషయం కాకపోయినా, చెప్పవలసి వస్తోంది. ఎందువల్ల నంటే, అనేక మంది విద్యాధికులు కూడా ఈ సంగతిని విస్మరించి ప్రవర్తించడం జరుగుతోంది కనుక. ఉదాహరణకి, ఇప్పుడు వచ్చే సాహిత్యంలో, పొరపాటున కాలుజారిన వారి ఇతివృత్తాలే తీసుకుని వారు పడిన బాధలు బహు విధాలుగా వర్ణిస్తున్నారు. సినిమాల్లో కూడా ఎక్కువగా ఇవే మనం చూస్తున్నాము. వైద్యశాస్త్రం చదివిన వారు కూడా ఈ విధంగా చేర్చబడ్డారు. దీని భావం ఏమిటి? వీరంతా నాగరికతా చిహ్నానికి రూపాలే. అయితే, నాగరికత అంటే ఏమిటి? ఇంద్రియోద్రేకములకు లోను గాక ఉచితానుచిత జ్ఞానంతో పూర్వాపరాలు విమర్శించుకొని పనిచేయడమే. అది పోయి, నేడు సంఘంలో విపరీతోద్రేకాలు రెచ్చగొట్టే ప్రదర్శనలు జరుగుచున్నవి. ఇవి దృశ్యరూపం లోకి రావడం ఘోర ప్రమాదకరం. ప్రబంధాలలో మితిమీరిన స్త్రీపురుష వర్ణనలు తత్సంబంధమైన విరహాలు, వేడుకలు, కూటములు, వర్ణించడం తప్పని వాపోతూనే, చౌకబారు రచనలు అందరికీ అందుబాటులో అందించడం పెద్ద నేరం.

ఇప్పుడు సంఘంలో స్త్రీ గుర్తించవలసినది, తాను క్షేత్రముననీ, తన ద్వారానే అధికాంశం సృష్టి కార్యక్రమ భారం ఆధారపడి ఉందనీ పురుషుడు బీజప్రదాతగానే మిగిలిపోతాడనీ. కాబట్టి, భారము మోయవలసిన తాను అందుకు సిద్ధపడుతూనే తాను దుఃఖ పడకుండా ఎదుటి వారిని నిందించకుండా సంఘాన్ని దుయ్యబట్టకుండా ఉండడానికి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు, తాను ప్రసవించకుండా ఉండడానికి తగిన చర్యలు, తానే

తీసుకోవాలి. వేష భాషల్లో తాను ఆ ప్రక్రియకు ఆకర్షించబడడానికి ప్రయత్నించ కూడదు. ఒక క్షణం ఆలోచింపక చేసిన తప్పును యావజ్జీవం అనుభవించడం లేదా ఆత్మహత్యకు పాల్పడటం అనాగరికం. సంతాన నిరోధాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఈ రోజుల్లో ఆడపిల్లలను ఒడ్డెక్కించ లేరని విచార పడటం, అపహాస్యం చేయడం, అట్టి ప్రసంగాలకు రచనలకు తావీయడం ఎంత మాత్రం అభిలషనీయం కాదు.

పాఠశాలల్లో, చెట్లకు పశువులకు పక్షులకు స్వపరాగ సంపర్కాలు, పరపరాగ సంపర్కాలు జరగడం గురించి బోధింప జేసే పెద్దలు, లైంగిక విజ్ఞానం బాలబాలికలకు కలిగించక పోవడం చాలా శోచనీయం. కాలేజీ విద్య ముగిసే నాటికయినా ఆ జ్ఞానం లేకపోవడం జుగుప్సాకరం. స్త్రీపురుషుల అవయవాభివృద్ధి, వాటి ఆరోగ్య దశ, ప్రయోజనాలు, వాటిని దుర్వినియోగం చేస్తే వచ్చే దుష్ఫలితాలు, యవ్వనంలో ఉన్న యువతీ యువకులకు నేర్పాలి. లేకపోతే, వారు చౌకబారు రచనలు, సినిమాల వల్ల ప్రేరేపణం పొందుట జరుగుతున్నది. ఈ విషయంలో, పాశ్చాత్యదేశ రచనల్లో వచ్చే మార్పులు మన వారు గమనించాలి. సోషలిష్టు (socialist) దేశాల్లో రచయితలు, రచయిత్రులు ఎన్నుకున్న కథావస్తువులు, సంఘటనలు జీవిత పోరాటానికి సంబంధించినవి. అందులో, స్త్రీపురుష సంబంధాలు యాదృశ్చికంగా వస్తుంటాయి. మన సాహిత్యంలో పడక గది (bedroom) వర్ణనలు, పురుష వర్ణనలు, విరహాలు విపరీతంగా పెరిగిపోయి కథాసృష్టి, నవలా సృష్టి జరుగుతోంది. సందర్భవశాత్తూ వస్తే చెప్పడం వేరు. పనిగట్టుకుని వాటి కోసమే కథ వ్రాయడం వేరు. ఇప్పటికీ చాలా మంది సంసారులకే సమగ్రంగా లైంగిక నిర్మాణాలు, వాటి విభాగాలు, కార్యక్రమాలు పూర్తిగా తెలియవు. ఈ పరిస్థితులు ఆలోచించి నేటి రచనలు సాగితే, అవి జనాభాను అదుపులో పెట్టే ప్రయత్నానికి మానసికంగాను కార్యరూపంలోను ఎక్కువ సహాయకారి కాగలవు.

పూర్వకాలం గురుకులాల్లోనే విద్యాభ్యాసం చేసి బ్రహ్మచర్యం చేసి వచ్చిన విద్యార్థులకు కావ్యపాఠం చెప్పి కొంచెం శృంగార భావానికి తిప్పేవారు. గర్భాధాన మంత్రాలు కూడా చాలా భాగం స్త్రీపురుష సంపర్క క్రియను వర్ణించి చెప్పబడినవే. ఈ సందర్భంగా, కాళిదాసు శాకుంతలం నాటకం లోని రెండు అంశాలు గుర్తొస్తున్నాయి. శకుంతల, బాధ్యతా రహితమైన ఒక జంట తాత్కాలిక సంపర్క

ఫలితము. పరిత్యక్త. శకుంతములు పెంచుచుండగా చూచి కణ్వుడు తెచ్చి పెంచిన బిడ్డ. అయినప్పటికీ, దుష్యంతుడు తన్ను గాంధర్వ వివాహ మాడమని కోరినప్పుడు, ఆమె వేసిన మొదటి ప్రశ్న, కలగబోవు సంతానం హక్కుల గురించి. ఋష్యాశ్రమంలో పెరిగిన శకుంతల గ్రహించిన విషయం, ఆధునిక యువతులు గ్రహించక పోవడం హాస్యాస్పదం. రెండవది, కథాపర్యవసానంలో, గాంధర్వ విధి లోని లోపమును తెలియ జేయుటకే దుష్యంతునిచే పరిత్యజించబడిన శకుంతలను, శిష్యులు అచ్చటనే వదిలిరి. ఈ స్థితికి కారణం ఎవరైనా అది అనాగరికమే.

అసలు, స్త్రీ పురుషుల సంభాషణ ఎట్లా ఉండాలో తెలియ జేయడానికి, పురాణాల నుండి చిన్న కథ ఉదాహరించడం అప్రస్తుతం కాదనుకుంటాను. ఒక సచ్ఛాత్రుడు గురుకులంలో విద్యాభ్యాసం చేస్తూ, మధ్యాహ్న వేళకి గ్రామం లోనికి భిక్షకు రాగా, ఒక ఇల్లాలు తడి వస్త్రంతో వంట చేసుకుంటూ ఆతురతతో భిక్షం తెచ్చి అతని జోలి లోకి వేయబోగా, అతడు ఆమెను తేరిపార చూచి "అమ్మా! ఆ రొమ్ములపై అంతంత కురుపులతో నెట్లు బాధపడు తున్నావమ్మా!" అని ఆర్తితో ప్రశ్నించాడట. దాని కామె "నాయనా! ఇవి కురుపులు కావు. బొబ్బలు అంతకన్నా కావు. ఇవి, ముందు పుట్టబోవు శిశువు నిమిత్తం పరమేశ్వరుడు ఆహారము నిలువజేసిన సంచులు." అని చెప్పగా, అతడు మహదానంద భరితుడై వెంటనే తిరిగి ఆశ్రమమునకు పోయి, అప్పటికి భుజించి తిరిగి మళ్ళీ భిక్షాటనకు పోలేదు. పుట్టబోవు శిశువునకు ఆహారము జాగ్రత్త చేసిన ప్రభువు, పుట్టిన వారి కేల ఈయడని అనుకొని, అక్కడే ఉండి పోయెను. ఆ బ్రహ్మచారి భిక్షకు రాలేదేమని ఊరి లోని పెద్దలు తర్కించు కొనిరి. అప్పుడు ఒకామె, ఫలానా వారి కోడలు భిక్ష పెట్టిన తరువాత రాలేదని చెప్పగా, కొందరు ఆ భిక్ష వేసిన స్త్రీ కడకు పోయి ప్రశ్నించగా, ఆమె తన నేర మేమియు లేదనెను. అంతట, వారామెను తీసుకొని గ్రామం వెలుపల నున్న ఆశ్రమమునకు పోయిరి. అప్పుడా బ్రహ్మచారి, ఆ స్త్రీ పాదములపై పడి "అమ్మా! నీవే నాకు గురువు. ఇప్పటికి నాకు పరమేశ్వరుని కృపాదృష్టి అర్థం అయింది." అని తన భక్తి ప్రకటించుకొనెను. అప్పుడు ఆ ఊరు వారు రోజు కొకరి వంతున తామే ఆ విద్యార్థికి అహారం ఏర్పాటు చేసిరి. దీనిని బట్టి, ఆ స్త్రీ సంస్కారం ఎట్టిదో, సంభాషణ ఎంతటి విజ్ఞానదాయకమో మనము గ్రహించి చౌకబారు

భావములకు స్వస్తి చెప్పవలెను. ముఖ్యముగా, నారీ లోకము గ్రహించి ఆచరణలో పెట్టి తమ సముద్ధరణకు తామే పూనుకొందురని ఆశిస్తున్నాను.

26. స్త్రీల పరిస్థితి

అవి నేను విజయవాడలో లయోలా కాలేజీలో (Andhra Loyola College) చదివే రోజులు (1974-77). నాకు ఎక్కువగా స్నేహితులు ఉండేవారు కారు గానీ, ఇద్దరు క్లాస్మేట్స్ (classmates) మాత్రం చాలా సన్నిహితంగా ఉండేవారు. వీలయినప్పుడల్లా కాలేజీ ఆవరణలో చెట్ల క్రింద కూర్చుని ప్రతి విషయం మీద చర్చించుకునే వాళ్ళం. ఆ రోజుల్లోనే నవలలు చదవడం, న్యూస్ పేపరు (News Paper) చదవడం కొంచెం కొంచెం అలవాటు చేసుకున్నాము కదా, బోల్డు విషయాలు ఉండేవి మాట్లాడుకోడానికి. అందులో త్రిపురనేని గోపీచంద్ గారు 1945-46లో వ్రాసిన "అసమర్థుని జీవయాత్ర" అన్న నవల మాకు చాలా టాపిక్స్ (topics) ఇచ్చింది. ఆ నవల ఆయన అంకిత మిచ్చిన విధానమే ఒక పెద్ద ఆకర్షణ, ఆ రోజుల్లో నా లాంటి కాలేజీ కుర్రకారుకి. గోపీచంద్ గారు హేతువాదానికి మార్గదర్శకుడైన తన తండ్రి కవిరాజు త్రిపురనేని రామస్వామిచౌదరి గారికి అంకితం ఇస్తూ ఏమని వ్రాసారంటే: “"ఎందుకు" అన్న ప్రశ్న నేర్పినందుకు నాన్న గారికి" అని. ఆ "ఎందుకు" అన్న ప్రశ్నే హేతువాదానికి మూలం.

ఆ రోజుల్లో స్త్రీ స్వాతంత్ర్యం గురించి మాలో చాలా వాడిగా వేడిగా చర్చలు జరుగుతూ ఉండేవి. ఎవరు చూసిన సంఘటనలు వారు చెబుతూ ఉండేవాళ్ళం. నేను మా ఊళ్ళో కూలీల కుటుంబాలలో ఉన్న స్త్రీలలో, బస్తీలో చదువుకున్న వారి కుటుంబాలలో ఉన్న స్త్రీలలో, స్వతంత్రం ఎలా ఉండేదో చెప్పేవాడిని. నా స్నేహితులు వాళ్ళు చూసిన దాన్ని బట్టి తమ అభిప్రాయం చెప్పేవారు. ముఖ్యంగా నా వాదన ఏమంటే, కూలీల కుటుంబాలలో స్త్రీలు వాళ్ళ సంపాదన వాళ్ళు సంపాదించుకోవడం వల్ల చాలా స్వతంత్రంగా ఉండేవారని, భర్త మీద ఎక్కువగా ఆధారపడేవారు కాదని, అవసరమయితే భర్తను ఎదిరించేవారని, భర్త కొడితే వాళ్ళు కూడా చీపురు తిరగేసే వారని, చెప్పేవాడిని. బస్తీలో చదుకున్న స్త్రీలు, ముఖ్యంగా ఉద్యోగం చెయ్యని (తండ్రులు, భర్తలు చెయ్యనివ్వక) స్త్రీలు, తండ్రి ఇంట్లోను భర్త ఇంట్లోను ఆస్తి హక్కు లేక (ఆ రోజుల్లో లేదు), వాక్స్వాతంత్ర్యం లేక, సంప్రదాయం కట్టుబాట్లు అన్న ముసుగులో అదే తమకి గౌరవం అన్న భ్రమలో ఉంటారని చెప్పేవాడిని. పెళ్ళిళ్ళలో కన్యాదానం చెయ్యడం స్త్రీ

స్వాతంత్ర్యానికి గొడ్డలిపెట్టు అనీ, ఒక వేళ ఏ కారణం చేతనయినా భర్త ఇంట్లో గొడవ పడినప్పుడు స్త్రీ పుట్టింటికి వద్దామనుకుంటే దానికి అనుమతి ఉండేది కాదనీ, ఇలాంటి పరిస్థితి చాలా దుర్భరమనీ నేను వాదించేవాడిని. ఆఖరికి సంతానం విషయంలో కూడా స్త్రీకి తాను అనుకున్నట్లుగా ఉండడానికి కుదిరేది కాదనీ, మగపిల్లవాడయితే సరే కానీ ఆడపిల్లని కంటే చిన్న చూపు చూసేవారని చెప్పేవాడిని.

మాలో ఆసక్తిని నింపి మమ్మల్ని చర్చలలోకి దింపడానికి కారణం "అసమర్థుని జీవయాత్ర" అన్న నవలలోని క్రింద ఇచ్చిన పేరగ్రాఫు (paragraph).

> “తన ప్రశ్నకు మేనేజరు గుడ్లప్పచెప్పి కూర్చోవడం చూస్తే సీతారామారావుకి హుషారెక్కింది. "కూతుర్ని అల్లుడి దగ్గరకు పంపటం, అల్లుడు గర్భిణీ చేసి మళ్ళీ నీ కూతుర్ని నీ దగ్గరకు పంపటం, నీవు నీళ్ళాడించి మళ్ళీ అల్లుడి దగ్గరకు పంపటం, అతడు మళ్ళీ గర్భిణీ చేసి నీ దగ్గరకు పంపటం, నీవు నీళ్ళాడించి మళ్ళీ అతని దగ్గరకు పంపటం - అతను మళ్ళీ నీ దగ్గరకు పంపటం - నీవు అతని దగ్గరకు పంపటం - అతను నీ దగ్గరకు పంపటం - ఇదేనటయ్యా నువ్వు చేసే పని?" అని ముక్కు మీద వేలు వేసుకుని, ఇంటి కప్పు ఎగిరిపోయేటట్లు నవ్వి, వెళ్ళిపోయాడు.”

ఆ మధ్య కేంద్రప్రభుత్వం వారు నిర్వహించిన నేషనల్ ఫామిలీ హెల్త్ సర్వే-5 (2020-21) [National Family Health Survey-5] గురించిన వార్తలు వార్తా పత్రికల్లో వచ్చినాయి. అందులో తెలిసిన ఒక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే తెలంగాణా, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలలో 75% పైగా ఆడువారు, భర్తలు భార్యలని కొట్టడం సబబే, అని సమర్థించారట. ఇతర రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల్లో కూడా ఇంతకన్నా తక్కువగానే ఐనా అలానే చెప్పారని తెలిసింది. దీన్ని బట్టి చూస్తే, గోపీచంద్ గారి నవలా కాలానికి ఈ కాలానికి స్త్రీల విషయంలో పెద్ద తేడా లేదేమో అనిపిస్తుంది.

నేను లయోలా కాలేజీలో (Andhra Loyola College) చదివే రోజుల్లో మా కుటుంబం సత్యనారాయణ పురంలో ఉండేది. సత్యనారాయణ పురం నుండి లయోలా కాలేజీకి రోజూ సైకిలు మీద వెళ్ళేవాడిని, గుణదల మీదుగా. ఏలూరు రోడ్డు నుండి గుణదల దగ్గర మలుపు తిరిగి ఆ గుణదల రోడ్డు పట్టుకుని లోపలికి వెళితే కాలేజీ వచ్చేది. ఆ గుణదల రోడ్డు మీద కూడా రెండు మూడు మలుపులు ఉండేవి. ఉదయం మేము కాలేజీకి వెళ్ళే వేళ, పశువులని పొలాలకి తోలుకెళ్ళే వేళ, ఒకటే కావడంతో గుణదల మలుపుల రోడ్డు మీద పశువులు వెళుతూ ఉండేవి. సాయంకాలం మేము కాలేజీ నుంచి ఇంటికి వెళ్ళేటప్పుడు కూడా సీను (scene) అదే. అది పశువులని ఇంటికి తోలుకెళ్ళే వేళ. అయితే, ఆ రెండు వేళల్లో రోజూ ఒక విచిత్రం జరిగేది. మలుపు మొదట్లో బుడ్డాళ్ళు పలికలు పుచ్చుకొని నుంచునేవారు. మలుపు దగ్గరకి గేదెలు ఆవులు రాగానే, ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క పశువు మీద టపా టపా చేతులు వేసే వారు. అలా ఎందుకంటే, ఒకళ్ళు అలా చెయ్యి వేసిన పశువు మళ్ళీ మలుపు వచ్చే లోపల ఎక్కడ పేడ వేసినా ఆ పేడ ఆ పశువు మీద చెయ్యి వేసిన బుడ్డాడిది. అది వాళ్ళ మధ్య వ్రాయబడని అవగాహన (unwritten understanding). రోజూ ఈ తమాషా చూడగా చూడగా, మలుపు మొదటి నుంచి మళ్ళీ మలుపు వచ్చే దాకా అంటే ఒక జీవిత కాలం అనీ, చెయ్యి వెయ్యడమంటే పెళ్ళి చేసుకోవడం అనీ, ఆ పశువు వేసిన పేడ మీద హక్కు పొందడం అంటే భార్య తన ఇంట్లో చేసే సేవల మీద ఉద్యోగం చేస్తే ఆమె సంపాదన మీద భర్తకు సంక్రమించే ఆధిపత్యం అనీ, నాకు లీలగా అర్థం అయింది. తమకి తెలియకుండా ఇదంతా ప్రతీకాత్మకంగా నాకు చెప్పిన ఆ బుడ్డాళ్ళకి నేను చాలా ఋణపడి ఉన్నాను.





పేరు	:	మద్దాలి వేంకట సత్య రంగనాధం
పుట్టిన తేదీ	:	25-09-1958
జన్మస్థలం	:	చిరువోలు గ్రామం, మోపిదేవి మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్.
విద్యార్హతలు	:	M.Sc; BL
విద్య నభ్యసించిన విద్యా సంస్థలు	:	జిల్లా పరిషత్ హైస్కూలు, మోపిదేవి; శాతవాహన కళాశాల, విజయవాడ; ఆంధ్ర లయోలా కళాశాల, విజయవాడ; ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం; ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ
వృత్తి / అనుభవం వివరాలు	:	భారతీయ సాంఖ్యక సేవ (Indian Statistical Service) సభ్యునిగా కేంద్ర ప్రభుత్వంలో 36 సంవత్సరాలకు పైగా అనుభవం; సెప్టెంబరు 2018లో డైరెక్టర్ జనరల్ గా సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీసులో (ఢిల్లీ) పదవీ విరమణ
ప్రస్తుత వ్యాసంగం	:	తెలుగు సాహిత్యం చదవడం, వ్రాయడం; సమకాలీన సమస్యలు విశ్లేషించి ప్రభుత్వాలకు, అధికారులకు తగిన సూచనలు ఇవ్వడం
కుటుంబ వివరాలు	:	భార్య: కామేశ్వరి; కుమారుడు: భారత్; కుమార్తె: స్వాతి; కోడలు: కోమల్; మనుమరాలు: ఈరా
గత ప్రచురణలు	:	శ్రీరాముని అంతరంగము (Paperback & E-book) in July 2025 దత్తపదుల సమాహారం (E-book) on 12th August 2025 సమస్యాపూరణాల సమాహారం (E-book) on 1st September 2025 నా కవితా ఖండికలు (E-book) on 12th September 2025
బ్లాగు వివరాలు	:	https://mvsranganadham.in/

ISBN 978-93-344-1226-0

9 789334 412260